

ఆంధ్రసచిత్ర వారపత్రిక
పురుషులు ప్రకృతి పరంగానే
బహు భార్యాప్రియులా?
కొత్త సీరియల్
అంతరాలు-
అంతర్యాలు
ప్రారంభం!
30 ఆగస్టు-5 సెప్టెంబర్, '85
రూ. 2.50


ఇదిగో
గ్లూకోన్-డి ⓣ
సూపర్‌హీరో
అమ్మకు ప్రియమైన సూపర్‌హీరో!
Glaxo
Glucon-D®
Glucose-D
GL
High-grade, finely powdered glucose enriched with vitamin D and calcium phosphates
200 GRAMS NET
GLAXO LABORATORIES (INDIA) LTD
Dr. Annie Besant Road, Bombay 400 025, India
® Trade Mark
Maximum Price Rs.
Local Taxes Extra
LOT
MONTH
మీరు ఎప్పుడూ కలలలో చూసి మురిసిపోతూంటారే....అలాంటివాడు....మరే పిల్లవాడూ లేనంత చురుగ్గా, చలాకీగా!
మీ సూపర్ హీరో అమితంగా ఇష్టపడే ఈ పానీయం—గ్లూకోన్-డి మీ అబ్బాయికి ఇవ్వండి.
గ్లూకోన్-డి. ఇందులో గ్లూకోస్, విటమిన్-డి మరియు కాల్షియం ఫాస్ఫేట్లు వున్నాయి. ఇవి మీ అబ్బాయి చక్కగా చదువుకోడానికి చలాకీగా ఆడుకోడానికి తగిన తక్షణ శక్తిని అందిస్తాయి.
గ్లాక్సోవారి గ్లూకోన్-డి మూలంగా ఇప్పుడు మీ స్వంత సూపర్ హీరోను చూడండి. గర్వంతో ఆనందించండి.
ఈ క్రొత్త అసలు ప్యాక్ చూసి కొనండి
గ్లూకోన్-డి ⓣ
సూపర్ హీరో అమితంగా ఇష్టపడే తక్షణ శక్తినిచ్చే పానీయం
GLL 1842



విజయ బాపినీడు
SOX
బత్తుల వెంకటనారాయణ
సమర్పించు
నాగార్జున ఆర్ట్ పిక్చర్స్
దొంగల్లో దొర
ఎ.సారథి
S.P.బాలసుబ్రహ్మణ్యం • సత్యానంద్ • M.V.రఘు ఎ.యస్.ఎ.నరసింహారావు

ముఖచిత్రం

2-8 ఆగస్టు ఆంధ్ర సచిత్ర వారపత్రికపై మా అభిమాన తార నళిని ముఖచిత్రము వేసినందుకు మా ధన్యవాదములు

మంజుల, మాధవి, హైదరాబాదు

*　*　*

ముఖచిత్రం అందాలనటి "నళిని" ముగ్ధమనోహరంగా వుంది

గుడివాడ కమలాధరరావు,
పుష్పంద్రాయునిపాలెం

*　*　*

'నళిని' ముఖచిత్రం అత్యంత ఆకర్షణీయంగా, కనువిందు చేసింది

శ్రీపాద శ్రీనివాస్, రమణ, బొబ్బిలి

బాగుంది

మా అభిమాన అందాల నటి అనూరాధ ముఖచిత్రం చూడముచ్చటగా, కనులకు విందుగా వుంది కొత్త శీర్షిక "నాకు నచ్చిన నా కార్టూన్" చాలా బాగుంది.

కాకాని రాజేకుమార్, నారాయణపెట

సీరియల్స్

భానుప్రియ ముఖచిత్రముతో వెలువడిన ఆంధ్రసచిత్ర వారపత్రిక మమ్మలని ఆకర్షించింది. శుశ్రుత నర్సింగ్‌హోమ్ చాల బాగుంది. డాక్టర్ రవీంద్రబాబు గార్కి మా అభినందనలు.

కొర్లు చక్రవర్తి, కొరుకొండ


*　*　*

అందరూ డా. రవిలాంటి వారే ఉంటే ప్రజలకు ఆస్పత్రులే పవిత్ర దేవాలయాలు. వచ్చే ప్రాణం, పోయే ప్రాణంగా ఉన్న కేసులూ, అతి క్లిష్టమైన కేసుల పట్ల డా. రవి తీసుకునే శ్రద్ధాసక్తులు చదువుతుంటే ఆ పాత్రలో డా. రవీంద్రబాబు ప్రతిభ ప్రస్ఫుటమౌతున్నది 'శుశ్రుత నర్సింగ్‌హోమ్' సీరియల్‌లో.

పిల్లలు లేని కొందరు స్త్రీలకు జరుపబడే (నరకాన్ని గుర్తుకు తెచ్చే) టెస్టులూ, ఎక్స్‌రేలూ తలచుకొంటేనే భయంకరంగా ఉంటాయి. 'మల్లిక' పాత్ర ద్వారా అవన్నీ విశదీకరించబడుతున్నాయి. పిల్లలు లేకపోవటం వల్ల భార్యాభర్తలిద్దరి మధ్యా చెప్పలేని దూరం, ఏదో వెలితి, నిరాశ, నిస్పృహ – యివన్నీ స్వానుభవాలే.

నాలాగా ఒక 'మల్లిక' కూడా ఉన్నదనుకునే పిల్లలు లేని స్త్రీలకు ఎంతో వూరట కల్గించగలదు యీ సీరియల్. విజ్ఞానాత్మకమైన యిటువంటి నవలను అందిస్తున్న రచయిత్రికి హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఎస్ విజయలక్ష్మి, హైదరాబాద్



*　*　*

"శుశ్రుత నర్సింగ్‌హోమ్" సీరియల్ చాల బాగుంది. రవి నర్సింగ్‌హోమ్‌లో రాకేష్, చంద్రలు ఇద్దరు "ఇందు, ఇందు" అని కలవరించడం, రవి మనస్సులో బాధ కలగడం మాకు చాల బాధగా వుంది. పత్రిక ఎప్పుడెప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నాము.

టి. వి. సుగుణమ్మ, కొత్తకాలవ

*　*　*

ఆంధ్రసచిత్ర వారపత్రికలోని "జిగిబిగి" చాలా బాగుంది. ఎంతో ఉత్కంఠతతో సాగుతోంది.

సింగం దత్తాత్రేయమూర్తి,
రఘు రామారావ్, ఒంగోలు

*　*　*

26.7.85 అందాలనటి భానుప్రియ ముఖచిత్రంతో వెలువడిన పత్రిక ఆకర్షణీయంగా వుంది. కళ్యాణీసామరాజ్‌గారి ముసురు వెలిసింది సీరియల్ చాలా చక్కగా సాగుతోంది. జిగిబిగి సీరియల్ బాగుంది.

కోట నరసింహరావు,
జూలూరు మల్లిఖార్జునరావు, మైలవరం

కథలు

12-18 జూలై 1985 నటి అనూరాధ ముఖచిత్రంతో వెలువడిన సంచికలో "మమ్మి నేనేం పాపం చేశాను....?" అనే కథ కఠిన హృదయులని గూడా కరిగించే విధంగా చాలా బాగుంది. రచయిత్రి 'కృష్ణజ' గారికి మా అభినందనలు.

ఏ. మురళీకృష్ణ, హిరమండలం

నేరమా?

విజయవాడలో కొన్ని చోట్ల పోలీసు అధికారులు జనాన్ని –

1. ప్లాట్‌ఫారమ్ మీద నుంచుని ఉంటే,
2. రోడ్ మూలల నుంచుని ఉంటే,

– అలాగ చెయ్యరాదని హెచ్చరిస్తున్నారు.

ప్లాట్‌ఫారమ్ మీద, వాహనాలకి అడ్డు లేకుండా రోడ్ల మీద నుంచుంటే నేరమా?

ఈ విషయమై పౌర హక్కుల మీద నిపుణులు ఏదయినా వివరణ ఇవ్వగలరా?

జి. రామలింగం, మదరాసు

□

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం : 1908

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు : (1938-1972)

శుక్రవారం : 30 ఆగస్టు-5 సెప్టెంబరు, '85
శ్రీ క్రోధన నామ సం. నిజ. శ్రావణ. శు. పూర్ణిమ
సంపుటము 77 : సంచిక 52

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

విడి ప్రతి వెల	రు. 2-50
పోస్టులో 6 నెలల చందా	రు. 71-50
పోస్టులో 12 నెలల చందా	రు. 143-00

ఆంధ్రపత్రిక కార్యాలయము,
గాంధినగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక

ముఖచిత్రం :
నటి : ముచ్చెర్ల అరుణ
(ఫోటో : ఎమ్. కె. రామమూర్తి)

కథలు :

మగ బుద్ధి	16
శిక్ష	26
అచ్చిరాని పని	32
చిరు దివ్వెల వెలుగులు	48
ఓ కన్నీటి కథ	62
పరువు ప్రతిష్ఠ	68

సీరియల్ నవలలు:

ప్రతిభ	8
శుశ్రుత నర్సింగ్‌హోమ్	20
అంతరాలు-అంతర్యాలు (ప్రారంభం)	38
మల్లిక	54

వ్యాసాలు, శీర్షికలు :

ఉత్తరాలు-4, న్యూఢిల్లీ లేఖ-5, హరిజనుల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత-7, వ్యక్తిగతం, వార ఫలం-14, ఇంటిని చక్కదిద్దుకోవడానికి కృత్రిమ గర్భధారణ!-23, నాకు నచ్చిన నా కార్టూన్-24, పురుషులు ప్రకృతి పరంగానే బహు భార్యా ప్రియులా?-30, ధర్మపథం-34, సినిమా విశేషాలు-35, ఈ'వేమన' పద్యాలు-50, ప్రశ్నావళి-52, సుభాషితాలు-59, హాలీవుడ్ గగన తలంలో వింత కాంతులు వెదజల్లే విభిన్న తారలు!-60, డాక్టర్ సలహాలు-65, ఫాల్గుని డైరీ-66, అవీ-ఇవీ-అన్నీ-72, హైదరాబాద్ నోట్‌బుక్-74.

ఏకపక్షంగా ఉన్న ఒప్పందం

చెకోస్లొవేకియాని నాజీలకి దత్తం చేస్తూ నెవెల్లీ ఛాంబర్ లెయిన్ బవేరియా రాజధానిలో చెప్పిన చోట సంతకం చేసినట్లే సుమారు 47 ఏళ్ళకి ఇప్పుడు ప్రధాన మంత్రి రాజీవ్ గాంధి మరో మ్యూనిచ్ సృష్టించారు. ఆ ఒప్పందానికి హిట్లర్ యొక్క జర్మనీలో నేకాక లండన్‌లో కూడా బ్రహ్మరథం పట్టారు. నెహ్రూ గారికి బైబిల్ లాంటి న్యూస్టేట్స్‌మన్ పత్రిక దాన్ని తెగ పొగిడింది. కింగ్స్లే మార్టిన్ కూడా మధు దండావతేలా సోషలిస్టే. ఈ గాంధీ- లోంగోవాల్ ఒప్పందం గురించి దండావతే అలాంటి ప్రశంసే చేసినా నాకు ఆశ్చర్యం అనిపించదు. కానీ ఆ మ్యూనిచ్ కథ అక్కడితో ఆగలేదు. ఒప్పందం మీద ఛాంబర్ లెయిన్ సంతకం చేసిన సంవత్సరంలోపే మిత్ర దేశాల మీద హిట్లర్ దండయాత్ర చేశాడు. ఆ ఒప్పందాలన్నీ తుడిచి పెట్టుకు పోయాయి. ఆ తర్వాత తొమ్మిది నెలలకి ఛాంబర్ లెయిన్ పదవీ భ్రష్టుడైనారు. ఆయనని తెగ విమర్శించిన విన్స్టన్ చర్చిల్ అధికారానికి వచ్చారు. చరిత్రని అర్థం చేసుకోకుండా దాన్ని సృష్టించాలనుకునే వారిపై అది ప్రతీకారం తీర్చుకునే విధం చాలా విచిత్రంగా ఉంటుంది.

మ్యూనిచ్ ఒప్పందంలో నిజాయితీ లేదు. వాళ్ళు సంతకం చేసిన కాగితానికి ఉన్న విలువ కూడా ఆ ఒప్పందానికి లేదని హిట్లర్‌కీ, ఛాంబర్ లెయిన్‌కి తెలుసు. కానీ వాళ్ళు దాని మీద సంతకాలు పెట్టారు. దానిని గురించి తెగ హడావుడి చేశారు. ఛాంబర్ లెయిన్ తమ గొడుగుని గాలిలో ఊపుతూ చివరికి ఎలాగో అలా ప్రపంచానికి శాంతి లభించిందన్నారు. లోంగోవాల్ తమ విషయంలో ఎంత పట్టుదలతో ఉన్నారో నాకు తెలియదు. ఎందుకంటే ఆ ఒప్పందంలో తనకు తానుగా ఆయన ఒప్పుకున్నది అంటూ ఏది లేదు. బంగారు గుడిలో సైనిక చర్యకి దారితీసిన పరిస్థితులు పునరావృతం కాకుండా, గురు ద్వారాలు తీవ్రవాదుల స్థావరాలుగా మారకుండా తమ శాయశక్తులా ప్రయత్నం చేస్తామని అకాలీలు ఏమి చెప్పలేదు. నిజంగా చెప్పాలంటే వాళ్ళు తమ తరఫున ఎలాంటి హామీని ఇవ్వలేదు. ఆ ఒప్పందంలో భారత ప్రభుత్వం అది చేస్తుంది, ఇది చేస్తుంది, ఆ కమిషన్‌ని నియమిస్తుంది, ఈ సంఘాన్ని వేస్తుంది, చండీఘర్‌ని పంజాబ్‌కి ఇచ్చి రాష్ట్రం బాగోగుల్ని చూస్తుంది అని ఉన్నదే తప్ప అవతలి వైపునించి ఎలాంటి హామీ లేదు. అసలు అవతలి వైపు వారెవరైంది కూడా లేదు. 11 అంశాల ఆ ఒప్పందంలో ఎక్కడా సిక్కు అనే మాట కనిపించదు. అకాలీలకి ఆ రాష్ట్రాన్ని దత్తం చేసినట్లుగా, ఇంకెవరూ అక్కడ లేనట్లుగా, దానితో మరెవరికీ సంబంధం లేనట్లుగా ఉన్నది ఆ ఒప్పందం.

అయితే అదొక్కటే అభ్యంతరకరమైన అంశం కాదు. తమ దేశంలోని ప్రజలతో, ఆ దేశాధినేత ఒప్పందం కుదుర్చుకున్నట్లు నేను ఎక్కడా వినలేదు. కానీ ఇది ఒక ప్రధానమంత్రి ఒక పార్టీతో కుదుర్చు కున్నటువంటిది. ఆ పార్టీనే ఆయన కొన్ని వారాల ముందు వరకూ మతపరమైన పక్షంగా అభివర్ణించారు. ఆ వర్గానికి ఆ పార్టీ ప్రాతినిధ్యం వహించ తగనిదిగా కూడా ఆయన అప్పుడు పేర్కొన్నారు. కానీ ఇప్పుడు అదే పార్టీ నాయకుడు తమ పార్టీ తరఫునే కాకుండా మొత్తం రాష్ట్రం తరఫున దేశాధినేతతో కలిసి ఒప్పందంపై సంతకం చేశారు. ఆయనకి తమ రాష్ట్రంలో ఎటువంటి అధికార హోదా కూడా లేదు. ప్రధాన మంత్రికీ, పంజాబ్ గవర్నర్‌కీ మధ్య జరిగిన ఒప్పందం అంటే దానికి కొంత అర్థం ఉంటుందనుకోవచ్చు. ఇంకా చెప్పాలంటే మిగిలిన రాష్ట్రాలైన హర్యానా, రాజస్తాన్‌లకి సంబంధం ఉంది కాబట్టి ఆ ముఖ్యమంత్రులు కూడా అర్జున్‌సింగ్‌తో పాటు సంతకాలు పెడితే దానికి అర్థం ఉంటుంది. అది కూడా అంత బాగుండదు కానీ ఇప్పుడు ఘనకార్యంగా భావించబడుతున్న ఈ ఒప్పందం కన్నా నయమేనని చెప్పవచ్చు.

న్యూఢిల్లీ లేఖ



డా. జయదుబాషి

ఇవన్నీ చాలా స్వల్ప విషయాలని మీరనవచ్చు. కాని ఎంత మాత్రం కావు. రేపు మరో వర్గం వారు తమది వేరే జాతిగా పేర్కొని ఆనంద్‌పూర్ సాహెబ్ తీర్మానం కోరినట్లే వాళ్ళు కూడా కోరవచ్చు. తీవ్రవాదులు, కిరాయి మూకల సహాయంతో కల్లోలాలని సృష్టించ వచ్చు. ఈ మధ్య ఓ ఆదివారం పత్రికలో పడిన వ్యాసంలో అటువంటి వాటికేమి కొదువ లేనట్లుగా రాశారు. అన్ని రకాల ఇబ్బందులనీ సృష్టించి దేశ ప్రయోజనాలని పణంగా పెట్టి మిగతా రాష్ట్రాలలో కొన్ని భాగాలని తమకి ధారాదత్తం చేస్తూ ప్రధానితో ఒప్పందం కావాలని వాళ్ళు పట్టుబట్టవచ్చు. హర్యానా, రాజస్తాన్‌లు రెండూ కాంగ్రెసు (ఐ) పరిపాలనలోనే ఉన్నాయి. వాటి ముఖ్య మంత్రులు కూడా పెట్టుమన్న చోటల్లా సంతకాలు పెట్టడానికి అలవాటు పడి ఉన్నారు. అదే రాజస్తాన్‌లో భా. జ. పా. లేదా లోక్‌దళ్ ప్రభుత్వం ఉండిఉంటే ప్రధానమంత్రి, ఆయనకి వంత పాడేవారు ఈ విషయంలో అంత తొందరపడి ఉండేవారా? వాళ్ళు ఒకటికి రెండు సార్లు కాదు పదిసార్లు అయినా ఈ ఒప్పందం గురించి ఆలోచించి ఉండేవారు. అయినా అదంత ముఖ్యం కాదు. ఆనంద్‌పూర్ సాహెబ్ తీర్మానానికి అధికార పక్షం తలాడించడమే ఆ ఒప్పందంలో ఆందోళన కలిగించే విషయం. కొన్ని నెలల కిందటి దాకా ప్రతిపక్షాలపై దెబ్బ కొట్టడానికి దానినే ప్రధానమంత్రి ఆయుధంగా వాడారు. అసలు సమస్యని తప్పు దోవ పట్టించేందుకే అకాలీలు ప్రయత్నించారు. ఆనంద్‌పూర్ సాహెబ్ తీర్మానాన్ని వాళ్ళు ఎన్నో రకాలుగా చెప్పారు. ఒకదానికి మరో దానికి కొద్ది తేడాతో వాళ్ళు అనేక అర్థాలు చెప్పారు. కేంద్ర- రాష్ట్ర సంబంధాల గురించి చెప్పే అంశాలు ఆ తీర్మానంలో కొన్ని మాత్రమే ఉన్నాయనీ, అవి అంత అభ్యంతరకరమైనవి కావన్న అభిప్రాయం కొందరికి ఉన్నది. కానీ అది నిజం కాదు. అసలు ఆ తీర్మానం అంతా కేంద్ర-రాష్ట్ర సంబంధాల గురించే. లేకపోతే దానికి అర్థమే లేదు. అకాలీలకి స్వయంగా ఒక రాష్ట్రం ఉండాలనీ అందులో పంథ్ పరిపాలనే అత్యున్నత మైనదిగా ఉండాలని ఆ తీర్మానం ప్రధానోద్దేశం. అంటే అది పంథ్ సార్వభౌమత్వాన్ని కోరుకుంటున్నదే కానీ భారత రాజ్యాంగం సార్వభౌమత్వాన్ని మాత్రం కాదు. ఈ అంశ[illegible]

[illegible]

చెప్పారు. కానీ కొందరు ఆ సమస్యని కప్పిపుచ్చడానికి చూస్తున్నారు పంథ్

సార్వభౌమాధికారం అన్నది రాష్ట్ర సార్వభౌమత్వానికి దగ్గరి దారి. అది దేశ సమైక్యతకి విఘాతం కల్పిస్తుందని మనందరికీ తెలుసు. కేంద్ర- రాష్ట్ర సంబంధాలని గురించి ఎన్. టి. ఆర్., హెగ్డేలలాగా మాట్లాడటం, రాష్ట్రాలకి స్వయం ప్రతిపత్తి ఉండాలనటం వేరు. దీనికి దానికి మధ్య గల తేడాని తెలుసుకోవాల్సి ఉంటుంది ఆ తేడాని గుర్తించారు కాబట్టి శ్రీమతి గాంధీ అలా వీలుకాదని అన్నారు. కానీ ఇప్పుడు ఆమె కుమారుడు ముందుకు వచ్చి అదే తీర్మానాన్ని గతాన్నంతా విస్మరించి దానినే ప్రమాణంగా భావించే వారితో సహపంక్తికి సిద్ధమైనారు ఆనంద్‌పూర్ సాహెబ్ తీర్మానంలోని తమ పాత కోర్కెలని వదులు కున్నట్లు ఆ ఒప్పందంలో అకాలీలు ఏ హామీ ఇవ్వలేదు నేనింతకు ముందే చెప్పినట్లు వారినించి ఎలాంటి హామీ ఈ ఒప్పందంలో లేదు ఆ తీర్మానంలోని కొన్ని భాగాలని సర్కారియా కమిషన్‌కి అప్పగించడం వల్ల అకాలీల కోర్కెలని ప్రభుత్వం గుర్తించినట్లు అవటమే కాకుండా సూత్రప్రాయంగా వాటిని ఆమోదించినట్లే అవుతుంది మళ్లీ చెబుతాను. ఆ తీర్మానాన్ని విడివిడిగా తీసుకోడానికి వీలు లేదు ఎందువల్లనంటే అన్ని తీర్మానాలకి పీఠిక అనేది ఒకటి ఉంటుంది. తీర్మానం ముఖ్యోద్దేశం, దాని తత్వం అందులో ఇమిడి ఉంటుంది. అలాంటిదేమి ఖాతరు చెయ్యకుండా ఒకటో, రెండో భాగాలని తీసుకుంటామంటే కుదరదు. ఆ ఒప్పందం మీద ప్రధాన మంత్రి సంతకం చెయ్యడం వల్ల అకాలీల కోర్కెలని ఆయన సూత్రప్రాయంగా ఆమోదించినట్లే అవుతుంది వారి సార్వభౌమాధికారానికి, సిక్కులకి ప్రత్యేకంగా ఒక రాష్ట్రం ఉండాలన్న దానికి ఆయన అంగీకరించినట్లే అవుతుంది కానీ ఇదంతా చాలా మామూలుగా జరిగిపోయింది తమ కుమారుడిని స్కూల్లో చేర్పించడానికి దరఖాస్తుపై సంతకం చేసినంత తేలికగా ప్రధాన మంత్రి దానిపై సంతకం పెట్టారు అదే చాలా ఆందోళనని కలిగించే విషయం.

జాతీయ సమైక్యతకి ఈ ఒప్పందం గొడ్డలి పెట్టులాంటిది ఆనంద్‌పూర్ సాహెబ్ తీర్మానం కూడా పాకిస్తాన్‌పై ముస్లిమ్‌లీగ్ తీర్మానం లాంటిదే రాజగోపాలాచారి ప్రోత్సాహంతో మహాత్మాగాంధీ ఆ తీర్మానంపై జిన్నాతో చర్చలు ప్రారంభించారు అప్పుడే పాకిస్తాన్ ఆవిర్భావానికి నాంది జరిగిందని చెప్పాలి మహాత్మాగాంధీ 1943 లేదా 1944లో ఏమి చేశారో ఇప్పుడు రాజీవ్ గాంధీ అదే చేశారు ఇదంతా ఎవరికీ తెలియకుండా జరిగిపోయింది ఛాంబర్ లెయిన్ 29 సెప్టెంబర్ 1938లో మ్యూనిచ్‌లో పెట్టమన్న చోట సంతకం పెట్టిన ఆ రోజులాగే 24 జూలై 1985 కూడా చెడ్డ రోజే. మధుదండావతే ఇప్పుడు న్యూ స్టేట్స్‌మన్ చదవక పోవచ్చు కానీ ఆయన పార్లమెంటులో ఆ ఒప్పందాన్ని సమర్థించడానికి లేచి నిలబడినప్పుడు మాత్రం దానిని గుర్తుంచుకోవాలి □

కృషి

జన్మనిచ్చేది
ప్రేమ పంచేది - తల్లి

బండిలాగేది
బ్రతుకు పంచేది - తండ్రి
బుద్ధి చెప్పేది
విద్య నేర్పేది - గురువు

ప్రతిభ పెంచుకు
ప్రయోజకుణ్ణి చేసేది
"స్వయం కృషి"

-వి. సూర్యారావు

న్యూఢిల్లీ లేఖ

హరిజనుల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



గుంటూరు ఆసుపత్రిలో కారంచేడు బాధితులను పరామర్శిస్తున్న ముఖ్యమంత్రి శ్రీ ఎన్. టి. రామారావు



కారంచేడు హరిజనవాడలో బాధితుల పరిస్థితులను విచారిస్తున్న కేంద్ర హోమ్ శాఖ సహాయమంత్రి శ్రీమతి రామ్ దులారి సిన్హా.

భారత దేశంలో గత ఎన్నో శతాబ్దాలుగా సమాజంలో అట్టడుగున ఉన్న వర్గం వారిని తక్కువగా చూస్తూ వారు పైకి రావడానికి మిగతా వారు తగిన అవకాశాలని కల్పించలేక పోయారన్నది నిర్వివాదాంశం. పంచమ వర్ణంగా పేర్కొనబడిన హరిజనులకి కూడా సమాజంలో సమానావకాశాలు కల్పించబడి మిగతా వర్ణాల వారితో సమాన ప్రతిపత్తి లభించినప్పుడే నిజమైన హరిజనాభ్యుదయం సాధ్యమవుతుంది.

జాతి పిత మహాత్మాగాంధీ హరిజనుల అభ్యున్నతికి అహరహం కృషి చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మిగతా వర్ణాల వారితో ఏవిధంగానూ పోటీపడ లేని హరిజనుల కోసం కొన్ని ప్రత్యేకసదుపాయాలని, కేటాయింపులని ఏర్పాటు చేశారు. అంటరాని తనాన్ని నేరంగా పరిగణించారు. విద్యాభ్యాసంలో, ఉద్యోగాలలో వారు పైకి రావటానికి వీళ్ళు కల్పించారు. మిగతా వారికన్నా తాము తక్కువ వారమనే న్యూనతాభావాన్ని హరిజనులు విస్మరించినపుడే సమాజంలో వారి పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉంటుంది. నగరాలలో, పెద్ద పెద్ద పట్నాలలో డబ్బు, అధికారం, హోదా ఉన్న ఏ కొద్ది మంది హరిజనులో సమాజంలోని మిగతా వర్ణాల వారితో సహజీవనం సాగిస్తున్నా దేశ జనాభాలో 80 శాతం ఉన్న పల్లెటూళ్ళలో మాత్రం హరిజనులని ఊరికి దూరంగానే ఉంచడం జరుగుతున్నది. కొన్ని చోట్ల నిర్మించబడిన హరిజన కాలనీలు కూడా ఊరికి దూరంగా ఉంటున్నాయి. ఈ పద్ధతి మారి మిగతా వర్ణాల వారు కూడా హరిజనులని తమతో ఒకరిగా చూసినప్పుడే నిజంగా వారి అభ్యుదయం జరిగిందని అనుకోవాలి. వారి హక్కుల పరిరక్షణకి అందరూ చేయూతని ఇవ్వటం ఎంతైనా అవసరం.

దేశంలోని అన్ని ప్రాంతాలలోనూ హరిజనులపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల కారంచేడులో జరిగిన దుర్ఘటనలో ఆరుగురు హరిజనులు దారుణంగా హత్య చేయబడ్డారు. 20 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. డబ్బు, పలుకుబడి ఉన్న ఒక వర్గం వారు తమపై దాడిచేసి బీభత్సాన్ని సృష్టించారని బాధితులలో కొందరు అన్నారు. అక్కడ జరిగింది "దాడి" కాదని, "ఘర్షణ" మాత్రమేనని ముఖ్యమంత్రి ఎన్. టి. రామారావు వివరించారు. కారంచేడు ముఖ్యమంత్రి వియ్యంకుడి ఊరు కావటం, శ్రీ రామారావు పెద్ద అల్లుడు, శాసన సభ్యుడు డా. దగ్గుబాటి వెంకటేశ్వరరావు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజక వర్గంలోని గ్రామం కావడంతో ఈ దుర్ఘటన రాజకీయంగా ఎంతో ప్రాముఖ్యాన్ని అందుకున్నది.

హరిజనులపై జరిగిన అత్యాచారాలకే ఎంతో ప్రాముఖ్యత, ప్రచారం లభిస్తాయనే వారు కూడా కొందరు ఉన్నారు. కానీ తరతరాలుగా అణగదొక్కబడి, అన్యాయాలకి గురైన వర్గం వారికి ఆ మాత్రం ఆసరా ఇవ్వడం సముచితమే అవుతుంది. అటువంటి వారిపై దౌర్జన్యాలని ఎవరు చేసినా ఖండించడం అన్నది సమాజంలోని ప్రతి వ్యక్తికి నైతిక బాధ్యత. ఎవరు చేసినా తప్పు తప్పే అవుతుంది.

కారంచేడు దుర్ఘటనపై ముఖ్యమంత్రి న్యాయ విచారణకి ఉత్తర్వు చేశారు. ఆ విచారణలో వాస్తవాలు బయటపడి అమాయకులు నిర్దోషులు అయిన వారికి న్యాయం, దోషులైన వారిని తగిన విధంగా శిక్షించడం జరుగుతుందని అందరూ ఎదురు చూస్తున్నారు.

— ఎం. కె. ఆర్. ప్రసాద్


కారంచేడు గ్రామం నించి సురక్షిత ప్రాంతాలకు తరలి పోతున్న హరిజనులు




చీరాలకు వలస వెళ్ళి నిరాశ్రయులై, ఇళ్ళకు తిరిగి ఎప్పుడు వెళ్ళగలమా? అని దిగులు చెందుతున్న కారం చేడు బాధితులు.



సీరియల్



ప్రతిభ



డాక్టర్ ముదిగొండ శివప్రసాద్

(గత సంచిక తరువాయి)

4

వాత్స్యాయన శర్మ స్థాపించిన సాహిత్య సంస్థ పేరు విపంచి. దీనికి గౌరవాధ్యక్షుడు భవభూతి. వర్కింగ్ ప్రెసిడెంట్ అరంగేట్రం ఆండాళ్. పేరు కిది సాహిత్య సంస్థ అయినా ఇతర లలిత కళలను కూడా ఇతోధికంగా పోషించి ప్రోత్సహిస్తామని వాత్స్యాయన శర్మ శపథం చేశాడు. విపంచినుండి వెలువడేవి రాగాలు. వానికి సాహిత్యం, సంగీతమూ రెండూ ఆధారాలు. నాట్యం సమాహార కళ అంటే సంగీత సాహిత్య శిల్ప చిత్ర లేఖనాదుల సహాయం లేకుండా అభినయం తనంత తాను నిలువలేదు. అందువల్ల వాత్స్యాయన శర్మ దృష్టిలో విపంచి అంటే సమస్త లలిత కళలనూ పోషించే సంస్థ.

వాత్స్యాయన శర్మవద్ద విపంచి సంస్థ ద్వారా సాహిత్య శిక్షణ సంగీత ప్రావీణ్యాన్నీ అభినయ కళనూ నేర్చుకోవాలనే ఉద్దేశంతో కొందరు దరఖాస్తు ఫారాలను పెట్టుకున్నారు. వాత్స్యాయన శర్మ వారందరికీ యింటర్వ్యూలు నిర్వహించాడు. ముందుగా కల్పవల్లి అనే ఒకామె తన కుమార్తె పంకజంను తీసుకు వచ్చింది.

"మా అమ్మాయిని గొప్ప రచయిత్రినిగా చేయండి", అన్నది కల్పవల్లి.

"తప్పకుండా చేస్తాను."

"కుమ్మరిమల్లి, రామభద్రాంబ, తాళ్లపాక తిమ్మక్క రంగా జమ్మ

జరిగిన కథ–3: ప్రతిభ హైదరాబాదులోని రవీంద్ర భారతిలో నృత్య ప్రదర్శన ఇచ్చింది. ఆమె నృత్యం చూసిన భవభూతి ఆమెకు తన అభినందనలు తెలిపాడు. బెంగుళూరులోని రవీంద్ర కళాక్షేత్రంలో జరిగిన సమావేశంలో ప్రసంగించిన భవభూతిని తమ కళామందిరానికి రమ్మని ప్రతిభ ఆహ్వానించింది. కళామందిరంలో ప్రతిభ నాట్యం తిలకించిన భవభూతి నిర్ఘాంత పోయాడు. వాత్స్యాయన శర్మ అరంగేట్రం ఆండాళ్‌ను ప్రిన్సిపాల్‌గా ఏర్పాటు చేసి నటరాజాలయంతో పాటు కవుల కాలేజీ ప్రారంభించాడు.

మధురవాణి లలాంటి గొప్ప రచయిత్రి కావాలని నా కోరిక. నా జీవితంలో అది ఫలించలేదు. కనీసం నా కుమార్తెకైనా ఆ విద్య అబ్బితే అదే పదివేలు"

"పదివేలు కాదు అయిదువేలు"

"ఏమిటి?"

"అదే. మీ అమ్మాయిని రచయిత్రినిగా చేయటానికి మీరు గుత్తగా అయిదువేలు యిచ్చుకోవలసి ఉంటుంది.అలా చేస్తే మొత్తం మూడు సంవత్సరాల కోర్సును రెండేళ్లలోనే ముగించి మీ అమ్మాయిని మార్కెటులోనికి వదిలి పెడతాం. అలా కాని పక్షంలో ప్రతినెలా మీరు రెండు వందల రూపాయలు కట్టవలసి ఉంటుంది. యిలా మూడు సంవత్సరాలు చదివితేనే గాని కోర్సు పూర్తి కాదు. దానివల్ల నాకు టైము, మీకు డబ్బు రెండూ వేస్టు. కాబట్టి మీకు సౌకర్యమేమిటో చూచుకోండి."

"రేటు కొంచెం ఎక్కువగా ఉంది." కల్పవల్లి సణిగింది.

"రేపు రాబడి కూడా అలాగే ఎక్కువగా ఉంటుంది. కాకుంటే నాదొక మనవి. ఇవాళ సమాజానికి రామ భద్రాంబలు, రంగాజమ్మలు అక్కరలేదు. ప్రేమ రచయిత్రులు కావాలి. ప్రేమ కొరకు, ప్రేమచేత, ప్రేమవలన ప్రేమింపబడే ప్రేమారాధకులు కావాలి. అందువల్ల మీ అమ్మాయికి ప్రేమ శిక్షణ యిస్తాను."

"ఇదేమన్యాయమండి. నేను సాహిత్య శిక్షణ కోసం వస్తే మీరు ప్రేమ శిక్షణ అంటారు."

"భయపడకు తల్లీ! అదే వ్యాపార రహస్యం. ప్రేమలో పరిపూర్ణత చెందనిదే ప్రముఖ రచయిత్రి లేదా రచయిత కావడం కష్టం. ఆ గొడవంతా మీకెందుకూ. మీ అమ్మాయికి ప్రాచీన రచయిత్రి కోర్సులతో పాటు, ప్రేమ రచయిత్రి కోర్సు కూడా యిస్తాం. తృప్తికరంగా ఆమె ఒక తెలుగు వారపత్రికలో సీరియల్ వెయించుకున్నాకనే మీరు మాకు సన్మానం చేయించవచ్చు."

"ఇదొకటా. ఇందాక అయిదువేలంటిరే?"

"అది ఫీజు తల్లీ! ఇది స్నాతకోత్సవ సన్మానం."

"దీనికేమివ్వాలి?"

"యథాశక్తి యివ్వండి!"

యింటర్వ్యూ జరుగుతున్నప్పుడు అరంగేట్రం ఆండాళ్ కూడా చూస్తున్నది.

"మేము అరంగేట్రం చేయించేటప్పుడు తులం బంగారం, పట్టుచీర, జాకెట్టు వెయ్యొన్నూట పదహార్లూ పుచ్చుకుంటాము. విదేశీ కౌసెట్టు, టి. వి., ఫ్రిజ్ యిలాంటి గృహోపకరణ సామగ్రిని కూడా కొందరు కళా ప్రేమికులు మాకు కానుకగా యిస్తారు. వారి ఆనందాన్ని పాడు చేయటం యిష్టంలేక ఏదో

తీసుకుంటాం", అన్నది ఆండాళ్.

అది విని కల్పవల్లి భయపడిపోయింది.

"మేము ఈ రచయిత్రి కోర్సుకు అంత యిచ్చుకోలేము."

"ఫరవాలేదు. స్నాతకోత్సవం అప్పుడు యధాశక్తి యిచ్చుకోండి." అన్నాడు వాత్సాయనశర్మ.

తరవాత, కొబ్బరికాయల గోవర్ధనరావు అనే వ్యక్తి వచ్చాడు. ఆయనకు ప్రాచీన సాహిత్యంలోనూ, వచన కవిత్వంలోనూ శిక్షణ కావాలిట.

"అలాగే అవశ్యం యిప్పిస్తాము. మా కోర్సులో టి. వి. ట్రియినింగ్, రేడియో ట్రియినింగ్, పెళ్లిళ్ల ట్రియినింగ్, పండగల ట్రియినింగ్ అనే వేరు వేరు సబ్జక్టులు ఉన్నాయి, అవన్నీ నీకు నేర్పిస్తాము కొబ్బరికాయల బాబూ."

"యిలాంటి పేర్లు నేనెప్పుడూ విని ఉండలేదు," అన్నాడు కొబ్బరికాయల గోవర్ధనరావు.

"అదే మా ప్రత్యేకత. టి. వి. ట్రియినింగ్ అంటే ఎలాంటి రచనలు చేస్తే టి. వి. లో సెలెక్టు అవుతాయి అనే ట్రియినింగ్. ఎలాంటి కథలు, గేయాలు రేడియోవాళ్ళు నీకు శృంగార నీరాజనం సమర్పించి ఎగరేసుకుపోతారు అనేది రేడియో ట్రియినింగ్‌లో చెప్పబడుతుంది. పెళ్లిళ్ల ట్రియినింగ్ అంటే నగరంలో ఎన్నో పెళ్లిళ్ళు జరుగుతుంటాయి. ఆ శుభ సందర్భంలో మనం పద్యాలు చదవాలి. దానికి ఆనందించి వధూవరుల తల్లిదండ్రులు సన్మానాలు చేసి, షడ్రషోపేతమైన భోజనాలు పెడతారు. ఇవి కాక ఉగాది, దసరా, సంక్రాంతి వంటి పండగలు వస్తాయి. ఆయా పండగలకూ నగరంలోనూ చుట్టుపక్కలా ఎన్నో సభలు, సమ్మేళనాలూ జరుగుతూంటాయి. వాటికి కూడా ఎలాంటి కవిత్వం రాస్తే మెప్పు పొందవచ్చో మేము ట్రయినింగ్ యిస్తాము."

"చాలా బాగుందండీ"

"కానీ! మి పేరు మాత్రం బాగాలేదు. కొబ్బరికాయల గోవర్ధన రావంటే పౌరజనానికి పట్టేట్టులేదు. పేరు పొడిపొడిగా ఉండాలి. కొ. గో. రావు అని పెట్టుకో. లేదా కేవలం కొ.గో.రా. అన్నా చాలు."

"కొ.గో.రా. ఏమిటండి గోంగూరలాగా."

"పోనీ కె. జి.అని పెట్టుకో."

"అదీ బాగాలేదండీ లోయర్ కే. జి. అప్పర్ కే.జి అని ఎగతాళి చేస్తారు. అంతేకాదు కే. జి. అంటే నాకు కిలో గ్రాం గుర్తుకొస్తున్నది."

"భేష్ బాగా చెప్పావు. నీవు మంచి మేధావి. తప్పకుండా తెలుగుదేశాన్ని పాలించే అగ్రశ్రేణి రచయితవు కాగలవు. సందేహంలేదు. పోని ఒక పని చేద్దాం. కొబ్బరకాయల గోవర్ధనరావు అని పేరుకు బదులు, నీకు నారికేళ శర్మ అని పేరు పెడతాను. బాగుందా?"

"ఏమో మి ఇష్టం. అయినా పేరు గూర్చి యింత చర్చ అవసరం అంటారా?"

"తప్పకుండా. పేరులోనే గలదు పెన్నిధి ఎల్లన్. మంచి రచనకన్నా మంచి పేరుచాలా ముఖ్యం. అసలు పేరును దాచి పెట్టుకొని, అశ్వని, భరణి, కృత్తిక, రోహిణి, మృగశిర, పునర్వసు, ఆరుద్ర యిలా పేర్లు పెట్టుకో. అవన్నీ అయిపోతే అపుడు రచయితలు ప్రభవ, విభవ, శుక్ల, ప్రజోత్పతి. ప్రమోదూత, యిలా సం. ల పేర్లు పెట్టుకోవాలి. అవి అయిపోతే పాడ్యమి, విదియ, తదియ, పూర్ణిమ, అమావాస్య పేర్లు పెట్టుకోవాలి. అదంతా ట్రయినింగులో మేం నేర్పుతాంలే. హిందీ వాళ్లకెవరికి అసలు పేర్లుండవు. చెట్ల పేర్లో, పూల పేర్లో, సూరజ్, చాంద్‌లీ, సంధ్య, తారా యిలా ప్రకృతికి సంబంధించిన పేర్లు యిలా ఏవేవో పెట్టుకుంటారు. ఆ పేర్లనుబట్టే వారికి వెలుగు వస్తూంటుంది. ఇంతకూ నీకు మా విపంచి సంస్థ నచ్చింది కదా!"

"నచ్చిందండీ నచ్చింది"

"అయితే ఇక ఆలస్యం దేనికి? వెళ్లి అయిదు వేలు పట్టుకురా!"

పీచు తీసిన కొబ్బరికాయలాగా నారికేళ శర్మ తలను అటూ ఇటూ ఆడిస్తూ వెళ్లిపోయాడు.

ఆ తరువాత మరొక విద్యార్థి వచ్చాడు. అతని పేరు పురుషోత్తమాచార్యులు.



అతనికి హింసాకవిత్వంలో శిక్షణ కావాలట.


"తప్పకుండా యిస్తాను." అన్నాడు వాత్సాయనశర్మ.

"కానీ నేను మి రేటు యిచ్చుకోలేను. నాకు షార్ట్ సర్టిఫికెటు కోర్సు ట్రయినింగ్ యిప్పించండి. డబ్బు కూడా నేను నెల నెలా కట్టలేను. గుత్తగా యిచ్చుకొనే శక్తి కూడాలేదు.

వాత్సాయన శర్మ పురుషోత్తమాచార్యుల వైపు చూచాడు. అతని కళ్ళు ఎర్రగా మండుతున్నాయి.

"భేష్! నీవు నాకు నచ్చావు నిన్ను తప్పకుండా మా కోర్సులో చేర్చుకుంటా. నీవు మాకు యధాశక్తి డబ్బు యివ్వవచ్చు. నీకు శిక్షణ కావలసింది హింసా కవిత్వం కాబట్టి నీకు రక్తబీజుడు అని పేరు పెడుతున్నాను."

ఇలా ఇంటర్వ్యూలు సాగాయి. వచ్చిన వాళ్ళు కొంతమంది అయిదు వేలు



ప్రతిభ

యివ్వటానికి ఒప్పుకోలేము మరికొంతమంది యిదేదో కొత్తగా ఉంది చూద్దామని వచ్చాం అంతేకాని మాకు మీ ట్రయినింగేమీ అక్కరలేదు అని వెళ్లిపోయారు

భవభూతి వాత్సాయనశర్మ ఆడే ఈ నాటకం అంతా చూస్తున్నాడు

"ఆండాళ్ భవభూతిని చూచి మీరెప్పుడైనా తీరికగా మా నాట్యశాలకు రండి మాట్లాడుకుందాం అన్నది

భవభూతి అవుననలేదు కాదనలేదు

ఆండాళ్ వెళ్లిపోయింది.

అప్పుడు భవభూతి వాత్సాయనశర్మతో ఇలా అన్నాడు

చూడు! ఇదంతా ఏదో నాటకంలా వుంది నీవు అగ్రశేణి నటుడివి. కాబట్టి ఇదొక సాహిత్య నాటకం అనుకోవాలి. నాకు మాత్రం కొంచెం చమత్కారంగాను, మరికొంత పరాచికంగాను ఉన్నట్లు అనిపిస్తున్నప్పటికీ ఇలా చేయడంవల్ల మనం సమాజాన్ని మోసగిస్తున్నామని నా అంతరాత్మకు అనిపిస్తోంది కవిత్వం ఒక జన్మసిద్ధమైన లక్షణం. దానికి ట్రయినింగ్ కోర్సులేమిటో నాకర్థం కావటంలేదు నటుడి వలెనే కవి కూడా ప్రతిభావంతుడై పుడతాడు మనం శాస్త్రం నేర్పగలమే కాని ప్రతిభను నేర్పలేం అది నేర్చుకుంటే వచ్చేదికాదు అసంఖ్యాకమైన వ్యక్తులను పరిశీలించటం వల్ల అనేకమైన శాస్త్ర, కావ్యములను అనుశీలించటంవల్ల లభించేది వ్యుత్పత్తి. ఇది కలవాడు లోకజ్ఞుడు కావచ్చు. కాని ప్రతిభావంతుడు అనడానికి వీల్లేదు ప్రాచీనకాలంలో కూడా ఎవరన్నా డబ్బు తీసుకుని కవులను సృష్టించినట్లు కనపడదు.'

ఒరే నాయనా! అవి శ్రీ కైవల్య పదంబు చేరుటకునై కవిత్వం చెప్పిన రోజులు. ఇప్పుడలా కాదు పాఠకుల సంఖ్య పెరిగింది పత్రికల సంఖ్య విస్తృతమైంది ఈ మాస్- మీడియా అనే యజ్ఞాగ్నిలో నిరంతరం ఇంధనం పడవేస్తూనే వుండాలి అందుకు వేల కొద్దీ రచయితలు రాత్రింబవళ్ళు రచనలను ఉత్పత్తి చేస్తూ వుండాలి ఇది ఒక పెద్ద ప్రొడక్షన్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ. కాబట్టి నీ ప్రాచీన నిర్వచనాలన్నీ యథాతథంగా ఇవ్వాళ అన్వయించటానికి వీల్లేదు అప్పుడు పాలకులు పాలితులో ధనవంతులో కవి పండితులను పోషించేవారు. అగ్రహారం ఇచ్చే వారు. అంబారీల మీద, పల్లకీల మీద ఊరేగించి కనకాభిషేకాలు చేసేవారు కాలికి గండ పెండేరాలు తొడిగేవారు. కాని ఇప్పుడలా కాదు పుచ్చు ఉల్లిపాయలకు, పాత చింతపండుకు వున్న ధరలో సగం కూడా నీ కవిత్వానికి ముట్టదు కవి కలానికి కాక కవి కులానికి బంగారు తొడుగును తొడిగే కాలం ఇది ఇలాంటి పరిస్థితుల్లో నే చేస్తున్నదేమీ తప్పుకాదు !'

"ఓయి. శర్మా! నిన్ను నువ్వు సమర్థించుకోవటం సమంజసంగానే వుంది. కాని నేనొక భ్రష్టయోగిని కవిత్వానికి పరమార్థం ఈశ్వర సాక్షాత్కారం అని నా వుద్దేశం. నాట్యానికి, నృత్యానికి కూడ అదే పరమ ప్రయోజనం. ఈ శరీరమొక హారతి కర్పూరం నటుడు దీన్ని వెలిగించి రంగస్థలంపై సరాజనం ఇస్తూ జనతా జనార్దనుని ముందు నిలబడి బతుకంతా ఈశ్వరారాధనలో గడుపుతాడు అదే విధంగా కవి కూడా అక్షరములను సాధనంగా చేసుకుని సహస్రార కమల సందర్శనం కోసం అనాహత ధ్వని ద్వారా సాగిపోతాడు. ఇదొక నిరంతర చిరంతన తపస్సు రచన మొత్తం ఒక సాధన అదొక యోగం. కలమూ, గళమూ అన్నీ భగవత్ కైంకర్యం కావాలనేది నా సిద్ధాంతం ఇది నేటి జనానికి నచ్చటం లేదు "

"నీవు ఒక విచిత్ర వ్యక్తివి ఏదో యుగం నుంచి పొరపాటున జారి వచ్చిన కాంతిమూర్తివి ఏ గోళం నుండో తోక తెగి పడ్డ చుక్కవు నిన్ను అందుకోవడం, అర్థం చేసుకోవడం కూడా చాలా కష్టం సరే! నా ఏడుపేదో నన్నేడవనీ!"- అన్నాడు వాత్సాయన శర్మ. భవభూతి మందస్మితం చేసి మౌనంగా ఊరుకున్నాడు వాత్సాయనశర్మ అనుకున్న ప్రకారం క్లాసులు ప్రారంభించాడు అందుకు కావలసిన ముడి సరుకు రకరకాల మార్గాల సేకరించుకున్నాడు మొదట శాస్త్రీయ కవిత్వం వ్రాసే విద్యార్థికి కొన్ని చిట్కాలు కవిత్వం- శ్రీరామాకుచ వంటి మంగళకరమైన శబ్దాలతో ప్రారంభించాలి కవి ఎప్పుడూ తల్లి పాలను వదిలిపెట్టని చంటి పిల్లవానిలాగే వ్యవహరించాలి సంస్కృత, ప్రాకృతాది అసంఖ్యాక కావ్యాల నుండి అక్కడక్కడ కొన్ని సంఘటనలు, భావాలు, యథాతథంగా దింపుకుని చెప్పి చెప్పక హక్కు భుక్తం చేసుకోవాలి ఎక్కువగా శృంగార వర్ణనలు ప్రయోగిస్తూ వుండాలి అయితే ఈనాడు ప్రాచీన కవిత్వం చదివే వాళ్ళు తక్కువ. అందుకని దానిని అధునాతనంగా మార్చి అక్కడక్కడ పాయసంలో జీడి పప్పులా, పకోడీలో ఉల్లిపాయలా వాడుకోవాలి

ఒకవేళ నీకు మహా కావ్యం వ్రాయగలిగిన శక్తి లేదనుకో ఏ తాళపత్ర గ్రంథాల లైబ్రరీకో పో! ఒక గ్రంథాన్ని తస్కరించు దాని మొదటి పుట చివరి పుట మార్చెయ్ ఆశ్వాసాంత గద్యలో నీ పేరు వచ్చేటట్టు చూసుకో ఆ కావ్యాన్ని నీ పేరు మీదనే ప్రచురించుకో! నీకు కొంచెంత కీర్తి వస్తుంది నీవొక మంచి కావ్యం వ్రాశావు నీకు పాఠకులు లేరు శ్రోతలు లేరు పబ్లిషర్లు లేరు అది నీ కర్మ! అప్పుడొక చిట్కా వుంది కొన్ని తాటాకులు తీసుకో వాటికి పసరు పట్టించు ఈ పద్యాలను ఆ తాళ పత్రాలలోకి ఎక్కించు ఆ పుస్తకాన్ని కట్ట కట్టి అటక మీద పడేసి దాని మీద నాలుగైదు చెద పురుగుల్ని పడెయ్యి అప్పుడది సమగ్రంగా ప్రాచీనతను సంతరించుకొన్నట్లే లెక్క ఆ తర్వాత దానిని వెలుగులోకి తీసుకురా ఎక్కడో మారుమూల ఈ కృతి దొరికిందని. నేటి వరకు ఇది అలభ్యమని ప్రకటించు నారాయణభట్టు రచించిన గాండీవ విలాసం వంటి ఏదో ఒక పేరు పెట్టు ఈ నారాయణభట్టు నన్నయభట్టుకు సాయం చేసిన పదకొండో శతాబ్దం నారాయణభట్టా? లేక అదే పేరుగల మరొక నారాయణభట్టా? అనే విషయం పుస్తకంలో ఎక్కడా తేలకూడదు తేలితే దాని మీద చర్చ జరిగే అవకాశం లేదు చర్చ లేకపోతే దానిమీద విశ్వ విద్యాలయాల్లో విద్యార్థులు రిసెర్చి చేసి పట్టాలు పుచ్చుకునే అవకాశం లేదు సాహిత్య మాసపత్రికల్లో పండితులూ,

రోజులో రెండు మధురానుభూతులు మీరు మెచ్చుకొనేలా అందిస్తోంది...



ట్రస్ట్

ఉదయం రివ్వురివ్వున తాజాదనపు ఆహ్లాదం కలిగించి, రాత్రి అంతా సూక్ష్మక్రిమికారకమైన దంతక్షయం బారినుంచి రక్షణ కల్పించే ఒకేఒక్క దంతరక్షణ ప్యాకేజీ.

మీరు ఆదమరచి నిద్రలో వున్నప్పుడు చిన్నచిన్న ఆహారపు అణువులు పళ్లలో చిక్కుకుని వుండి సూక్ష్మక్రిముల్ని సృష్టిస్తాయి. అవి అతి వేగంగా రెట్టింపై నోరంతా వ్యాపించి గార పట్టిస్తాయి.గార మూలంగా హానికరమైన ఆమ్లాలు ఉత్పత్తయి దంతక్షయానికి, పుప్పిపళ్లకు ప్రధాన కారణా లవుతాయి.

ప్రతి రాత్రి నిద్రకుపక్రమించేముందు ట్రస్ట్ (నైట్) తో మీ పళ్లను బ్రష్ చేసుకోవడం అలవరచుకోండి. నిద్రపోతున్నప్పుడు దంత సమస్యలు ఉత్పన్నంకావు. ఒక్క ట్రస్ట్ (నైట్) లో మాత్రమే క్లోరెక్సిడిన్ అనే ప్రత్యేక రసాయనం వుండి, మీరు నిద్రిస్తున్న సమయంలో అనేక గంటలపాటు పళ్లపై గార పట్టకుండా నివారిస్తుంది.



ఎర్రనిరంగు ప్యాక్
ఉదయం

నీలంరంగు ప్యాక్
రాత్రి

ఉదయాన్నే మళ్లీ ట్రస్ట్ (మార్నింగ్) తో మీ దినచర్యను ఆరంభించండి. ట్రస్ట్ లో చురుకైన అంతర్గత ద్రవ్యాలు మీ పళ్లను పూర్తిగా శుభ్రపరచి,తళతళ లాడిస్తాయి. ట్రస్ట్ లోని అద్భుతమైన సువాసన,దుర్గంధాన్ని నివారించి మీ శ్వాసను చల్లగా, తాజాగా వుంచుతుంది.ట్రస్ట్ నమ్మికకు మరోపేరు.ట్రస్ట్ ను అలవాటు చేసుకోండి.మీ దినచర్యను ప్రారంభించేందుకు ట్రస్ట్ ఒక్కటే ఉత్తమ మార్గం.

ట్రస్ట్... మీకు అవసరం, రాత్రి -ఉదయం.

ఎందుకోమరి!?

ఉదయభానుని ప్రథమ కిరణం
పూర్ణచంద్రుని హర్ష వదనం
గండుకోయిల గానమాధురి
గులాబీ పూ పొదల 'ఘుమ' 'ఘుమ'
మంత్ర ముగ్ధ మయూర నృత్యం
మలయమారుత మంద గమనం
అణువణువునా ప్రణవనిరరి
ఆహర్ని శలానంద వల్లరి.....
ఔను...ఎన్నో....మరెన్నెన్నో....
అందచందాలొలకరించే
అవనిని సృష్టించిన 'నీవే'! –
తోచినప్పుడు –(తోచనప్పుడు?)
ఎప్పుడోప్పుడు...ఎందుకోమరి!? –
కూడూ గుడ్డా లేక, కుళ్ళే
కురూపులను గూడా పుట్టిస్తావ్!!

–ఏల్చూరి విజయరాఘవరావు

ప్రతిభ

పండితమ్మన్యులూ కలిసి ఘుర్ఘుర స్వరాలు చేస్తూ ఒకరినొకరు కరుచుకునే అవకాశం లేదు. కాబట్టి మొదటనే ఆ తాటాకుల్లో సందేహాలకు, అనుమానాలకు సాధ్యమైనంత అవకాశం వుండేట్లు జాగ్రత్త పడు. అప్పుడు చూడు నా సామి రంగా! ఈ తెలుగు సాహితీ లోకం జుట్టు ఎక్కుని బజారున పడుతుంది. ఇది ప్రాచీన సాహిత్య విద్యార్థి వ్యాపారం చేసుకునే విధానం. ఇందులో ఇంకా వివరాలున్నాయి. అవన్నీ మరెప్పుడయినా తెలుసుకోవచ్చు.

దీనికన్నా మంచి కొత్త సందర్భోచిత కవిత్వ సృష్టి దేశంలో అనేకమైన సందర్భాలు అవకాశంలోకి వస్తుంటాయి. అప్పుడొకసారి వెలం వెత్తులాగా జనమంతా ఆ సందర్భాన్ని పురస్కరించుకున్న సాహిత్యం కోసం ఎగబడతారు. అందుకని బంత్సకొద్ది అలాంటి సందర్భోచిత సాహిత్యాన్ని సృష్టించాల్సిన అవసరం కలుగుతుంది. వాటికి గిరాకీ కూడ ఎక్కువ. ఉదాహరణకు ఆగష్టు 15 వస్తుంది. అప్పుడు స్వతంత్రం, స్వరాజ్యం, మువ్వన్నెల జండా, అందరికీ జండా- అందరూ ఒక జండా- ఎవరికి వారే ఒక జండా-" అంటూ ఇలా కవిత్వాన్ని పేనుకుంటూ పోవాలి. అక్టోబరు 2 వస్తుంది. అప్పుడు అకస్మాత్తుగా గాంధీని గుర్తు చేసుకోవాలి. "తాతా- ఓ తాతా- ఓ బోసి నోటి తాతా!" అంటూ రేడియోలను, టి.వి.లను, పత్రికలను పడికట్టు పదాలతో నింపాలి. ఇలా కాక అప్పుడప్పుడు కొన్ని పండగలు వస్తుంటాయి. వినాయక చవితి వస్తుంది. వెంటనే విఘ్నేశ్వరుణ్ని ఆధారంగా చేసుకుని అద్భుతమైన వెకిలి వేషాలు వెయ్యాలి. "నాయకుడా ఓ వినాయకుడా" అంటూ రక రకాల పేరడీలు కట్టాలి. గారడీలు చెయ్యాలి. సంక్రాంతి వస్తే "రావే- రావే సంక్రాంతి, రవ్వల మువ్వల సంక్రాంతి- గువ్వల నవ్వుల సంక్రాంతి, విక్రాంతి, మహా క్రాంతి" అంటూ సంక్రాంతి కవులంతా రొమ్ము కొట్టుకోవాలి. "ఉగాది- ఉగాది- ఎక్కడున్నావే ఉగాది- ఏ గాదెలో ఏ పొదలో దాక్కున్నావే ఉగాది- రావే రావే ఉగాది మా గాదెలు నింపే ఉగాది" అంటూ గానం చెయ్యాలి. ఇలా పండగ కవిత్వాలూ, ప్రభుత్వ కవిత్వాలూ ముందే వ్రాసి పెట్టుకోవాలి. ఆయా సందర్భాల్లో, ఒక పేరు అటు మార్చి, ఇటు మార్చి వాటినే వాడుకోవచ్చు.

పెళ్ళిళ్ళ పంచ రత్నాలకు బాగా గిరాకీ వుంటుంది. వీటికి సీస పద్యాలు శ్రేష్ఠం. పై నాలుగు చరణాలూ రెడిమేడ్. కంద గీతిలో మాత్రం "వరుడు మాధవయ్య వధువు రుక్మిణీదేవి" అని ఒక పంక్తి వుంటుంది. దాన్ని మాత్రం వేరే వేరే పెండ్లిండ్లలో సందర్భోచితంగా మార్చుకుంటూ వుండాలి. "వరుడు రంగారావు వధువు కమలాదేవి "ఇలా వేరే పెండ్లికి ఆ పంక్తిని మార్చాలి. దీని వల్ల శాలువాలు, నూట పదహార్లు, షడ్రసోపేతమైన విందు భోజనాలు లభిస్తాయి. ఒకేసారి గిరాకీ ఎక్కువగా వచ్చినపుడు పొరుగూరు పెండ్లిండ్లకు ఈ పద్యాలు పార్సిళ్ళలో పంపి అక్కడ పెళ్ళి పందిళ్ళలో పంచి పెట్టే ఏర్పాటు చేయించుకోవాలి. నగదు బహుమానము ఆ వేడిలోనే సదస్యంలో వసూలు చేసుకోవాలి. లేకుంటే ఆలస్యమైనకొద్దీ పెళ్ళి వారు అప్పులో పడే ప్రమాదముంది.

శుభాశుభములు రెండూ మనకు సమానం. పెళ్ళి పద్యాల్లాగే చావు పద్యాలు కూడా తయారు చేసి వుంచుకోవటం మంచిది. ఆ పద్యాలల్లో నీవొక వ్యక్తివి కాదు మహా సంస్థవు. నీవొక వ్యక్తివి కాదు శక్తివి! నీవు లేని లోటు ఎందరున్నా తీర్చలేనిది!- వంటి విశేషణాలు ఉపయోగించాలి. ఇవి ఎవరికైనా సరిపోతాయి. కేవలం ఆ నాయకుని పేరును మాత్రం మొదట చివర మార్చాలి. నీ కీర్తి గగనమెత్తు వ్యాపించింది! నీ కీర్తి హంసలా వుంది. నీ కీర్తి కొంగలా వుంది- ఇలాంటి వాక్యాలు ఎవరికైనా ఒకటే.

ఇకపోతే ఆకాశవాణికి ఎంత సేపూ ప్రణాళికాబద్ధ కవిత్వాన్నే తయారు చేసుకోవాలి. కవిత్వంలో ఎక్కడా రంగు రుచి వాసనా వుండగూడదు. జాతి, కులం, మతం, స్త్రీలింగం, పుంలింగాల ప్రసక్తి వుండగూడదు. "పద పద పద ముందుకు- అదిగో అదిగో విందుకు"! ఇలా మాటలను పేర్చుకుంటూ పోవాలి. మధ్య మధ్య పచ్చ విప్లవం, తెల్ల విప్లవం వంటి పద జాలం కూడా వాడాలి.

వీటన్నిటికన్నా మిక్కిలి లాభసాటి వ్యాపారం సినిమా కవిత్వం. ప్రతి సినిమాలోనూ ఒక క్లబ్బు డాన్సు, ఒక బర్త్‌డే సీను, ఒక శోభనం గది వుంటుంది. వాటికనుగుణంగా పాటలు ముందే అల్లి దగ్గర పెట్టుకోవాలి-

"పాలకూ పూలకూ వేడి
ఇది నీకూ నాకూ వాడి
మన ఇద్దరి ఈ జంట
ఎన్నో కలల పంట
డీ డిడి డిడి డిడి
డా డడ డాడా డాడా-

ఇలా తాడూ బొంగరం లేకుండా పంక్తులు పేర్చుకుంటూ పోవాలి. ఉన్నట్టుండి సినిమాల్లో కోయ వాళ్ళు వస్తారు. అది సాంఘికమైనా, చారిత్రికమైనా, పౌరాణికమైనా సరే వాళ్ళు వస్తారు! ఎందుకు వస్తారో ఎవరికీ తెలియదు! వచ్చిన దగ్గర్నుంచి నానా రభసా చేస్తారు.

"జుంబారో లంబాడీ-
జింకిలకడ జింజిం." అంటూ చిన్న చిన్న తోకల్లాంటి గుడ్డలు చుట్టుకుని, తలకు కొమ్ములు, ఈకలు పెట్టుకుని, అద్భుతమైన కంగాళీ చేస్తారు. దీనంతా ఆ ప్రేక్షకులనబడే ప్రబుద్ధులు టిక్కెట్టు కొనుక్కున్న పాపానికి నోరు మూసుకుని భరిస్తారు. అది వాళ్ళ ఖర్మ! మనం మాత్రం కొన్ని కోయ పాటలు తయారు చేసి పెట్టాలి. వీటికన్నా కూడా ఎక్కువ గిరాకీ కల పాటలు శృంగార గీతాలనబడే అసభ్య వల్గర్ సెక్స్ గీతాలు-

"యెనకెనకాయేం జూస్తావ్ మావయ్యా!
ముందు పని మొదలెట్టు వోరయ్యా- వంటి వ్రాతలు పుష్కలంగా వుండాలి!
"పొలమంతా దున్నరా
గడ్డంతా పీకరా
విత్తనాలు జోరుగా
విసిరిసిరి కొట్టరా"- వంటి పాటలు ఎంత బాగా వ్రాయగలిగితే నీకంత కనక వర్షం కురుస్తుంది.

నీవు వ్రాసే ప్రతి మాటా రెండర్థాలతో వుండాలి. అప్పుడే నీకు చాలా తొందరగా ధనమూ, కీర్తి లభిస్తాయి. వీటిని ఎలా సాధన చేయాలో, ఎలా

రెండర్థాలు వచ్చేటట్లు చూచుకోవాలో మీకు తర్వాత క్లాసుల్లో శిక్షణ ఇస్తాను.


ఇక పోతే ఇప్పుడు బాగా చెలామణిలో వున్నది విప్లవ కవిత్వం. అంటే రక్త కవిత్వం. దీని నిండా నెత్తుర్లు, మంటలు, భగ భగలు, చితులు, స్మశానాలు వంటి పదాలు తరచు వాడతూ వుండాలి. డబ్బున్న వాళ్ళని నోటికెంత వస్తే అంత తిడుతూ వుండాలి. ప్రజాశక్తి, జనశక్తి, ధనశక్తి, విప్లవం వంటి పదాలు విరివిగా దొర్లిస్తూ వుండాలి. గోరి కడతా- సమాధి కడతా- రక్తం జూస్తా- పేగులు తీస్తా- ఇలా యథేచ్ఛగా తిడుతూ వుండాలి ఎంత బాగా తిట్టగలిగితే నీ కవిత్వం అంత బాగా రాణిస్తుంది.

నాయనలారా! ఇవన్నీ పదాల గారడీలు. భావమూ, రసమూ, అలంకారమూ, ఔచిత్యము, వీనితో ఎక్కడా ప్రమేయం లేదు పాఠకులు వెనుకటి వలె పరిమితమైన సంఖ్యగలవారు కాదు. జీవితమంతా కష్టపడి ఏ మనుచరిత్రమో, వసు చరిత్రమో కావ్యం వ్రాస్తే దానితో వారు శతాబ్దాల కొలదీ కీర్తి శరీరంతో విలసిల్లేవారు. మనకున్న సగటు పాఠకుల విజ్ఞానం చాలా తక్కువ వారికి సమాసోక్తులు, ధ్వని సిద్ధాంతాలూ అక్కర లేదు. ఎంతసేపూ, బనీను కవిత్వం, జాకీటు కవిత్వం, లంగా కవిత్వం కావాలి. ఈ విషయాన్ని గుర్తించుకుంటే చాలు. రచయితలకు కనక వర్షం కురుస్తుంది.

అన్నింటికన్నా బాగా లాభసాటిగల వ్యాపారం వంటింటి కథా రచన ఇందులో ఎక్కువగా పోపు సామాన్లు గూర్చి వ్రాస్తూ వుండాలి ఆవాలు, మెంతులు, జీలకర్ర, వెల్లుల్లి, కరివేపాకు, కొత్తిమీర, ఇంగువ, అల్లం, చింతపండు, ఉప్పు, మెరపకాయ, తిరగమోత వీటన్నిటితోనూ, కూర ఘుమఘుమలాడినట్లు, మీ నవల ఘుమ ఘుమలాడాలి. నవలనిండా అంతులేని త్యాగాలుండాలి. బక్కెట్లకొద్దీ కన్నీరు కార్చాలి. అత్తలు కోడళ్ళను సతాయించటాలు, ఆడబిడ్డలు వదినలను రాచి రంపాన పెట్టడాలు, అసూయలు, అల్లర్లు, అవమానాలు, మధ్య తరతి మిడియోక్రసీ మొత్తం భారి ఎత్తున కిచిడీ వండినట్లు వండి వార్చాలి.ఇవి కాక ఉంగరాల జుత్తుగల తొమ్మిదడుగుల పొడవైన హీరో, పదిహేనడుగుల కారు వేసుకుని రోడ్సైడ్ రోమియోలా తిరుగుతూ వుండాలి. అతడి వెంట పెళ్ళయినవాళ్ళు, పెళ్ళి కాని వాళ్ళు, మొగుడ్ని వదిలేసిన వాళ్ళు, మొగుడి చేత వదిలి వేయబడ్డవాళ్ళు సమస్త స్త్రీ జనం గోపాలుని వెంట పడ్డ గోపికలలాగా ఇళ్ళూ వాకళ్ళూ వదిలేసి వెంట పడాలి మధ్య, మధ్య "నన్నుపార్థం చేసుకుంటున్నారు నన్ను అనుమానిస్తున్నారు. మీ పాద ధూళి వద్ద నాకు కొంచెం చోటు ఇవ్వండి" ఇలాంటిడైలాగులు వాడుతూ వుండాలి. పొద్దున్నే పాలు పోయడానికి వచ్చిన వాడి దగ్గర్నుంచి రాత్రి పూట వీధి కాపలా కొరకు వచ్చిన గుర్ఖా వరకు చొక్కా, లాగూ, బనీను, విప్పుకుని రేసు గుర్రంలాగా, రేప్ కోసం పరిగెత్తుతూ వుండడానికి శక్తి వంచన లేకుండా వర్ణించాలి. ఇందులో ఇంకా చాలా వ్యాపార శిల్పాలున్నాయి. వాటన్నింటినీ వదిలిపెట్టకుండా మీకు ఆయా తరగతుల్లో బోధిస్తాను"- అని వాత్సాయనశర్మ తన విద్యార్థినీ, విద్యార్థులకు సంగ్రాహక పాఠాన్ని బోధించాడు

వాత్సాయనశర్మ తరగతులు ప్రారంభమయినాయి. భవభూతి ఇదంతా గమనిస్తున్నాడు. అతనిలో అసహనం పెరిగిపోయింది.

కవిత్వానికి శబ్దానికి ఇదేనా ప్రయోజనం? రసము బ్రహ్మస్వరూపము. ఈశ్వర సాక్షాత్కారాన్ని పొందలేని సామాన్య మానవుడు రసానందాన్ని అనుభవించి శాఖా చందన న్యాయంగా దివ్యానుభూతిని పొందగలుగుతాడు. అందుకు ఇతివృత్తమూ, అలంకారమూ, శైలీ, శయ్యా, పద రచన అన్ని దోహదం చేస్తాయి. ప్రాచీనుల్లో ఎక్కువమందికి ఈ శాస్త్ర రహస్యం తెలుసు. ఆధునికుల్లో పాఠకులకూ రచయితలకూ కూడ రస విద్య తెలియదు. శబ్దం దైవ స్వరూపమనే పరిజ్ఞానం లేదు. దేహం ఆరాధనాయోగ్యమైన ఉపకరణమనీ, అదొక హారతి కర్పూరమనీ నటులకు తెలియదు. దేహం దేవాలయమైనప్పుడు దాన్ని ఎంత పవిత్రంగా వుంచుకోవాలో అందలి అంగాంగ విన్యాసం ఎలా ఆరాధనా కాండగా మార్చాలో ఋషితుల్యులైన నట యోగులకు మాత్రమే తెలుసు. అందరూ నటులైతే వాత్సాయనశర్మను నటయోగిగా చేయాలని తన సంకల్పం. కాని అది నెరవేరేట్లు లేదు. పులి మీద పుట్ర అన్నట్లు అందుకు తగినట్లు ఈ కవుల కాలేజీ ఒకటి మొదలు పెట్టాడు. శబ్దం ఇక్కడ వ్యాపారపు ముడి సరుకుగా



మారిపోతున్నది.

భవభూతిలోని ఆవేదన తీవ్రతరమైంది

హిమాలయంలోని ఘనీభవించిన మంచు సూర్య సంతప్త ధాటికి కరిగి నీరై ప్రవహించి ఆవిరిగా పైకి లేచి మేఘంగా మారి వర్షించినట్లు భవభూతి వెచ్చని హృదయోద్వేగం అతని మనస్సును వెచ్చజేసి కన్నుల వెంట దుఃఖాశ్రువులను ప్రసరింపజేసింది సజలములైన అతని నేత్రాలు శ్రావణ మేఘములైనాయి. ఆ ఉద్వేగంలో అతడొక యక్షగానం వ్రాశాడు దాని పేరు 'క్షీర సాగర మథనం' దేవతలూ, దానవులూ పాలసముద్రాన్ని చిలికారు. అందుండి అష్టైశ్వర్యాలు పుట్టాయి చంద్రుడు, పారిజాతమూ, లక్ష్మి, కౌస్తుభమూ, ఇలా ఒక్కొక్కటే వస్తున్నాయి వాసుకి నోటి నుండి జారిన విషం హాలాహలం అయింది దానిని జూచి అంతా పరుగెత్తుకుపోయారు అప్పుడు శివుడు వచ్చి దాన్ని మింగి మృత్యుంజయుడయ్యాడు

శివుడు మృత్యుంజయుడు' అతడు శక్తితో కూడుకున్నవాడు కాబట్టి మృత్యుంజయుడు' అమృతాన్ని తాగిన దేవతలు అనిత్యులైనారు. విషాన్ని మింగిన శివుడు మాత్రం మృత్యుంజయుడయినాడు! ఏమిటి విచిత్రం' ఇందుకు కారణం అమ్మవారే' భవభూతికి అర్ధనారీశ్వర తత్వం అర్థమయింది'

అతని కళ్ళ ముందు అకస్మాత్తుగా ప్రతిభ సాక్షాత్కరించింది.

రసావేశంతో ఆమె చేసిన నృత్యం గుర్తుకు వచ్చింది. చాలా మంది కళాకారుల్లో గ్రేస్ వుంటుంది అది లేకపోతే అసలు నర్తకియే కాజాలదు. దానినే మనం హొయలు లేక వొయ్యారం అనవచ్చు దీనితో పాటు కళలో ఆర్ద్రత కూడా వుండాలి. అప్పుడే అది రాణిస్తుంది వారే ప్రముఖ కవులు. ప్రముఖ నర్తకులు ఔతారు. ఈ రెండింటితో పాటు కళాకారునికి ఆవేశమూ, తాదాత్మ్యమూ కూడా అవసరం. అది వున్నవారే ఋషితుల్యులైన కళాకారులుగా అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించగలుగుతారు

ప్రతిభ చేసిన అలౌకిక నృత్యానికి ఇదేనా అర్థం!

తాను క్షీర సాగర మథనం అనే యక్షగానాన్ని వ్రాసినట్లు, అందులో మోహిని పాత్రను తాను అభినయిస్తే అది బాగా రాణించి జనరంజకంగా ఉంటుందని భావిస్తున్నట్లు ప్రతిభకు భవభూతి ఒక వుత్తరం వ్రాశాడు.

కొద్ది రోజుల్లోనే ప్రతిభ వద్ద నుండ భవభూతికి సమాధానం వచ్చింది.

"భవభూతి గారికి నమస్కారములు. సాదరంతో మీరు వ్రాసిన జాబు అందింది. కృతజ్ఞతలు నేను మీకొక ముఖ్యమైన విషయం వ్రాస్తున్నాను. బెంగుళూరు సంస్థను ప్రస్తుతానికి మూసి వేయదలచుకోలేదు. దీనితో పాటు హైదరాబాదులో మా శాఖను ప్రారంభించాలనుకుంటున్నాను. నడిస్తే రెండూ నడుస్తాయి. లేకుంటే కొంత కాలానికి బెంగుళూరు బ్రాంచినే తీసి వేయవచ్చు. ఇదే నా వుద్దేశం. త్వరలో సుధారాణితోనూ, మా నట్యాంగం బృందంతోనూ నేను హైదరాబాదుకు వస్తున్నాను. రాగానే నన్ను మీరు కలవండి. మీతో చాలా విషయాలు మాట్లాడాలి. మోహిని వేషం సంగతి స్పష్టం చదివి నిర్ణయించుకుందాం. ఉంటాను వందనాలతో

– ప్రతిభ"

(ఇంకా ఉంది)

వ్యక్తిగతం





కాంగ్రెసు (ఐ)పార్లమెంటు సభ్యుడు,ప్రముఖ కార్మిక నాయకుడు,ఆంధ్రప్రదేశ్ గవర్నర్ డాక్టర్‌శంకర్ దయాళ్ శర్మఅల్లుడు శ్రీ లలిత్ మాకెన్(35)ని, ఆయన భార్య శ్రీమతి గీతాంజలిని పశ్చిమ ఢిల్లీలోని కీర్తి నగర్‌లో ఉన్న వారి ఇంటి ఆవరణలో గుర్తు తెలియని ఇద్దరు దుండగులు కాల్చి చంపారు.జూలై 31వ తేదీ ఉదయం 10 గంటల ప్రాంతంలో పార్లమెంటుకి వెళ్ళడానికి వారు తమ కారులో ఎక్కబోతుండగా ఈ దారుణం జరిగింది. హంతకులిద్దరూ స్కూటర్ మీద వచ్చి మాకెన్ దంపతులు బయటికి రాగానే కాల్పులు జరిపి తప్పించుకు పోయారు. వెంటనే మాకెన్ దంపతులని రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రికి తీసుకు వెళ్ళారు. కానీ శ్రీ లలిత్ మాకెన్ దారిలోనే ప్రాణాలు వదిలారు. శ్రీమతి గీతాంజలి ఆసుపత్రిలో కన్ను మూశారు. ఈ దారుణ హత్యలకి తీవ్రవాదులే కారణమని భావించబడు తున్నది. కనిష్క విమాన పతనానికి కారణంగా చెప్పబడుతున్న అంతర్జాతీయ తీవ్రవాది లాల్‌సింగ్ ఈ హత్యలు చేశాడని పోలీసులు గట్టిగా నమ్ముతున్నారు. అతనికోసం తీవ్రంగా అన్వేషిస్తున్నారు. శ్రీ మాకెన్ దక్షిణ ఢిల్లీ పార్లమెంటు నియోజక వర్గంనించి లోక్ సభకి పెద్ద మెజారిటీతో ఎన్నికైనారు. ఢిల్లీ నించి ఎన్నికైన పార్లమెంటు సభ్యులందరికన్నా ఈయన వయసులో చిన్నవారు. వీరికి ఆరు సంవత్సరాల కుమార్తె ఉన్నది.... □

వారఫలం

30–8–1985శుక్రవారం మొదలు 5–9–1985గురువారం వరకు

★ **మేషం :** ఆదాయం గలవారం. ఒకానొక విషయంలో మీ అభీష్టం నెరవేరుతుంది. 'కృషితో నాస్తి దుర్భిక్షమ్' అని గ్రహించిన వారుగాన మేలే జరుగుతుంది. శుభ ప్రస్తావనలుంత గలవు. వ్యర్థ కాలక్షేపం అనవసరం. స్త్రీలకు : కళారంగాన వృద్ధి, ఆరోగ్యమందభివృద్ధి.

★ **వృషభం :** శుభ కార్యాచరణమునకు అవకాశం గల వారం. సబంధ విషయాల గూర్చిన చర్చలుంతగలవు. అప్రయత్నంగా ధనాదాయ మున్నది. ఏమయినా అనవసర వ్యక్తులను దాపునకు రానీయకండి. వ్యాపార లాభ సంపాదన కాస్కారమున్నది. స్త్రీలకు : వస్తుసేకరణకు, లాభ సంపాదనకు, భూమి కొనుగోలు చేయుటకు, ఉద్యోగరీత్యా మేలు పొందుటకు అవకాశం.

★ **మిధునం :** నూతనాంశాలు గ్రహిస్తారు. నూతన మిత్రులు చేరుటకు అవకాశమున్నది. అనవసరంగా తగాదా తంటాలుంటాయేమో, జాగ్రత్త! వైజ్ఞానికంగా కొందరకు సదవకాశా లుంటాయి, గ్రహించండి. స్త్రీలకు : ఆదాయం, అధికారమందభివృద్ధి.

★ **కర్కాటకం :** మీ యింట శుభం జరుగు యత్నాలుంతగలవు. సాటి వారిలో మీకు పేరు ప్రతిష్ఠలు రాగలవు. అధికారమందభివృద్ధి చేకూరుతుంది. పుణ్యకార్యాచరణమున కవకాశముంటుంది. స్త్రీలకు : స్థితియందు వృద్ధి, ఉద్యోగ, గృహములందు మార్పులు సంభవించ నున్నవి, గ్రహించండి.

★ **సింహం :** ఎన్నడో రావలసిన డబ్బు ఈ వారం గాని అందదు. అయినవారో, మిత్రులో ఉద్యోగ విషయంగా మీకు సాయపడనున్నారు, గమనించి, అందుకోండి. స్థిరాస్థియందు కొందరకు ఏవో మార్పులు రానున్నవి. స్త్రీలకు : ఆపేక్షించిన వ్యవహారంలో మీ అభిమతమే నెరవేరుతుంది. ఆశించిన ప్రమోషన్ అందుతుంది.

★ **కన్య :** వ్యాపార నిమిత్తం దూర ప్రాంతాలకు ప్రయాణించు అవకాశం కొందరకు, నూతన గృహ నిర్మాణావకాశాలు , కొందరకు, సాహితీరంగాన సదవకాశాలు కొందరకు, "స్పెక్యులేషన్" ఫలించుట కొందరకు, ఆరోగ్య మందు వృద్ధి కొందరకు చెప్పదగిన అంశాలు. స్త్రీలకు: నగలో, విలువగల వస్త్రాలో, ఖరీదైన వస్తువులో కొనుగోలు చేయగల అవకాశా లున్నాయి.

★ **తుల :** రాజ్యాంగ సంబంధం మీకున్న, అమిత జాగ్రత్తగా వ్యవహరించాలి. డబ్బు సంబంధమైన ఉద్యోగమయితే తప్పులు చేయకుండా జాగ్రత్తపడాలి. ఇంట దొంగతనం జరుగుతుందేమో గ్రహించి మెలగండి. స్త్రీలకు: వస్తువులో, నగలో కొందరు పోగొట్టుకో గలరు. ఉద్యోగాభివృద్ధి కొందర కున్నది.

★ **వృశ్చికం :** కూర్చున్న వారిని పిలిచి, ఏదో యిబ్బందులలో చిక్కించే వారుంటారు, జాగ్రత్త. అశ్రద్ధతో కొంత యిబ్బందికి గురి కాగలుగుట కూడా గమనిస్తారు. చేసిన ఉద్యోగ యత్నాలు ఫలిస్తాయి. కొందరకు దూర దేశ ప్రయాణం చెప్పదగిన అంశం. స్త్రీలకు: నూతన మిత్ర కలయిక, ఉద్యోగరీత్యా మేలు.

★ **ధనుస్సు :** నూతన మార్గాన ధనాదాయం, నూతనోద్యోగ ప్రాప్తి, నూతన వ్యాపారాలోచనలు, నూతన గృహ నిర్మాణానికి నాంది, నట గాయక కథకులకు ధనలబ్ధికి అవకాశ మున్నది. స్త్రీలకు: ఇటీవల పోగొట్టుకొన్న వస్తువులను సమకూర్చుకోగలుగుట విశేషం. ఆరోగ్యమందు చెప్పదగిన వృద్ధి.


★ **మకరం :** స్థిరాస్తి విషయంలో పట్టుదలలు పెరుగుతాయి. దాయాదులతోనో, బంధువులతోనో ఘర్షణ జరుగుతుంది. కొంత బలం అమ్ముకోవలసిన అగత్యం కూడా ఏర్పడు తుంది. "కోర్టు" మూలంగా వ్యవహారం పరిష్కారం కాగలదు. స్త్రీలకు: కళారంగ ప్రసిద్ధి, ఉద్యోగరీత్యా అనుకూలం.

★ **కుంభం :** మొదట మీకు తట్టిన ఆలోచనలను అమలులో పెట్టండి. వారూ వీరూ చెప్పారని తటపటాయించకండి. సాహితీ మార్గాన కొందరకు సదవకాశాలు లభ్యం కాగలవు. ఫ్యాక్టరీ లందు పని పాటలు చేసికొనే వారికి, బ్యాంకు ఉద్యోగులకు సదవకాశాలు లభ్యములు కాగలవు.

★ **మీనం :** విందు వినోదాలతో కాలక్షేపం. నూతన మిత్ర గోష్ఠి, ఉద్యోగ సంపాదనా యత్నాలు సఫలం కావటం, రాజకీయంగా అనుకూలత చేకూరటం, అప్రయత్నాదాయం సంభవం. ఎంతో కాలంగా దూరమైన మిత్రులు దాపునకు రాగలరు. స్త్రీలకు: కొందరకు పెద్ద పదవి లభ్యం కాగలదు. గృహ మార్పు కొందరకు చెప్పదగిన అంశం కూడ. గ్రహించండి.

-విద్వాన్ కోట సత్యరంగయ్యశాస్త్రి





KOHINOOR

లేత ఎఱుపు సుకుమారమైన కండోం

TTK తయారీ.

మగబుద్ధి

పూడిపెద్ది సత్యాలక్ష్మి

సరిగ్గా మాపెళ్ళయి మూడ్నెల్లయింది ఈ మూడు నెలల్లో మేమిద్దరం ఒహర్నొకరు వదిలి ఉండలేని స్థితిక వచ్చాం. కొత్త ఊరు కొత్త వాతావరణం బాగా అలవాటయిపోయాయి మా శ్రిమతికి ఇటు మాతల్లిదండ్రులకి అటు మా శ్రిమతికి తల్లి దండ్రులకీ చాలా దూరంలో ఉన్నప్పటికి ఎవరికి ఉత్తరాలు వ్రాయటాన్కి కూడా తీరిక లేనంతగా ఉండేవాళ్ళం ఆఫీసు పూర్తయిన వెంటనే ఇంటికి చేరుకుని తలుపులు బిడాయించుకుని- ఇంట్లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ- నవ్వుతూ, తుళ్ళుతూ, కాలం గడిపేస్తున్నాం- నిన్ను చేసుకోవటం నా అదృష్టం అంటే- నువ్వు దొరకటం నా అదృష్టం అంటూ ఒకర్నొకరు తెగ అభినందించుకుంటూ ఉండేవాళ్ళం మా కాలనిలో అంతా వెటకారం కూడా చేస్తూ ఉండేవారు 'ఎంత కొత్తగా పెళ్ళయిన దంపతులైనా- మరి ఇంతలా- బైట కైనా రాకుండా రోజులు గడిపేస్తున్నామని'.

మా ఆఫీసులో సరేసరి -"ఏమోయ్ మోహన్‌రావ్ - నిన్న భూకంపం వచ్చింది తెల్సా' అని అడిగి - అవున్లే నీకెందుకు తెలుస్తుంది - కొత్తగా పెళ్ళయింది కదూ! అంటూ ఆటపటిస్తూ ఉండేవారు

ఇంత చక్కగా రోజులు గడిచిపోతున్న క్షణంలో - మాకో టిలిగ్రాం వచ్చింది "స్టార్ట్ ఇమ్మీడియట్లీ' అంటూ మా మాంవగారి దగ్గర్నుండి.

సంగతేంటో తెలియని మేం తెగ గాబరా పడుతూ -గబగబా సామాన్లు సర్దుకుని -ఆఫీసుకి శలవు పెట్టుకుని మా అత్తవారి ఊరైన బరంపురం చేరుకున్నాం

రైల్వేస్టేషన్ నుండి ఇంటి కెళ్ళేంత వరకూ టెన్షన్ భరించలేకపోయినా మేం ఇంటి కెళ్ళేసరికి - మా మరదలు నవ్వుతూ రిసీవ్ చేసుకోటం - చూసి - హమ్మయ్య అంటూ తేలిక పడ్డాం - జరక్కూడనిదేది జరగనందుకు.

'ఏమే జాకీ (ఇది మా మరదలికి ముద్దుగా నేను పెట్టుకున్న పేరు) టిలిగ్రాం ఇచ్చి పిలిపించారు - కొంపలంటుకున్నట్లు, ఎందుకేంటి' - అన్నాను పలకరిస్తూ.

'గుమ్మంలో అడుగు పెడుతూనే ఎంటా తొందర - అయినా కొంపలంటుకుంటే ఫైర్ సర్వీసుకు కబురు పెడ్తాం గానీ - నిన్నెందుకు పిలుస్తాం' - అంది.

ఇంట్లో కెళ్ళగానే- మా శ్రీమతి కూడా అదే ప్రశ్న వేసింది- మా అత్తగార్ని

అబ్బే ఏంలేదమ్మా" అక్కకి నెలలు నిండాయి ఇంక పురుడొచ్చే టైమేనని డాక్టర్ చెప్పాడు ఈ లొపున పాపం నిన్ను చూడాల నుందంది- ఇంక ఆ కోరికలా ఉండిపోతే పురుడు రాదేమోనని బెంగపడి- మి నాన్నగారు టిలిగ్రాం ఇచ్చారు "

'అక్కేది?" అంది ఆతృతగా మా ఆవిడ ఈ లోపునే పెరట్లోంచి మొఖం కడుక్కుని, తుడుచుకుంటూ- వరండాలో చెల్లెల్ని చూస్తూనే

"-సుధా. బాగున్నావా?" అంటూ దగ్గరకొచ్చి వాటేసుకుంది-వాళ్ళ అక్క.

"ఏంటక్కా? మూడ్నెళ్ళకే నా కోసం మొహం వాచిపోయావా? దూరాభారం నుండి శ్రమపడి రావటాన్కి మాతాతలు దిగొచ్చారు- టిలిగ్రాం చూసి- ఎంతగాబరా పడిపోయామో--తెల్సా?"

'తెలుసమ్మా' అలా ఇస్తేనే గాని మిరు రారని తెల్సి- అలా ఇచ్చాను. ఏమోయ్ అల్లుడు కులాసానా, ఎవిటప్పా, పెట్లి తల్లి కూతుర్లూ పలకరింపు లేనా- అల్లుడ్ని మాంవగార్ని కాస్త చూస్తారా-" అంటూ ప్రవేశించారు మా మామగారు

ఆరాత్రి నాశ్రీమతి మాకు కేటాయించిన గదిలోకి ప్రవేశించి అందించిన శుభవార్త ఏమిటంటే- వాళ్ళ అక్క పురుడ యెంత వరకూ తను అక్కడుండక తప్పదని.

నా గుండెల్లో రాయి పడింది. "ఇదేం ఖర్మరా భగవంతుడా! పురుడోసుకునేది మి అక్కయితే- నువ్వెందుకోయ్ ఇక్కడా- అయినా నన్నొదిలి ఉండటాన్ని నీ మనసొప్పుతోంది? అడిగాను.

"నా కుండాలని లేదండీ- కానీ అక్కకిది తొలికాన్పు.-డెలివరి కొంచెం కష్టం అని డాక్టర్ చెప్పిందిట- అందుకని అక్క భయపడుతోంది-' ఈటైంలో నేనుంటే కాస్త ధైర్యంగా ఉంటుందని-" కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ అంది సుధ.

"సరే- పురుడింకో వారం పది రోజుల్లో అవుతుందన్నావ్ కదా! నువ్వుండు నాకు శలవు లేదు- నేను వెళ్ళిపోయి నా తంటాలు నేను పడతాను-" అన్నాను.

మర్నాటి సాయంకాలం రామారావు మాష్టారింటికి ప్రోగ్రాం పెట్టింది-సుధ.

ఆ రామారావు మాష్టారనబడే అయన మమ్మల్ని పెళ్ళయ్యాక చూడలేదుట.

రామారావు మాష్టారంటే సుధకి చాలా ఇష్టం- సుధ చెప్పే కబుర్లలో పాతిక శాతం ఆయన గురించే ఉండాలి సుధ అభిమానం ఇంతలా సంపాదించిన ఆ మాష్టార్ని చూడాలని నాకూ ఉండేది.

సరే అని- కప్పుకున్నాను.

మర్నాటి సాయంకాలం ఊరి చివర్న ఉన్న రామారావు మాష్టారింటికి చేరుకున్నాం

రామారావు మాష్టారంటే -పంచ-లాల్చి- పిలక- పొడుండబ్బా- పై మిద కండువా కళ్ళద్దాలు- ఇవన్నీ ఉంటాయనుకున్న నాకు ఆశాభంగమే కల్గింది అయన నాకంటె రెండు మూడేళ్ళు పెద్ద ఉంటాడేమో- చక్కని క్రాఫు, పేంటూ షర్ట్‌లో హుందాగా, అందంగా చాలా నీటుగా ఉన్నాడు- మేం వెళ్ళే సరిక ఆయనతో పాటుగా మరో ముగ్గురు మాష్టర్లున్నారు సుమారు ఒకే వయసు వాళ్ళు, ఎవరికి పెళ్ళి కాకపోవటం- మరో విశేషం వెళ్ళగానే మాయిద్దర్ని చూసిన మాష్టారు 'హల్లో సుధప్పలూ- ఏంటి గుర్తున్నాడన్న మాట ఈ దౌర్భాగ్యుడు-" అంటూ పలకరించాడు ఆయన మాటల్లో- కొంత చలాకి, కొంత నిష్ఠూరం ధ్వనించాయి

సుధ నన్ను మాష్టారికి పరిచయం చేసింది- తక్కిన మాష్టర్లు కూడా పరిచయం అయ్యారు-కాఫీలు తెప్పించాడాయన.

చాలా సేపు- ఎవేవో విషయాలు మాట్లాడుకున్నాం అంతవరకూ నా ప్రక్కన కూర్చున్న సుధ- నా దగ్గర్నుండి లేచి వెళ్ళి- ఆయన ప్రక్కన ఖాళీగా ఉన్న కుర్చిని - ఆయనకి మరింత దగ్గరగా లాక్కుని- ఆయన భుజాల మిద చేతులు వేసి -కబుర్లు చెప్పటం ప్రారంభించింది-

సుధ కాస్త అయినింటిలో పుట్టి- అంతకంటే పెద్ద నాగరికత గల్గిన సమాజంలో పెరిగింది. కానీ ఎంతయినా- తెలుగు సాంప్రదాయంలో పుట్టిన మగాడ్ని- అది నేనెంత మాత్రం సహించ లేక పోయాను అయినా అంత మందిలో సుధ నేమన గలను .ఖాళీ అయిన నా ప్రక్క కుర్చి నన్ను వెక్కిరించింది. నా గుండెలు బరువెక్కి పోయాయి.

సుధకి అందరితో చనువుగా ఉండటం అలవాటే- కానీ- ఈ చనువు మాత్రం నేను సహించ లేక పోతున్నాను. గుండెలలో అగ్ని పర్వతాలు బ్రద్దలౌతున్నట్లు ఫీలవుతూ కూర్చుని -

అన్యమనస్కంగానే మాట్లాడుతున్నాను

రెండు- మూడు- ఐదు- పది-నిముషాలు గడచి పోతున్నాయి- మాసిన వాళ్ళకి వారిద్దరూ భార్యా భర్తల్లా కన్పిస్తారు

నా చేతగాని తనాన్ని చూడలేకో- సుధ ప్రవర్తనని చూడలేకో- తక్షణ ముగ్గురు మాష్టార్లు బయటికి వెళ్ళి గేటుదగ్గర మాట్లాడు కుంటున్నారు సుధ ఏదో జోక్ కట్‌చేసింది. నాకు విన్పించ లేదా జోక్- కానీ వాళ్ళిద్దరూ పక,పక, విరగబడి నవ్వుకుంటున్నారు

పంటికి గాయాలు చేస- కొరంరాననట్లనిపించింది నాకు- ఇంక అక్కడుండ లేక పోయాను విస, విసాబయట కొచ్చి- నేను కూడా తక్షణ మాష్టర్లతో పాటు వీధి గేటు దగ్గర నిలబడ్డాను- నేను నిష్క్రమించటం వాళ్ళిద్దరూ- గమనించ లేదు.

బయట వర్షం-హోరుమని కురుస్తోంది.

నా మనసు ఝోరుమని ఏడుస్తోంది ఏం చెయ్యటాన్కి పాలుపోలేదు

"సుధా ఇంటి కెళ్ళి పోదాం- రిక్షా పిలుస్తా-

అంటూ జవాబు కోసం కూడా ఎదురు చూడకుండా-వర్షంలో బయటకి వచ్చాను

"కాసేపాగండి- వర్షం తగ్గాక వెళ్ళురు గాని- బయట నాతో పాటు నిల్చున్న మాష్టర్లలో ఒకాయన అన్నాడు

లేదండి- ఈ వర్షం ఎప్పటికి తగ్గుతుందో ఏమో- తొమ్మిదయి పోయింది ఇంటి దగ్గరెదురు చూస్తుంటారు '

పదండి- నేనూ వస్తా ' నంటూ మరో మాష్టారు నాతో పాటు వర్షంలో తడుస్తూ వచ్చారు కాస్త దూరం పోయాక- రిక్షాదొరికింది. మాష్టారిదగ్గర శలవు తీసుకుని- సుధ నేను బయటకొచ్చాం- మాష్టారింటి నుండి మా మావగారిల్లు సుమారు మూడు కిలో మీటర్లుంటుంది. . రిక్షా ఆసామి- వర్షంలో తడిసి పోతూ- రొప్పుతూ లాగుతున్నాడు సుధతో నేనేమి మాట్లాడ లేక పోయాను నా గుండె భారంగా- నా మనసు- అసూయగా- నా శ్వాస వేడిగా నిట్టూరుస్తున్నాయి

ఇల్లొచ్చింది- దిగండి' అన్న మాటతో ఈ లోకంలోకి వచ్చాను రిక్షాకి డబ్బులిచ్చి - ఇంట్లోకి చేరుకున్నాం

"ఏంటలా-ఉన్నారు-' అడిగింది సుధ

"ఎలా? '

'చలాకీగా లేరు '

' నా మనసవాళ ఎందుకో బాగా లేదు "

ఎందుకో? అడిగింది

"తెలీదు."

ఏంటండీ మీరె అలా ఉంటారు సర్దాగా, చలాకీగా ఉండే మీరలా ఉంటె ఎలా చెప్పండి? తల నొప్పిగా ఉందా?"

మౌనంగా నా పనులు నెను చేసుకున్నాను సుధ ఏమడిగినా- అన్నింటికి నా సమాధానం మౌనమే... నా గుండె భారం తగ్గించుకుంది' నా బాధ ఎవరితో చెప్పుకోగలను

ఆఖర్కి అతి కష్టంమిద నా గొంతు పెగిలింది- మా గదిలోకి వచ్చిన సుధతొనే నా సంభాషణ ప్రారంభం అయింది

'సుధా- ఎందుకలా ఉన్నానని కదూ అడిగావిందాక .. '

"అవును మి రెందుకో చలాకీగా లేరివాళ.

'ఎందుకా నువ్వు మాష్టారింట్లో ప్రవర్తించిన తీరుకి . "

అదోలా చూసింది- అర్థంకానట్టు

"అర్థం కాలేదా? - ఎంత నంగనాచివె-



కట్టుకున్న మొగుడక్కడ కూర్చుంటే- అంతవరకూ ప్రక్కన కూర్చున్న నువ్వు- పరాయి మొగాడి ప్రక్కన- చేరి- ఏక ఏకలూ- పకపకలూనా? ఎంత నీకు మాష్టారయితే మాత్రం- మీ సరసాలు నా ఎదురుగానా?- నువ్వెంత పెద్ద నాగరిక సమాజంలో పెరిగినా సరే? నేను లేనప్పుడు నీ ఇష్టం- నేనుండగా- నా ఎదురుగా ఆ రకంగా ప్రవర్తించకు.

నేను సగటు మగాణ్ణి సుధా!

అవమానాన్ని సహించలేను- అలా అని దిగమ్రింగలేను. నువ్వే నా సర్వస్వం- నీ మీద తప్ప నా కెవ్వరిమీదా- అభిమానం- అనురాగం లేవని- నన్నెందుకు వంచించావు. నీ మాటలన్నీ నిజమనుకుని మోసపోయాను సుధా! మరో ముగ్గురు పరాయి మగాళ్ళ ముందు మొగుడి కెదురుగా- పెళ్ళికాని పరాయి మగాడి ప్రక్కన కూర్చుని- నువ్వు ప్రవర్తించిన తీరుని జీర్ణం చేసుకోలేక పోతున్నాను సుధా!"

"నాకెప్పుడూ అలాంటుద్దేశ్యం లేదండి- ప్లీజ్- నన్ను నమ్మండి..."

వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"నోర్మూయ్" చాచి లెంపకాయి కొట్టాను. అప్పటికి నా మనసు శాంతించింది. కానీ అనవసరంగా- ఆవేశాన్కి లోనై, ఆడదాని వంటిమీద చెయ్యి జేసుకున్నందుక్కి- ఓ ప్రక్క బాధ చోటు చేసుకుంది.

రాత్రి 12 గం.లు దాటింది. ప్రక్కనే పడుకున్న సుధ ఇంకా వెక్కుతోంది. - నా మనసు జాలితో నిండిపోయింది. పిచ్చి పిల్లా అంటూ దగ్గరగా తీసుకుని- గుండెలమీద పడుకోబెట్టుకుని నన్ను

మగబుద్ధి

క్షమించు సుధా- కోపంతో - అవమాన భారంతో - ఆవేశపడ్డాను- నిన్ను తప్పుగా అర్థం చేసుకున్నానంటూ ఓదార్చాను సుధ నన్ను లతలా పెనవేసుకుంది.

* * * *

సుధని అక్కడే వదిలి తిరిగి వచ్చేస. డ్యూటీలో జాయిన్ అయ్యాను. 10 రోజులు గడిచి పోయాయి. నా కప్పుడప్పుడు రామారావు మాష్టారింట్లో జరిగిన సంఘటన గుర్తొచ్చి- మనసు బాధగా మూల్గుతోంది

అనుమానం రాకనే పోవాలి వస్తే అది మనసుని తొలిచేసి- మనిషినే తినేస్తుంది రామారావు మాష్టారు సుధకోసం ప్రజంటు చేసిన ఆర్ట్లు గుర్తొచ్చాయి. అన్ని ప్రేమికుల చిత్రాలే-

లైలా- మజ్నూ, రాధా కృష్ణ, కోడిపుంజు- పెట్ట, రెండు నెమళ్ళు- వర్షంలో చెట్టు క్రింద తడుస్తున్న ప్రేమికులు, సూర్యాస్తమయపు వెలుగులో - సుదూరాలకి పయనిస్తున్న ప్రేమికులు

ఇవన్నీ సుధ పొందికగా డ్రాయింగ్ రూంలో సర్దింది. - వాటిని చూసి- ఇంతకు ముందు నాకేం అన్పించలేదు- కాని- ఇప్పుడు మాత్రం చాలా అన్పిస్తోంది.

* * * *

కాలం గడిచి పోయింది సుధ అక్కకి కొడుకు పుట్టాడు- నెల రోజులు గడిచిపోయాక సుధ నా దగ్గర కొచ్చేసింది. మా మధ్య మునపటి అన్యోన్యత లేదు. ఆ సంఘటన మర్చిపోదాం అనుకుంటూనే మర్చిపోలేక పోతున్నాం-

కాల గమనంలో మరి కొద్ది రోజులు గడిచి పోయాక- ఆ విషయం- ఇద్దరం మర్చిపోయాం. కానీ మళ్ళీ ఆ విషయం గుర్తుకి రావటాన్కి కారణం- సుధే.

ఆ రోజు ఆగస్టు 15వ తారీఖు. ఆఫీసులో ఎక్కువ పని ఉండటం మూలంగా రాత్రి 11 గం లకి ఇంటి కొచ్చాను టేబిల్ మీద భోజనాలు సర్దటం ప్రారంభించింది సుధ

బెడ్‌రూంలో ఉన్న బీరువాలో డబ్బు పెడదామని సొరుగు తెరిచేసరికి- పెద్ద ఎయిర్‌మైల్ కవరు- దానిమీద రామారావు మాష్టారి అడ్రస్సు.

నా మనసు పాత సంఘటనని గుర్తుకి తెచ్చుకుంది కవరు చేతిలోకి తీసుకున్నాను. లోపల ఇంకా ఉత్తరం పెట్టలేదు. ఖాళీగా ఉన్న కవరు.

అంటే సుధ ఇంకా నన్ను మోసం చేస్తోంది. ఇందులో అనుమానం లేదు- నాకు తెలీకుండా ఆ రాస్కెల్‌కి- ఉత్తరాలు రాస్తోందన్న మాట. వెంటనే అడగాలను కున్నాను... కానీ అడిగితే దబాయించ వచ్చు- చక్కని కథ చెప్పి నన్ను ఇంకా మోసం చెయ్యవచ్చు. పూర్తిగా తెల్సుకుని నిర్ణయం తీసుకోవటం మంచిదనిపించింది.

ఏమీ తెలీనట్లు డైనింగ్ హాల్‌లోకి నడిచాను. ఏదో తిన్నాననిపించుకుని- వచ్చి పడుకున్నాను.

మర్నాడు ఉదయం- ఎనిమిదింటికే ఆఫీసు కెళ్ళిపోయాను. ఆఫీసు పక్కన మా కాలనీ అంతటికీ కలిపి ఒక్కటే పోష్టుబాక్సు ఉంది. నా దృష్టంతా దానిమీదే ఉంది- రెండు మూడు సార్లు బయటకొచ్చి చూసాను. నాల్గోసారి నేనొచ్చేసరికి ఏదో పోస్టు చేసి వెళ్ళిపోతున్న మా ప్రక్క యింటి వాళ్ళ పని పిల్ల కన్పించింది. వెంటనే నాకు కథ అర్థం అయిపోయింది. ఓహో ఇది పోస్టు చేస్తోందన్నమాట- అనుకుంటూ ఆ పిల్లని కేకేసాను.

ఆ అమ్మాయి వచ్చింది- "ఏటండీ?" అంటూ...

'ఏం ఇటొచ్చావ్?" అడిగాను.

"సుధమ్మ గారుత్తరం పోస్టులో ఎయ్యమంటి వచ్చినానండి- డబ్బాలో వేసి పోతున్నానండి" అంది.

"ఆహాఁ-" అని ఆఫీసులోకి వచ్చేసాను.

మధ్యాహ్నం 11-30కి క్లియరెన్స్‌కి పోస్టుమాన్ వచ్చాడు- అతని చేతిలో 5 రూ.ల నోటు పెట్టి సుధ పోస్టు చేయించిన ఉత్తరం తీసుకున్నాను.

కవరులోపల ఉన్న వస్తువు చూసి నాకు మతిపోయింది

అది రామారావు మాష్టారికి సుధ పంపించే రాఖీ- దాంతో పాటు చిన్న కాగితంలో "అన్నయ్యకు ప్రేమతో సుధ" అని అందంగా చెక్కిన అక్షరాలు- నన్ను వెక్కిరిస్తున్నట్లనిపించాయి.

"నన్ను క్షమించు సుధా- నిన్ను అనుమానించినందుకు, అనరాని మాట లన్నందుకు, నీ వంటిమీద చెయ్యి వేసుకున్నందుకు- అన్నింటికి ఒకే ఒక్కసారి నన్ను క్షమించు" అని గొణుక్కున్నాను. □


బరోడా ఆంధ్ర సమితి వారి ఆధ్వర్యంలో జూలై 12న బరోడాలో శ్రీ బి. ఐ. పట్టాభిరామ్ ఇంద్రజాల ప్రదర్శన జరిగిన సందర్భంగా తీసిన ఛాయా చిత్రం



జీవితం చాలా అపురూపమైనది జీవించండి దర్జాగా



బ్రిల్‌క్రీమ్, మీ వ్యక్తిత్వానికి కొత్త అందం తెచ్చేందుకు ప్రత్యేకంగా తయారు చేయబడింది. జిడ్డుగా ఉండని ఈ క్రీమ్, మీ జుట్టుకి కొత్త రూపు సమకూర్చి రోజంతా పొందికగా ఉండేలా చేస్తుంది.



బ్రిల్‌క్రీమ్ హెయిర్ డ్రెసింగ్ మీ జీవనశైలికి వన్నె తెస్తుంది.

సీరియల్

శుశ్రుత నర్సింగ్ హోమ్

డాక్టర్ కె. రవీంద్రబాబు

(గత సంచిక తరువాయి)

రవి పరిస్థితి బాగా లేదన్న విషయం బయటకు రాకూడదు వస్తే గందరగోళం ఎక్కువవుతుంది సావిత్రమ్మగారికి యీ విషయం తెలిసిందంటే ఆందోళన పెరిగి ప్రమాదం జరగవచ్చు! ఈ సమయంలో నే గుండె నిబ్బరం అవసరం!

రామారావు వచ్చే లోపల రవి బట్టలు, పక్క దుప్పట్లు మార్చాలి అనుకుంటూ వెళ్ళింది మంజు. కాని ఆమె తన బలమంతా వుపయోగించినా రవిని మంచం మీద నుండి కదిలించలేకపోయింది!

వాకిట్లో నిలబడి వున్న మల్లిక లోపలకు వచ్చి సాయం చేసింది పక్క దుప్పట్లు మార్చి, రవి ముఖం కాళ్ళూ, చేతులూ, సబ్బు నీళ్ళతో తుడిచింది మంజు. చన్నీళ్ళలో యుడికొలోన్ వేసి రుమాలందులో ముంచి నుదుట వుంచింది

వాకిట్లో కారు వచ్చి ఆగితే పరిగెత్తుకు వెళ్ళింది మంజు

'ఏమ్మా మంజూ! అమెరికా అంటే మొఖం మొత్తిందా ఏం? ఎప్పుడొచ్చావు?' అన్నాడాయన

'వచ్చి కొద్ది రోజులయింది సార్! మీకు వచ్చి కనపడదామనే లోపల కొన్ని పరిస్థితులు తోసుకొచ్చాయి' అంటూ డ్రాయింగ్ రూమ్‌లోకి తీసుకుని వెళ్ళింది

మూలంగా విషయాలన్నీ చెప్పింది మంజు "రవికి ప్రమాదమైన జబ్బు వచ్చిందని తెలిస్తే సావిత్రమ్మగారి పరిస్థితి విషమిస్తుంది. మీరు ఆమెను చూడడానికి వస్తున్నారని చెప్పాను."

"అలాగా మంజూ! ఐ విల్ ఫాలో యువర్ టిప్!"

రామారావుగారు వెళ్ళి సావిత్రమ్మగారి మంచం పక్కన కూర్చుని ఆమెను పరీక్ష చేయసాగారు.

"మీరు పది పదిహేను రోజులలో మామూలుగా లేచి నడుస్తారు! మీ మనుమడు గట్టిగా వైద్యం చేస్తే యీ లోపలే లేచి తిరుగుతారేమో?"

రామారావుగారి మాటలకు సావిత్రమ్మ నవ్వుకున్నది

"సరే! సావిత్రమ్మగారిని చూచాను! ఇక నా శిష్యుడు జ్వరం తగిలి పడకేసాడన్నారు! ఏడీ ఎక్కడా? రవి?" అంటూ రవి గదిలోకి వెళ్ళాడాయన వూరికే పలుకరించటానికి వెళ్ళినట్లు వెళ్ళాడాయన.

డాక్టరు రవి పరిస్థితి చూచాక ఆయన ముఖంలో ఆందోళన కనిపించింది. అంతకుముందే నర్సింగ్‌హోమ్‌నుండి ఎల్‌పి నీడిల్ తెప్పించి వుంచింది మంజు.

వెన్ను నుండి నీరు తీశాడు డాక్టరు రామారావు. ఎల్‌పి ఫ్లూయిడ్ బయొకెమికల్ ఎనాలిసిస్‌కు పంపించమని చెప్పి రవికి వాడవలసిన మందులు మంజుతో చర్చించాడు.

"ఇక్కడ నుండి అతన్ని కదిలించితే సావిత్రమ్మగారు అనుమానపడతారు కష్టమైనా యిక్కడే వుంచి వైద్యం చేయించాలి" మీరు రోజుకోసారి వచ్చి సావిత్రమ్మగారిని చూడడానికి వచ్చినట్లు వచ్చి రవిని చూచి సలహా ఇచ్చి వెళుతుండండి' అంది మంజు

'అలాగేనమ్మా మంజూ!' అంటూ వెళ్ళిపోయాడాయన. సాయంత్రానికి వెన్ను నుండి తీసిన నీరు ఎనాలిసిస్ రిపోర్టు వచ్చింది. ఎన్‌కెఫలైటిస్ అని వ్యాధి నిర్ధారణ చేశారు రామారావుగారు

హాస్పటల్ నుండి కాంపౌండర్ నాగేశ్వరరావును పిలిపించింది మంజు. ప్రత్యేకంగా రవిని కనిపెట్టుకుని వుండడానికి నాగేశ్వరరావు, మల్లిక, భూదేవి ఇంటి దగ్గర అన్ని విషయాలు కనిపెట్టుకుని వుంటారు అని అనుకున్నాక ధైర్యంగా ఆస్పత్రికి బయల్దేరింది. రవి ఆరోగ్యం విషయమై ఇంట్లోగాని బయటగాని ఎవరికీ చెప్పవద్దని నాగేశ్వరరావుకూ, మల్లికకూ మరీ మరీ చెప్పింది మంజు

వైద్య వృత్తి తన పర బేధం నిలువనీయదు! తను ఇన్ని వేల మైళ్ళు ప్రయాణించేసి వచ్చింది రవికోసం! అతను ప్రమాద స్థితిలో వుంటే దగ్గర వుండకుండా ఇలా ఆసుపత్రిలో రోగులను చూడడానికి రావలసి వస్తున్నది! ఈ నర్సింగ్‌హోమ్ మాత్రం రవిది కాదా? అతనికి బాగా లేనప్పుడు నర్సింగ్‌హోమ్‌లోని రోగుల మంచి చెడూ చూడవలసిన బాధ్యత తనమీద వున్నది అందులోనూ యం. బి. బి. యస్. లో తన క్లాస్‌మేట్ రఘు నర్సింగ్‌హోమ్‌లో ప్రమాద పరిస్థితిలో జేరివున్నాడు. నర్సింగ్‌హోంలోని బాధాతప్తులకు ఉపశాంతి కలుగచేయడంలో వుండే ఆత్మతృప్తి అన్ని బాధలను కనీసం తాత్కాలికంగా నయినా వుపశమింపజేస్తున్నది

"అమ్మాయికి నొప్పులు వస్తున్నయ్యమ్మా" అంటూ ఎదురుగా వొక నడివయసు ఆమె నుల్చుని వుంది

మంజు వెళ్ళి చూసి వచ్చింది. డెలివరి టేబిల్‌మీద వున్న అమ్మాయికి

జరిగిన కథ-10: రచయిత, సర్జన్ అయిన రవితో రచయిత్రి, లెక్చరర్ అయిన ఇందువదనకు హైదరాబాద్‌లో పరిచయం అయ్యింది ఇందువదన అప్తమిత్రుడు చంద్రహాస్ గుంటూరులోని రవిగారి శుశ్రుత నర్సింగ్ హోమ్‌లో చేరాడని తెలిసి అతనిని చూడటానికి గుంటూరు వస్తుంది ఇందువదన రవి ఇంట్లో దిగుతుంది ఆమెను చూసిన చంద్ర ధైర్యం తెచ్చుకుంటాడు చంద్ర, రాకేష్ ఇందువదన పేరు కలవరించడం విన్న రవి మనసు కల్లోలం చెందుతుంది. చంద్రహాస్‌కి అల్సర్ ఆపరేషన్ జరిగింది రవికి మేనకోడలు గీతను పెళ్ళి చేసుకోవడం ఇష్టం లేదు అమెరికా నుండి వచ్చిన తన క్లాసుమేటు మంజు ఇందుకి పెద్దమ్మ కూతురని తెలుసుకుంటాడు రవి. ఇందుపై అభిమానం పెరిగింది. రవి అమ్మమ్మకు పక్షవాతం వచ్చి పడిపోయింది రవి స్నేహితుడు రఘు లిల్లీతో తన ప్రేమ విఫలం కావడంతో నిద్ర మాత్రలు మింగాడు మంజు. రవి సన్నిహితంగా ఉండటం చూచిన ఇందు మనసు వ్యాకులం చెందుతుంది. రవికి జ్వరం రావడంతో రవి నర్సింగ్‌హోమ్‌లోని పేషంట్లని మంజు చూసుకోవాల్సి వచ్చింది రవి జ్వర తీవ్రత చూస్తే మంజుకి భయం వేసింది. మెడిసిన్ ప్రొఫెసర్ రామారావు గారికి ఒకసారి వచ్చి రవిని చూసి పొమ్మని ఫోన్ చేసింది



పద్దెనిమిదేళ్ళుంటాయి. ముఖం పాలిపోయి వున్నది. ప్రపంచంలో వున్న దైన్యం అంతా మూటగట్టుకున్నట్లుగా వుందామె ముఖం.

పొద్దుటి నుండీ నొప్పులు వస్తున్నయ్యి అని చెప్పింది తల్లి. పరీక్షచేసి చూచింది మంజు. కాన్పవటానికి అట్టే సమయంలేదు అరగంటలో నే పండంటి బిడ్డను కన్నది ఆ అమ్మాయి. పిల్లవాడిని చూచి సంతోషించడానికి బదులు దిగులుగా వుండిపోయారు తల్లీకూతురు. కాన్పయాక తల్లినీ బిడ్డనూ నర్సింగ్‌హోమ్‌లోని రూమ్‌లోకి మార్పించింది సరోజ. నర్సింగ్‌హోమ్ పని చూసుకుని ఇంటికి వెళ్ళింది మంజు.

రవి గది నుండి ఏదో శబ్దం వచ్చినట్లుంటే వెళ్ళింది మంజు. మూర్ఛ తెరలాటి తెర వచ్చి చేతులూ కాళ్ళూ విపరీతంగా కొట్టుకుంటున్నాడు రవి. కాంపౌండర్ నాగేశ్వరరావు పత్తాలేదు! మల్లిక బిక్కు బిక్కుమంటూ రవి కాళ్ళూ చేతులూ పట్టుకొని ఆపాలని ప్రయత్నం చేస్తున్నది గాని ఆమెవల్ల కావటంలేదు నిముషం సేపున్నాక తెర ఆగిపోయింది

"మల్లికా! నాగేశ్వరరావేడి?"

"ఏమోనమ్మా! బజారుకు వెళ్ళి సిగరెట్ కాల్చుకువస్తానని వెళ్ళాడు! వెళ్ళికూడా చాలాసేపయింది!"

"ఇప్పుడు వచ్చిన తెరేనా? ఇంతకుముందు కూడా ఇలా వచ్చాయా?"

"ఇప్పుడేనమ్మా! పెదాలు కదులుతున్నట్లుంటే ఏమయినా కావాలని అడుగుతున్నారేమోనని దగ్గరకు వెళ్ళాను కుడిచేతి బొటన వేలిలో బయలుదేరిన కదలిక క్రమంగా కుడిచేయి, కుడి కాలు, ముఖం, ఆ తర్వాత ఎడమచేయి కాలూ కొట్టుకోవడం మొదలెట్టాయి! ఏం చేయాలో తోచక భయపడ్డాను ఇంతలో మీరొచ్చారు" అంది మల్లిక.

"పరవాలేదు! ఈ అమ్మాయి నర్సుగా పనికి వస్తుంది అని మనసులో అనుకుని గార్డినాల్ ఇంజక్షన్ లోడ్ చేసి చేసింది మంజు. ఈ లోపల మల్లిక టవల్ తడిపి రవి నోటి నుండి వచ్చిన నురగ తుడిచి వేచింది.

అప్పుడు వచ్చాడు నాగేశ్వరరావు. "గీత పాప పెన్సిల్ తెచ్చి పెట్టమంటే వెళ్ళాను" అన్నాడు సంజాయిషీ చెప్పినట్లు, ఇక అతన్ని కోప్పడి ప్రయోజనం వుండదని వూరుకున్నది మంజు.

ఫోన్ చేసి డాక్టరు రామారావు గారిని కన్సల్ట్ చేద్దామని అనుకుని మళ్ళా ఆ ప్రయత్నం మానుకున్నది. రవికి తెరలు వస్తున్నయ్యని ఆయనతో చెప్పడం ఇంట్లో అందరూ వింటారు. సావిత్రమ్మ గారికీ విషయం తెలిస్తే ఆమె పరిస్థితి విషమించవచ్చు! "హాస్పటల్‌కు వెళ్ళాక ఫోన్ చేస్తా! ఎటుదిరిగి గార్డినాల్

శుశ్రుత నర్సింగ్‌హోమ్

ఇచ్చాను గదా" అనుకుంది మంజు.

"నాగేశ్వరరావు ఫిట్‌ను చూడకపోవడమూ మంచిదే అయింది. చూసి వుంటే యీ విషయం ఆస్పత్రిలో నలుగురికి చెబుతాడు. లేనిపోని గందరగోళం అవుతుంది" అనుకుంటూంటే భూదేవి కేక వేసింది.

"మంజు! స్నానం చేసి భోంచేయమ్మా"

మంజు స్నానం, భోజనం అయి వచ్చాక మల్లికను వెళ్ళి భోంచేయమంది. ఆ అమ్మాయి అయిదు నిముషాలలో భోంచేసి వచ్చింది! నాగేశ్వరరావును బయట వరండాలో పడుకోమంది మంజు ఆమె అంటమే తరువాయి వెళ్ళాడతను! కాసేపట్లో గుర్రుపెట్టి నిద్రపోయాడు. అందరి కంటె ముందే అతనికి భోజనం వడ్డించింది భూదేవి!

"మల్లికా! నీకింకా నీరసం తగ్గలేదు! విశ్రాంతి తీసుకోవాల్సిన సమయంలో వీరయ్య భయం కొద్దీ ఇలా వచ్చావు! వెళ్ళి పడుకో!"

'లేదమ్మా! నాకు నీరసంగా లేదు! అయినా మళ్ళీ బాబుగారికి తెర వస్తుందేమో! ఈ రాత్రికి మేలుకుని వుంటాను"

"ఇక ఆ ప్రమాదమేమీ లేదు! అయినా నేను మేలుకుని వుంటాలే! నువ్వెళ్ళి పడుకో!"

"నాకు నిద్ర రావడం లేదమ్మా! నేను మేలుకుని వుంటాను! మీరు పడుకోండి."

"సరే! అయితే వొక పని చేయి! నేను పన్నెండింటి వరకూ నిద్రపోతాను! సరిగా పన్నెండింటికి నన్ను నిద్ర లేపి నువ్వు పడుకో! ఏం?"

'అలాగేనమ్మా!'

మంజు వెళ్ళి హాలులో సోఫాలో పడుకుంది పడుకోంగానే నిద్ర ముంచుకొచ్చిందామెకు మంజు నిద్ర లేచేసరికి బాగా తెల్లవారిపోయింది

"అరె! ఇలా మొద్దు నిద్రపోయానేంటి?" అనుకుంటూ చప్పున లేచి వెళ్ళింది మంజు.

మల్లిక రవి మంచం పక్కన స్టూలు మీద కూర్చుని వున్నది. రాత్రంతా మేలుకుని వున్న అలసట తాలూకు ఛాయలు ఆమె ముఖం మీద స్ఫుటంగా కనపడుతున్నవి

"మల్లికా! రాత్రి నన్ను నిద్ర లేపలేదేమమ్మా, పోనీ యిప్పుడయినా వెళ్ళి పడుకో! నేను ఆస్పత్రికి వెళ్ళేప్పుడు నిన్ను లేపుతాను" అని మంజు అన్నాక లేచి అవతలకు వెళ్ళింది మల్లిక

రవి టెంపరేచర్ ఏమీ తగ్గుముఖం పట్టలేదు అతనికి మళ్ళా తెర రాలేదని తప్ప ఇతరత్రా అతని పరిస్థితి మెరుగవలేదు! ఇన్నాళ్ళ నుండీ రవి దగ్గర పని చేస్తున్న కాంపౌండర్ రాత్రంతా శుభ్రంగా గుర్రు పెట్టి నిద్రపోయాడు! కొద్ది రోజుల క్రితం రవి చేత వైద్యం చేయించుకున్న మల్లిక ఇప్పుడతన్ని అమిత భక్తిశ్రద్ధలతో రాత్రింబవళ్ళు చూస్తున్నది!

స్నానం చేసి కాఫీ టిఫిన్ తీసుకుని నర్సింగ్ హోమ్ వైపుగా బయల్దేరింది మంజు నాలుగిళ్ళవతల నుల్చుని వున్న వ్యక్తి వీరయ్య అని పోల్చుకుంది మంజు అంతకుముందురోజు అతన్ని దూరంగా వుండగా సరోజ చూపించిందామెకు. మంజుని చూడగానే ముఖం పక్కకు తిప్పుకున్నాడు వీరయ్య. అతని దగ్గరకు వెళ్ళి–

"వీరయ్య గారూ! ఏమిటిలా వచ్చారు! ఓ! మీ ఆవిడ కోసమా?"

అవునన్నట్లు తలూపాడతను

"నా వెంట రండి వీరయ్య గారూ! మీ ఆవిడను మీకు చూపిస్తాను" అంది మంజు.

గంగిరెద్దులా తలాడిస్తూ ఆమె వెంట వెళ్ళాడు వీరయ్య! ఆ వీధి చివర బట్టల కొట్టు ముందు షోకేస్‌లో అందమైన ప్లాస్టిక్ యువతికి కంచిపట్టు చీర చుట్టారు.

"అదుగో మీ ఆవిడ! రాత్రికి ఆ చీర తీసివేసి ఎదురుగా కూర్చొని చూద్దురు గాని! ఎంత అందమైన భార్య వుంది మీకు!"

మంజు మాటలకు వీరయ్య ముఖం కందగడ్డలా మారిపోయింది. తల దించుకుని చకచక నడుస్తూ వెళ్ళిపోయాడతను!

'ఇక జన్మలో వీడి ఛాయలకు రాడు' అనుకుంటుంటే నవ్వు వచ్చింది మంజుకు.

రఘు పరిస్థితిలో బాగా మార్పు వచ్చింది. తెల్లవారుతున్నప్పుడు అతనొకసారి కండ్లు తెరిచి చూచాడని చెప్పింది నరసమ్మగారు.

మంజు రాంగానే నరసమ్మ గారు అతని దగ్గరకు వెళ్ళి "రఘూ! ఎవరొచ్చారో చూడు!" అని పెద్దగా అన్నది.

ఆమె మాటలు విన్నాక నెమ్మదిగా కండ్లు తెరిచి చూచాడు రఘు! పాలిపోయిన ముఖంపై నాలుగురోజులుగా పెరిగిన గడ్డం – మబ్బుకప్పిన చంద్రుడిలా వుంది! కాంతిహీనమైన గాజుకళ్ళ నుండి నిర్జీవమైన చూపులు మంజును క్షణం సేపు చూసాయి. ఆమెను గుర్తు పట్టిన చిహ్నంగా క్షణం సేపు చూపులు తేజోవంతమైనాయి!

అంతలోనే మత్తు బిళ్ళల తాలూకు మైకం అతన్ని మరలా మగత క్రీనీడలోనికి లాక్కుని వెళ్ళింది!

"ఇప్పుడిప్పుడే స్పృహలోనికి వచ్చే చిహ్నాలున్నాయి. రెండు మూడు రోజులలో మామూలు స్పృహలోనికి రావచ్చు!" అంది మంజు నరసమ్మగారితో.

రెండు చేతులు జోడించి మంజుకు నమస్కరిస్తూ–

"ప్రాణాలు లేని కట్టెను తెచ్చావిక్కడకు! నీట ముంచినా పాల ముంచినా భారం నీదే! కడుపు కోతతో జీవితాంతం ఏడ్చే బాధ లేకుండా చేస్తావని ఆశ పడుతున్నానమ్మా!" అంది.

"ధైర్యంగా వుండమ్మా! ఏం పరవా లేదు!" అంటూ పక్క గదిలోకి వెళ్ళింది మంజు.

సరోజ ఆదుర్దాగా పరుగెత్తుకుని వచ్చి "డాక్టరుగారూ! రాత్రి తొలిచూలు కాన్పయిన అమ్మాయి, ఆమె తల్లీ పత్తాలేరు! ఉదయం వార్డులో ఇన్‌పేషెంట్లను చూస్తూ వాళ్ళ రూముకు వెళ్ళేసరికి పిల్లవాడు వొకటే ఏడుస్తున్నాడు. ఇదేమిటి ఇలా పిల్లవాడ్ని వదలి వెళ్ళింది అని వరండాలోనూ బాత్‌రూమ్‌ల దగ్గర చూసాను! అయిపులేరు! ఆయా నడిగితే పొద్దున తల్లీ, కూతురూ వాకిటి దగ్గర రిక్షా అతనితో ఏదో మాట్లాడుతున్నారంది. ఇందాక రిక్షా రంగడిని అడిగితే ఇద్దరు ఆడవాళ్ళను పొద్దున స్టేషన్ దగ్గర దింపానని చెప్పాడు!"

"అలాగా! చక్కటి మగపిల్లవాడు! వదలి వెళ్ళటానికి వాళ్ళకు మనసెలా వొప్పిందో?" అంటూ పిల్లవాడు వున్న రూమ్‌లోకి వెళ్ళింది.

సుశీల మంచం మీద కూర్చుని తల్లి వదలి వెళ్ళిన పిల్లవాడికి స్తన్య మిస్తున్నది ఆమె ముఖంలో వెల్లి విరిసే మాతృత్వ మమతానురాగాలు పసిబిడ్డను అమృతధారల్లా ముంచెత్తుతున్నాయి! ఆమె కండ్లలో ఏదో తృప్తి "ఈ ప్రపంచ మంతా జయించాను నాకేమి?" అన్నట్లు!

ఆ దృశ్యం చూడగానే మంజు కనులు చమర్చాయి ఆ తల్లి కర్కశహృదయంతో కన్న బిడ్డను నిర్దయగా వదలి వెళ్ళితే యీ తల్లి అమృత హృదయంతో తన ప్రేమను బిడ్డమీద కురిపిస్తున్నది.

ఒకరికి పనికి రాకుండా పోయిన బిడ్డ మరొకరికి ప్రాణప్రదం అవుతున్నాడు.

రెండు సమస్యలు ఒకేసారి పరిష్కారమయి పోయాయి! పెండ్లి కాకుండా తల్లి అయిన ఆమెకు అనవసర అవాంఛనీయమైన బిడ్డ బెడద తప్పిపోయింది! పెండ్లి అయి సంతానం కోసం తపించిపోతూ జీవితాంతం గొడ్రాలుగా బతకాలని విధి నిర్దేశించిన సుశీలకు తల్లి అయే యోగం పట్టింది!

బిడ్డ కను ముక్కు తీరు బాగుంది! పచ్చని పసిమి ఛాయ! తల్లి తండ్రి ఎవరో, ఏ వూరో, ఏ కులమో తెలియదు సుశీల ఆ బిడ్డను చూసిన దగ్గర్నుండి సంతోషంతో పొంగి పోతున్నది. ఆమె తల్లీ తండ్రీ, అత్తా మామా, భర్తా అందరూ ఈ బిడ్డను సుశీల దగ్గరకు తీయడం హర్షించారు. ఒకరకంగా ఆ బిడ్డ ఎవరో ఏమిటో తెలియక పోవటం మంచిది అనుకుంది మంజు "ఏ తల్లి కని వదలి వెళ్ళినా యీ తల్లి వడిలో పెరిగే నీవు అదృష్టవంతుడివిరా" అనుకుంటూ మిగిలిన రూములలోని రోగులను చూడటానికి వెళ్ళింది మంజు.

చంద్ర రూమ్‌లోకి వెళ్ళగానే నర్స్ అతని దిండు కింద చేయిపెట్టి సిగరెట్

ఇంటిని చక్కదిద్దుకోడానికి కృత్రిమ గర్భధారణ!

డబ్బు కోసం కన్నతల్లిదండ్రులే తమ పిల్లల్ని అమ్ముకోడం మనం వింటూ ఉంటాము. మనదేశంలో అలాంటిది జరిగితే పేదరికమే దానికి కారణం అయి ఉంటుంది కానీ పాశ్చాత్య దేశాలలో ఈ వ్యాపారం మరింత శాస్త్రీయంగా ముందడుగు వేసినట్లు కనిపిస్తున్నది. కృత్రిమ గర్భధారణ ద్వారా పరపురుషుడి బిడ్డకి తల్లి కావడానికి డబ్బు కోసం అంగీకరించే తల్లులు అక్కడ ఉన్నట్లు కిమ్‌కాటన్ మరొక రచయితతో కలిసి రాసిన 'బేబీ కాటన్' చదివిన వాళ్లకి తెలుస్తుంది. కిమ్‌కాటన్ (28) బ్రిటిష్ వనిత. భర్త, కుమార్తె (8), కుమారుడు (5) ఉన్నారు ఇద్దరు పిల్లల తర్వాత ఆమె భర్త వాసెక్టమీ చేయించుకున్నాడు పేదరికం కారణంగా కిమ్ కిరాయి తల్లి కాలేదు తమ నాలుగు పడక గదుల పెద్ద ఇంటిని మరింత ఆధునికంగా అందంగా తీర్చిదిద్దుకోడానికి డబ్బు అవసరం అయి ఆమె ఆ పనికి ఒప్పుకున్నది బ్రిటన్‌లో కృత్రిమ గర్భధారణ ద్వారా గర్భం ధరించిన మొట్టమొదటి కిరాయి తల్లి ఈమె ఒక ఏజన్సీ ఈమెకి తోడ్పడింది ఆమె భర్త కూడా దీనికి అంగీకరించాడు ఆస్పత్రి ఖర్చు, మందుల ఖర్చులు కాక 6,500 పౌన్లు కిమ్‌కి ఇవ్వడానికి అమెరికాలో ఉన్న ఆ పిల్లలు లేని దంపతులు ఒప్పుకున్నారు ఆ దంపతులలో భర్త వీర్యం ద్వారా కిమ్ గర్భవతి అయి ఆడపిల్లని కన్నది. బ్రిటన్‌లో ఇలా జరగటం అదే మొదటిసారి అని ఆ ఏజన్సీ ప్రచారం చెయ్యడంతో పత్రికలకి ఆసక్తి పెరిగింది చివరికి కిమ్ కాటన్ కథని 'డైలీస్టార్' పత్రిక 15 వేల పౌన్లకి కొన్నది కిమ్‌కి డబ్బు సమస్య, ఇంటి సమస్య తీరాయి

కాని తనకి పుట్టిన బిడ్డని కిమ్ జీవితంలో ఎప్పటికీ కలుసుకోడానికి వీలులేదు బిడ్డ కన్నతల్లి ప్రేమకి నోచుకోదు తండ్రి అనువంశిక లక్షణాలని కలిగి ఉన్నప్పటికి పెంపుడు తల్లి చేతిలో పెరిగే ఆ బిడ్డ జీవితం ఎలా ఉంటుందన్నది కాలమే నిర్ణయించాలి! □

పెట్టికోసం వెతికింది

"ఇక జన్మలో సిగరెట్ ముట్టను. నిన్ననే సిగరెట్ పెట్టెలు చెత్త బుట్టలోకి వెళ్ళిపోయాయి" అన్నాడు చంద్ర!

అతనికి పాలు, హార్లిక్సు తాగించమని చెప్పింది.

రాకేష్ గదిలోకి వెళ్ళేసరికి అతని తల్లి దిగులుగా వున్నది.

"ఇప్పటివరకు ఒకటే గోల చేసాడు! నర్సు వచ్చి మత్తు ఇంజక్షన్ ఇచ్చాక నిద్రపోయాడు." అన్నది.

"ఏమ్మా! ఎందుకని?" అంది మంజు.

"ఏం చెప్పమంటావమ్మా! నిన్న మీకు నేను చెప్పిన విషయమే!" అంది సుందరమ్మ.

"రాకేష్‌కు స్పృహ వచ్చాక నన్ను పిలవండి నేను అతనితో మాట్లాడాలి" అంది మంజు.

"అలాగేనమ్మా" అని సుందరమ్మ అంటుంటే పక్క రూములలోని రోగులను చూడటానికి వెళ్ళింది మంజు. ఇన్‌పేషెంట్లనందరనూ చూచి వెళ్ళి కన్సల్టింగ్ రూమ్‌లోకి వెళ్ళేసరికి పాతిక సంవత్సరాల వయసుగల యువతిని తీసుకుని వచ్చారు.

ఆమె వద్ద నుండి కుక్కపిల్ల అరచినట్లు అదేపనిగా శబ్దాలు వస్తున్నాయి! వెంబడి ఏదయినా కుక్కపిల్ల వున్నదేమోనని అటూ ఇటూ చూచింది మంజు! ఆ శబ్దాలు ఆమె గొంతులో నుండే వస్తున్నవి! ఆమె పక్క నున్న నడివయసామె ముందుకు వచ్చి–

"ఈమె మా కోడలు సుగుణ! పెళ్ళయి పదేళ్ళయింది! ఇంతవరకు సంతానం కలగలేదు. అందుకోసమై ఎన్నో నోములు నోచింది. ఎన్నో దేముళ్ళకు మొక్కింది. ఊహు! ప్రయోజనం కనపడలా! రాత్రి నిద్రలో కాలభైరవుడు కనపడి "బిడ్డా దిగులు పడకు! నీవంటి పుత్రమురాలు గొడ్రాలుగా ఆఘోరించడం చూచి చలించి పోయాను! నీ అసమాన తపోనిష్ఠకు మెచ్చాను! నీ కడుపున నీ బిడ్డగా పెరగాలని నిర్ణయించుకున్నాను. నా అంశతో నీ కడుపున పుట్టే బిడ్డకు నాపేరే పెట్టి పెంచగలవు" అని అంతర్ధానమై పోయాడు. అప్పట్నుంచి అమ్మాయి కడుపులో నుండి ఇలా శబ్దాలు వస్తున్నాయి. ఇరుగు పొరుగు పోగయి 'ఆ దేవుడు కరుణించి వరమిచ్చినా సుగుణమ్మ కుక్కపిల్లను కనలేదు' ఆస్పత్రికి తీసుకు వెళ్ళితే ఆపరేషన్ చేసి బిడ్డను తీస్తారు" అన్నారు. అందుకని అందరం ఇలా బయల్దేరి వచ్చాం" అంది

మంజు సుగుణను బల్లమీద పడుకోబెట్టింది నోటి నుండి అదేపనిగా వచ్చే మూలుగులకు, అరుపులకు గాలి జీర్ణాశయంలోకి పోయి పొట్ట వుబ్బి నిండు గర్భిణి పొట్టలా వున్నది. పొట్టమీద చేతితో తట్టి చూచింది మంజు. గాలితో నిండివున్నట్లు డోలు మోత వినపడ్డది! అదేపనిగా సుగుణ నోటి నుండి కుక్క అరుపులు వెలువడసాగాయి! కాసేపు అలాగే వింటే మతిపోతుందా అనిపించింది మంజుకు ముఖం ముడుచుకుని పక్కన నుల్చునివున్న సుగుణ భర్త ప్రసాద్‌ను రమ్మని సైగ చేసి కన్సల్టింగ్ రూమ్ పక్కనున్న రూమ్‌లోకి జేరింది

ఏమిటయ్యా ప్రసాద్! ఏమిటి విషయం?" అని అడిగింది మంజు

"అమ్మా! ఏం చెప్పేది! అత్తా కోడలు కలసి నన్ను తినేస్తున్నారు బిడ్డలు లేకపోతే పిడా బాయెనని పూరుకోరు. అష్టమైన స్వాములవార్లు సన్యాసుల దగ్గరకు వెళుతున్నారు ఎక్కడ ఏ రాయి కనపడ్డా ప్రదక్షిణలు చేసేది సుగుణ!

కాలభైరవ స్వామి లీలలు ఎవరో సుగుణకు, అమ్మకు చెప్పారు ఇక అమ్మ పూజలు మొదలెట్టించింది. వీధిలో వాళ్ళంతా వచ్చి చూచి వెళ్ళారు. "ఇంకే ముంది! స్వామి అనుగ్రహం కలుగుతున్నది" అని ప్రచారం మొదలెట్టింది అమ్మ

రాత్రి కలలో స్వామి కనపడ్డాడని, అప్పట్నుంచి యీ వికారపు చేష్టలు చేస్తున్నది సుగుణ!"

"అలాగా" అని అంటుంటే మంజు ముఖంలో చిరునవ్వు మొలచింది. కనీసం ప్రసాద్ అయినా సక్రమంగా ఆలోచిస్తున్నాడు అనుకొని అతనితో –

ప్రసాద్! మీవాళ్ళ పిచ్చి వదలాలంటే ఒకటే మార్గం వున్నది నేను చెప్పినట్లు చేస్తావా?" అంది.

"అమ్మా! మీరేం చెప్పినా చేస్తాను! మా వాళ్ళ పిచ్చి వదిలితే చాలు! ఇంతకంటే నాకు ఎవరైనా చేయగల మహోపకారం మరొకటి వుండదు!"

"అలాగయితే ఒక కుక్కపిల్లను తీసుకునిరా" అంటూ అతనితో కొన్ని విషయాలు చెప్పింది మంజు ఆమె చెప్పినట్లు చేసాడు ప్రసాద్.

(ఇంకా ఉంది)

కార్టూన్లు సంఖ్యాపరంగా ఎక్కువగా ఉంటాయి గనుక, వాటిల్లో ఫలానాది నాకు నచ్చింది అంటూ ఓ కార్టూన్‌ని ఏరి చూపించడం కొంచెం కష్టమే. తెలుగు, ఇంగ్లీషు, కన్నడ భాషా పత్రికల్లో, నేనింతవరకు కొన్ని వేల కార్టూన్లు గీశాను. అయితే, ప్రతి కార్టూను ఉత్తమమైనదిగా ఉండేలా గీయడం ఎవరూ చేయలేని పని. అంతపెద్ద క్రికెట్ మాస్టర్ గవాస్కరే, బాటింగ్ చేసిన ప్రతి బాల్‌తో సిక్సర్ కొట్టలేడు కదా!


అసలు ఓ కార్టూన్ నచ్చడం అనేది పాఠకుడికి కానివ్వండి, కార్టూనిస్టుకు కానివ్వండి – ఆ చూసే వ్యక్తి యొక్క అభిరుచి మీద ఆధారపడి ఉంటుంది. కొందరికి మొరటు హాస్యం నచ్చితే, మరి కొందరికి సున్నితమైన హాస్యం నచ్చుతుంది. కొన్ని కార్టూన్లు, అవి గీసినప్పుడు జరిగే సంఘటనల ప్రభావం వల్ల కూడా నచ్చవచ్చు. ఈ కోవకు చెందినదే, నేను గీసిన కార్టూన్లలో నాకు నచ్చిన ఓ కార్టూను.

1975 ప్రాంతాల్లో నేను ఇంగ్లీష్ "శంకర్స్ వీక్లీ"లో కాస్త ఎక్కువగా కార్టూన్లు గీస్తుండేవాణ్ణి. ఈ కార్టూన్ గీసినపుడు ఆచార్య వినోబాభావే దీర్ఘకాల మౌనవ్రతం పాటిస్తున్నారు. ఆయన చేత దీక్ష విరమింపజేసి, దేశ సమస్యల పట్ల ఆయన దృష్టిని కేంద్రీకరింపజేసి,



వారి సలహాలు పొందాలని ప్రతిపక్ష నాయకులంతా ప్రయత్నిస్తున్నారు. సరిగ్గా అదే సమయంలో ఓ పేరుమోసిన దేశనాయకుడెవరో మరణించారు. అస్తమించిన ఆ నాయకుని గౌరవార్థం, దేశమంతటా సంతాప సభలు జరిపి, రెండు నిమిషాలు మౌనం పాటించారని పేపర్లో వార్త వచ్చింది. అది చదవగానే, ఈ పరిస్థితిలో వినోబాభావే ఏం చేస్తారని నాకో ఊహతట్టి వెంటనే ఇంగ్లీష్‌లో కార్టూన్ గీసి "శంకర్స్ వీక్లీ"కి పంపాను. ఆ కార్టూన్‌లో ఓ స్వామీజీ ఆశ్రమంలో కూచుని ఉంటారు. బ్యాక్‌గ్రౌండ్‌లో ఒక బోర్డు మీద "స్వామీజీ దీర్ఘకాల మౌనవ్రతం పాటిస్తున్నారు" అని రాసి ఉంటుంది. స్వామీజీ పత్రికా విలేఖరులతో ఇలా అంటారు – "దివంగతులైన నాయకుని గౌరవార్థం, నా మౌనవ్రతాన్ని రెండు నిమిషాలపాటు విరమించుకుంటున్నాను". ఈ కార్టూన్ "శంకర్స్ వీక్లీ"లో అచ్చయింది. ఇది అచ్చయిన కొద్ది రోజులకే, ప్రతిపక్ష నాయకుల తరపున శ్రీ జయప్రకాశ్ నారాయణ్ వెళ్ళి వినోబాభావేను కలవడం, శ్రీ భావే తాత్కాలికంగా దీక్ష విరమించి జయప్రకాశ్‌జీతో కొద్దిసేపు – రెండు మూడు నిమిషాలు – మాట్లాడటం జరిగింది. అనుకుని వేసిన ఈ కార్టూన్‌ని, అనుకోకుండా జరిగిన ఈ సంఘటనని కలగలిపి మెచ్చుకుంటూ చాలామంది నాకు, శంకర్స్ వీక్లీకి ఉత్తరాలు రాశారు–ఇది కార్టూనిస్టు ముందు చూపు అంటూ! ఇందులో నిజానికి ముందు చూపు, వెనక చూపు ఏవీ లేవు కాని, కేవలం కార్టూన్‌కోసం ఊహించిన ఐడియా నిజమైంది, అంతే!

–రామకృష్ణ.



" As a mark of respect to the departed leader, I break my silence for two minutes. "

శిక్ష

లక్ష్మీ శ్రీనివాసన్

"మీరు ఇల్లు అమ్మడానికి వీల్లేదు!..." పిచ్చిగా అరుస్తూ తన భర్త చేతిలో వున్న అట్ట బోర్డును చటుక్కున లాక్కొని లోపలకు పరిగెత్తింది భవాని.

బాబూరావు ఒక్క ఉరుకున ఆమెను సమీపించి, తిరిగి ఆ బోర్డును చేజిక్కించుకున్నాడు.

"వొద్దండీ... మీరు ఇల్లు అమ్మవద్దు... ఆ బోర్డు బయట పెట్టొద్దు!.." అంటూ దగ్గర కొచ్చిన భార్యను బలంగా ఒక్క తోపు తోశాడు బాబూరావు.

విసురుగా వెళ్ళి గోడకు గుద్దుకున్న భవాని "అమ్మా!" అని బాధగా అరచి తల పట్టుకొని వుండిపోయింది.

ఆమెకేమైందో పట్టించుకోకుండా బయటికొచ్చి, తన చేతిలో వున్న 'ఈ ఇల్లు అమ్మబడును' అన్న బోర్డును ఇంటి ముందు తగిలించాడు బాబూరావు.

నాలుగ్గదులున్న ఆ పెంకుటిల్లు మెయిన్ రోడ్‌కు చేర్చి వుంది. ఓ ఇంటి కుండాల్సిన సౌకర్యాలతో బాటు ఆ ఇంట్లో మంచినీళ్ళ కుళాయి కూడా వుంది. ఆసుపత్రి, తాలూకా ఆఫీసు, హైస్కూలు, సినిమా హాల్సులాంటివన్నీ ఆ ఇంటికి సమీపంలో వున్నాయి...

అన్నీ అందుబాటులో వున్నాయని అదేపనిగా వచ్చి పడే బంధువుల బాధపడలేకగాని, ఇల్లమ్మితే తప్ప తీరని బరువు, బాధ్యతలుండిగాని బాబూరావు ఆ ఇల్లు అమ్మడంలేదు. ఎప్పుడైనా అత్తమామలు వచ్చిపోవడం తప్ప ప్రత్యేకించి బాబూరావుకూ చెప్పుకోదగ్గ బంధువులు, రక్త సంబంధికులూ ఎవరూ లేరు.

అద్దె ఇంట్లో అనేకానేక అవస్థలు అనుభవించి- తన కొడుక్కలాంటి దుస్థితి సంభవించకూడదని అష్టకష్టాలు పడి ఆ ఇల్లు కట్టాడు బాబూరావు తండ్రి తమ్మిరాజు. స్వంత ఇంటి సుఖం అనుభవించకుండానే ఆ ఇల్లు కట్టిన ఏడాదికి బాబూరావు తల్లి చనిపోయింది. అప్పటికి పదిహేనేళ్ళ వయసున్న కొడుకును బాగా చదివించి- బ్రతకడానికి లోటు లేని ఉద్యోగంతో బాటు అందమైన అమ్మాయిని చూసి పెళ్ళి చేసి, ఒక మనుమరాల్ని కూడా కళ్ళ చూసి నాలుగేళ్ళ క్రితం కన్ను మూశాడు తిమ్మరాజు- తను చనిపోయే ముందు ఆ ఇంటి మీదున్న కొద్దిపాటి అప్పు తీర్చివేసి, కొడుకు జీవితాన్ని పూలబాట చేసి మరీ వెళ్ళిపోయాడతను.

ఆ పూల బాటను ముళ్ళబాటగా మార్చుకున్నాడిప్పుడు బాబూరావు. ఆ బాటనింకా ఇంకా క్లిష్టతరం చేసుకొని, తండ్రి ఎంతో కష్టపడి కట్టించిన ఆ ఇంటినీ, అన్నిటికీ అందుబాటులో అనుకూలంగా వున్న ఆ ఇంటిని అమ్మదల్చుకున్నాడు బాబూరావు.

అతనీ స్థితికి రావడానికి కారణం తాగుడు. ఒకప్పుడు తాగే వాళ్ళని చూసి అసహ్యించుకునే బాబూరావు అకస్మాత్తుగా గొప్ప తాగుబోతైపోయాడు.. అసలు తాగకుండా వుండలేని పరిస్థితికొచ్చేశాడు. ఇది స్వయం కృతాపరాధమే తప్ప- అతను తాగుబోతు కావడానికి ఏ ఒక్కరూ కారణం గాదు- సరదాగా ఒక్కసారి తాగి చూడాలన్న కోరిక అతణ్ణి సదా తాగుబోతుగా మార్చి సర్వ నాశనం చేసింది.

ఇది మంచి పని కాదని భవాని ఎన్ని విధాల చెప్పినా అతడు వినిపించుకోలేదు. సరి కదా ఆమెను హింసించడం ప్రారంభించాడు. ఈ విషయం భవాని తండ్రి ఆదిశేషయ్యకు తెలిసేసరికి చాలా ఆలశ్యమైపోయింది.

ఆయన కాస్త డబ్బూ, పరపతీ వున్నవాడు- గౌరవ మర్యాదల కోసం ప్రాకులాడే వాడూను. అల్లుడి తాగుడు జబ్బు బాగా ముదిరిపోయిందని తెలియగానే వచ్చి- ఆ విషయం అంతకు ముందెప్పుడూ చెప్పనందుకు కూతుర్ని చివాట్లు పెట్టాడు. అల్లుడి గురించి అన్ని విషయాలు సవిస్తరంగా తెలుసుకొని, అతడు కింగ్స్ బార్‌లో తప్పతాగి తూలుతూ పడి లేస్తూ రావడం స్వయంగా చూశాడు.

నిలువు లోతు బురదలో కూరుకుపోయిన అతణ్ణి ఒక్కసారిగా పైకి లాగడం కష్టమని గ్రహించి- ఒక రోజు, "అల్లుడూ! నువ్వు తాగితే తాగు... మనమంతా తాగకపోతే వూళ్ళో బార్లు వర్ధిల్లేదెట్లా?.. వీధికో బ్రాందీషాపు... సెంటరుకో బారు వెలుస్తున్నాయంటే మనమంతా తాగడానికే.. అంచేత నిన్ను నేను తాగవద్దనడం లేదు. కానీ, లిమిట్‌గా తాగు.. ఓ పెద్ద బాటిల్ కొని తెచ్చుకొని రోజుకు రెండో, మూడో పెగ్గులు లిమిట్ పెట్టుకో... నీ కాళ్ళకు సాష్టాంగపడి మొక్కుతాను!" అన్నాడు అన్నంత పనీ చెయ్యడానికి సిద్ధపడుతూ.

"మీరంత పని చెయ్యొద్దు... నా మంచి కోరి చెప్పిన మీ మాటలు కాదంటానా! మీరు చెప్పినట్టే చేస్తాను" అని మామగారికి మాటిచ్చాడు బాబూరావు.

ఆ మాట నిలబెట్టుకుంటాడన్న ఆశతో అల్లుడికి చెప్పవలసినవన్నీ మరోసారి చెప్పి ఆ మర్నాడే వెళ్ళిపోయాడు ఆదిశేషయ్య.

నిజంగా తాగుబోతు మాటలు నిజం కావుగనక- బాబూరావు విషయంలో కూడా అదే జరిగింది... ఆ వాగ్దానం చేశాక అతడు తాగడం మరింత ఎక్కువైందే తప్ప తగ్గలేదు. వచ్చిన జీతం సరిపోక పొయ్యేసరికి ఉద్యోగంలో అవినీతికి పాల్పడ్డంతో అది పై అధికారులకు తెలిసిపోయింది. ఫలితం... హఠాత్తుగా అతడు ఉద్యోగం నుంచి తొలగించబడ్డాడు. దాంతో అతను అంతకు ముందే ఒకరికి తెలియకుండా ఒకరి దగ్గర చేసిన అప్పులన్నీ వెలుగులోకొచ్చాయి. ఒకటికి ఒకటి కలిపితే రెండైనట్టు ఆ అప్పులు కొన్నివేలై బాబూరావు పరువు తీసేందుకిప్పుడు సిద్ధంగా వున్నాయి.

ఇలాంటి విష వలయంలో చిక్కుకుపోయిన బాబూరావుకు ఇల్లు అమ్మడం కన్నా మరో గత్యంతరం కనిపించలేదు. దానికి తోడు నాలుగు రోజుల్నుండి అతడికి మందు పడకపోవడంతో మతిపోతోంది. అందుకే ఆ రోజు అప్పటికప్పుడు ఆ బోర్డు రాసి- ఇల్లాలు వద్దంటున్నా వినక ఇంటి ముందు తగిలించాడు బాబూరావు.

ఎంత లేదన్నా తన యిల్లు పాతిక వేలకు తక్కువ రాదు. అప్పులన్నీ తీర్చగా అయిదారు వేలైనా మిగుల్తాయి. ఆ మిగిలిన డబ్బుతో జాషీగా, కులాసాగా బారులో గడపొచ్చుని... విస్కీ బ్రాందీల మత్తులో మునిగి తేలొచ్చునీ, అనుకుంటున్నాడు బాబూరావు. తలకు దెబ్బ తగిలి బాధ పడుతున్న భార్య కాని, తల్లి దగ్గర కూర్చొని తన వైపు బిక్కు బిక్కుమని చూస్తున్న అయిదేళ్ళ కూతురుగానీ అతడి కళ్ళకు కనిపించడం లేదు.- అతడికి కనిపిస్తున్నవల్లా తనెప్పుడూ వెళ్ళే కింగ్స్ బారూ, ఆ బార్లో వుండే విస్కీ, బ్రాంది బాటిల్సూను.

-తన మెళ్ళోని వస్తువులన్నీ తగలేశాడు. వున్న

వుద్యోగం పోగొట్టుకున్నాడు. వుండేందుకు నీడ కూడా లేకుండా చేస్తున్నాడు... నేనేం పాపం చేశాను దేవుడా? నాకెందుకిలాంటి శిక్ష విధించావు??... తగిలిన దెబ్బతోపాటు బాధలన్నీ తల్చుకొని విలపిస్తోంది భవాని ఆమేకేం చెయ్యడానికి పాలుపోవడం లేదు. ఆలోచించి, ఆలోచించి ఆ సాయంత్రం వీలు చూసుకొని పక్కింటి వాళ్ళ ద్వారా తన తండ్రికి కబురు పెట్టింది.

*   *   *   *   *

బాబూరావు ఇంటి మీద చాలామంది దృష్టి పడింది. అతడి పరిస్థితి తెలిసిన కొందరు ముందుకొచ్చి ఆ ఇంటిని పదిహేను వేలకు, ఇరవై వేలకు అడగటం మొదలు పెట్టారు- ఇలా మూడు రోజులు గడిచిపోయాయ్... అప్పుల వాళ్ళు అదేపనిగా వచ్చి పర్మం.. తాగేందుకు డబ్బు లేకపోవడంతో ఇరవై వేలకైనా ఇల్లు ఇచ్చేసే నిర్ణయానికొచ్చేశాడు ఇక తట్టుకోలేక బాబూరావు.

అతడలాంటి నిర్ణయానికొచ్చిన మరుసటి రోజు ఆ ఇల్లు కొంటానంటూ వచ్చాడొక వ్యక్తి. ఆ వ్యక్తిని చూస్తూనే బాబూరావు నిర్ఘాంతపోయాడు. అసంకల్పితంగా అతడి శరీరంలో సన్నని వణుకు మొదలైంది. అతడి హృదయంలో అంతులేని సంఘర్షణ చెలరేగింది... తనను తాను కంట్రోలు చేసుకునే ప్రయత్నం చేస్తూ- "మీరు.. మీరు..." అన్నారు, తడబాటుతో బాబూరావు. అదే సమయంలో లోపల్నుంచి ఆ వ్యక్తిని చూసిన భవాని ఉలిక్కిపడింది.

ఆ వ్యక్తి చిన్నగా నవ్వి- "ఔను, నేనే, కింగ్స్ బార్ ప్రొప్రయిటర్ భీమేశ్వర్రావుని. నన్ను చూసి ఎందుకంత కంగారు పడతారు. మీరిల్లు ఎంతకైతే అమ్మదల్చుకున్నారో ఖచ్చితంగా చెప్పండి!" అన్నాడు.

ఆ మాటలు బాబూరావుకు సరిగ్గా వినిపించలేదు- ఆ కింగ్స్ బార్‌కె వెళ్ళి కొన్ని వేల రూపాయలు తగలేశాడు తను. తనా బారులో తాగి తాగి ఇల్లమ్ముకునే హీన స్థితికి వస్తే- తనకా విస్కీ, బ్రాందీలు అమ్మిన వ్యక్తి తనిల్లు కొనటానికి వచ్చాడు.. ఎంత విచిత్రం!!... బాబూరావు కళ్ళు నెమ్మదిగా తెరుచుకోసాగాయి. ఇక ముందెప్పుడూ తాగకూడదని అప్పటికప్పుడు ఆత్మసాక్షిగా నిర్ణయించుకున్నాడతను- అయితే సమయం మించిపోయింది. ఇల్లు అమ్మక తప్పదు... ఇల్లమ్మి అప్పులు తీర్చగా మిగిలిన డబ్బుతో ఏదొక వ్యాపారం చేసి జీవితాన్ని చక్కదిద్దుకోవాలన్న ఆలోచన ఆ క్షణంలో బలీయంగా కలిగిందతనికి.

"అలా మౌనంగా వుండిపోయారేమిటి? ఇల్లు ఎంతకైతే ఇవ్వదల్చుకున్నారో చెప్పండి! మీకూ.



నాకూ రెండే రెండు మాటలు!" అన్నాడు కొన్ని క్షణాల తర్వాత భీమేశ్వరరావు.

"ముప్పై వేలు!" అన్నాడు తన ఆలోచనల్లోంచి తేరుకొని బాబూరావు

'కాదు. ఇరవై అయిదు వేలిస్తాను రెండు రోజుల్లో రిజిస్ట్రేషను ఇరవై రోజుల్లో మీరు ఇల్లు ఖాళీ చెయ్యడం జరిగిపోవాలి!' అన్నాడు నిర్మొహమాటంగా భీమేశ్వర్రావు

అందుకంగీకరించాడు బాబూరావు. ఆ వెంటనే వెయ్యి రూపాయలు అడ్వాన్సుగా ఇచ్చి, అగ్రిమెంట్ రాయించుకొని, ఎల్లుండి సరాసరి రిజిస్ట్రేషన్ ఆఫీసుకు రమ్మని చెప్పి వెళ్ళిపోయాడు భీమేశ్వర్రావు

ఆ డబ్బు భార్యకిచ్చి; "భవానీ, ఇంత కాలం ఇలా ప్రవర్తించినందుకు నన్నుక్షమించు! ఇక ముందెప్పుడూ తాగనని నీకుమాటిస్తున్నాను నన్నునమ్ము!" అన్నాడు బాబూరావు.

'ఇప్పటికైనా మీరామాట మీద నిలబడకలిగితే నాకదే పదివేలు!" అంది భవాని.

* * * * *

అనుకున్నట్టుగానే అన్నీ జరిగిపోయాయి. తాగుడంటే ఒకప్పుడెంత అసహ్యించుకునేవాడో ఇప్పుడంతకు మించి 'అసహ్యించుకుంటున్నాడు బాబూరావు అప్పులన్నీ తీర్చగా మిగిలిన డబ్బుతో అతడేదో చిన్న వ్యాపారం కూడా ప్రారంభించాడు.

భర్త అన్న మాట మీద నిలబడతాడనీ, అతడిలో అంతటి మార్పొస్తుందనీ వూహించని భవాని ఆనందంతో ఉక్కిరి బిక్కిరైంది- అయితే తనెంతో కష్టంలో వుండి కబురు పెడితే తండ్రి రానందుకు బాధ; ఇల్లు ఖాళీ చెయ్యాల్సిన గడువు దగ్గర పడుతుందన్న బెంగా ఆమెను పట్టుకు పీడించసాగాయి. ఆ రోజు బయటికెళుతున్న భర్తనాపుజేసి- "ఇక మూడు రోజుల్లో అతడిచ్చిన గడువు పూర్తయిపోతుంది. ఇంటి విషయమేమైనా ఆలోచిస్తున్నారా?" అంది భవాని.

హృద్రోగానికి కొత్త చికిత్స

హృద్రోగాల చికిత్సకు మరో నూతన పద్ధతి మరో రెండు సంవత్సరాలలో డాక్టర్లకు అందుబాటులోకి రానున్నది. టి.పి.ఎ. అనేది రక్త ప్రవాహంలోని అడ్డంకులను కరిగించగల టిష్యూ ప్రొటీను ఆరోగ్యవంతుల శరీరాలలో ఈ ప్రొటీను సమృద్ధిగా ఉంటుంది. పశ్చిమజర్మనీలోని ఒక పరిశోధనా సంస్థ ఒక అమెరికా పరిశోధనా సంస్థ సహకారంతో ఈ ప్రొటీనును తయారుచెయగల జీన్లను వేరు పరిచింది ఈ జీన్లను జంతువుల శరీరంలో, జీవకణాలలోకి ఎక్కించి, అది ఈ ప్రొటీన్ను తయారు చేస్తున్నట్లు తెలుసు కొన్నారు. దీనిని ఇంజెక్షన్ల రూపంలో శరీరంలోకి పంపటానికి వీలవుతుంది. ఇంతవరకు అందిన ఫలితాలు ఆశాజనకంగా ఉన్నట్లు డాక్టర్లు తెలియజేశారు

(గ్లోబల్)

శిక్ష

"అద్దె యిల్లు కోసం ప్రయత్నిస్తున్నాను భవానీ!ఎక్కడ చూసినా మనం భరించలేని అద్దెలు.. మనకందుబాటులో వుండే ఇల్లు ఇంతవరకెక్కడా కనిపించలేదు ఇప్పుడదే ప్రయత్నం మీద బయల్దేరాను!" సిగ్గు పడుతూ చెప్పి గబ గబా వెళ్ళిపోయాడు బాబూరావు.

అతడి మాటలతో భవాని బెంగ మరింత ఎక్కువైంది ఆ దొరకబోయే ఇల్లెక్కడో... అక్కడెలా వుంటుందో?... అద్దె ఇళ్ళలో ఆమె ఎప్పుడూ వుండకపోయినా వుంటున్న వాళ్ళ బాధలెన్నో కళ్ళారా చూస్తూనే వుంది. అవన్నీ తల్చుకొని ఆమె ఆందోళన పడుతున్న సమయంలో-తండ్రి ఆది శేషయ్య వచ్చాడు. ఆయన్ని చూసి వెంటనే మాట్లాడలేదు భవాని.

"నా మీద కోపం వచ్చిందామ్మా?" అన్నాడు, ఆమె, మనసులోని భావం గ్రహించినట్టు ఆదిశేషయ్య.

"లేదు నాన్నా! అంతా జరిగిపోయాక వచ్చినందుకు సంతోషంగా వుంది!" అంది నిష్ఠూరంగా భవాని.

"ఔనమ్మా, అంతా జరిగిపోయింది... ఆ పరిస్థితిలో నేనొచ్చినా అది జరక్క మానదు కదా? ఇంతకు ముందు అల్లుడికెన్నో విధాలుగా చెప్పి చెప్పి నా మాట విలువ కూడా పోగొట్టుకున్నాను- సరే, ఇప్పుడెలా వుందమ్మా నీ భర్త పరిస్థితి? అతడిలో మార్పొచ్చిందని విన్నాను!?" అన్నాడు ఆదిశేషయ్య.

"మీరు విన్నది నిజమే నాన్నా! కానీ, ఏం లాభం?... ఆ మార్పొచ్చేసరికి అన్నీ అయిపోయినై. ఆఖరుకు వుండే నీడ కూడా పోయింది. ఇప్పుడెక్కడ వుండాలో ఏమిటో అంతా అయోమయంగా వుంది!" అంది అవ్యక్తమైన బాధతో భవాని.

కొన్ని క్షణాలపాటు కూతురి మొహంలోకి పరీక్షగా చూసి, "నువ్వెక్కడికీ వెళ్ళనవసరం లేదమ్మా... ఈ ఇల్లు నీ పేరున నేను కొన్నాను! ఈ ఇల్లు నీది!!" అన్నాడు ప్రేమగా ఆదిశేషయ్య.

"నాన్నా!" అంది ఆశ్చర్యంగా భవాని.

"నేను చెప్పేది నిజమే తల్లీ! నువ్వా రోజు కబురు పెట్టగానే నాకేం తోచింది కాదు. ఆ సమయంలో వచ్చి అప్పులన్నీ తీర్చి, ఇల్లు అమ్మకుండా చేసినా అల్లుడు మారతాడన్న నమ్మకం లేదు. అతడిలో ఎలా మార్పు తీసుకు రావాలని ఆలోచిస్తుంటే-కింగ్స్ బార్ ప్రొప్రయిటరు భీమేశ్వర్రావు నాకు గుర్తొచ్చాడు. అతడు మన వూరి మున్సబుగారబ్బాయన్న సంగతి నీకు జ్ఞాపకం వుండే వుంటుంది. వెంటనే వచ్చి, ఈ కథంతా చెప్పి అతణ్ణి ప్రాధేయపడి ఇక్కడకు పంపించి ఈ ఇల్లు కొనిపించాను.

"అదే రోజున మళ్ళీ నీ పేరున మార్పు చేయించి ఇలా వచ్చాను. డబ్బు ఖర్చయినా భీమేశ్వరరావు రావడంతో అల్లుడిలో మార్పొచ్చినందుకు ఆనందంగా వుంది. నా ప్రయత్నం వృథా కాలేదనే అనిపిస్తోంది!" అన్నాడు గద్గదిక స్వరంతో ఆదిశేషయ్య.

"మిమ్మల్నింత తప్పుగా అర్థం చేసుకున్నాను నాన్నా!నా కోసం మీరెంత శ్రమ పడ్డారు!!" అంది, బాధా, ఆనందమూ కలగలసిన కంఠంతో భవాని.

"శ్రమ కాదు తల్లీ! వేలకు వేలు కట్నమిచ్చి, కాళ్ళు కడిగి కన్యాదానం చేసే మామలకు కొందరల్లుళ్ళు విధించే శిక్ష ఇది!.. కొన్నాళ్ళపాటు ఈ ఇల్లు అద్దెకిచ్చేటట్టుగా భీమేశ్వరరావుని నీ భర్తతో చెప్పమంటాను. ఈ నిజం మాత్రం అల్లుడికప్పుడే తెలియనివ్వకు!!" అన్నాడు ఆవేదనగా ఆదిశేషయ్య.


భవాని కళ్ళెందుకో చెమ్మగిల్లాయి. □



ఆంధ్రపత్రిక పాఠకులకి చక్కటి అవకాశం!



కళ్యాణవేదిక
ఉచిత సమాచారం



జీవితానికి వివాహం ఒక మలుపు. 'ఒకరి కొకరు రాసిపెట్టడం' ఏది చేతిలోనిదనే నానుడి అందరెరిగినదే. అయితే రాసిపెట్టినవారు చేరువయ్యే క్షణం అంత సులభం కాదు. మానవప్రయత్నం కూడా కావాలి. ఇందుకు ఎంతో శ్రమ, త్రిప్పట, వ్యయం అవుతోంది.

సమాజంలో నెలకొనియున్న ఈ సమస్యకు పరిష్కార మార్గంగా ఆంధ్రపత్రికలో కొంతకాలంగా "కళ్యాణ వేదిక" శీర్షికన తగ్గింపు రేట్లపై ప్రకటనలు వేయడం జరుగుతోంది.

ఈ శీర్షికను మరింతగా ప్రజలకు వుపయోగపడేందుకు వీలుగా విస్తృతపర్చి ప్రతి బుధవారం "కళ్యాణ వేదిక ఉచిత సమాచారం" శీర్షికగా ఆంధ్రపత్రిక దినపత్రికలో ప్రకటించాలనుకుంటున్నాము.

వధూవరులవివరాల వుచిత సమాచారము కోరువారు/యిచ్చేవారు పూర్తివివరములను అంటే వరుడు/వధువుకు సంబంధించిన వయసు, చదువు, ఇతర అర్హతలు సుమారు **150** అక్షరాలకు మించనట్లు తెలుగులోనే స్పష్టంగా వ్రాసి, ఈ దిగువ కూపనును జతపర్చి మీ వూరిలోని ఆంధ్రపత్రిక ఏజెంటు ద్వారా పంపాలి. చిరునామా పిన్‌కోడ్‌తోబాటు సమగ్రంగా ఉండాలని మనవి.

ఆ విధంగా మాకు అందిన వధూవరుల సమాచారమును వుచితంగా వారమునకు ఒకసారి ప్రతి బుధవారం వీలువెంబడి ప్రకటిస్తాము.

ఉచిత వధూవరుల సమాచారము యివ్వదలచినవారు ఈ దిగువ నిబంధనలు పాటించాలి.

- ★ వధువు/వరునికి సంబంధించిన వివరాలు సమగ్రంగా, అచ్చులో 150 అక్షరాలకు మించనట్లుగా తెలుగులోనే స్పష్టంగా వ్రాసి పంపాలి.
- ★ వధువు/వరుల తల్లిదండ్రులు, సంరక్షకులు తాము యిచ్చే సమాచారము వాస్తవమని, ఎవరినీ కించపర్చే విషయము అందులో లేదని హామీ ఇవ్వాలి.
- ★ సమాచారం పంపేవారి పేర్లు వగైరా రహస్యంగానే వుంచబడతాయి. ప్రతి ప్రకటనకు ఒక బాక్సు నెంబరు కేటాయించి, వచ్చిన జవాబులు **ఉచితంగానే** వాటికి సంబంధించినవారికి నెల రోజులలోపు పంపడం జరుగుతుంది.
- ★ ఈ శీర్షికను కుల మత వర్గ భేధాలు లేకుండా అందరూ వుపయోగించుకోవచ్చును.
- ★ అందిన సమాచారము ప్రతి బుధవారం మాత్రమే, అవి అందిన వరుస క్రమంలో ప్రకటించబడతాయి. వీటిని త్రిప్పి పంపే ప్రసక్తి లేదు. కావున స్వంత అడ్రసుగల కవర్లు, లేదా స్టాంపులు జతపర్చకూడదు.
- ★ ప్రకటనకు ఏదైన అనర్హమైనదిగా తోచినపుడు వాటిని వెయ్యకుండా ఆపుచేసే హక్కు పత్రికకు వుంటుంది.
- ★ ఇతర విధములైన వుత్తరప్రత్యుత్తరములకు అవకాశం లేదు. ఫోటోలు పంపకూడదు.

కళ్యాణ వేదిక ఉచిత సమాచార కూపను

పేరు ______________________________

చిరునామా ______________________________

______________________________ పిన్ కోడ్ ______________

స్థానిక ఆంధ్రపత్రిక ఏజెంటు సంతకం ______________________________

పురుషులు ప్రకృతిపరంగానే బహు భార్యా ప్రియులా?

ప్రకృతిలో ఎన్నో జీవజాతులున్నాయి. ప్రతి జాతిలోనూ ప్రత్యేకతలున్నాయి. ఆ ప్రత్యేకతలే వైవిధ్యాలని తెస్తాయి. ఈ వైవిధ్యాలే జాతుల ఆవిర్భావానికి దారితీస్తాయని పరిణామ శాస్త్ర నిపుణులు చెబుతారు. జీవ జాతుల మధ్య జన్యుపరమైన అనుబంధం ఉన్నప్పటికీ – పరిసరాల ప్రభావం వలన, పోషణ విధానంలోని వ్యత్యాసాల వలన ప్రతి జాతి మధ్యా భిన్నత్వముంటుంది. ఒకే ప్రక్రియని నెరిపేటప్పుడు కూడా భిన్న జాతుల మధ్య భిన్న ధోరణులు గోచరించవచ్చు. జీవ క్రియలు సార్వత్రికంగా ఒకే విధంగా కొనసాగినప్పటికీ జీవన విధానాలలోని ఆచరణ పద్ధతులు వేరు వేరుగా ఉండటం చేత ఈ పోకడ కనిపిస్తుందని శాస్త్రనిపుణులు చెప్పే మాటలో ఎంతైనా వాస్తవముంది.

ఉదాహరణకి 92 శాతం పక్షులు ఏకపత్నీ వ్రతాన్ని పాటిస్తూ ఉండగా క్షీరదాలు 5 శాతం కన్నా తక్కువ మాత్రమే ఏకపత్నీ వ్రతాన్ని పాటిస్తున్నాయి. మానవులలో బహుభార్యా ప్రియత్వము అరుదేమి కాదు. మనదేశంలో బహుభార్యాత్వము చట్టరీత్యా నేరమే కాని, మహమ్మదీయులకి ఈ చట్టం వర్తించదు. పాశ్చాత్య దేశాలలో ఎంతోమంది స్త్రీపురుషులు విచ్చలవిడిగా సంబంధాలని పెంచుకొంటూ ఉంటారు. వ్యభిచారం లేని ప్రాంతాన్ని ప్రపంచంలో చూడటమే కష్టంగా ఉంది. అక్రమ సంబంధాలకి కొదవలేదు. జంతుశాస్త్ర దృక్పథంలో మనిషిని కూడా పరిణితి చెందిన జంతువుగా గుర్తించితే, అతడు బహుభార్యా ప్రియుడిగానే కనిపిస్తాడు. పురుషులు ఇలా ఎందుకు ప్రవర్తించాలి? పోతే దీనికి పూర్తి విరుద్ధంగా స్త్రీలలో బహుభర్తృత్వ ధోరణి ఎంత మాత్రమూ కనిపించడం లేదు. ఒక స్త్రీ ఎక్కువమంది పురుషులతో కలిసి ఉన్నట్లు చెప్పడానికి కొన్ని సాక్ష్యాధారాలున్నా, ఒక పురుషుడు ఎక్కువమంది స్త్రీలతో కూడి ఉండేవాడని చెప్పడానికి ఎక్కువ సాక్ష్యాధారాలున్నాయి. శాస్త్రపరంగా ప్రకృతి రీత్యా పురుషుడు బహు స్త్రీ అభిలాషి అని స్ఫుటంగా వెల్లడి చేయడం జరిగింది కూడా! సామాజిక నియమాలకి కట్టుబడి బహు భార్యాత్వ ధోరణి నించి పురుషులు దూరమవుతున్నారే తప్ప, స్వాభావికంగా సహజ సిద్ధంగా కాదు. ఈ విషయం కూడా మనదేశానికి సంబంధించి మాత్రమే! అందుకే మనదేశంలో ఒక స్త్రీ దారి వెంట వెళుతూ ఉంటే వయో భేదాలు లేకుండా ఆమెను ఎందరో పురుషులు కళ్ళతో పొడుస్తూ ఉంటారు. ఇది పరస్త్రీ వ్యామోహంతో అని ఎంతోమంది అనుకొంటారు. కాని, జన్యు పరంగా అనూచానంగా పురుష సాంప్రదాయికంగా వస్తున్న బహు స్త్రీ చాపల్య గుణం అని చాలామందికి తెలియదు. "మగబుద్ధి" అని స్త్రీలు ఎద్దేవా చేసినా, వెలి వేసినా అది స్వతహాగా పురుషాంతరంలోంచి అయత్నకృతంగా వచ్చిన బుద్ధేకాని మరేమికాదు. ఈ బుద్ధి ప్రభావమే మన సంప్రదాయంలోకి ఇద్దరు పెళ్లాల ముద్దుల మొగుళ్లని దేవుళ్ళుగా తెచ్చింది. కొన్ని వేలమంది స్త్రీలకి నాథుడిగా ఉన్న కృష్ణపరమాత్ముడి కథ మనకు తెలిసిందే!

బహు స్త్రీ ప్రియత్వం మనుష్యులలోనే కాదు, జంతువులలో కూడా ఉన్నాయి. కోతుల మందని గమనిస్తే జట్లు జట్లుగా అవి తిరుగాడుతూ ఉండటం తెలుస్తుంది. ప్రతి జట్టుకీ మగకోతి ప్రాతినిధ్యం వహిస్తుంది. ఈ మగ కోతే, ఆడ కోతులతో కూడుతూ ఉంటుంది. వేరే మగకోతికి ఈ కోతి ఎంత మాత్రమూ అవకాశమివ్వదు. బలంలో తనని మించిన కోతి వచ్చి ఓడగొట్టితే తప్ప ఇది ఎట్టి పరిస్థితులలోనూ ఆడకోతుల సాంగత్యాన్ని వదులుకోదు. సాంగత్యమే ప్రధానం కాని, వావి వరుసల ప్రమేయం లేదు! గొర్రిల్లాలలో కాని, ఒరాంగ్ఉటన్‌లలో కాని, చింపాంజీలలో కాని, గిబ్బన్‌లలో కాని ఈ పద్ధతే కొనసాగుతూ ఉంటుంది. సింహాలు, పులులు వంటి జంతువులలో కూడా బహు స్త్రీ ప్రియత్వం కనిపిస్తుంది.



దక్షిణ చైనాలో బాగా కనిపించే "పాండా" జంతువులలో ఆదర్శ దాంపత్యం లేదు. గర్భాన్ని ఆరు నెలల పాటు మోయడమే దానికి కారణం!

బహుస్త్రీ ప్రియత్వం పక్షులలో 8 శాతానికి మించి లేదు. దాదాపు పక్షులన్నీ ఆదర్శ దాంపత్యాన్ని గడిపేవే? పారాకీట్‌లు, పావురాలు, బుల్‌బుల్‌లు, మైనా పిట్టలు పాతివ్రత్యాన్ని పాటిస్తాయి. పక్షులలో ఉన్న ఏకస్త్రీ నిబంధన మరి జంతువులలో ఎందుకు లేకపోయింది అన్న సంగతి ఆలోచించాలి. ఇకపోతే కొన్ని జంతువులలో దంపతులుగా జీవితకాలం వ్యవహరించేవి కూడా ఉన్నాయి. యేల్ యూనివర్సిటీకి చెందిన పాట్సీ మొఖల్‌మన్ అనే జంతు శాస్త్రజ్ఞురాలు గుంటనక్కలు ఏక స్త్రీ నిబంధనని కచ్చితంగా అమలు పరుస్తాయని తెలిపింది. ఆఫ్రికన్ వేటకుక్కలలో విచ్చలవిడి శృంగారం లేదని హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన జేమ్స్ మాల్కమ్ అనే జీవశాస్త్రవేత్త వెల్లడించాడు. దుప్పులు కూడా (కొన్ని తెగలకి చెందినవి మాత్రమే!) ఒక భార్య – ఒక భర్త సిద్ధాంతాన్ని పాటిస్తాయి! అయితే అన్ని వేళలా కాదు. పక్షులలో సైతం ఆదర్శజంటలని అనుకొన్నవి కూడా ఒక్కోమారు వ్యభిచారం చేస్తాయని స్టాక్‌హోమ్ విశ్వవిద్యాలయానికి చెందిన హామ్స్–టిమరిన్ అనే జీవశాస్త్రవేత్త ప్రకటన ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.


ఎందుకని జంతువులలో ఎక్కువభాగం (మనుష్యులతో సహా?) బహు స్త్రీ ప్రియులుగా ఉంటాయి? పక్షులలో అధికశాతం ఏక స్త్రీ నిబంధనకి కట్టుబడి ఉంటాయి? అనే అంశాన్ని విపులంగా చర్చించాలి. జంతు ప్రవర్తన శాస్త్రానికి సంబంధించిన నిపుణుల అభిప్రాయాలు ఆమోద

యోగ్యంగా ఉన్నాయి.

జంతువుల (మనుష్యులని కూడా చేర్చుకోవాలి!) జీవనసరళిలో స్త్రీ, పురుష జీవులు నిర్వర్తించే జీవన వ్యాపారాలపై ఆధారపడి బహు స్త్రీ ప్రియత్వము లేదా ఏక స్త్రీ నిబంధనా వ్యవస్థ ఉంటుంది. ఉదాహరణకి పక్షులని తీసుకొందాము.

మగపక్షి, ఆడపక్షి హీనపక్షం ఇరవై సార్లకి పయిగా కలుసుకొంటే (అన్ని తెగల పక్షులకి ఈ సంఖ్య వర్తించకపోవచ్చు!) ఆడపక్షి గర్భం దాలుస్తుంది. ఆడపక్షి – ఏ జాతిలోనైనా –ఐదారు గ్రుడ్ల వరకు పెడుతుంది. కాబట్టి సంతానం స్పష్టంగా పెరుగుతుంది. జాతి బలం – సంఖ్య రూపేణా పుంజుకుంటుంది. కొన్ని పక్షులు 12–16 గ్రుడ్లని కూడా పెడతాయి. మరి అరుదుగా ఒకే గ్రుడ్డు పెట్టే పక్షులు కూడా ఉన్నాయి. ఎంపరర్ పెంగ్విన్, నిప్పుకోడి వంటివి ఇలాంటి పక్షులు! పైగా గర్భధారణ తరువాత గ్రుడ్లు పెట్టడం– అవి చితికి పిల్లలు బయటికి రావడం – ఆ పిల్లలకి స్వతహాగా బ్రతికే శక్తి కలగడం – వీటన్నింటికి పట్టే కాలం చాల తక్కువ! అంటే స్త్రీ జీవి గ్రుడ్లని పెట్టి మళ్ళీ పురుష జీవితో జతకట్టడానికి సిద్ధం అవడానికి పట్టే సమయం చాల స్వల్పమని తెలుస్తుంది. అందువల్ల స్త్రీ, పురుష పక్షులు విడివిడిగా దూరంగా ఉండే కాలం చాల తక్కువ అవుతుంది. ఈ కారణం చేతనే పక్షులలో బహు భార్యా చాపల్యత లేదని తోస్తుంది. ఇది వాస్తవం కూడా! జత కట్టడానికి స్త్రీ జంతువు సిద్ధంగా లేనంత కాలం పురుష జంతువుకి మరో తాపత్రయముంటే బహు భార్యాత్వ ధోరణి నిరోధించబడుతుంది. గుంటనక్కలలో, కొన్ని తెగల వేటకుక్కలలో స్త్రీ జంతువులతో పాటు పురుష జంతువులకి సంతానాన్ని జాగ్రత్తగా చూచుకొనే విషయంలో పాత్ర ఉంది. స్త్రీ జంతువు పిల్ల జంతువుకి పాలిచ్చి, అది స్వతంత్రంగా బ్రతికే స్థాయి వచ్చే వరకు వేరే యితర ఆహారాన్ని కూడా సమకూర్చి పెడుతుంది. ఈ అంశంలో స్త్రీ జంతువుకి పురుషజంతువు అన్ని వేళలా సహాయపడ ఆహర్నిశలూ అండగా ఉంటుంది. అందువల్ల ఆ మగజంతువుకి వేరే వ్యాసంగం ఉండదు. పిల్ల జంతువు స్వతంత్రంగా బ్రతికే స్థాయి వచ్చే నాటికి, స్త్రీ, పురుషజంతువులు రెండూ మళ్ళీ కలుసుకొంటాయి! ఈ విధానంలో బహుభార్యాత్వ ధోరణికి అవకాశం లేదు. మరి మనుష్యుల విషయం ఇలా కాదు కదా!

స్త్రీ పురుషులు కలుసుకున్నాక – స్త్రీ గర్భం ధరించాక – ఆమె కనడానికి హీన పక్షం తొమ్మిది నెలలు అవసరం. మూడు నెలల తరువాత గర్భవతులకి భర్తలతో కలియడం అంటే ఇష్టంగా ఉండదట కూడా! ఈ విషయాన్ని నిర్ధారిస్తూ పరిశోధనాపరమైన సాక్ష్యాలు కూడా ఉన్నాయి. తీరా తొమ్మిది నెలలూ నిండి ప్రసవించాక ఆరు నెలలకి కాని మళ్ళీ మునుపటి స్థాయి రాదు. పసి పాపకి పాలిచ్చి పెంచే బాధ్యతా, తరువాత తరువాత



జంతువులలో మగవాటి ప్రమేయం రక్షణకి సంతానాభివృద్ధికి మాత్రమే పరిమితమై ఉంటాయి! ఉదాహరణకి దుప్పి!!

గోరుముద్దలు తినిపించే బాధ్యతా రెండు కూడా తల్లిని ఆశ్రయించుకొని ఉండేవి. రెండేళ్ళకి కాని పసిబిడ్డ తల్లికి ఎడంకాదు. అది కూడా పూర్తిగా కాదు. ఆ తరువాతే స్త్రీకి పురుష సంపర్కాభిలాష మనస్ఫూర్తిగా కలిగేది. అంటే సుమారుగా మూడు సంవత్సరాలపాటు మగవాడు, స్త్రీకి దూరంగా ఉండాలన్న మాట! మధ్య మధ్యలో కలిసినప్పటికి అది తృప్తికరమైన అనుభూతిని ఇవ్వకపోవచ్చు. ఇటువంటి పరిస్థితులలో మగవాడు సహజంగానే మరో ఆడదాని పొందు కోరడం జరుగుతుంది. సాంఘిక నియమాలు, సమాజపు కట్టుబాట్లు, కుటుంబ వ్యవస్థలు, వావివరుసలు రంగంలోకి వచ్చి మగవానిని అదుపులో పెడతాయి. వీటి నుంచి తప్పించుకొనే మార్గంలో "వ్యభిచారం" తార సిల్లింది. భారతదేశంలో ధర్మ మార్గం పేరిట రామాయణ తత్త్వం కొంతవరకైనా ఆదర్శ మయింది కాని; ప్రపంచంలో మిగతా స్థలాలలో ని పరిస్థితి నేటికీ అధ్వాన్నంగానే ఉంది. గల్ఫ్ దేశాలలో ఒక పురుషుడు పది, పన్నెండుమంది స్త్రీలతో కాపురం చేయడం మామూలు విషయమే కదా! చరిత్రలో గతాన్ని పరిశీలిస్తే సామ్రాట్టులకి నవాబులకి వందల సంఖ్యలో ఉంపుడుకత్తెలు ఉండటం అవగాహనకి వస్తుంది. ప్రకృతిపరంగా మగవాడి లక్షణమే బహుభార్యా ప్రియత్వమని అనుకొని ప్రవర్తించడం అనుచితం. కాలధర్మాలని బట్టి సంస్కార శీలతని మరింతగా పెంచుకోవాలి. జంతు జాతులలో జాతిని ద్విగుణీకృతం చేయడం సంఖ్యాపరంగా మాత్రమే పరిమితం. మరి మానవ జాతి అలా కాదు. ఉత్తమ మానుష ధర్మాలకి విలువ ఇచ్చి జాతిశక్తిని పెంపొందింపజేసే బాధ్యత స్త్రీ, పురుష భేదం లేకుండా అందరికీ ఉంది. మానవజన్మ కేవలం సంభోగేచ్ఛని తీర్చుకోవడం కోసం ఉపయోగించరాదు. అదే పరమావధి కాకూడదు కూడా!

మనుష్యులు జంతువులు కాదని తెలియజెప్ప వలసిన ఆవశ్యకతని గుర్తుపెట్టుకోవాలి! ☐

—డాక్టర్ గుమ్మనూరు రమేష్‌బాబు

అచ్చిరాని పని

సి.వి. సర్వేశ్వర శర్మ

తెల్లవారింది.

రాంబాబు నూతి దగ్గర స్నానం చేస్తున్నాడు. బద్ధకంగా మంచం మీద పడుకుని దొర్లుతున్న కనకయ్యకు నూతి దగ్గర రాంబాబు కన్పిస్తున్నాడు. అరవై ఏళ్ల కనకయ్యకు ఇరవై ఏళ్ల కొడుకు రాంబాబు.

ఎన్ని రాళ్లకు ఎన్ని గుళ్లకు మ్రొక్కిందో రాంబాబు తల్లి. రాంబాబు పుట్టాడు. చిన్న స్కూల్లో పంతులు ఉద్యోగంతో కనకయ్య సంసారం మొదలయింది. రాంబాబు పుట్టేవరకూ పిల్లలు లేరనే చింత పుట్టిన తరువాత రాంబాబును జాగ్రత్తగా పెంచే బాధ్యతలతో కనకయ్య జీవితం దొర్లుతోంది. కనకయ్యకు తాతముత్తాతలు యిచ్చిన ఆస్తి శరీరం తప్పించి మరింకేమి లేదు.

ఏ నెల జీతం ఆ నెలకే సరి. అలాగే గడిపేశారు. గారంగా పెరుగుతున్న రాంబాబు చదువులో కూడా గారంగానే ముందుకు వెడుతున్నాడు. యిరవై ఏళ్ల రాంబాబు మొత్తానికి బి. ఎ. క్లాసులోకి వచ్చాడు. తల్లీ తండ్రి రాంబాబుకి కావలసినంత ప్రేమాభిమానాలు ఇవ్వగల్గుతున్నారు కాని రాంబాబు వయసుకు తగ్గ హంగులు, సరదాలు తీరటంలేదు.

తండ్రి పరిస్థితి తెలిసిన రాంబాబు కూడా చాలామట్టుకు సర్దుకుపోతున్నాడు.

ఇంట్లో చిరిగిన బట్టలతో గడిపినా, కాలేజీకి వెళ్లేటప్పుడు ఇస్త్రీవి కాకపోయినా కనీసం గట్టి బట్టలయినా వేసుకోవాలి. అందుకే రెండు జతల బట్టలు కనకయ్య కుట్టించాడు రాంబాబుకి.

రిటైరైన తరువాత వచ్చిన డబ్బు రాంబాబు తల్లి ఆరోగ్యానికి సరిపడింది. ఆమెకు ఉబ్బసం వ్యాధి. దానికితోడు ఎక్కువ రక్తపోటు. రాంబాబు తల్లి రత్తమ్మ, రాంబాబు పుట్టే వరకూ ఆరోగ్యంగానే ఉంది. పిల్లాడు పుట్టాడనే సంబరంలో ఆరోగ్యాన్ని సరిగా చూసుకోక కొంప మీదకు తెచ్చుకుందని కనకయ్య అనుమానం.

ఆర్నెల్ల నుండి రాంబాబు అడుగుతున్నాడు మూడేళ్లనాడు కొన్న చెప్పులు అరిగిపోయాయని, తెగిపోయాయని.

చెప్పులు చాలాసార్లు తెగాయి. చెప్పులు కుట్టే రంగయ్య చెప్పులు బాగుచెయ్యమని ఇచ్చినప్పుడల్లా చూసే హేళన చూపులు తండ్రికి చాలాసార్లు చెప్పాడు రాంబాబు.

రాంబాబు చెప్పులకన్నా ఇంకా ముఖ్యమైనవి తను ఇంట్లో సమకూర్చాలి. అసమర్థుడిలా వింటూ ఉండిపోయేవాడు.

తండ్రి అసమర్థతను రాంబాబు సానుభూతితో అర్థం చేసుకుంటాడు. కాని తనను ఎవరు అర్థం చేసుకుంటారు.

మంచం మీద నుండి కనకయ్య లేచాడు. కాలకృత్యాలన్నీ తీర్చుకున్నాడు.

రాంబాబు డొక్కు సైకిలు మీద దగ్గర్లో ఉన్న పట్నంలోని కాలేజీకి బయలుదేరాడు. సైకిలుకు బాగా మాసిపోయిన సంచీ తగిలించి ఉంది. సంచీ కన్నంలోంచి రాంబాబు భోజనం కేరియరు కన్పిస్తోంది.

జనాభా ఎక్కువ, కాలేజీ బిల్డింగులు తక్కువ. అందుకే కాలేజీ ఉదయం ఏడు నుండి సాయంత్రం అయిదువరకూ పనిచేస్తూనే ఉంటుంది. ఉదయం కొంతమందికి చదువు. మిగిలినవారికి మధ్యాహ్నం చదువు. రాంబాబుకు పన్నెండయ్యేసరికి కాలేజీ వదిలేస్తారు.

ఎండలో ఇంటికి రాడు. భోజనం చేసి సాయంత్రం మెల్లిగా యిల్లు చేరుకుంటాడు.

'కాలేజీకి వెడుతున్నాను' రాంబాబు చెప్పాడు.

మౌనంగా కనకయ్య తలూపాడు. రాంబాబు కదలికతో సైకిలు చప్పుడు చేస్తూ ముందుకు కదిలింది.

మట్టి అరుగు మీద కూర్చున్న కనకయ్య ఇంట్లోకి చూశాడు. వర్షాలకు తడిసి కరిగిపోతున్న మట్టిగోడలు, పైకప్పు మీద బాగా ఎండిన తాటాకు చీకిపోతున్న వెదుళ్ల మీద ఎప్పుడు క్రిందకు రాలిపోదామా అన్నట్టున్నాయి.

ముష్టి కొంపలా ఉంది. దరిద్రుడు మరో దరిద్రుడ్ని పీక్కుతిన్నట్టు ఈ కొంపకి తనిచ్చే పదిహేను రూపాయల అద్దె చాలదని ఇంటి యజమాని వారానికోసారి బెదిరిస్తుంటాడు. ఏమి చెయ్యలేని తను సంబంధం లేనట్టు నవ్వుతో తుడిచేసుకుంటాడు.

ఇంటి పరిస్థితులు ఎప్పుడూ ఇరకాటంగానే ఉంటున్నాయి. కాకపోతే తన తండ్రికంటే తనే గొప్పవాడని కనకయ్య ఒక్కొక్కసారి అనుకుంటూ ఉంటాడు.

కనకయ్య తండ్రి ఫైయ్యర్ గ్రేడు చెప్పించాడు అంతే. కాని తను కొడుక్కి బి. ఎ. చెప్పిస్తున్నాడు. రాంబాబు కోరిక ఎలా తీర్చాలి.

ఇంట్లోకి వెళ్లి కావిడి పెట్టి తెరిచాడు. పక్క అరలో ఉన్న రేకు పెట్టి తీశాడు. దాని మూత తెరచాడు. అది కనకయ్య ఇనపెట్టి. అందులో అతని సిరులు నిల్వ ఉంటాయి. కొత్త రూపాయి నోటు. దానితో బాటు వడుగులో పొర్లించిన పావలా కాసు ఉన్నాయి.

ఏదో ఆరాటం. ఇనపెట్లో ఎంతుందో తెల్సు అయినా ఏదో తెలియని ఆశ. నిరాశతో పెట్టి మూత పెట్టాడు. ప్రక్క అరలో బట్టలు లోతుగా ఉన్నాయి. ఏదో కవరు.

కనకయ్య కవరు తీశాడు. అందులో శుభలేఖ ఉంది. బయటకు తీసి చూశాడు.

తను అక్షరాభ్యాసం చేయించిన రాజశేఖరం పెళ్లి. పెద్ద యింజనీరు అయ్యాడు. శుభలేఖ పరీక్షగా చూశాడు. పెళ్లి అయిపోయింది.

రేపటి రోజున పెళ్లికుమారుని ఇంట్లో విందు భోజనం. పట్నంలో చక్కటి ఇల్లుంది. అదృష్టవంతుడు. తన మీద ఎంతో అభిమానం. అందుకే రాజశేఖరానికి అక్షరాభ్యాసం తనచేత చేయించాడు ముకుందం.

ముకుందం తనూ చిన్ననాటి స్నేహితులు. ఎంతమంది చెప్పినా వినకుండా తన కొడుక్కి తను కాకుండా నాచేత అక్షరాభ్యాసం చేయించాడు. ఆ అభిమానం తను జన్మ జన్మలకు మరిచిపోలేడు.

సాయంత్రం రాంబాబు ఇంటికి వచ్చాడు. మర్నాడు రాజశేఖరం ఇంట్లో విందు. భోజనానికి అక్కడికి వెళ్లమని రాంబాబుకు చెబుదా మనుకున్నాడు. ఎన్నిసార్లు అనుకున్నాడో చివరికి మరచిపోయాడు.

మళ్లీ తెల్లారింది. రాంబాబు 'కాలేజీకి వెడుతున్నాను' అన్నాడు మామూలుగానే కనకయ్య తలూపాడు. రాంబాబు సైకిలు కదలిపోయింది.

విందు సంగతి జ్ఞాపకం వచ్చింది. ఎంతో నొచ్చుకున్నాడు. ఒక్క రోజైనా కొడుక్కి మంచి భోజనం ఉండేది. తన మతిమరుపుకు ఎంతో బాధ పడ్డాడు.

అడుగులో అడుగు వేసుకుంటూ చేతి సంచీ కర్రా పుచ్చుకుని పట్నం బయలుదేరాడు కనకయ్య.

రత్తమ్మ ముక్కుతూ మూలుగుతూ మంచం మీదే ఉండిపోయింది.

పట్నం చేరిన కనకయ్య ఖాళీ జేబుతో పెద్దల దర్శనానికి వెళ్లాడు. పనుల హడావడిలో ఆలస్యంగా కనకయ్యకు దర్శనమిచ్చి నమస్కారాలతో సెలవలు పుచ్చేసుకున్నారు.

నమస్కారాలతో తృప్తిపడిపోయిన కనకయ్య మెల్లిగా రాజశేఖరం ఇంటికి బయలుదేరాడు. కడుపులో ఖాళీ. ఒంట్లో నీరసం నెత్తిన ఎండ చేతిన

ఖాళీ సంచి బరువు కఱ్ఱ.

షామియానాలతో జనాలతో హడావిడిగా ఉంది ముకుందం ఇల్లు. ఆ హడావిడిలో తన ఉనికిని ఎవరూ పట్టించుకోలేదు. అయినా ధైర్యంగా ఒక కుర్చీలో కూర్చున్నాడు.

ముకుందం హడావిడిగా ఉన్నాడు. పలకరింపుగా నవ్వాడు. కనకయ్య పలకరించాడు.

'వీధిలో కూర్చున్నావు లోపలకు రా. తర్వాత బ్యాచ్‌లో భోజనం చేద్దువుగాని' ముకుందం అన్నాడు.

కనకయ్యకు వెయ్యి ఏనుగుల బలం వచ్చింది. తనను సాక్షాత్తు పెళ్ళి పెద్ద గుర్తించాడు. ముకుందం హడావిడిగా వెళ్ళిపోయాడు.

చిన్నపిల్లలు ఆడుకుంటున్నారు. కొంచెం పెద్ద పిల్లలు హడావిడిగా తిరుగుతున్నారు. మరి కొంతమంది అక్కడక్కడ జట్లు జట్లుగా కూర్చున్నారు. 'కొంచెం మంచినీళ్ళు తెచ్చి పెట్టు' ఒక పిల్లవాడ్ని అడిగాడు. ఒకమ్మాయి కనకయ్య మాట విని ఒక గ్లాసుడు మంచినీళ్ళు తెచ్చింది. కనకయ్య మంచినీళ్ళు తాగి గ్లాసు లోపల గదిలో పెడదామని ఇంట్లోకి వెళ్ళాడు.

కనకయ్య కళ్ళు చెదిరిపోయాయి. ఒళ్ళంతా చెమటలు పోసేశాయి. అచేతనుడయిపోయాడు. అనాలోచితంగా ఉండిపోయాడు.

లోపలి గుమ్మం ప్రక్కన పెళ్ళి భోజనాలు చేస్తున్న పెద్దలు విడిచిన చెప్పుల గుట్ట. పరిశీలనగా చూశాడు. కనకయ్య దృష్టి గోడ వార మంచం వెనుక విడిచిన కొత్త చెప్పుల జత వైపు మళ్ళింది. సరిగ్గా రాంబాబుకు సరిపోతాయి.

అరవై ఏళ్ళ తన నిజాయితీ ప్రక్కకు తప్పుకుని కొత్త ఆలోచనలకు దోవ ఇస్తోంది.

ఏదైనా కావలసివస్తే 'బెగ్, బారో ఆర్ స్టీల్' కనకయ్యకు చిన్ననాటి పెద్దల మాటలు గుర్తుకు వస్తున్నాయి.

కనకయ్యకు పరిస్థితులు కలిసివచ్చాయి. ఆ గదిలో ఎవరూ లేరు. ఒక్క ఉదుటున కొత్త చెప్పులు సంచిలో వేసుకున్నాడు. ముకుందం బయటకు వచ్చాడు.

కనకయ్యకు కాళ్ళలో పటుత్వం తప్పింది. కింద పడబోయాడు. ముకుందం ఆప్యాయంగా పట్టుకున్నాడు. దగ్గరుండి వేరుగా విందు భోజనం పెట్టించాడు.

కనకయ్య ఏదో తిన్నాడు. మనసు చేసిన పనిని గుర్తు చేస్తోంది. అంతరాత్మ అసహ్యించుకుంటోంది. వీటన్నింటిని మించిన మనిషిగా కనకయ్య నిగ్రహించుకుని ఇంటిముఖం పట్టాడు.

అతి కష్టం మీద అడుగులేసుకుంటూ అనుక్షణం పశ్చాత్తాపంతో క్రుంగిపోతూ ఇంటిని చేరాడు. ఒంట్లో ఆఖరి కణం కూడా ఖర్చు పెట్టేసింది. ఓపిక లేక అరుగుమీద చతికిలబడ్డాడు. 'కొడుకు కోరిక తీర్చగలిగినందుకు' కనకయ్యకు వెర్రి ఆనందంగా ఉంది.



ధర్మపథం



కాత్యాయనీవ్రతం

మనకు సంవత్సరం పొడుగునా ఎన్నో పండుగలు వస్తాయి. కొన్ని ఒక్క రోజు మాత్రం జరిగేవి, కొన్ని రెండు రోజులూ, కొన్ని మూడు రోజులూ జరుగుతాయి. వసంత నవరాత్రులు, వినాయక పూజలూ, దేవీ పూజలూ తొమ్మిది దినాలు జరుగుతాయి. అలాంటిదే కాత్యాయనీ వ్రతం. అది ధనుర్మాసం ప్రారంభం నుంచీ భోగి పండుగ చివరి వరకూ నెల దినాలు నియమ నిష్ఠలతో జరిపే వ్రతం. ఇది తెలుగువారనుసరించే చాంద్రమానం ప్రకారం మార్గశిర మాసంలో ప్రారంభమై పెద్ద పండుగ దాకా ఆచరించబడుతుంది. శ్రీకృష్ణుడే తమ భర్తగా కోరిన గోపికలు, తమ కోరిక నెరవేర్చవలెనని కాత్యాయనీదేవిని (గౌరీదేవిని) పూజించి ప్రార్థించడం ఇందలి ముఖ్యాంశం. వారు రాత్రి నాలుగో జామున ఇంటివారికి తెలియకుండా, ఒకరినొకరు కలుసుకుని గుంపుగా పోయి, స్నానం చేసి, ఆ దేవిని పూజించి, చీకటి ఉండగానే తిరిగి ఇళ్లకు చేరుకునేవారు. నెల దినాలు ఇలా నియమంగా వ్రతం చేసేసరికి దేవి అనుగ్రహించి వారి కోరిక నెరవేరేట్లు వరం ఇచ్చింది.

గోపికలు మోహావేశంతో శ్రీకృష్ణుని తమ ప్రణయమూర్తిగా భావించినట్లును, భోగేచ్ఛతో అతనిని తమకు నాథునిగా కోరినట్లును సామాన్యులు భ్రాంతి పడుచుందురే కాని, వాస్తవమునకు వారు కోరేది కైవల్యం తప్ప లౌకిక సుఖం కానే కాదు.

వారిది మధుర భక్తి గాని, ప్రేయసీ ప్రియులకు ఉండే ప్రణయ భావం కాదు. అందువల్లనే కాత్యాయనీ వ్రతం పరమ పవిత్రమై ఉన్నది. ఈ విధంగానే పెరియాళ్వారి ముద్దు కూతురు గోదాదేవి శ్రీరంగనాథునిలో ఐక్య భావాన్ని పొందగోరియే ధనుర్మాస వ్రతం ఆచరించి కృతార్థతను పొందింది. ఆమె ద్రవిడ భాషలో రచించిన తిరుప్పావైలో గోపికలకు శ్రీకృష్ణుని యెడ గల మధుర భక్తి వివరించ బడింది. తరువాత తరువాత ఈ వ్రతం సంప్రదాయాన్ననుసరించే వివాహ సమయంలో వధువు చేత గౌరీ పూజ చేయించడం జరుగుతున్నది.

స్త్రీలే కాదు. పురుషులు కూడా తమ్ము నాయికలుగాను, భగవంతుణ్ణి నాయకునిగాను భావించి మధుర భక్తి భావంతో పరవశత్వం పొంది తుదకు కైవల్యాన్ని సాధించడం వైష్ణవ సంప్రదాయంగా ఉన్నది. ఇది భక్తి యొక్క పరమావధిని తెలుపుతూ ఉన్నది.

ఈ వ్రతం నెరవేర్చే ధనుర్మాసం నెల రోజులూ – ముఖ్యంగా విశిష్టాద్వైతులు సంకీర్తనలు చెయ్యడం, సాయంకాలం ఉపన్యాసాలిచ్చి ప్రజలను భక్తి పరవశులుగా చెయ్యడం జరుగుతూ ఉంటుంది. గృహాలంకరణం రంగవల్లులతో ఇంపుగా జరుగుతుంది. సూర్యోదయానికి ముందుగానే స్వామికి వేడి వేడి వివిధాన్నాల నైవేద్యం జరుగుతుంది. భక్తులు తెల్లవారు జాముననే స్నానాలు చేసి విష్ణు దేవాలయాలలో భగవత్సేవ జరుపుతారు.

—బులుసు వేంకటరమణయ్య

అచ్చిరాని పని

మళ్ళీ అరుగుకు రాంబాబు సైకిలు జేరవేసి ఉంది. రాంబాబు ఈ రోజు తొందరగా ఇంటికి వచ్చాడేమిటని విస్తుపోయాడు. ఇంట్లోంచి మాటలు అరుగు మీద కూర్చున్న కనకయ్యకు వినిపిస్తున్నాయి.

రాంబాబును తల్లి ఓదారుస్తోంది.

'బాధపడకమ్మా మనకు ప్రాప్తి లేదని సరిపెట్టుకో' తల్లి మాటలు.

'అది కాదమ్మా. నాన్న పరిస్థితి నాకు తెలుసు. అందుకే నాన్నను కష్టపెట్టకుండా ...' రాంబాబు చెబుతున్నాడు. 'నాన్నగారు నీకు కావలసినవి ఇస్తారు. నువ్వేం బెంగపెట్టుకోకు ...' తల్లి అంటోంది.

'నా బాధ నీకు తెలీదమ్మ. మీకు తెలీకుండా రోజూ ఒక గంట చిన్నపిల్లలకు ప్రయివేటు చెప్పాను.

'బోలెడు డబ్బు సంపాదించుకుందువుగాని' తల్లి పూరడింపు.

ఈ నెల సంపాదన నలభయి రూపాయలతో ఈ రోజే కొన్నాను. మా మాష్టారి అమ్మాయి పెళ్లి అయింది. విందు భోజనానికి రమ్మంటే తప్పనిసరిగా వెళ్లాల్సి వచ్చింది. పెళ్లికొడుకు ఇంట్లో విందు. మాష్టారితో వెళ్లాను.

మాష్టారు వడ్డనలో దిగారు.

నేనుకూడా వడ్డనలో దిగాల్సివచ్చింది.

రాంబాబు ఎంతో విచారంగా జాలిగా చెప్పుకుంటున్నాడు.

వడ్డన పూర్తి అయి భోజనంచేసి చూసుకుంటే ఇంకేముంది నా గుండె ఆగిపోయింది.

మంచం వెనుక దాచాను నా కొత్త చెప్పులు. పిచ్చాడిలా మొత్తం గుట్టంతా వెతికాను. అందరూ చాలా హేళనగా చూశారు. నా బ్రతుకే నాకే అసహ్యం వేసింది.

ఎవడో దొంగిలించాడు దొంగ వెధవ.

నా కష్టార్జితం

వాడికి నా ఉసురు తగులుతుంది.

పిచ్చిగా ఆవేశంగా అరుస్తున్నాడు.

కనకయ్యకు జ్ఞాపకం వచ్చింది.

ముకుందం వియ్యంకుడు పట్నం కాలేజీలో మాష్టారని.

అసమర్థునిగానే

గమ్యం తెలియని

వెర్రివానిలా

కూలబడిన

కనకయ్యకు

కళ్ళు కూడా తిరగడం మొదలయింది. □



"పెళ్ళి మీకు అక్షింతలు నాకు"లో గణేష్, రజని

సినిమా విశేషాలు

-జి.వి.జి.

రాఘవేంద్రరావు, బాలకృష్ణ కాంబినేషన్‌లో రామకృష్ణ సినీ స్టూడియోస్ "పట్టాభిషేకం"

"జూన్ 22 నుంచి ఆగస్టు 10 వరకు మొదటి షెడ్యూల్ పూర్తయింది. సెప్టెంబరులో, అక్టోబరులో, కొంత భాగం విశాఖపట్నంలో జరిగే షెడ్యూల్స్‌తో పూర్తవుతుంది," అన్నారు కె. రాఘవేంద్రరావు. ఈయన దర్శకత్వంలో నందమూరి జయకృష్ణ సమర్పణలో నందమూరి హరికృష్ణ నిర్మించే రామకృష్ణ సినీ స్టూడియోస్ 14వ చిత్రం "పట్టాభిషేకం"లో బాలకృష్ణ, విజయశాంతి, శారద, శ్రీలక్ష్మి, కల్పనారాయ్, రావుగోపాలరావు, నూతన్‌ప్రసాద్, రాజేంద్రప్రసాద్, పి. జె. శర్మ, రాజ్‌వర్మ, మాడా, చిట్టిబాబు, మూర్తి పాల్గొంటున్నారు. పరుచూరి సోదరుల రచన, వేటూరి గీతాలు, చక్రవర్తి సంగీతం, కె. ఎస్. ప్రకాష్ ఛాయ, భాస్కరరాజు శిల్పం, వేమూరి రవీంద్రబాబు కూర్పు, సలీమ్ నృత్యాలు, ఎ. ఎస్. రెడ్డి సహదర్శకత్వం, సత్యం ప్రొడక్షన్ నిర్వహిస్తున్నారు.

కృష్ణ, కోదండరామి రెడ్డి సమ్మేళనంతో విజయలక్ష్మి ఆర్ట్ పిక్చర్స్ చిత్రం

"ఆగస్టు 11 నుంచి షూటింగ్. నవంబర్‌లో ముగుస్తుంది. జనవరి రిలీజ్." అన్నారు. ఎ. కోదండరామిరెడ్డి. ఈయన దర్శకత్వంలో టి. త్రివిక్రమరావు నిర్మించే విజయలక్ష్మి ఆర్ట్ పిక్చర్స్ చిత్రంలో కృష్ణ సరసన శ్రీదేవి నాయిక. పరుచూరి సోదరులు కథ, మాటలు రాశారు. చక్రవర్తి సంగీతం. వి. ఎస్. ఆర్. స్వామి ఛాయ, భాస్కరరాజు శిల్పంతో టి. ప్రద్యుమ్నరావు సహనిర్మాత.

తిరుపతి రెడ్డి "వేట"లో చిరంజీవి, కోదండరామిరెడ్డి

"ఆగస్టులో షూటింగ్. డిసెంబర్ కల్లా పూర్తవుతుంది." అన్నారు డాక్టర్ ఎం. తిరుపతి రెడ్డి. ఈయన నిర్మించే సంయుక్తా మూవీస్ "వేట" చిత్రంలో విజయశాంతి నాయిక. రంగనాథ్, నూతన్ ప్రసాద్ ప్రభృతులు తతిమ్మా భూమికలు నిర్వహిస్తారు. పరుచూరి సోదరుల రచన, చక్రవర్తి సంగీతం, ఎస్. గోపాల రెడ్డి ఛాయ, కె. ధనుంజయ రెడ్డి నిర్వహణలో కె. నరసారెడ్డి సమర్పిస్తారు చిత్రాన్ని. స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: ఎ. కోదండరామిరెడ్డి.



"సింహాసనం"లో కృష్ణ

సినిమా

కె. ఎస్. రెడ్డి దర్శకత్వంలో "మారణహోమం"

సంఘంలోని దుష్ట శక్తుల ఆటకట్టించి సమాజాభ్యున్నతికి నడుం కట్టిన ఓ యువకుని గాధ పూర్తిగా సస్పెన్స్ ఉన్న క్రయిమ్ చిత్రం అభిమన్యు అనే ఒక కొత్త నటుడ్ని పరిచయం చేస్తున్నాం అన్నారు కె ఎస్ రెడ్డి ఈయన స్క్రీన్‌ప్లే దర్శకత్వంలో అట్లూరి రఘునాధరావు నిర్మిస్తున్న దేగా ఆర్ట్స్ వారి పై చిత్రం మొదటి షెడ్యూల్ జూన్ 12 నుంచి 22 వరకు జరిగింది ఆ తర్వాత ఆగస్టు 20 నుంచి సెప్టెంబర్ 5 వరకు జరిగే షెడ్యూల్‌తో షూటింగ్ పూర్తవుతుంది కపిల్‌దేవ్, గొల్లపూడి గిరిబాబు, నూతన్‌ప్రసాద్ అరుణ, అహల్య రావి కొండలరావు హేమసుందర్, సురేంద్ర అభిమన్యు మాస్టర్ సత్యం పాల్గొంటున్నారు విద్య, రత్నం కథ మాటలు సమకూర్చారు చక్రవర్తి సంగీతం, పద్మనాభం ఛాయ ఎం కృష్ణ శిల్పం, బాషా సాహసాలు, కృష్ణమోహన్ సహదర్శకత్వం, నాయని మహేశ్వరరావు కూర్పుతో ఆర్ ఎన్ మూర్తి ఆర్ సూరపరాజు ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్

ఎ. ఎన్ ఆర్, వి. మధుసూదనరావులతో రామానాయుడు చిత్రం

జనవరి నుంచి షూటింగ్ నాగేశ్వరరావు గారి పక్కన సుహాసిని హీరోయిన్ అన్నారు సురేష్ రామానాయుడు ఈ చిత్రానికి వి మధుసూదనరావు దర్శకుడు పరుచూరి సోదరులు రచయితలు

"మాయాజాలం" 3–డి చిత్రం

సెప్టెంబర్ మొదటి వారంలో గాని, రెండవ వారంలో గాని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం, అన్నారు పి స్వర్ణసుందరి ఈమె విజయ ఆదిత్య కంబైన్స్ పతాకంతో 3–డి లో భారీఎత్తున నిర్మించిన పై చిత్రంలో ఎవ్వరూ నడపకుండానే రయ్యమని దూసుకు వెళ్ళె కార్లు సైకిల్స్ లాంటి స్పెషల్ ఎఫెక్ట్స్ ఎన్నో ఉన్నాయని ఛాయాగ్రహణంతో పాటు దర్శకత్వం నెఱపిన సైమన్ తెలిపారు రాజేష్ రజని, నాగేష్, కాంచన, బొంబాయి నర్తకి తీనాదాస్, మాంత్రికుడుగా నంబియార్ మరికొందరు నవ నటీ నటులు నటించారు చిత్రాలయా గోపి రచన వేటూరి గీతాలు ఇళయరాజా సంగీతం వెళ్ళస్వామి కూర్పు, దేవేష్ స్పెషల్ ఎఫెక్ట్స్ తెరవెనుక హంగులు లోకంలో జరుగుతున్న అన్యాయాలను, దోపిడీలను నిర్మూలించడానికి ధర్మప్రభువు యమధర్మరాజు మూలంగా సర్వశక్తిని పొందిన ఓ మానవుడు ఆడించిన వింత గారడి ముఖ్యాంశంగా సంభ్రమాశ్చర్యాలు గొలిపే రీతిలో చిత్రీకరించాం అన్నారు డైరెక్టర్

"గర్జన"లో



జయమాలిని

"శివకన్య"

"భక్తి-అహానికి మధ్య జరిగిన ఘర్షణ. శివుని మానసపుత్రి శివకన్య అహంతో కన్నుగానక ఓ శివభక్తురాలిపై పంతం పట్టి, నానా కడగండ్లకు గురిచేస్తుంది. చివరికి ఆ భక్తురాలినే క్షమాభిక్ష వేడవలసి వస్తుంది. ... దాదాపు వంద సర్పాలు విచిత్రమైన పనులు చేస్తాయి. శివకన్యగా మాధవి, భక్తురాలుగా రూప పాల్గొన్నారు. ఆగస్టులో విడుదల చేయడాకి సన్నాహాలు చేస్తున్నాం," అన్నారు ధనలక్ష్మి చిత్ర పతాకంతో పై చిత్రాన్ని నిర్మించిన పి. ఇందిరారాజా, జయశ్రీ, వసంతకుమార్, రాజా సంభాషణలు రాశారు. కృష్ణ-చక్ర సంగీతం, రాజా ఛాయ, రాజన్ సంకలనం తెర వెనుక హంగులు. పండరీబాయి, రామకృష్ణ, రాజీవ్, హేమసుందర్, సత్రా, రాళ్ళపల్లి,చిట్టిబాబు ఈ చిత్రంలో నటించారు.

విడుదలకు సిద్ధమవుతున్న "కసాయిగుండెలు"

"జూలై 16 నుండి 26 వరకు భాగ్యనగర్ స్టూడియోస్, హైదరాబాద్ పరిసరాలలో ఫైట్స్ రెండు పాటల చిత్రీకరణ ముగించాం. మిగతా మూడు పాటలను ఊటీలో పిక్చరైజ్ చేయడంతో మొత్తం షూటింగ్ పూర్తయిపోతుంది. ఇది సెంటిమెంట్‌తో కూడిన యాక్షన్ చిత్రం," అన్నారు కొండవీటి సత్యం. ఈయన గతంలో డైరెక్టర్లు పి. సాంబశివరావు,. సి. ఎస్. రావ్, రేలంగి నరసింహారావుల వద్ద శిష్యరికం చేశారు.ఈయన కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంతో పి. క్రాంతికుమారి, వనపర్తి నరేంద్రబాబు నిర్మించే శ్రీ నరేంద్ర మూవీస్ "కసాయి గుండెలు"లో నవనటుడు క్రాంతిమోహన్, పూర్ణిమ, దేవిశ్రీ, బాలాజీ, పి. జె. శర్మ, సత్రా వెంకటేశ్వరరావు, పండరీబాయి, వెంకట్, సుదర్శన్, అనూరాధ పాత్రధారులు. మధు మాటలు, గోపి పాటలు, సత్యం సంగీతం, రంగసాయిరెడ్డి సహకార దర్శకత్వం, వి. లక్ష్మణ్ ఛాయ, సురేష్ నృత్యాలు, వేమూరి రవి కూర్పు నిర్వహిస్తున్నారు.


ఇమంది రామారావు రచన, దర్శకత్వంలో "సన్నజాజులు"

మురళీమోహన్ హీరోగా సుగుణా పిక్చర్స్ నిర్మించే "సన్నజాజులు" చిత్రానికి ఇటీవల కొన్ని పాటలు రికార్డయ్యాయి. "సెప్టెంబర్ మొదటివారం నుంచి షూటింగ్ రాజమండ్రి, విశాఖపట్నం పరిసరాలలో రెండు షెడ్యూల్స్‌లో పూర్తవుతుంది," అన్నారు ఇమంది రామారావు. ఈయన కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంతో సత్తి భాస్కరరెడ్డి నిర్మించే ఈ చిత్రంలో రాజేంద్రప్రసాద్, రాజేష్, సుధాకర్, నూతన్‌ప్రసాద్, వేలు, చిట్టిబాబు, రాజ్‌కమల్, శశిమోహన్, విజయకుమార్, కాకరాల, నానిబాబు, శ్రావణకుమార్, జయచిత్ర, సుమిత్ర, వై. విజయ, సరోజ, మమత, కృష్ణప్రియ వగైరా నటవర్గం. ఇమంది సంభాషణలు, సత్యం సంగీతం, వై. ఎస్. శర్మ ఛాయ, ఉత్తమ్ సహ దర్శకత్వం, కోటగిరి వెంకటేశ్వరరావు కూర్పుతో ఆర్. వి. రమణ, జి. వి. రమణయ్య చౌదరి సహ నిర్మాతలు.

జయభేరీ ఆర్ట్స్ ప్రొడక్షన్స్ కొత్త చిత్రం షూటింగ్

"ఆగస్టు 1 నుంచి 15 వరకు తొలి షెడ్యూల్ జరిగింది. జయసుధది, నాది డైనమిక్ కారెక్టర్స్," అన్నారు మురళీమోహన్. ఈయన ప్రధాన పాత్ర నిర్వహిస్తూ, సమర్పించే జయభేరి ఆర్ట్స్ ప్రొడక్షన్స్ చిత్రంలో ప్రభాకరరెడ్డి, ప్రసాద్‌బాబు, ఈశ్వరరావు, వేలు, అన్నపూర్ణ, పుష్పలత, కె. విజయ, కృష్ణవేణి

(45 వపేజీ చూడండి)





ఆదర్శాలు అమూల్యమైనవి. అనుభూతులు వాస్తవమైనవి.

వీటి మధ్య సహజంగా సంఘర్షణను తట్టుకుని, ఆదర్శాల వుండగలిగే వారు అరుదుగా కనిపిస్తా

కొందరు ఆదర్శాలు వల్లిస్తూ ఆచరణలో మాత్రం వాటికి విరుద్ధంగా వ్యవహరిస్తారు. మరికొందరు ఆదర్శాలు వున్నట్లు నటిస్తూ, సమయానుకూలంగా ప్లేటు ఫిరాయిస్తుంటారు.

ఇలా ఆదర్శాల పేరు చాటున రకరకాల వ్యక్తులు రకరకాలుగా జీవితాలు గడుపుతుంటారు.

కాని సుబ్బారావుగారి వ్యక్తిత్వం ప్రత్యేకమైనది. తాను నమ్మిన ఆదర్శాలే వారికి పంచప్రాణాలు. ఆయన, తన ఆదర్శాలకు వ్యతిరేకంగా, జీవితంలో ఏ ఒక్క సందర్భంలోను వ్యవహరించలేదు. అయితే, ఇప్పటి, ఆయన కుటుంబ పరిస్థితిని చూస్తున్న కొందరు, సుబ్బారావుగారు వట్టి అసమర్థుడని, చాటుమాటుగా వ్యాఖ్యానిస్తారు. ఇలా వ్యాఖ్యానించే వారికి, ఆయనలోని అసమర్థతలు బహుశా ఇవి కావచ్చు.

సునాయాసంగా అబద్ధాలు చెప్పలేకపోవడం. లౌక్యం తెలియక పోవడం.

అంతర్నాలు

...బాబు

దేహి అని చేయి చాపిన వారికి లేదనకుండా, కలిగి వున్నంతలో దానం చేయడం సహాయం అర్థించిన వారికి శాయశక్తులా తోడ్పడటం, సంఘ సంక్షేమం కోసం తనకున్న కొద్దిపాటి ఆస్తిని ఖర్చు చేయడం, స్వార్థప్రయోజనాల కోసం గొప్పవాళ్ళుగా చెలామణి అవుతున్న 'పెద్దమనుషుల' ప్రాపకం కోసం తాపత్రయపడక పోవడం, తన జీవితం ఆర్థికంగా దిగజారిపోయినప్పటికీ సిద్ధపడి ఆదర్శాలకు తిలోదకాలివ్వలేకపోవడం, (బ్రాహ్మణ వంశానికి చెందిన వారైనప్పటికీ అగ్రవర్ణమనే అతిశయంగాని, స్వాభిమానంగాని కించిత్తు కూడా లేకుండా) మానవతా దృష్టితో అందరికీ సేవ చేయడం, తుదకు ఒక అనామకునిగా శేషజీవితాన్ని గడపడం... ఇవేనా?

* * * * *

'ఏమేవ్! తలుపు తీయ్...' తలుపుల మీద ధమధమ శబ్దం వినబడుతోంది.

'ఏమేవ్!' .. మళ్ళీ పిలుపు... సుబ్బారావుగారు బజారు పని చూచుకుని ఇంటికి తిరిగి వచ్చారు.

'ఆ(..ఆ(... వస్తున్నానండీ'..., అంటూ ఆయన భార్య సుబ్బమ్మగారు చరచర వచ్చి తలుపు తెరచింది.

'హుష్ ష్ ష్ .. ఎంత మండిపోతోంది. ముందో గ్లాసుడు

అనుభవాలు,

సంభవించే
కట్టుబడి



ఒకటి చాలు

ఒక్క కన్ను చాలు ఊరునంతయు జూడ
ఒక్క అన్ను చాలు ఊరు చెడప
ఒక్క చేయి చాలు పెక్కుదానము లీయ
ఒక్క వాయి చాలు ఉసురు తీయ

దీపమొకటి చాలు తేజమ్మునందింప
కోప మొకటి చాలు కూల ద్రోయ
నీతి ఒకటి చాలు జాతిమూర్తిని తీర్ప
భీతి ఒకటి చాలు బీరువార్ప

మాట ఒకటి చాలు మమతల నల్లింప
బీట ఒకటి చాలు కోట గూల్ప
పద్య మొకటి చాలు ప్రాజ్ఞగా నరుజేయ
మద్యమొకటి చాలు మందు జేయ

వేద మొకటి చాలు విజ్ఞానమును పేర్ప
జూద మొకటి చాలు సూడు గూర్ప
రాగ మొకటి చాలు రసధాత్రికిని పోవ
రోగ మొకటి చాలు రోటు వోవ

ఒక్క కలము చాలు ఉద్గ్రంధమును వ్రాయ
ఒక్క బిలము చాలు ఓటు సెయ
ఒక్క మేధ చాలు ఉత్సాహములు పొంగ
ఒక్క బాధ చాలు ఒరపు క్రుంగ

—కనమలూరు వెంకటశివయ్య

అంతరాలు– అంతర్యాలు

మంచితీర్థమివ్వు...' అంటూ, సుబ్బారావుగారు పై ఖండువా తీసి, చిలుక కొయ్యకు తగిలించి, లాల్చీ విప్పకుండానే పడక కుర్చీలో మేను వాల్చారు.

సుబ్బమ్మగారు లోపలికి వెళ్ళి మంచినీళ్ళ గ్లాసుతో తిరిగివచ్చింది.

'ఏమిటండీ, ఆ ముచ్చెమటలు. ముందు ఆ చొక్కా విప్పకపోయారా .... వుండండి విసన కర్ర తెస్తాను...' అంటూ గదిలోకి వెళ్ళి విసనకర్ర తెచ్చి విసురుతూ ...'మీరు మరీను. ఇంత ఎండ వేళ సిటీ బస్సయినా ఎక్కి రాకపోయారా.. చూడండి స్నానం చేసినట్లు ఎల్లా తడిచిపోయారో..!'

'అదిగో, నువు చెప్పేది నా సిద్ధాంతానికి విరుద్ధం. పిండి కొద్దీ రొట్టె అన్నారు పెద్దలు. అల్లాగే, మనం కూడా మన స్థితిగతులను బట్టి కాలం గడపాలి... తెలిసిందా!'

'ఆఁ ..మీది మరీ చాదస్తం. లేవండి స్నానం చేసి భోంచేద్దురుగాని.'

'అగవే ...నా భోజనానికేం తొందర. ఇటు విను మరి... పెద్దమ్మాయి దగ్గర నుంచి ఉత్తరం వచ్చిందా ? నేను మొన్న రాసిన కార్డుకి ఈ వేళ సమాధానం రావాలనుకుంటున్నాను...'

సుబ్బారావుగారిలా మాట్లాడుతున్నంతలో 'పోస్ట్' అన్న కేక వినిపించింది. సైకిల్ బెల్ మ్రోగింది. సుబ్బమ్మగారు ఆత్రంగా వెళ్ళి పోస్టుమన్ ఇచ్చిన కవరు తీసుకుని లోపలికి వచ్చింది.

'ఏదీ .. ఇటివ్వు' ..అంటూ భార్య చేతిలోని కవరు అందుకుని, చించి, చదవడం ప్రారంభించారు.

'మహారాజశ్రీ నాన్నగారికి, అనేక వందనములు చేసి శాంత వ్రాయునది.

ఇక్కడ అంతా క్షేమం. అక్కడి మీ క్షేమ సమాచారములు తెలుపగోరుతాను. నన్ను, పిల్లల్ని తీసుకు రావడానికి, మీ అల్లుడుగారికి సెలవు దొరకలేదు. అందుచేత మీరే వచ్చి తీసుకు వెళ్ళవలెను. పెద్దవాడు రఘుకి శగ్గడ్డలు లేచినవి. ఇంకా తగ్గలేదు. చిన్నదానికి అమ్మవారు చూపింది. కాని భగవంతుని దయవల్ల త్వరలోనే తగ్గిపోయింది. మొన్ననే స్నానం చేయించాము. నాకు, మీ అల్లుడిగారికి బొత్తిగా బట్టలు లేవు. నా విషయం అటు వుండనిచ్చినా, మీ అల్లుడుగారు ఆఫీసుకు వెళ్ళవలసిన వారు కదా. అందువల్ల మీరు వచ్చేటప్పుడు ఎంతో కొంత సైకం తీసుకు రావలసిందిగా కోరుతున్నాను. మా రెండవ మరది వేణు, మా దగ్గరే వుంటూ చదువుకుంటున్నాడు. అందువల్ల కూడా మా యింటి ఖర్చులు పెరిగాయి. అమ్మకు వందనాలు, చెల్లాయికి దీవెనలు చెప్పండి అన్నయ్యలకు ఎన్ని ఉత్తరాలు రాసినా జవాబులు రాలేదు.

ఇంతే సంగతులు
చిత్తగించవలెను
శాంత.

'ఓసి పిచ్చితల్లీ... వాళ్ళు అన్నయ్యలటే. మనపాలిట యమదూతలు కారూ...' అని తక్కున వ్యాఖ్యానించింది సుబ్బమ్మగారు.

'హుష్ ష్ ష్ . అల్లా అనకు. నాకు మహచెడ్డ కోపం వస్తుంది. వాళ్ళేమీ అప్రయోజకులు కాదు. మనంతటి వాళ్ళయ్యారు. మంచి– చెడు విచక్షణ లేదంటావ్... అందుకు మనమా బాధ్యులం..' అంటూ ఇంకా ఏమో చెప్పబోతున్న భర్త మాటకు అడ్డువచ్చి, 'అవును మనమే బాధ్యులం. ముమ్మాటికీను. వాళ్ళు ప్రయోజకులని మీరంటున్నారు. కాని లోకం నమ్మద్దూ.. తల్లి, తండ్రి, తోబుట్టువుల ముక్కు, మొగం చూడని వాళ్ళను ప్రయోజకులంటామా!? ఇక కోడళ్ళ సంగతి తెలియందేముంది. ఆస్తులు కూడబెట్టి ఇవ్వలేదని గుణుపు. ఓ ప్రక్క శాపనార్థాలు, మరో ప్రక్కన దిగుళ్ళు.. ఇవేగా చివరికి మనకు మిగిలింది' అంది సుబ్బమ్మగారు గుక్క తిప్పుకోకుండా.

'అబ్బబ్బ ... నువు నోరు కాస్త మూయవే. ఎంత కాలం చెప్పుకున్నా ఇదేగా వరుస...'

'అవున్లెండి, మీకలానే అనిపిస్తుంది. తల్లి కడుపు కోత మీకేం మర్మమవుతుంది. దాన్ని తీసుకొచ్చి పురుడు పోసి పంపాలంటే దిక్కు తోచక తబ్బిబ్బవుతున్నాము. కుమార్తు బాధ్యత గల వాళ్ళయితే ఈ కుటుంబం పరిస్థితి ఇల్లా వుండేదా. చెప్పండి మీరే...' మళ్ళీ రెట్టించింది.

'నా ఖర్మ .. ఏం చేయమంటావు...' చిరుకోపంతో గట్టిగానే అన్నారు సుబ్బారావుగారు.

భార్య వెంటనే స్వరం తగ్గించి ... 'పోనీలెండి. మళ్ళా మీ మనసు బాధపెట్టడం దేనికి... కానున్నది కాక మానదు గదా. లేవండిక స్నానానికి ...' అంటూ భార్య లోపలికి దారితీసింది.

ఇంతలో సరోజ వచ్చింది. వచ్చీ రావడంతోటే, చరచర లోపలికి వెళ్ళి ...

'అమ్మా, అమ్మా, మా క్లాస్‌మేట్సంతా కలసి పిక్నిక్‌కి వెడుతున్నారే. నేనూ వెడతాను, పంపవూ. నాన్నకు చెప్పవే. నువు చెబితే తప్పకుండా వింటారు ...'

గుక్క తిప్పుకోకుండా చిన్న కూతురు చెప్పిన మాటలు విన్న సుబ్బమ్మగారికి, ఏం సమాధానం చెప్పాలో తోచలేదు. నలుగురితో పాటు సరదాగా వెళ్ళాలని కూతురు ముచ్చటపడుతోంది. నిజమే. కాని ఇంటి పరిస్థితి సరిగాలేదు. భర్తకు ఇలాంటి విషయాలు చెబితే కస్సుమంటారు... ఎలా చెప్పా ...' అని కొద్దిసేపు తర్జనభర్జన పడిన తల్లి, కూతురు వైపు తిరిగి –

'సరోజా! ఇప్పుడా పిక్నిక్‌కి వేళ్ళకపోతే నష్టమేమిటే ...' అని సూటిగా ప్రశ్నించింది. ఈ ప్రశ్నకు సరోజ మొదట బిత్తరపోయింది. కొన్ని క్షణాలాగి ఇలా

అంది ...

'అమ్మా! సినిమా చూడకపోతే నష్టమేమిటి? ... ఇదీ అంతే.'

'సినిమాకెడితే ఏపాటవుతుందే వెర్రిదానా. మరి పిక్నిక్ అంటున్నావు కదా. ఖర్చు ఎక్కువ కావద్దూ. మన పరిస్థితిని కూడా ఆలోచించుకోవాలి కదమ్మా!'

'సరేలేవే ... అడగడం నాది బుద్ధి తక్కువ. ఏది అడిగినా, మాటి మాటికి ఇంటి పరిస్థితి చూడు ... అంటున్నారు. మొన్నటి దీపావళికి కొత్త బట్టలు కొంటానన్నారు. అవీ లేవుగా ... ' బుంగమూతి పెట్టి అంది సరోజ.

సరోజకు నిండా పద్ధెనిమిదేళ్ళు లేవు. కూతురు సరదాలు తల్లికి తెలియవా. కాని ఏం చేయగలదు. కుటుంబం స్థితి ఇప్పుడు మరింతగా దిగజారిపోయింది. పెద్దకొడుకు జనార్ధనరావు డాక్టరీ వృత్తిలో వున్నాడు. చిన్న కొడుకు ప్రకాశరావు ఇంజనీరు. కాని ఏం లాభం. ఏ కొడుకూ తల్లిదండ్రులకు చిల్లి గవ్వయినా పంపడు.

సుబ్బారావుగారు స్నానం ముగించి వచ్చి భోజనానికి కూర్చున్నారు. సరోజ ముందు గదిలోకి వెళ్ళిపోయింది.

'ఏమండి! చిట్టిది పిక్నిక్‌కి వెడుతుందట. డబ్బు కావాలిట ...' సుబ్బమ్మగారు మెల్లగా అడిగింది. సుబ్బారావుగారు తలయెత్తి "పిక్నిక్కా ... అదెక్కడ. అయినా అన్నీ తెలిసి కూడా అడుగుతున్నావన్న మాట ... బాగు బాగు ...'

'ఇందులో తెలీడానికేముందని. చిట్టిదాని ఆపేక్ష...'

'ఆపేక్షాలేదు, ఉపేక్షాలేదు. ఊరుకో. నన్ను విసిగించకు. రేపు అమ్మాయిని తీసుకురావడానికి ఊరు వెళ్లాలా. పైపెచ్చు ఖర్చం ఏమైనా తీసుకురమ్మని వ్రాసింది. ఇవన్నీ తెలిసేనా పిక్నిక్‌లు, గిక్నిక్‌లు అంటున్నావు ...' కాస్త మందలింపు ధోరణిలో అన్నారు సుబ్బారావుగారు.

"పోనీలెండి మీ యిష్టం. ఆ మూడు ముళ్ళు పడితే పిల్ల పరాయిదైపోతుందాయె. వున్న నాలుగు రోజులైనా, అచ్చట ముచ్చట తీర్చుకుందామని తల్లికుంటుంది."

'అదిగో ఆ వాగుడే మానమన్నాను. అసలు మీ స్త్రీజాతికున్న జాఢ్యమే ఇది. కుటుంబ భారమంతా మీ నెత్తినే పడినట్టు మగాడు వెధవాయ్ అయినట్టు ఆలోచిస్తుంటారు. అమ్మాయి సరదాగా వుండాలని నాకు మాత్రం వుండదూ. మన పరిస్థితిని బట్టి ప్రతి విషయాన్ని ఆలోచించుకోవాలి. రేపు ఊరు బయలుదేరాలంటే కనీసం అయిదు వందలైనా చేత పట్టుకోవాలి.'

'అంత డబ్బు దేనికండీ ... ముందు అమ్మాయిని, పిల్లల్ని తీసుకురండి. ఆ తర్వాత చూద్దాము.'

'అయితే, అల్లుడి సంగతి మరచిపోయావన్న మాట. ఇట్టాగే వుంటుంది ఆడాళ్ళ బుద్ధి. శాంత రాసిన ఉత్తరం జ్ఞాపకం లేదూ!?'

'ఎందుకు లేదూ. అవేవో ఆయనే సర్దుకుంటారు లెండి. దానికే ... అల్లానే రాస్తుంది.

'నాకు తెలుసే. నీవిలానే మాట్లాడుతావని. అల్లుడు అగౌరవంగా చూడబడుతోంటే, మనమ్మాయికి మాత్రం గౌరవం ఎలా దక్కుతుంది. ఆ మాత్రం ఆలోచనలేదూ!?' ... ఆరు నూరుగాని, నూరు ఆరుగాని చేయి చాపినవాళ్ళకు ఈ సుబ్బారావు కాదనలేడు....' చివరి మాటలు కించిత్తు ఆవేశంతోనే అన్నారు.

'సరే మీ యిష్టం. కాని ఇంత డబ్బు ఎక్కడనించి తేవాలని మీ ఉద్దేశం ...?' భార్య సూటిగా ప్రశ్నించింది.

'ఇల్లు తనఖా పెట్టిన చోటే. ఇంకెవరిస్తారు మరి ...' వెంటనే సమాధానం చెప్పారు సుబ్బారావుగారు.

ఆయన భోజనం ముగిసింది. ముందు గదిలోకి దారితీశారు. వెంట భార్యకూడా నడిచింది. సరోజ స్నేహితురాలింటికి వెళ్ళింది కాబోలు ముందు గదిలో లేదు.

శాంత పెళ్ళికని, సుబ్బారావుగారు ఇల్లు తనఖా పెట్టి డబ్బు తెచ్చారు. అయితే అది ఒక షరతు మీద జరిగింది. తెచ్చిన అప్పును ఇద్దరు కొడుకులు కలసి తీర్చాలని. పెళ్ళి సమయంలో ఇందుకు కొడుకులు ధీమాగా అంగీకరించారు. వివాహమైన తర్వాత వంతులువడి, కొడుకులిద్దరు తండ్రికి నామం పెట్టారు. అప్పు అప్పుగానే మిగిలిపోయింది. ఇల్లు తనఖాలో వుండిపోయింది.

"ఇంతకూ ఏపాటి అప్పుతేవాలని మీ ఉద్దేశం?" అడిగింది సాలోచనగా సుబ్బమ్మగారు.

"చెప్పానుగా! కనీసం అయిదువందలైనా తేవాలని...."


సుబ్బమ్మగారు నిట్టూర్పు.... "భగవంతుడా కష్టాలన్నీ పేదవాళ్ళకే అప్పగిస్తావా....!"


"మనం చేసుకున్నదానికి భగవంతుడేం చేస్తాడే వెర్రిదానా. న్యాయం, ధర్మం నశించాయి. నీవు, నేను అడ్డుపడితే ఆగుతుందా. ఏ రోజుకు ఏ మార్పు వస్తుందో ఎవరి కెరుక..." ఈ మాటలని సుబ్బారావుగారు కూడా నిట్టూర్పు విడిచారు.

భార్య మాత్రం విడిచిపెట్టలేదు–

"ఆ వెంకయ్యగారు చూడండి ఎంత తెలివైన పని చేశారో. వారు పూరింటిలో వుంటూ సొంత ఇంటిని నాలుగు పోర్షన్లుగా కట్టించి అద్దెల కిచ్చుకున్నారు. ఆ పని మనం చేసినా బాగుండేది. ఈ బాధలు కొంతయినా తగ్గేవి."

"ఒక్క వెంకయ్యగారనేవిటి, డబ్బున్న ప్రతివాడు అలానే చేస్తున్నాడు. అద్దెలు కట్టలేక జీతం రాళ్ళమీద ఆధారపడే ఉద్యోగస్థుల పాట్లు వర్ణనాతీతమనుకో. మనం కూడా వాటాల ఇల్లు కట్టి నాబోటి గుమస్తాగాళ్లను దోచుకోమని చెప్పడమేనా నీ తాత్పర్యం." సుబ్బారావుగారు ఈసడింపు ధోరణిలో







అంతరాలు – అంతర్యాలు

అన్నారు.

"మరెవరో డబ్బు సంపాదిస్తున్నారన్న బాధ దేనికండి. మనకి చేతకాదని చెప్పండి ఒప్పుకుంటాను. చేతిలో పైసా లేకపోతే ఇచ్చే వారెవరైనా వున్నారా అని.... ఆఁ..." సుబ్బమ్మగారు సూది గుచ్చినట్లుంది.

"ఒకరిస్తారన్న ఆశతోనే మనం బ్రతుకుతున్నామేమే పిచ్చిదానా. ఉచితార్థంగా ఎవరూ ఇవ్వరు. నేను బ్రతికి వున్నంత వరకు నా కష్టార్జితమే శరణ్యం. తెలిసిందా..." సుబ్బారావుగారు ఖండితంగా చెప్పారు.

ఇంతలో వాకిలి తలుపు త్రోసుకుని గలగల మంటూ ఆరుగురు కుర్రాళ్లు ప్రవేశించారు. వారిలో ఓ కుర్రాడు గది మూలనున్న ఈత చాపను తెచ్చి పరిచాడు. పిల్లలు కూర్చున్నారు.

సుబ్బారావుగారికి ఆ పిల్లలను చూడగానే మూడ్ మారిపోయింది. చిరునవ్వుతో భార్య వైపు తిరిగి అన్నారిలా–

"ఏమేవ్, చూడు. వీళ్లతో గంటల తరబడి కాలక్షేపం చేయడమంటే నాకెంతో సరదా. మాయ మర్మం తెలియని వాళ్లెవరంటే పిల్లలే. అదే నాక్కావలసింది...." ఈ మాటలు ఇంకా పూర్తి కాకుండానే ఓ కుర్రాడు లేచి....

"మాష్టారూ! మరే శేషుగాడు ప్రొద్దుట, స్కూలు పెరటి గోడ వెనక నక్కి బీడీ కాల్చాడండి. నేను నిజ్జంగా చూశాను."

"ఏరా శేషు నిజమేనా?" మేస్టారి ప్రశ్న.

"నిజమేనండీ, ఎలాగుంటుందోనని కాల్చానండి. ఇంకెప్పుడూ ఈ పని చేయనండి..." భయంగా జవాబు చెప్పాడు శేషు.

"తప్పు కదురా వెధవా. లెంప లేసుకో! శేషు లెంప లేసుకున్నాడు.

"ఇటుచూడు. మీ నాన్న నీ కోసమని 10 రూపాయలిచ్చి ప్రైవేట్ చెప్పిస్తున్నాడు. ఎందుకో తెలుసా. కేవలం చదువు చెప్పమని మాత్రమే కాదు. నీకు మంచి బుద్ధులు అలవడేట్లు చేయమని. అరే అబ్బాయిలూ శేషుకే కాదురా ఈ మాటలు చెబుతూంట. మీరు కూడా వినాలి... నాకు డబ్బుకాదు ముఖ్యం. మీరంతా ప్రయోజకులు కావటం. అర్థమైందా?" సుబ్బారావుగారు చిన్న ఉపన్యాసమే చెప్పారు.

"అయిందండీ..." అని పిల్లలంతా తలలు వూపుతూ ఒకేసారి అన్నారు.

"ఒరే పిల్లలూ నాకు ఈ వేళ, రేపు జరూరైన పనులున్నాయి. అందువల్ల మీరు ఎల్లుండి రండి. నేను గుర్తు పెట్టి ఇచ్చిన పాఠాలు, ఈలోగా శ్రద్ధగా చదవండి. సరేనా..."

"అలాగేనండి..." అంటూ పిల్లలు లేచారు. రెండు రోజులు సెలవు దొరికినందుకు సంబరపడ్డారు. పుస్తకాలు చేతపట్టి పంతులుగారికి నమస్కరించి బైటకు ఉడాయించారు.

"సరే నేకూడా వెళ్దొస్తా..." అంటూ లేవబోయిన సుబ్బారావుగారికి. వాకిట్లో ఏవో గావు కేకలు వినిపించాయి. చివాల్న లేచి వాకిలి తలుపు తెరచి బయటకు వెళ్లారు. భార్య కూడా గుమ్మం దగ్గరకు వచ్చింది.

రోడ్డు మధ్య ఓ బికారివ్యక్తి పడిపోయి మెలికలు తిరిగిపోతూ, నోటి వెంట నురుగులు క్రక్కుతూ రోదనతో కూడిన వెర్రికేకలు వేస్తున్నాడు. త్రోవన వెడుతున్న కార్లేవీ ఆగలేదు. ఇద్దరు ముగ్గురు చిన్న కుర్రాళ్ళు మాత్రం ఆగి ఆ దృశ్యాన్ని వింత వింతగా చూస్తున్నారు. రోడ్డు మీద పడినవాడు బిచ్చగాడు– మూర్ఛవాడు.


ఈ దృశ్యాన్ని చూచిన సుబ్బారావుగారి వదనం వివర్ణమైంది. హృదయం తరుక్కుపోయింది. వెంటనే, ప్రక్కనే నిలబడవున్న భార్యతో "బిందెడు నీళ్ళు త్వరగా తీసుకురా.... ఊఁ... త్వరగా.... పాపం ఆ మూర్ఛవాడికి ఒంటినిండా దెబ్బలే..." అంటూ అరచినట్లే చెప్పారు.


భార్య లోపలికి వెళ్లి నీళ్ల బిందె తెచ్చి అందించింది. సుబ్బారావుగారు మూర్ఛవాడిని సమీపించి నెత్తిమీద నీళ్ళు ధారగా పోశారు. మరో బిందె తెచ్చింది. మళ్లీ అలాగే పోశారు. నీళ్ళు చాల లేదు. ప్రక్కనే వున్న కుర్రాళ్లను ఇంటిలోకి పంపి నూతి నీళ్ళు తోడించి తెప్పించారు. తాళం చెవి తెప్పించి ఆ మూర్ఛవాని చేతిలో పెట్టి చేయి బిగించారు. ఓ పావు గంట తర్వాత వాడికి చేతులు, కాళ్ళు కొట్టుకోవడం ఆగింది. బిక్క మొగంతో లేవబోయాడు. దిక్కు తోచని అతని చూపుల్లో దైన్యం తొంగి చూచింది. అతడిని, సుబ్బారావుగారు తమ ఇంటి ముంగిటకు తీసుకు వెళ్లి మెల్లగా కూర్చో బెట్టారు. తాను కూడా అతని ప్రక్కనే కూర్చుని ఉపశమన వాక్యాలు చెప్పారు. సుబ్బమ్మగారు ఓ అరటాకులో అన్నం, కూర పెట్టి తెచ్చింది. మూర్ఛవాడు భోజనం చేసి ఆ పుణ్యదంపతులిద్దరికి, రెండు చేతులూ జోడించి నమస్కరించాడు.

సుబ్బారావుగారు అశ్రుపూరిత నయనాలతో ఇలా అన్నారు:

"బాబు– నమస్కరించ వలసింది నాకు కాదు. ఆ భగవంతుడికి. బాధలంటే ఏమిటో, బాధలు పడేవారికి, ఆ సర్వాంతర్యామికి మాత్రమే తెలుస్తాయి

అసలైన తెలుపు ఏమిటో...ప్రపంచానికి చూపండి





ఉత్తమం... ఉత్తమం... తెలుపులో సర్వోత్తమం!

డెట్ మీకు అందిస్తుంది ఎంతో ఎక్కువ. దీని క్రొత్త రేపర్ ఎంతో అందమైనది. ఆకర్షణీయమైనది. తీసి చూడండి, లోపల మరో ఆశ్చర్యం — ఉల్లాసకరమైన మనమోహక పరిమళం. అంతేకాదు, డెట్‌లో నిండి వున్నది ఎంతో ఎక్కువ తెలుపు శక్తి. మరి రండి, డెట్ ప్రపంచంలో అడుగిడండి. స్వయంగా చూడండి, అందరికీ చూపండి. డెట్ తెలుపు...అసలైన తెలుపు!'

అంతరాలు- అంతర్యాలు

నాయనా... దిగులువడకు.. నీకూ మంచి రోజులు రాకపోవు" అంటూ భుజం మీద చేయి వేసి ధైర్యం చెప్పారు.

ఇంతలో వీపు మీద మూటతో చాకలి సీతమ్మ వచ్చింది. మూట దింపుతూ, బురద మరకలతో, తడిచి పోయివున్న సుబ్బారావుగారి బట్టలు చూస్తూ...

"ఇదేటండమ్మగారూ! అయ్యగారి బట్టలు బురదయి పోనాయి. అంటు సొంటు లేకుండా ఆ బికారోడ్ని ముట్టుకున్నారా ఏంటి....?" అని అడిగింది. సుబ్బమ్మగారు పెదవి విప్ప లేదు. భర్త ఇలాంటి సేవలు చేయడం ఆమెకు కొత్తేమి కాదు. భర్తను అనుసరించడమే తన విధి అని నమ్మిన పుణ్యవతి ఆమె.

సీతమ్మ అన్నమాటలకు సుబ్బారావు గారికి కోపం రాలేదు. కాని బాధ పడ్డారు. సీతమ్మ వైపు చూస్తూ, కొద్ది క్షణాలు ఆగి మెల్లగా అన్నారు... "మానవ సేవే మాధవ సేవ" అన్నమాటలు నీవెప్పుడూ వినలేదా సీతమ్మా!

"ఇన్నానయగారూ..."


"ఇప్పుడు నేను చేసిన పని కూడా అదే తల్లీ. అంటు సొంటు అన్నావు గదా సీతమ్మా. పెద్దల మాటలు చద్ది మూటలు. వాటిని విషతుల్యం చేయకూడదు. శుచి, శుభ్రత కోసం చెప్పిన మాటలకు విపరీతార్థాలు తీసి, మనలో మనమే అంతరాలు సృష్టించుకోడం అపచారం తల్లీ... అంటరానితనాన్ని భగవంతుడు మెచ్చుడు..."

సుబ్బమ్మగారు జోక్యం చేసుకుని, – "మీరు బజారు వెడతానన్నారు గుర్తుందా..." అంది.

"ఉండవే, నీ తొందర... మాటొచ్చినప్పుడే మంచి, చెడు విడమరచి చెప్పాలి. స్వాతంత్ర్యోద్యమంలో మేము పొందిన శిక్షణ ఇదే. ఆ రోజుల్లో మాయ, మర్మం లేకుండా అందరం కలసి పని చేసే వాళ్లం. ఉన్నవ వారు, వెంకటప్పయ్య పంతులుగారు మాకు మంచి శిక్షణ ఇచ్చేవారు. హరిజన పిల్లల్ని తీసుకొచ్చి తల స్నానాలు చేయించి, శుచి, శుభ్రత నేర్పి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసే వాళ్లం. ఆ పిల్లలకు క్షవరాలు కూడా చేసే వాళ్లం. తెలిసిందా...." అంటూ సుబ్బారావుగారు గతాన్ని ఓ సారి గుర్తు చేశారు.

సుబ్బారావు గారు ప్రయాణానికి సన్నాహమయ్యారు– భార్య గమనించి,... "ఇంత ఎండలో దేనికండీ... రేపు వెళ్లొచ్చుగా..." అంది.

"పోనిద్దూ, ఈ ఎండ నన్నేం చేస్తుంది" అంటూ పెరటిలోకి వెళ్లి తలస్నానం చేసి, బట్టలు మార్చుకుని బయలు దేరారు.



* * * * *

"పరంధామయ్య గారూ!"

"ఎవరది?"

"నేనేనండీ, సుబ్బారావుని."

"అరెరె, సుబ్బారావుగారా." అంటూ చావడి తలుపు తెరచి కళ్ల జోడు సర్దుకుంటూ... "రండి, రండి, దయ చేయండి... ఇంత ఎండలో..." అని, మాట సగంలోనే ముగించాడు పరంధామయ్య. ఇద్దరూ కుర్చీల్లో ఆసీనులయ్యారు.

"కొద్దిగా మంచి తీర్థం...?" పరంధామయ్య అడిగాడు.

"వద్దండీ, ఇప్పుడే భోజనమైంది."

"అలాగా.... సరేలెండి. విశేషాలేమిటో సెలవివ్వారు కాదు."

"ఏమున్నాయండీ చెప్పేందుకు. మీకు తెలీనవి, నేను చెప్ప గలిగేవీను. ఎవరు చెప్పినా ఈ సంసార లంపటత్వం వల్ల కలిగే చిక్కులేగా!"

"అయ్యో, మీరు సెలవిచ్చింది యథార్థం. నాకంటారా, మన ఎక్కడి దక్కడ బ్లాక్ అయిపోయింది. సరకు విడుదల చేయడమేగాని, చేతిలోకి తిరిగి పైసా రావడం లేదు. వ్యాపారం మహాగడ్డుగా వుందనుకోండి..."

"అందరిదీ ఇదే స్థితండి. చేతిలో ఒక్క పైసా కూడా కనిపించడం లేదని అననివాడంటూ లేడు. పేదవాళ్లు, కూలివాళ్లు, చిన్న జీతగాళ్లు అంటే అర్థముంది. కాని, ప్రతి ఒక్కడూనా? ఏమిటో అంతా మాయగా వుందండి..." అని కొద్ది క్షణాలు ఆగి, పరంధామయ్య కళ్లలోకి సూటిగా చూస్తూ సుబ్బారావుగారన్నారిలా...

"ఇతరుల సంగతి నాకు దేనికిలెండి గాని, నేను మాత్రం పైకం కొద్దిగా అవసరమయ్యే వచ్చాను. సత్యాన్ని దాచడం దేనికి. చెబుతా వినండి. మా పెద్దమ్మాయిని తీసుకు రావాలి. పురుడు గ్రదా చాలా వ్యవహారముంది. అందుకోసం కనీసం అయిదు వందలైనా కావాలి. లేదనరన్న నమ్మకంతో వచ్చా."

"అయ్యో, అలాగా... మీ పరిస్థితిని అర్థం చేసుకున్నాను. కాని మీ కిప్పుడు సహాయం చేయగలనా లేదా అని సందేహిస్తున్నాను."

"పరంధామయ్యగారు. మీరు కాదంటే నేను చాలా బాధపడవలసి వస్తుంది. మరో మార్గం లేకనే ఇలా వచ్చాను."

"సరే, మీ మాట కాదనలేను గనక ఓ పని చేస్తాను."

"ఏమిటండీ అది..." ఆశతో ముందుకు కొద్దిగా వంగి పరంధామయ్యను సూటిగా చూశారు సుబ్బారావు గారు.

"మరేం లేదు. ఎక్కడైనా అప్పు తెచ్చి మీకిస్తాను. సరా...!"

"తిరిగి, ఆ అప్పు ఫలాన గడువులోగా తీర్చమంటే నాకు సాధ్యమా?" తన అశక్తతను వ్యక్తం చేశారు సుబ్బారావు గారు.

"మరి, నన్నేం చేయమంటారో మీరే చెప్పండి..."

సుబ్బారావుగారు రెండు క్షణాలు కళ్లు మూసుకుని, తిరిగి తలయెత్తి ఇలా అన్నారు.

సరే, మీరు ఎక్కడైనా తీసుకురండి. ఆ సొమ్ముని మా యింటి తనఖాకు సంబంధించిన ఖాతాలో వ్రాయండి. వడ్డీ పెరిగితే పెరుగు తుంది. ఇక ఇంతకన్నా నేనేమి చెప్పగలను."

పరంధామయ్య ఉద్దేశం కూడా అదే. చేబదులుగా ఇస్తే తిరిగి ఎప్పుడు వసూలవుతుందో నన్న సందేహంతో, మాట తిప్పాడు. తన ఉద్దేశాన్ని సుబ్బారావు గారి నోటివెంట రప్పించ గలిగాడు. పరంధామయ్య చిరునవ్వు నవ్వుతూ...

"వుండండి. ప్రొద్దుట మా వర్తకుడు కొంత పైకం తెచ్చి దాచమని ఇచ్చాడు. అందులో డబ్బు తీసి మీ కిస్తాను. ఆ తర్వాత మాలో మేము సర్దుకుంటాం. లెండి..." అని లోపలికి వెళ్లి, డబ్బుతో తిరిగి వచ్చి, "ఇదిగో మీరు కోరిన డబ్బు. లెక్కపెట్టుకోండి..." అంటూ సుబ్బారావు గారి చేతిలో పెట్టాడు.

సొమ్ము దొరికినదన్న సంతోషంతో సుబ్బారావుగారు లేచి, కృతజ్ఞతలు చెప్పి ఇంటికి తిరిగి బయలు దేరారు.

(ఇంకా ఉంది)

సినిమా

(37 వ పేజీ తరువాయి)

ఇతర పాత్రధారులు. గణేష్‌పాత్రో మాటలు, వేటూరి పాటలు, చక్రవర్తి సంగీతం, కె. ఎస్. హరి ఛాయ, [illegible]ర నృత్యాలు, కిశోర్ నిర్వహణతో మాగంటి వెంకటేశ్వరరావు నిర్మించే ఈ చిత్రానికి రాజాచంద్ర దర్శకుడు.


నరేష్‌తో విజయకృష్ణా మూవీస్ కొత్త చిత్రం

"అక్టోబర్ నుంచి షూటింగ్. జయసుధ ఒక విశిష్టమైన పాత్రను నిర్వహిస్తుంది," అన్నారు విజయనిర్మల. ఈమె స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో "సూర్య చంద్ర" అనంతరం ఎస్. రమానంద్ నిర్మించే విజయకృష్ణా మూవీస్ మరో చిత్రంలో నరేష్ హీరో. రమేష్‌నాయుడు సంగీతం, పుష్పాలగోపీకృష్ణ ఛాయ, అదుర్తి హరనాథ్ కూర్పు, ఎస్. రవికుమార్ నిర్వహణతో ఎస్. రఘునాథ్ సహ నిర్మాత.

కృష్ణంరాజు హీరోగా గణపతి పిక్చర్స్ చిత్రం తొలి షెడ్యూల్ ముగింపు

"పరిస్థితుల ప్రభావం మూలంగా తన ఐశ్వర్యాన్ని పోగొట్టుకుని నిందలపాలైన ఓ యువకుడు మళ్ళీ ధనవంతుడై, తన మీది నిందలను తొలగించుకుని, నిజాయితీని రుజువు చేసుకుని, ధనమదాంధుల మీద ప్రతీకారం సాధించి, ప్రజలకు అండగా నిలుస్తాడు. కృష్ణంరాజు విజృంభించడానికి అనువైన పాత్ర. జూలై 19 నుంచి 31 వరకు ఫస్ట్ షెడ్యూల్ ముగించాం. ఆగస్ట్ 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు జరిగే తదుపరి షెడ్యూల్‌తో షూటింగ్ పూర్తయిపోతుంది," అన్నారు సత్తిరాజు. ఈయన నిర్వహణలో జి. రామమోహనరావు దర్శకత్వం వహించే గణపతి పిక్చర్స్ వారి తొలి చిత్రంలో జయసుధ నాయిక. ప్రభాకర రెడ్డి, గుమ్మడి, హరిప్రసాద్, సారథి, అంజలీదేవి, ఎస్. వరలక్ష్మి తక్కిన నటవర్గం. డాక్టర్ ప్రభాకర రెడ్డి కథకు మద్దిపట్ల సూరి సంభాషణల కర్త. గోపి గీతాలకు జె.వి. రాఘవులు స్వరకర్త. సత్తిబాబు ఛాయ, బి.ఎన్. కృష్ణ శిల్పం, సి. పుల్లారావు సహ దర్శకత్వం, జ్యోతి ప్రసాద్ ప్రొడక్షన్‌తో నాగవర్మ, విజయరామరాజు సహ నిర్మాతలు. జి. సూర్యనారాయణరాజు నిర్మాత.

నువ్వే ఆడదానివయితే వెంటనే హీరోయిన్ వేషం ఇచ్చేద్దునయ్యా !





"మాయాజాలం" 3-డి చిత్రంలో రజని

జయలక్ష్మి అసోసియేట్స్ చిత్రం

"కాలేజ్ వాతావరణం ప్రధానంగా రూపొందిస్తున్నాం. రెండు పాటలను కుర్తాలం జలపాతం వద్ద చిత్రీకరిస్తున్నాం. శోభన అనే కొత్త హీరోయిన్‌ను పరిచయం చేస్తున్నాం," అన్నారు రవీంద్రబాబు. ఈయన స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో సత్యా రెడ్డి కథ సమకూర్చి, నిర్మించే చిత్రానికి జూలై 25న జయమాలిని ఇంట్లో ప్రారంభోత్సవం జరిగింది. ఒకే షెడ్యూల్‌గా ఆగస్ట్ నెలాఖరుకు పూర్తవుతుంది. భానుచందర్, శరత్‌బాబు, శోభన, సత్యనారాయణ, నూతన్ ప్రసాద్, రాజేంద్ర ప్రసాద్, రమాప్రభ, మాడా, పి. ఆర్. వరలక్ష్మి పాల్గొంటున్నారు. గణేష్‌పాత్రో సంభాషణలు, ఆత్రేయ గీతాలు, జె. వి. రాఘవులు సంగీతం, దివాకర్ ఛాయ, తోట యాదు శిల్పం, ప్రకాష్ నృత్యాలు, ఎ. పాండు–ఎ. రంగ ప్రొడక్షన్, రమేష్ సహకార దర్శకత్వం నిర్వహిస్తున్నారు.

బాలకృష్ణతో విశ్వశాంతి ఎంటర్‌ప్రైసెస్

"జనవరిలో షూటింగ్ మొదలై, మూడు షెడ్యూల్స్‌లో మార్చికి పూర్తవుతుంది." అన్నారు విశ్వశాంతి ఎంటర్ ప్రైజెస్ అధినేత ఎ. కె. వి. ప్రసాద్. ఈయన నిర్మించే చిత్రంలో బాలకృష్ణ, రాధ, గొల్లపూడి మారుతీరావు, పి. ఎల్. నారాయణ, నూతన్ ప్రసాద్, అన్నపూర్ణ ఆదిగాగల వారు పాల్గొంటారు. చక్రవర్తి సంగీతం, నందమూరి మోహనకృష్ణ ఛాయతో కె. మురళీమోహనరావు దర్శకుడు.

'పున్నమిరాత్రి'లో డైరెక్టర్ ప్రతిభ

సుధీర్ (భానుచందర్) గదిలో పరధ్యానంగా కూర్చుని ఉన్నాడు. అతన్ని చూసి డైరెక్టర్ సకలలింగేశ్వరరావు (గొల్లపూడి) "ఒక జీనియస్ డైరెక్టర్‌గా చెప్తున్నాను. ఎప్పుడూ మన్ను తిన్న పాములా ఉండకూడదయ్యా. వెన్న తిన్న కృష్ణుడిలా కనిపించాలి. తెలిసిందా?" అన్నాడు.

ఇంతలో అక్కడికి వచ్చిన మంజుల (స్మిత) కొద్ది దూరంలో ఆగి, పొంచి వినసాగింది.

సుధీర్ నిట్టూరుస్తూ, "బంధాలు, అనుబంధాలు తెంచుకునేందుకు ఒక జీవిత కాలం పడుతుంది." అన్నాడు.

"బాగుందయ్యా, మెడకో పలుపు కొనాల్సి వస్తుందని గేదెను కొనడం మానుకుంటామా? నేనే రాశాను డైలాగు మన సినిమా కోసం!ఎలాగుంది?" అన్నాడు డైరెక్టరు.

"జీవితంలో దెబ్బతిన్న నేను ఎవరితోనైనా సరే-పరిచయంగానే ఉంచుతాను. ఏ మనిషినీ మనసు దాకా రానివ్వటం లేదు." అన్నాడు. సుధీర్.

"ఊఁ..... అర్థమయిందయ్యా నీ కేసు. ఎవరో అమ్మాయి నిన్ను ప్రేమించినట్టే ప్రేమించి మోసం చేసింది. ఆహాహా! ఇది ఆర్డినరి సినిమాలో అరవ సీనులే. నా చిత్రానికి నేనే నిర్మాత, దర్శకుడు, హీరో, విలన్, ఛాయాగ్రాహకుడు, సంగీత దర్శకుడు– అన్ని డిపార్ట్‌మెంట్లూ నిర్వహించాను. నా చిత్రం గాని రిలీజైతే, నాకు తప్పకుండా ఇండియన్ ఆస్కార్ లభిస్తుంది." అని డైరెక్టర్ అంటూండగా మంజుల ఇక అక్కడ ఉండలేక వెనుతిరిగి వెళ్ళిపోయింది.

ఎన్. వి. సుబ్బరాజు కథ, సమర్పణలో వి. ఎస్. రంగనాధవర్మ నిర్మించిన శ్రీవాణీ సినీ ఆర్ట్స్ 'పున్నమిరాత్రి' చిత్రానికి పి. చంద్రశేఖర రెడ్డి దర్శకుడు.

'పట్నం పిల్ల–పల్లెటూరి చిన్నోడు"

"రెండో షెడ్యూల్‌ను మన రాష్ట్రంలోని ఓ గ్రామంలో ఆగస్ట్ 16 నుంచి 24 వరకు పూర్తి చేశాం. చివరి షెడ్యూల్ సెప్టెంబర్‌లో," అన్నారు కె. సత్యం. ఈయన కూర్పు, సమర్పణలో కె. వి. నారాయణగుప్త నిర్మించే గుప్తా క్రియేషన్స్ వారి ఈ చిత్రంలో సుహాసిని, భానుచందర్, సత్యనారాయణ, కె. ఆర్. విజయ, జయంతి, రాజ్యలక్ష్మి, వై. విజయ, అనుపమ, రాజా, నూతన్‌ప్రసాద్, రావికొండలరావు, శ్యాంబాబు నటిస్తున్నారు. కాశీ విశ్వనాథ్, భరణి మాటలు రాశారు. ఆత్రేయ, సినారె, కొసరాజు, రాజశ్రీ గీతాలకు కృష్ణచక్ర బాణీలు కూర్చారు. డి. ప్రసాద్‌బాబు ఛాయ, కళాధర్ శిల్పంతో మౌళి దర్శకుడు.



ఇటీవల ప్రధానమంత్రి హైదరాబాదు సందర్శించినప్పుడు ఎర్‌పోర్టులో సూపర్‌స్టార్ కృష్ణ, ప్రధాని రాజీవ్‌తో ముచ్చటిస్తున్నప్పటి చిత్రం. ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు, సినీనటి శ్రీమతి జమున తదితరులను చిత్రంలో చూడవచ్చు.

టెంపోరావ్ అస్తమయం

"గూఢచుపుత్రాణి, సి. ఐ. డి. రాజు" చిత్రాలకు స్క్రిప్టులు రాసిన టెంపోరావ్ అసలు పేరు కూరపాటి రామచంద్రరావు. ఈయన ఎన్నో సాంఘిక నవలలు, డిటెక్టివ్ నవలలు ఆంగ్ల, తెలుగు భాషల్లో రాశారు. "డిటెక్టివ్, ఫిలిమ్, టెంపో" పత్రికల సంపాదకుడుగా కూడా పాఠకులకు సుపరిచితుడు. మేధావి. చక్కని వక్త. శ్రీ శ్రీ అధ్యక్షతన ఈయనకు 1973 లో జరిగిన ఘన సన్మానంలో 'సాహితీ సామ్రాట్' అనే బిరుద ప్రదానం జరిగింది. నాలాంటి వారెందరికో ఈయన గురుతుల్యులు.

"ఎర్ర మట్టి"లో ఒక దృశ్యం



వి. మధుసూధనరావు దర్శకత్వంలో రామోజీరావు 8వ చిత్రం "మల్లెమొగ్గలు"

ఉషాకిరణ్ మూవీస్ 8వ చిత్రం "మల్లెమొగ్గలు"కి జూలై 24న వేటూరి గీతం, రమేష్‌నాయుడు సంగీతం, ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం గాత్రంతో "వెన్నెలా వెన్నెలా వెన్నెలా" అనే పాట రికార్డింగ్‌తో ప్రారంభోత్సవం జరిగింది. సి. ఎస్. రావ్ రచన, ఎస్. నవకాంత్ ఛాయ, వి. భాస్కరరాజు శిల్పం, శేషు నృత్యాలు, అట్లూరి రామారావు నిర్వహణతో రామోజీరావు నిర్మించే ఈ చిత్రానికి వి. మధుసూధనరావు దర్శకుడు.

మోహన్‌బాబుతో తాతినేని ప్రసాద్ దర్శకత్వంలో సి. ద్వారకనాధ్‌బాబు నిర్మించే చిత్రం


"మోహన్‌బాబు సరసన రాధ నాయిక," అన్నారు తాతినేని ప్రసాద్. ఈయన దర్శకత్వంలో విజయలక్ష్మి


"వందేమాతరం"లో విజయశాంతి

సమర్పించే శ్రీ ద్వారకా క్రియేషన్స్ వారి చిత్రానికి జూలై 27న తొలి గీతం ధ్వని ముద్రితమైంది. జగ్గయ్య, గొల్లపూడి, నూతన్‌ప్రసాద్, రమాప్రభ, హేమసుందర్, మిక్కిలినేని, తతిమ్మా భూమికలు నిర్వహిస్తున్నారు. ఆత్రేయ, విశ్వ, కాశీ విశ్వనాధ్, సత్యం, సత్తిబాబు, కణ్ణన్, గూనా, తాండవకృష్ణ, చంద్రశేఖర్ తెర వెనుక కృషి చేస్తున్నారు. సి. ద్వారకానాధ్ బాబు నిర్మాత.

అనిల్ కుమార్ దర్శకత్వంలో రాంప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ "అనాదిగా ఆడది"

"మహిళా సమస్యాత్మక చిత్రం. భానుప్రియ నాయిక." అన్నారు ఎన్. రామలింగేశ్వరరావు. ఈయన "అనురాగబంధం" అనంతరం నిర్మించే రాంప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ "అనాదిగా ఆడది" చిత్రానికి పూర్తి సంభాషణల కర్త. అనిల్‌కుమార్ దర్శకత్వంలో నందిగం దేవి ప్రసాద్ సమర్పిస్తారు చిత్రాన్ని. □



చిరుదివ్వెల వెలుగులు

సుస్మితా రమణమూర్తి

"నమస్కారం సార్! పరిచితులైన కంఠం విని వెనుతిరిగి చూశాడు గోపాల్

ఇరవయ్యేళ్ళ కుర్రాడు నవ్వుతూ కన్పించాడు.

బాగా తెలిసిన ముఖం. ,ఫలానా అని నిర్ధారించుకోలేకపోతున్నాడు తను. మాటల్లోకి దిగితే గుర్తుకి రావొచ్చున్న తలంపుతో – "ఏఁవిటోయ్, బాగున్నావా? అమ్మ నాన్న కులాశాయేనా?", కుశల ప్రశ్నలు వేశాడు.

"అంతా బాగున్నారండి? నాన్నగారు మిమ్మల్ని కలియమన్నారండి! సాయంత్రం ఇంటికి వద్దామను కుంటుంటే అనుకోకుండా మీరు కన్పించారండి!" వినయంగా చెప్పాడు కుర్రాడు.


"ఏదైనా సలహా గురించా? ఇంతకీ నీవేం జేస్తున్నావ్? చదువుకుంటున్నావా? లేక ... ఏదైనా ఉద్యోగ ప్రయత్నంలో వున్నావా?"

"ఈ ఊర్లోనే ఎస్. ఎస్. సి పాసయాను కదండి? ...."

"అవునవును! ఎస్ ఎస్ సి. పాసై ఎన్నాళ్ళయింది?" కుర్రాడి మాటలకు అడ్డు తగులుతూ అడిగాడు గోపాల్.

"అప్పుడే మర్చిపోయార్గా సార్ నన్ను!? మి దగ్గర ప్రయివేటు చదివిన పదిమంది ఫస్ట్ క్లాసులో పాసైన సంవత్సరం గుర్తు లేదాండి మికు!? పోని మి జేబులో వున్న పెన్‌ని చూసైనా నేనెవరో గుర్తొస్తుందేఁవో ప్రయత్నించండి సార్!" "గోపాల్ జేబు వేపు చూస్తూ అన్నాడు కుర్రాడు.

ఈ కాలపు కుర్రాళ్ళు బాగా తెలివైనవాళ్ళు సుమా! ఏదో కప్పదాటు వేద్దామనుకున్నాను గాని – ఇలాదొరికిపోతాననుకోలేదు పెన్ చూసైనా గుర్తు తెచ్చుకోమంటున్నాడే!? ... ఎవరు చెప్మా? ...



రెండేళ్ళ క్రితం తన దగ్గర ప్రయివేటు చదువుకున్న కుర్రాడొకడు బహుమతిగా ఈ పెన్నిచ్చాడు. ఆ కుర్రాడు – ఈ కుర్రాడేనా? అయ్యుండొచ్చు! లేకుంటే అంత ఖచ్చితంగా ఎలా చెబుతాడు? ....

గోపాల్ ఆలోచనలు ఓ కొలిక్కి రాలేదు.

"సారి సార్! మిమ్మల్ని ఇబ్బంది పెట్టాను. ఎంతో మంది మీ దగ్గరకు ప్రయివేటుకి వస్తుంటారు. అంతమందినీ పేరు పేరునా గుర్తు పెట్టుకోవడం కష్టమే! నేను వీరాజునండి? ఆ రోజుల్లో మీ ఇంటికి దగ్గర్లో వున్న మా చుట్టాల ఇంట్లో వుండి చదువుకునేవాణ్ణి". అంటూ చెప్పాడు తను.

అప్పటికి వీరాజు విషయాలు గుర్తొచ్చాయ్ గోపాల్‌కి.

"మీ నాన్నగారు వ్యవసాయం చేస్తుంటారు కదూ? అనకాపల్లేనా మీది? ఇంటర్ మీ వూర్లోనే చేశావు కదూ?" అంటూ అడిగాడు.

వీరాజు కళ్ళు ఆనందంతో మెరిశాయ్.

"మీ జ్ఞాపకశక్తికి జోహార్సార్!" అన్నాడు వీరాజు.

"నీవన్నట్లు అంతమందినీ గుర్తుపెట్టుకోవటం కష్టమే అయినా అందర్నీ మర్చిపోవడం కూడా అంతే కష్టం! ఏమంటావ్?" నవ్వుతూ అడిగాడు గోపాల్.

"అవున్సార్!"

"ఇప్పుడేం జేస్తున్నావ్?"

"ఇంటరైంది. ఏదైనా డిగ్రీ చేద్దామనుకుంటున్నానండి!"

"వెరి గుడ్!"

"నాన్నగారు వద్దంటున్నారండి!"

"ఎందుకని!? ...."

ఎస్. ఎస్. సి. పాసైన వెంటనే నాన్నగారి బలవంతంవల్ల ఎంప్లాయ్‌మెంట్లో రిజిస్ట్రేషన్ వేయించాను. ఈ మధ్య అటెండర్ పోస్టుకి ఇంటర్వ్యూ రావడం సెలెక్టవడం కూడా జరిగింది. ఈ నెలాఖర్లోగా చేరాలని ఆర్డర్స్ కూడా వచ్చేశాయ్. ఈ ఊర్లోనే చదువుకుని – ఇంటర్ పాసై ఉండికూడా ఈ ఊర్లోనే అటెండర్‌గా ఉద్యోగం చేయడమంటె అదోలా వుంది నాకు. ఉద్యోగంలో చేరడమా లేక చదువుకోడమా?– అన్న విషయంలో మీ సలహా తీసుకోమని నాన్నగారు చెప్పారు నాకు."

"అలాగా!" అంటూ ఆలోచనల్లో పడ్డాడు గోపాల్.

"డిగ్రీ చదివితే ఆఫీసర్ ఉద్యోగం రావచ్చు కదండి?" వీరాజు.

"రానూ వచ్చు. రాకపోనూ వచ్చు. ఉద్యోగం సంగతి తర్వాత ఆలోచిద్దాం గాని అసలు చదువుకోడం ఎందుకో చెప్పు."

"అదేమిట్సార్!? ... ఎంత ఎక్కువ చదువుకుంటే అంత మంచి ఉద్యోగం వస్తుంది కదా? మీకు రెండు డిగ్రీలుండబట్టే కదా మీకు పెద్ద ఆఫీసర్ ఉద్యోగం వచ్చింది?"

"చూడు రాజూ! చదువు యొక్క పరమార్థం ఉద్యోగంకాదు. చదువు జ్ఞానసముపార్జన కోసమని అంతా తెల్సుకున్ననాడు గాని ప్రస్తుతం వున్న నిరుద్యోగ సమస్య అధికారంలో చిరుదివ్వెల వెలుగులు ప్రసరింపబడవు. వచ్చిన అవకాశాన్ని జారవిడుచుకుని భవిష్యత్తులో అవకాశం రానప్పుడు బాధపడి లాభం వుండదు. డిగ్నిటీ ఆఫ్ లేబర్ విలువ గుర్తించిన ఎంతో మంది డిగ్రీరాయుళ్ళు నిరుద్యోగ సమస్యవల్ల కిళ్ళీ షాపులు-ఫాన్సీ షాపులు పెట్టుకుని బ్రతకడానికి ప్రయత్నిస్తున్న రోజులివి......"

"ఎక్కువ చదువుకోవడం మంచిది కాదంటారా!? ..." గోపాల్ మాటలకి అడ్డు తగులుతూ అమాయకంగా అడిగాడు వీరాజు.

"ఇప్పట్లో నీకే కాదు. నీ పరిస్థితిలో వున్న ఎవరికీ నా మాటలు అర్థంకావు. ఒక్క విషయం మాత్రం నీకు అర్థమయ్యేలా చెప్పగలను. నీ తల్లిదండ్రులు తల తాకట్టుపెట్టయినా నిన్ను పెద్ద చదువులు చదివిస్తే చదివించొచ్చు గాని రాబోయే ఓ రేపులో నీ చదువుకి తగ్గ ఉద్యోగాన్ని రికమండేషన్ ద్వారా గాని డబ్బు మూలంగా గాని సంపాదించి పెట్టలేరు. నాకంటే నీకే మీ ఇంటి పరిస్థితులు బాగా తెలియాలి."

"బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకుంటే ఉద్యోగం ఎందుకు రాదండి?"

బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకుంటే 'ఉద్యోగం రాదు' అని ఖచ్చితంగా నే చెప్పలేను గాని బాగా చదువుకుంటే నీ బుర్ర బాగా పదునెక్కుతుంది. తెలివితేటలు పెరుగుతాయ్. తద్వారా దేశంలోని పరిస్థితుల్ని అన్ని కోణాల నుంచి పరిశీలించి అర్థం చేసుకోగలవు. చదువు కేవలం ఉద్యోగం కోసం కాదన్న విషయం అప్పటిగ్గాని నీకర్థంకాదు".

"ఆ విషయం అర్థంచేసుకోడానికైనా చదువుకోవాలి కదండి?"

వీరాజు వేపు చురుగ్గా చూశాడు గోపాల్.

అమాయకత్వంతో నిండిన తన ముఖాన్ని చూసి – "చదువుకోవచ్చు. ఉద్యోగం చేస్తూ కూడా చదువుకోవచ్చు." చెప్పాడు గోపాల్. వీరాజుకి గోపాల్ మాటలు రుచింపలేదు.

"నా మాటలు ఇప్పటికీ నీకు అర్థం కాలేదు కదూ? ప్రత్యక్షంగా చూస్తే నీకే తెలుస్తుంది పద!" అంటూ గోపాల్ వీరాజుని దగ్గర్లో వున్న కలెక్టర్ ఆఫీసుకి తీసుకువెళ్ళాడు.


"ఆ వరండాలో ఒక్కో స్తంభానికి చేరబడి కూర్చున్న మనుషుల్ని వాళ్ళ చుట్టూ వున్న గుంపుల్ని ఎప్పుడైనా చూశావా?" గోపాల్ ప్రశ్న

"ఓసారెప్పుడో బేంకు పనిమీద వచ్చినప్పుడు చూశాన్సార్!"

"ఆ మనుషుల గురించి నీకేం తెల్సో చెప్పు!"

"ఇక్కడున్న బేంకుకి – కలెక్టరాఫీసుకి సంబంధించిన అప్లికేషన్లు రాయించుకోడానికి ఛెలానులు నింపించుకోడానికి – టైపింగ్ కోసం ఆ స్తంభానికి ఆనుకుని కూర్చున్న మనుష్యుల దగ్గరకు వెళ్తుంటారు. తమ పని చేయించుకుని అర్ధో, రూపాయో వాళ్ళకిస్తుంటారు. అంతేనా సార్?"

"ఫర్వాలేదు. విషయాన్ని బాగానే ఆకళింపు జేసుకున్నావ్. ప్రక్కనే పోష్టాఫీసు వుంది కదా? కావాల్సిన వాళ్ళకు ఉత్తరాలు రాసిపెడ్తారు. కొంతమందికి వచ్చిన ఉత్తరాల్ని విన్పిస్తారు. మనియార్డర్ ఫారాన్ని నింపి పెడ్తారు. ఇలా అన్ని విధాల అందరికీ కావాల్సిన పనుల్ని కూర్చున్న చోట్నుంచి లేవకుండానే ఎంతో ఓపిగ్గా చేసిపెడ్తూ ఉదయం నుంచి సాయంత్రం దాకా కూడబెట్టిన పావలాల్ని – అర్ధల్ని పదులు – పాతికలుగా మార్చుకుంటారు. ప్రతివాడికీ ఏ రోజూ పాతిక





రూపాయలకి తక్కువ వుండదు ఆదాయం!"

గోపాల్ చెప్పింది శ్రద్ధగా విన్న వీర్రాజు తేలిగ్గా నవ్వేస్తూ – పదో క్లాసో-ఇంటరో చెట్టేక్కేసిన వాళ్లై వుంటారు వాళ్ళు. ఉద్యోగం దొరక్క ఇలా బ్రతికేస్తున్నారనుకుంటాను?" అన్నాడు.

"అలాంటివాళ్ళూ వున్నారు. డిగ్రీ చదువులు వెలగబెట్టి ఉద్యోగం రాక ఎప్పుడు వస్తుందో తెలియని ఉద్యోగం కోసం పడిగాపులు కాస్తూ కాలాన్ని వృధా చేయకుండా – తనపై ఆధారపడిన వాళ్ళను ఆదుకోడానికి స్వంత తెలివి తేటలతో అందరి అభిమానాన్ని చూరగొంటూ అలా బ్రతుకు శకటాన్ని గుట్టుగా ఈడ్చేస్తున్న వాళ్ళూ వున్నారు."

"అదేవిటి సార్!? ... పెద్ద చదువు చదువు

చిరుదివ్వెల వెలుగులు

కున్నోళ్ళవి కూడా కేరాఫ్ వరండా బ్రతుకులై పోయాయంటే నమ్మశక్యంగా లేదండి? ...."

"నా మాటలు నీకు ఆశ్చర్యంగానే వుండొచ్చు. పెద్ద చదువు – పెద్ద ఉద్యోగం, చిన్న చదువు – చిన్న ఉద్యోగం – అన్న కొలబద్ద నీ బుర్రలోంచి పోయినప్పుడుగాని నా మాటలు నీకు అర్థంకావు. స్సరే! వాళ్ళు కాస్త ఖాళీగా వున్నప్పుడు వాళ్ళేం చదువుకున్నారో? వాళ్ళ పరిస్థితులేవిటో? – నీవంతట నీవే వాళ్ళ ద్వారా తెల్సుకుని సాయంత్రం మా ఇంటికి రా? నాకు అర్జంటు పనోటుంది. నే వెళ్ళాలి! సాయంత్రం తప్పకుండా రావాలి సుమా!" అంటూ గోపాల్ వీర్రాజుని అక్కడ వదిలేసి వెళ్ళిపోయాడు.

* * * * *

నమస్కారం సార్!"

"రావోయ్, రా! నీ గురించే ఎదురు చూస్తున్నాను. మీరు లెక్కలు చేస్తుండండి: ఇప్పుడే వస్తాను." అంటూ ప్రయివేటు కుర్రాళ్ళకి చెప్పి వీర్రాజుతో ప్రక్క గదిలోకి వెళ్ళాడు గోపాల్.

"మీరు చెప్పిందే రైటు సార్! అక్కడ డిగ్రీ చదివుకున్నోళ్ళే కాదు, ఎమ్మే చదివినతను కూడా వున్నాడటండి! ఎవరో వేణుట! ఈ రోజతను రాలేదట. ఉదయం మీరు చెప్పిందంతా అర్థమైందండి! నేనేం జేస్తే మంచిదో ఇప్పుడు చెప్పండి."

వీర్రాజులోని మార్పుకి గోపాల్ సంతోషిస్తూ – "ఆ వేణు ఎవరో కాదు రాజూ! ఈ గోపాలే ఆ వేణు గోపాల్! నీవనుకుంటున్నట్లు నేనే ఆఫీసుల్లోనూ ఆఫీసర్ని కాదు. ఆ వరండా ఆఫీసులో బంట్రోతు – టైపిస్టు – ఆఫీసర్ అన్నీ నేనే! ఉదయం తొమ్మిది దాకా ప్రయివేట్లు చెబుతూ – పది నుంచి సాయంత్రం నాలుగు దాకా ఆ వరండా ఉద్యోగం చేస్తూ మళ్ళీ సాయంత్రం ఆరునుంచి ఎనిమిదిదాకా ప్రయివేట్లు చెబుతూ నెలకి ఓ వెయ్యి రూపాయలు సంపా దించగల్గుతున్నాను. నా వాళ్ళని ఆదుకోగలుగు తున్నాను. ఈ మధ్య ఓ రెండు ఇంటర్వ్యూలకు వెళ్ళాను. ఓ కంపెనీలో సెలెక్టు అయినట్లు తెల్సింది. ఉద్యోగం వచ్చినా సంతోషం.లేకున్నా నా ఉద్యోగం వుండనే వుంది." అంటూ ఆగాడు గోపాల్.

వీర్రాజు విస్మయంగా గోపాల్ వేపు నోట మాట రాక చూస్తుండిపోయాడు.

"ఇప్పుడు చెప్పు రాజూ! వచ్చిన ఉద్యోగాన్ని వదిలేసి చదువుల కెగబడతావా? ఉద్యోగం చేస్తూ రాత్రి పూట చదువుకుని నీ విజ్ఞానాన్ని పెంపొందించుకుంటావా?" సూటిగా వీర్రాజు వేపు చూస్తూ అడిగాడు గోపాల్.

"మనం చదువుకున్నాం. గవర్నమెంటే ఉద్యోగం చూపిస్తుంది – అన్న ధీమాతో కాలాన్ని వృధా చేస్తున్న ఎంతో మందికి మీలాంటివాళ్ళు తమ తమ బ్రతుకుల్ని ప్రకాశవంతం చేసుకోడానికి వెలిగించుకొనే చిరుదివ్వెలే కనువిప్పు కలిగించా లండి! మీ సలహా ప్రకారం ఉద్యోగం చేస్తూ చదువుకుంటాను సార్! ఏ చదువు భవిష్యత్తులో నాకు ఉపయోగిస్తుందో మీరే చెప్పాలి. మీ దగ్గరే వుంటి మళ్ళీ మీ శిష్యరికంలోనే డిగ్రీకూడా పూర్తిచేస్తాను. మా వూరెళ్ళి నాన్నగార్కి నా నిర్ణయం తెలియజేస్తే ఎంతో సంతోషిస్తారు. మళ్ళీ కలుస్తాను సార్!" అంటూ వీర్రాజు వెళ్ళిపోయాడు.

'లోకజ్ఞానం గల ప్రతివాళ్ళూ తనలా గైడ్ చేస్తే వీర్రాజునే కాదు యువతలో ప్రతి రాయినీ వజ్రంగా తీర్చిదిద్దొచ్చు' స్వగతంలా అనుకున్నాడు గోపాల్ వీర్రాజు వెళ్తున్న వేపు చూస్తూ. □


'సిస్టమ్స్' లోంబెమేరు దేన్నైనా ఎన్నిక
చేసుకోవచ్చు...
• నాన్-స్టాప్
• బెఫోర్-టైమ్
• డే-ఆఫ్టర్
• రోయల్ యాక్షన్
• క్రోవిన్-4850
SYSTEM
SUITINGS
MANSI/SY/3/85

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

వి. వి. ఆర్. ఆర్. మరుమద్దాలి

★ కె. రా. గారూ మిమ్మల్ని మీ ప్రశ్నావళిని చూస్తూంటే జాలి వేస్తుంది. మగవాళ్ళని పొద్దస్తమానూ తిట్టిపోయడమే మీ జీవిత లక్ష్యమైనట్టు ప్రవర్తిస్తున్నారు ... ఒక రచయిత్రికి ఉండవలసిన సంకుచిత భావం అదికాదు. మీరు మీ పద్ధతి మార్చుకోవాలని నా సలహా.

● సలహాకేం ఎవరేనా ఇవ్వొచ్చు రాజేశ్వరరావుగారూ. అవగాహన శక్తి ఎవరూ ఇవ్వలేరు. అది మీకై మీరు పెంపొందించుకోవాలి. మీ జాలీ సానుభూతీ – ఏవీ నా కక్కరలేదు. మీ చుట్టుపక్కల గుడ్డిగా మగవాడిని ఆరాధించే ఎవరో వుండకుండా వుండరు – వారి మీద ఒలకపోయండి! నా కంటే వారికే అది అవసరం. నేను ఏ మగాడినేనా తీరి కూర్చుని మీరన్నట్టు పొద్దస్తమానూ తిట్టానా తిడుతున్నానా అడిగి చూడండి. అయినా గుమ్మిడికాయల దొంగ అంటే భుజాలు తడుముకుంటున్నారెందుకు? మీ నిజస్వరూపం ఎక్కడేనా నా సమాధానాల్లో బహిర్గతం అయిందా!!

బి. ఎస్. ఆర్. పెన్‌జంద్ర

★ ఎలక్షన్ల ముందు మన అన్నగారు అన్న ఈనాడు పత్రిక ఇప్పుడు మన అన్నగారు అనడం మానేసిందెందువల్ల?

● ఏముంది? ఎలక్షన్ల ముందులాగా లేవు అన్నగారి పొగడలు! అందువలన.

కె. ఆర్. పి. సంగారెడ్డి

★ అక్కయ్యా ఆడవారిని ఆటబొమ్మలుగా చూస్తారు. ఆడవారంటే లేనిపోని అపార్థాలు తీస్తారు. ఈ మగవారు ఏనాడు మారుతారు?

● ఆడవాళ్ళు మారనన్నాళ్ళు మగవాళ్ళు మారే అవకాశం లేదు. మన మీద మనకే లేని గౌరవం వారికెలా వుంటుందనుకుంటున్నారు?

కె. వి. ఎమ్. విజయవాడ

★ ప్రజాడిసి – అంటే?

● సాక్ష్యాధారాలతో నిరూపణ చేయలేని ఒక స్వీయాభిప్రాయం కాదా?'

సి. హెచ్. ఎన్. ఆర్. సికింద్రాబాద్

★ అందరికీ అన్ని విద్యలు తెలిసినా తెలియనిదొకటి వుంటుంది. అదేమిటి?

● ఎదుటి వాడికి తెలియనిది!

సి. కె. ఆర్. కొమ్మకొట్టాల


★ కూచిపూడి నాట్యం నేర్చుకుంటున్నాను. దానిపై యిష్టం వుండటం వల్ల చదువు పాడు చేసుకున్నాను.

● నాట్యం నేర్చుకోవడం తప్పుకాదు కాని చదువు నిర్లక్ష్యం చేయడం తప్పే. రెండూ కొనసాగించే ప్రయత్నం చేయడం మంచిది ఎంత గొప్ప కళాకారునికైనా కనీసపు విద్యార్హతలు చాలా అవసరం.

పి. ఎన్. పి. కార్వార్

★ ఈ మధ్య సినిమాలలో నిరుద్యోగ సమస్యను మరి ఘోరంగా చిత్రిస్తున్నారు అని నా అభిప్రాయం.

● సినిమాలు సమస్యా పరిష్కారానికి కావు. సమస్యలని చూపి డబ్బు చేసుకుందుకేనని తెలిసి మనం వాటిలో 'తీరు'కి బాధపడటం వృథాప్రయాస.



కె. ఎస్. ఆర్. సిమెంట్‌నగరు

★ జాతకాలు చెప్పేవారి జాతకం – రోడ్డు మీద జీవితం, ఏమంటారు?

● అది సరే – ఇది తెలిసి రోడ్డు వార కూర్చుని జాతకం చూపించుకునే వారినేమనాలి?

డి. జె. ఆర్. విశాఖపట్నం

★ ప్రేమ అమూల్యమైనది అంటూనే చిన్నచూపు చూస్తారెందుకు?

● ఖరీదు లేని దానిపై విలువ ఎలా కట్టడం?! ... అందుకే యీ పదం మరి వేళాకోళంగా తయారయిపోయింది.

జి. ఎల్. బరంపురం

★ దుశ్శాసనుని గురుతు తెచ్చినట్టు దుశ్శాలువ గొప్పవారికి కప్పుతారు. దాన్ని సుశ్శాలువ అంటే ఎలా వుంటుంది?

● బాగానే ఉంటుంది. 'సులువుగా' వచ్చే దానిలా!

ఎం. ఎస్. నెట్టూరు

★ ముమ్మిడి వరం బాలయోగి మే నెలలో కర్నాటకలో ఏ ప్రదేశం చూపిస్తే అక్కడ వర్షం కురిపిస్తామని సవాలు చేశారు.

● అంతకంటే ఆయన ఎక్కడుంటే అక్కడే వర్షం కురిపించడం మేలేమో

ఎస్. హెచ్. తిప్పనాపల్లి

★ మీరొక ప్రముఖ కవిపత్ని అయివుండి- మీ జవాబులు చదువుతుంటే ఎప్పుడూ స్త్రీ సమస్యలకి అనుకూలంగా, మరికొన్ని పనికిమాలిన జవాబులివ్వడం అయిష్టంగా వుంది. ఈ శీర్షిక కాకుండా అభ్యుదయ భావాలు గల శీర్షికను నిర్వహించండి.

● ఏం- లేబుల్ అంటిస్తే గాని మీకు భావాలు అర్థం కావా ఏమిటి?! కవిపత్నినే కాని నేను వ్యక్తి నికూడా. మరిచిపోకండి.

ఐ. కె. ఆర్. విజయనగరం

★ ఆడది ఎంత పొగరు బోతుది అయినా పెళ్లి అయిన తరువాత భర్త పాదాలకి మొక్కుతుంది. నటనా? భక్తా?

● మీరు తెలుగు సినిమాలు చూసి చూసి- యిలా ఆలోచిస్తున్నట్టుంది. మొక్కితే నటన? మొక్కక పోతే పొగరు? అంతేనా? మనిషికి మనిషి మొక్కడమేమిటి?'

బి. ఐ. అక్కుపల్లి

★ మనసు లేని మనిషిని మనిషే కాదంటారు మనస్సున్న మనిషిని బ్రతకనివ్వరు.

● అదే యీ లోక నీతి. లేనిది ఉండాలనడం ఉన్నది నిర్లక్ష్యం చేయడం. □


రాఖీ....!
— శేఖర్..
Chaitanya
ఎవరో అమ్మాయి వచ్చి రాఖీ కడ్తుంటే... పోన్లే పాపం అనుకున్నా తీరా చూస్తే వాచీ లేదురా బాబూ!
ఇవాళ ఓ పాతిక రూపాయలు అవసరం వచ్చిందే! వెంటనే నా దగ్గరున్న నాల్రూపాయలు పెట్టి రాఖీలు కొని నాకు తెల్సిన వాళ్లందరికి కట్టా అంతే.....ఎలావుంది నా ఐడియా?!
అబ్బో! ఏంలేదురా! వీడు ఎన్నాళ్లనుంచో ప్రేమిస్తున్న హృదయరాణే వచ్చి రాఖీ కట్టేసి వెళ్లిందట!!
PARK
వద్దూ.... నీకు పుణ్యం వుంటుంది త్వరగా రాఖీ కట్టేయ్ తల్లీ....!!
PARK
నువ్ నాకు రాఖీ కట్టం లేదూ........ కట్టం లేదూ.... కట్టం లేదూ..........
ఇవాళ రోడ్డుసైడ్ రోమియోల బారినుంచి తప్పించుకోడానికి ఇది భలే ఉపయోగపడిందే..!!



(గత సంచిక తరువాయి)

"మల్లిక రిజైన్ చేసిందని విని స్తన్నయ్యాను." చెప్పుకుపోయాడు ఫిలిప్. "కొన్నాళ్ళు దూరంగా వెళ్ళాలనుకుంటోందని తెలుసుగాని ఉద్యోగం కూడా మానేసి పూరే వదిలి వెళ్తుందనుకోలేదు. అందుకే ఆమెకు వెంటనే ఫోన్ చేశాను. చికాగోలో వుద్యోగం చూసుకుంటుందట. త్వరలో నే డివోర్సుకి అప్లయ్ చేస్తుందట." భార్గవ్ మధ్యలో ఏదో అనబోయేంతలో అడ్డుకున్నాడు ఫిలిప్. "నేను చెప్పేది సాంతం వినండి. మల్లికా, నేనూ స్నేహితులం. చాలాసార్లు అడగ్గా మల్లిక మనస్సు విప్పి చెప్పింది. పిల్లలంటే మీకెంతో ఇష్టమని, పిల్లలు లేకపోవటంవల్ల చాలా డిప్రెష్ అవుతున్నారని, అందువల్లనే టైమంతా లాబ్‌లో గడుపుతున్నారని, పేదవాళ్ళను బాగుపర్చటానికై డబ్బు సంపాదనకి ప్రయత్నిస్తున్నారని, ఆ ప్రయత్నంలో మిగతా జీవితాన్ని పట్టించుకోవడం లేదని చెప్పింది. తను మీ జీవితంలో నుండి తప్పుకుంటే మీరు మళ్ళీ పెళ్ళి చేసుకుని పిల్లాపాపలతో సంతోషంగా వుంటారని ఆమె అభిప్రాయం.

ఈ విషయం మీకు చెప్పాలా వద్దాని నిన్నంతా ఆలోచించాను. నన్ను నమ్మి మనస్సు విప్పి చెప్పుకున్న మల్లిక నేను మీకీ విషయం చెప్పానని తెలిస్తే మళ్ళీ నా ముఖం చూడదేమో! కాని చూస్తూ చూస్తూ మల్లిక తన సంతోషాన్ని నాశనం చేసుకోవటం స్నేహితుడుగా నేను భరించలేను. ఆమె మిమ్మల్నెంతగా ప్రేమిస్తుందో నాకు తెలుసు. అందుకే మీతో చెప్పటానికే నిశ్చయించుకున్నాను. మీరేం చేస్తారో, అంతా మీ చేతుల్లోనే వుంది!"

భార్గవ్ వింటూ కూర్చున్నాడు. మల్లిక అలా ఆలోచించిందా? అంతా తన ఇష్టమేననుకుంటోందా? అప్లయ్ చేయగానే తను ఎగురుకుంటూ డివోర్సు ఇస్తాడనుకుంటోందా? తనతో మాట మాత్రమైనా అనక్కరలేదా? కోపంతో అతని కణతల నరాలు పొంగాయి.

"మల్లిక తొందరపాటు మనిషని తెలుసు. కాని ఫూల్ అనుకోలేదు. ఇంతమాత్రం అర్థం చేసుకుందన్న మాట! రేపు డివోర్సు పేపర్సు పోస్ట్‌లో పంపితే నేను సంతకం చేసి పంపాలటనా?" అతని కళ్ళలో ఎర్ర జీరలు తొంగి చూస్తున్నాయి.

"నేనెంతో చెప్పి చూశాను రామ్! ఆమె వినటంలేదు. మీతో ముందే చెబితే ఏదో ఒక అడ్డు పెడతారని ఆమె భయం! దయచేసి మీరామెపై కోపం తెచ్చుకోవద్దు. జరగాల్సింది చూడండి" ప్రాధేయపూర్వకంగా అన్నాడు ఫిలిప్.

భార్గవ్ అతనివంక సాలో చనగా చూశాడు. మల్లికపై ఏమిటితని ఇంటరెస్ట్?

"మీరెందుకు ఇంతగా శ్రమపడుతున్నారో తెలుసుకోవచ్చా?" సూటిగా చూశాడు.

"నిరభ్యంతరంగా!" ఫిలిప్ చూపులు మరల్చుకోలేదు. "నా మనస్సుకు నచ్చిన కొద్దిమంది ఫ్రెండ్స్‌లో మల్లిక ఒకటి మిస్టర్ రామ్! మంచి స్నేహితులు దొరకటం ఎంత కష్టమో మీకు తెలియదా? నాకు నా అనేవాళ్ళు లేరు. నా స్నేహితులే నా వాళ్ళనుకుంటాను. వాళ్ళు సుఖంగా వుంటే నాకు సంతోషంగా వుంటుంది. ఆఫ్టరాల్ ఆత్మీయులు కష్టసుఖాలను పంచుకోవటమే కదా జీవితమంటే!"

లేచి నిలబడ్డాడు ఫిలిప్. "చాలా టైమయ్యింది. ఇక వెళ్తాను. తొందరలో మల్లికతో మాట్లాడతారని ఆశిస్తాను. ఒక్క విషయం! దయచేసి నేను మీతో మాట్లాడినట్టు ఆమెకు చెప్పొద్దు."

తనూ లేచి షేక్‌హాండుకై చెయ్యి జాపాడు భార్గవ్.

"థాంక్యూ ఫర్ లెటింగ్ మి నో!"

* * *

మల్లిక ఒక్కతే కూర్చుని కిటికీలో నుండి బైటికి చూస్తోంది. రెండ్రోజుల నుండీ ముసురు పట్టినట్టు ఒకటే వాన! మబ్బు మబ్బుగా గ్లూమీగా వుంది వాతావరణం. లూసీ ఆఫీసు నుండి రావటానికింకా టైముంది. అవన్‌లో బేక్ అవుతున్న చికెన్ లూసీ వచ్చేసరికి రెడీ అవుతుంది. ఇంతకుముందే వెజిటబుల్ శాలడ్ చేసి రెఫ్రిజిరేటర్‌లో వుంచింది.

నెల క్రితం మల్లికను ఎయిర్‌పోర్ట్‌లో రిసీవ్ చేసుకుని ఇంటికి తీసుకొచ్చింది లూసీ. అసలు మీటింగ్స్ జరిగే హోటల్లోనే మల్లిక రూం రిజర్వు చేయించుకుంది. మీటింగ్స్ అయ్యేవరకూ హోటల్లో వుంటానంటే ఒప్పుకోలేదు లూసీ. హోటల్ రిజర్వేషన్ కాన్సిల్ చేసింది. లూసీకూడా ఆ మీటింగ్స్‌కి రిజిస్టర్ చేయించుకోవడంతో ఇద్దరూ కలిసే వెళ్ళేవాళ్ళు. ఆ తర్వాత ఒక వారం రోజులు వెకేషన్ తీసుకుని మల్లికతో కలిసి తిరిగింది లూసీ. పైకి సరదాగా తనతో తిరుగుతున్నా ఏదో విషయమై మల్లిక బాధపడుతోందని పసిగట్టింది. తనతో కలిసి రెండు మూడు వారాలు గడుపుతానని మల్లిక మొదట్లో అన్నప్పుడే ఆశ్చర్యమనిపించింది. అయినా ఏమీ అనలేదు.

తర్వాత మల్లిక విషయం చెప్పినప్పుడు సావకాశంగా విని ఒక్కటే అంది, "నువ్వు చాలా ఆవేశంగా వున్నావు మల్లీ! కొంతకాలం ఇలా రావటం మంచి పనే. స్థిమితంగా ఆలోచించుకో. నెల తర్వాత కూడా నీ మనస్సు మారకపోతే అలాగే చేద్దువుగాని."

లూసీ ఒంటరిది. ఆమె పెళ్ళి చేసుకోలేదు. బాయ్ ఫ్రెండ్సూ లేరు. వుద్యోగమే ఆమె లోకం! శలవులొచ్చినప్పుడు వూళ్ళు తిరగడం, పుస్తకాలు చదవటం, బాల్ గేమ్‌లు వాచ్ చెయ్యటం ఆమె హాబీలు!

లూసీతో గడుపుతుంటే మల్లికకు పెళ్ళికాక ముందు జీవితం గుర్తొచ్చేది. ఈ

జరిగిన కథ–17: భార్గవ్ అమెరికాలో ఒక చిన్న ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. మల్లిక, భార్గవ్ ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు. వారి జీవితం సాఫీగా జరిగి పోతున్నా పిల్లలు మాత్రం కలగలేదు. అందుకై ఆ దంపతులు డాక్టర్ల చుట్టూ తిరగారు కానీ ఫలితం మాత్రం కనపడ లేదు. భార్గవ్‌కి మాత్రం తమకు తప్పక పిల్లలు పుడతారని నమ్మకం. పిల్లల్ని పెంపకం తీసుకునే విషయంలో తమకు ఆసక్తి లేదని డాక్టరుతో చెపుతాడు భార్గవ్. డాక్టరు మాటలు విన్న భార్గవ్‌కి తనింట్లో చిన్నప్పుడు పాలేరుగా ఉన్న చిట్టిగాడు, వాడి పిల్లలు జ్ఞాపకం వస్తారు. చిట్టిగాడి పిల్లలకి ఏదో ఒక దారి చూపాలని అనుకుంటాడు. చిట్టిగాడి భార్య చనిపోయిందని, వాడు క్షయతో బాధపడుతున్నాడని తండ్రి ఉత్తరం ద్వారా తెలుసుకున్న భార్గవ్ ఆవేదన చెందుతాడు. భార్గవ్ ఇదివరకటిలా ఉండటం లేదని స్నేహితురాలు అంజలికి చెప్పి బాధపడుతుంది మల్లిక. వెడ్డింగ్ యానివర్సిరినాడు భార్గవ్ తప్పతాగి ఇంటికి రాకుండా జిమ్ అపార్ట్‌మెంటులో పడి ఉండటంతో మల్లికకి మనస్సంతా శూన్యంగా అయ్యింది. పిల్లలు లేకపోవడమే దీనికంతా కారణం అనుకుంటుందామె. భార్గవ్ కంపెనీ స్టాకులు కొంటానంటే మల్లిక వద్దనిందని ఆమె మనసుని గాయపరిచే మాటంటాడు భార్గవ్. మల్లికకి గతం జ్ఞాపకం వస్తుంది. మల్లిక తను భార్గవ్‌కి దూరంగా వెళ్ళిపోతే అతను పిల్లల కోసం మళ్ళీ పెళ్ళి చేసుకుంటాడని అనుకుంటుంది. ఆ ఉద్దేశంతోనే నెల రోజులు చికాగోలో గడిపి వస్తానని భార్గవ్‌కి చెప్పివెళ్ళిపోతుంది. ఒక ముక్కు ముఖం తెలియని వ్యక్తి ద్వారా తన భార్య తిరిగి తన జీవితంలోకి రాదని విన్న భార్గవ్ ముఖం కోపంతో కందిపోతుంది.

దేశం వచ్చిన క్రొత్త అవటంతో అంతా తికమకగా వుండి లోన్‌లీగా వుండేది అప్పట్లో. ఆ టైంలో లూసీయే మల్లికతో స్నేహం కలిపింది. క్రొత్త విషయాలు వివరించి చెప్పింది. కొద్ది రోజుల్లోనే క్రొత్త దేశంలో వున్నాననే విషయం మరిచిపోయేలా చేసింది.

చికాగో వచ్చినాక ఇంతవరకూ భార్గవ్‌తో మాట్లాడలేదు మల్లిక. రెండు మూడుసార్లు ఫోన్ చేసినా అతనింట్లో లేదు, అర్ధరాత్రి వేళలో కూడా. ఆఫీసుకి చేసి ఆ టైంలో కూడా వర్క్ చేస్తున్నాడని తెలుసుకుని ఫోన్ పెట్టేసింది.

తను లేకపోతే అతనికి హాయిగా వుండి వుంటుంది. ఏ అడ్డంకి వుండదుగా? చక్కగా తన పని తాను చేసుకోవచ్చు. మిలియన్లు గడించవచ్చు. ఒక విధమైన కసిగా వుంది ఆమెకు. ఆమె నిశ్చయం తిరుగులేనిదిగా మారింది, ఆఫీసుకి రెజిగ్నేషన్ లెటర్ పంపింది. చికాగోలో వుద్యోగం వేట ప్రారంభించింది. త్వరలోనే వుద్యోగం దొరుకుతుంది. వేరే ఇల్లు చూసుకోవచ్చు. లేదా లూసీతో కలిసి ఇల్లు షేర్ చెయ్యవచ్చు.

అలా కిటికీలో నుండి బైటికి, వర్షంలోకి చూస్తూనే వుంది మల్లిక.

★ ★ ★ ★ ★


ఫిలిప్ వెళ్ళిపోయినాక మరి భార్గవ్‌కి పనిచెయ్య బుద్ధికాలేదు. అప్పటికప్పుడు ఒక నిశ్చయానికొచ్చాడు. చికాగో వెళ్ళి మల్లిక మొద్దు బుర్రలో కాస్త జ్ఞానం పోసి, అవసరమైతే బుర్ర బద్దలు కొట్టయినా సరే, సరిగ్గా ఆలోచించేలా చెయ్యాలి. మళ్ళీ తెల్లారేలోపల తిరిగి రావచ్చు. ఇక్కడున్నా ఈ పూటకి పనిసాగదు. రాత్రికి నిద్రా పట్టదు.

ఎయిర్‌లైన్స్‌ని పిల్చి రిజర్వేషన్ చేశాడు. ఇంకో రెండు గంటల్లో ఫ్లైట్. వున్నఫళంగా ఎయిర్‌పోర్ట్‌కి బైలుదేరాడు.


ఓహేర్ ఎయిర్‌పోర్ట్‌లో ప్లేన్ దిగేసరికి సాయంత్రం అయిదయ్యింది. బైట కుంభవృష్టిలాగా వాన పడుతోంది.

టాక్సీని పిల్చి ఎక్కాడు. లూసీ అడ్రస్ బైటికి తీసి డ్రైవర్‌కి చెప్పాడు.

డ్రైవర్ టాక్సీ పోనిస్తూ మాటలు మొదలెట్టాడు. "ఏం వాన! ఏం వాన! రెండ్రోజుల నుండి ఏకధారగా పడుతోంది. బైట తిరగాలంటే పెద్ద న్యూసెన్స్! ఇట్లాంటి సమయంలో హాయిగా ఇంట్లో టి. వి. ముందు కూర్చుని సిక్స్‌పాక్ బీర్, పాప్‌కార్న్ పట్టుకుని బాల్‌గేం వాచ్ చేసేవాడిదే జీవితం!" ఏమిటేమిటో







మల్లిక

చెప్పుకుపోతున్నాడు. ఊ కొడుతున్నా భార్గవ్ మనస్సు అతని మాటల మీద లేదు నెల రోజుల తర్వాత మల్లికను చూడబోతున్న ఆత్రంలో వుంది.

* * * * *

డోర్ బెల్ మోతకి చటుక్కున లేచింది మల్లిక. లూసీ దగ్గర కీస్ వుంటాయి. డోర్ బెల్ ఎందుకు మోగిస్తుంది? ఒకవేళ కీస్ మర్చిపోయిందేమో! పీప్ హోల్ నుంచి చూసింది.

ఒక్కసారి గుండె ఆగినట్లయ్యింది. వర్షపు జల్లులో తడుస్తూ నిల్చొనివున్న భార్గవ్!

గబుక్కున తలుపు తీసింది.

ఎదుటనున్నది మల్లికేనా అన్నట్లు ఆమె వంకే చూశాడు భార్గవ్. మనిషి చాలా చిక్కిపోయింది. జీవంతో మెరిసే ఆమె కళ్ళు వెలాతెలాగా వున్నాయి.

భార్గవ్ ఇంత మారిపోయాడేమిటి? కళ్ళు పెట్టుకుని అలాగే చూస్తోంది మల్లిక చెంపలలో తొంగిచూస్తోన్న తెల్ల వెంట్రుకలు, పెరిగిన గడ్డం, లోతుకుపోయిన కళ్ళు.

నెల రోజుల్లో ఇంత మార్పు సాధ్యమా? ఇద్దరి మనసుల్లోనూ ఒకటే ఆలోచన!

"లోపలికి రానియ్యవా? ఈ వర్షంలోనే నిలబెడతావా?" ముందు తనే తేరుకున్నాడు భార్గవ్.

వులిక్కిపడింది మల్లిక. జరిగి అతను రావటానికి చోటిచ్చింది.

లోపలికొచ్చి తలుపేశాడు భార్గవ్.

"పద. ముందు బట్టలు మార్చుకో" బాత్ రూమ్ చూపించింది.

ఇనీషియల్ షాక్ నుండి తేరుకుంది మల్లిక. పోయిన పెన్నిధేదో దొరికినట్లు మనస్సు నెమ్మదిగా డాన్స్ మొదలెట్టింది. ఆనందంతో పగిలేలా వున్న గుండెను అదుముకుంటూ కిచెన్‌లోకి వెళ్ళింది. గబగబా కాఫీ చేసి తీసుకొచ్చింది.

భార్గవ్ బట్టలు మార్చుకుని తల తుడుచుకుంటూ బైటికి వస్తున్నాడు.

ఇద్దరూ లివింగ్ రూమ్‌లో కాఫీ తాగుతూ కూర్చున్నారు కాఫీ పూర్తయ్యేవరకూ ఎవ్వరూ మాట్లాడలేదు.

"న్యూయార్క్‌లో జాబ్ రిజైన్ చేశావట. ఎందుకూ?" కప్పు టేబుల్ మీద పెడుతూ అడిగాడు భార్గవ్.

"నీకెలా తెలుసు?" ఆశ్చర్యపోయింది మల్లిక.

"ఎలా తెలిస్తేనేం? నిజమేనా?"

"నిజమే." కళ్ళు వాల్చుకుంది.

"అదే, ఎందుకూ అని అడుగుతున్నాను."

"ఇక్కడ జాబ్ చూసుకుంటున్నాను." ధైర్యంగా తలెత్తింది. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు తను ధైర్యంగా వుండవలసింది?

"ఏం, న్యూయార్కు జీవితం విసుగుపుట్టిందా?" మామూలుగానే అడిగాడు.

కాదు, నీతో ది జీవితం అనబోయి ఆవునంది.

"అయితే నేనూ జాబ్ రిజైన్ చేసి ఇక్కడికి రావాలా?"

మాట్లాడలేదు మల్లిక. చాలాసేపు చూశాడు భార్గవ్. అతనికి విసుగువచ్చింది.

"దయచేసి, ముసుగులో గుద్దులాట మాని ఇక అసలు విషయానికొద్దామా? వున్న వూళ్ళో మంచి ఉద్యోగం మాని ఇక్కడ చూసుకోవాల్సిన అవసరమేమొచ్చింది?"

తీక్షణంగా చూస్తున్న అతని కళ్ళల్లోకి చూడలేకపోయింది. ధైర్యం నీరుగారిపోయింది.

"మాట్లాడ్డానికే ధైర్యం లేనిదానివి డివోర్స్ ప్రొసీడింగ్స్ ఎలా మొదలెడతావు?"

అదిరిపడింది. అతనికెవరు చెప్పారు? ఈ విషయం లూసీకి, ఫిలిప్‌కి తప్ప ఎవ్వరికీ తెలియదు. అంజలిక్కూడా ఖచ్చితంగా తెలియదు. లూసీ తన వెనక అలా చెయ్యదు. ఇక మిగిలింది ఫిలిప్!

"మాట్లాడవేం?" గట్టిగా అడిగాడు.

అంతే. ఐస్ బ్రేక్ అయ్యింది. పిరికితనం మాయమయ్యింది.

"ధైర్యం లేకకాదు. సమయం కోసం చూస్తున్నాను."

"ఓహో! ఇంకా సమయం కుదరలేదా? ప్రపంచమంతా తెలిసినా నాకింతవరకూ తెలియకుండా దాచావు. ఒక నిర్ణయానికి వచ్చే ముందు నాతో చర్చించాలన్న కర్టెసీ అయినా లేదా నీకు? ఇది నీ ఒక్కదానికి సంబంధించిన విషయమనుకుంటున్నావా?" కోపంగా అడిగాడు.

మల్లికకూ కోపం వచ్చింది. "చర్చించటానికి తమరు దొరికితేగా? ఇంటికి నాలుగుసార్లు ఫోన్ చేసినా మనిషి పత్తాలేడు!"

"ల్యాబ్‌కి చెయ్యొచ్చుగా?"

"ఈ నెల రోజుల్లో నేను బ్రతికున్నానో, చచ్చానో కూడా అక్కర్లేని మనిషితో ల్యాబ్‌కి ఫోన్ చేసి మాట్లాడే గతి పట్టలేదు."

మళ్ళీ వ్యవహారం శృతిమించుతోందని గ్రహించాడు భార్గవ్. తను మల్లికతో సావకాశంగా, సామరస్యంగా మాట్లాడాలని వచ్చాడు. అసలీ మధ్య అర్థంలేని చిరాకు, కోపంవల్ల సంభాషణని త్రుంచేసి, మాట్లాడటం పూర్తిచెయ్యకుండా వెళ్ళిపోవటం వల్లనే విషయం ఇంతవరకూ వచ్చింది. మనస్సు విప్పి మాట్లాడే అవకాశం ఇద్దరూ ఒకరినొకరు ఇచ్చుకోలేదింతవరకూ.

"ఆవేశం వల్ల పనులు చక్కబడవు మల్లీ! అర్థంలేని ఆవేశాలతో, అపార్థాలతో పండంటి జీవితాలను పాడుచేసుకోవటానికి ఇది సినిమాకాదు. ఇద్దరం చదువుకున్నాం. విజ్ఞానం సంపాదించాం. లోకానుభవం గడించాం. చిన్నపిల్లల్లాగా సిల్లీగా కొట్లాడుకోవటం మాని రేషనల్‌గా మాట్లాడుకుందాం. సరేనా?" మృదువుగా అన్నాడు భార్గవ్.

"సరే" ఒప్పుకుంది మల్లిక.

వృత్తిలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నదే నా ఆశయం!



కాని నా బ్యాంకు - వైశ్యాబ్యాంకుకు చేరువవ్వడం నాకు మరింత ముఖ్యం.


ఎందుకో తెలుసా ? వైశ్యాబ్యాంకులో చేసిన పొదుపు నా భావి జీవితానికి బలమైన పునాది. వైశ్యాబ్యాంకు నాబోటివారికి మరెన్నో అనువైన పథకాలను రూపొందించింది.

మీరూ మా పరంపర డిపాజిట్ పథకంలో పొదుపుచేసి మీ భావి-జీవితంలో ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పొందండి.

మీ పొదుపు మా పరంపర పథకంలో ఎలా అభివృద్ధి చెందుతుందో మీరే చూడండి.

నెలసరి డిపాజిట్ మొత్తం	పొదుపు చేయవలసిన కాలం	పొదుపు చేయబడిన మొత్తం	121 నెలల తరువాత మేము మీకు ఇవ్వవలసినది నెలకు	లేక పూర్తిమొత్తం
రూ 100/-	120 నెలలు	రూ 12,000/-	రూ 197 80	రూ 21,772/-

ప్రజా సేవలో 50 సంవత్సరాలకు పైగా అనుభవమున్న వైశ్యాబ్యాంకు, మీ ప్రతీ అవసరానికి తగిన, అనువైన పథకాలను రూపొందించింది.
వివరాలకు మీ దగ్గరలో యున్న మా బ్రాంచిని సంప్రదించండి.



రండి, కలిసి అభివృద్ధి సాధిద్దాం

ది వైశ్యా బ్యాంక్ లిమిటెడ్

రిజిష్టర్డ్ ఆఫీసు అవెన్యూరోడ్ బెంగుళూరు 560 002
అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసు
72 సెయింట్ మార్క్స్‌రోడ్, బెంగుళూరు 560 001

ఛైర్మన్ రమేశ్‌గెల్లి

KIRON/VBL/85

మల్లిక

"అయితే చెప్పు. డివోర్సు ఎందుకు కావాలనుకుంటున్నావు?"

"ప్రస్తుత పరిస్థితిలో అదే మార్గంగా తోస్తోంది." ఆగిపోయింది మల్లిక. మళ్ళీ ఏదో గడ్డ కరుతోంది.

"ఏ పరిస్థితి?"

"దేనివల్ల నాకు దూరంగా, వర్కుకి దగ్గరగా వెళుతున్నావో ఆ పరిస్థితి! నువ్వు దేశసేవ అంటూ మిలియన్లు గడించటానికి ఎందుకు బైలుదేరావో నాకు తెలియదనుకున్నావా? నీకెంతో ఇష్టమైన పిల్లల్ని ఇవ్వలేని నేనంటే నీకు విసుగుపుట్టింది. నానుండి దూరంగా వెళ్ళటానికే అలా చేస్తున్నావు. అందుకే నీకు దూరంగా వెళ్ళిపోవాలనుకుంటున్నాను. నీ జీవితంలో అడ్డుగా వుండటం నాకిష్టం లేదు. నువ్వు మళ్ళీ పెళ్ళి చేసుకుని నీక్కావల్సినంత మంది పిల్లల్నికని సంతోషంగా వుండు" మల్లిక తలవంచుకునే ఇదంతా చెప్పింది.

భార్గవ్ లేచివచ్చి ఆమె ప్రక్కన కూర్చున్నాడు. ముఖం పైకెత్తాడు.

"నువ్వు వెళ్ళిపోతే నేను మళ్ళీ పెళ్ళి చేసుకుని సంతోషంగా వుండగలననే అనుకుంటున్నావా?"

మల్లిక మాట్లాడలేదు.

"పోనీ, ఆవిధంగా నాకు పిల్లలు పుడతారన్న గ్యారంటీ అయినా వుందా?"

మళ్ళీ మాట్లాడలేదు మల్లిక.

"లేదు. ఎందుకంటే లోపం నీలో వుందో, నాలో వుందో తెలియదు గనక." తనే అన్నాడు.

"నీ టెస్ట్ రిజల్ట్స్ బాగానే వచ్చాయిగా?" గొంతు పెగుల్చుకుని అంది.

"నీవిమాత్రం రాలేదా?" మల్లిక మాట్లాడలేదు.

"ఒకటడుగుతాను చెప్పు. నా నుండి విడిపోయి నువ్వు సంతోషంగా వుండగలవా?"

జవాబు చెప్పేముందు ఒక్క నిముషం ఆలోచించింది మల్లిక.

"ఇది సంతోషానికి సంబంధించింది కాదు. బాధ్యతకు సంబంధించింది! ఇద్దరూ సఫరవ్వటం దండగ కదూ?"

భార్గవ్‌కి ఒళ్ళు మండింది. ఇంత చెప్పినా అర్థం చేసుకోదేం? "నాకోసం నీ జీవితాన్ని ఫణంగా పెట్టే త్యాగమూర్తివి నువ్వైతే నా సంతోషాన్ని చూసుకునే స్వార్థపరుణ్ణి నేనేనా? నేనంటే నీకున్న అభిప్రాయం అదేనన్నమాట?"

"ఇందులో త్యాగాల ప్రసక్తి ఏముంది?" నెమ్మదిగా అంది.

"మరి నువ్వు చేస్తున్నదేమిటి? బూడిదలో పన్నీరు పోసినట్లు నువ్వు చేస్తున్నాననుకుంటున్నది అర్థంలేని త్యాగం! ఎవ్వరికీ సంతోషాన్నివ్వలేనిది, వుపయోగపడనిది. ఆదివరకొకసారి నేనన్నట్లు చాలా తెలివిగల దాన్ననీ, అందరి మనసుల్నీ చదవగలననీ నీకు గర్వం. కాని నా అభిప్రాయం ప్రకారం నువ్వొస్టి ఫూల్‌వి!

నాకు పిల్లలంటే ఇష్టం. నిజమే! పిల్లలు పుట్టటం లేటవుతున్నకొలదీ నాలో ఫ్రస్ట్రేషన్ పెరిగిన మాటా నిజమే! ఆ రియాక్షన్ సహజమేననుకుంటున్నాను. ఎందుకంటే నేను మనిషిని!

ఆ లెక్కన నువ్వూ ఎంతో బాధపడ్డావు. పిల్లలు లేకపోతే జీవితమే లేదా అంటూ వాదించిన నువ్వు స్టెఫనీ మీద మమకారం పెంచుకుని, ఆ పిల్ల వెళ్ళిపోగానే ఎంత వ్యధననుభవించావో నాకు తెలియదనుకున్నావా? నెల నెలా కన్సెప్షన్ కోసం ఎదురు చూసి, పిరియడ్ రాగానే ముఖం వేళ్ళాడేసుకుని తిరిగే నిన్ను గమనించలేదనుకున్నావా?

నువ్వు లేకపోతే నాకు జీవితమే వుండదని నీకు తెలుసు. నేను లేకుండా నువ్వు సంతోషంగా వుండలేవని నాకు తెలుసు. నెల రోజుల తర్వాత నిన్ను చూస్తుంటేనే ఆ విషయం తెలుస్తోంది.

ఇక నువ్వు చేసే ఈ పనివల్ల ఎవరికి లాభం?

పిల్లలుంటే నాకు సంతోషంగానే వుంటుంది. కాని నువ్వులేని పిల్లలు నాకిచ్చేది సగం సంతోషం మాత్రమే! నా ఆనందమనే త్రాసులో ఒకవైపు నిన్నూ, ఒక వైపు పిల్లల్ని వుంచితే నువ్వే ఒకపాలు ఎక్కువ తూగుతావని నాకు తెలుసు. ఇప్పుడు పిల్లలు లేరని బాధపడిన దానికంటే నువ్వులేనినాడు ఎక్కువ బాధపడతాను. లేనిదానికోసం వున్న సంతోషాన్ని ఒదులుకునే మూర్ఖుణ్ణి కాను!

ఆలోచిస్తుంటే నాకొకటి అర్థమయ్యింది. పిల్లలు కావాలనుకోవటం ఒకరకంగా స్వార్థమే! ఒక ప్రాణిని సృష్టించామనే తృప్తి, ఆ ప్రాణిని పెంచి పెద్దజేసి ఒక వ్యక్తిత్వం ఏర్పరచామనే ఆనందంకంటే కూడా తమ తర్వాత తమలోని అంశ అంతరించకుండా తరతరాలుగా ఈ భూమ్మీద వుండాలనే స్వార్థమే జీవులకు ఎక్కువగా వుంటుంది.

అది సాధ్యంకాదని తెలిసి ఇంకొకరకంగా నా పేరు భూమ్మీద నిలవాలని ఈ ప్రాజెక్ట్ చేపట్టానేమో! పేదవాళ్ళను ఆదుకోవాలనే ఆలోచన అందుకే కలిగిందేమో! నాకే సరిగ్గా తెలియదు. కారణం ఏదైనా, చేసేపని నలుగురికీ మేలు చేసేది అయినప్పుడు పూర్తి చెయ్యాలనే అనుకుంటున్నాను. దీనివల్లనే నీతో ఎక్కువటైం గడపలేక పోయాను. అంతేగాని, నీమీద విసుగుతో కాదు.

అయితే ఒక గుడ్ న్యూస్! రిజల్ట్ రావటానికి ఇంకా ఎంతో దూరం లేదు రెండు మూడు వారాలు లేదా మహాఅయితే నెలరోజులు ఓపిక పడితే చాలు.

బాగా ఆలోచించు మల్లీ! ఇది నీ ఒక్క దాని జీవితమే కాదు. నా ఆనందం, ఆశ, వూపిరి అన్నీ నువ్వే! నువ్వెళ్ళిపోతే అన్నీ నీతో పాటే వెళ్ళిపోతాయి. నాకు మిగిలేది శూన్య జీవితమే!"

దుడుకుగా మొదలైన అతని స్వరం మాట్లాడ్డం ముగించేసరికి జీరగా మారింది.

మల్లిక అతని ముఖంలోకి చూసింది. జీవమంతా ఎవరో తోడేసినట్లు పాలిపోయివుంది ముఖం. కళ్ళు అలిసిపోయి వున్నాయి. భార్గవ్‌ని ఆ స్థితిలో ఎప్పుడూ చూడలేదు మల్లిక. ఆమెలో ఎమోషన్స్ వువ్వెత్తుగా లేచి గొంతులో అడ్డుకున్నాయి. నిశ్శబ్దంగా అతని తలను హృదయానికి హత్తుకుంది. ఎన్నో రోజుల తర్వాత అతని స్పర్శ హాయిగా వుంది. ఈ మనిషి తన ప్రక్కన లేకపోతే తను బ్రతకగలదా? బ్రతికినా అందులో సారముంటుందా?

12

మర్నాడు తెల్లవారు ఝాము ఫ్లైట్‌లో మల్లికతో కలిసి న్యూయార్క్ వచ్చేశాడు భార్గవ్. చాలా రోజుల తర్వాత తీరిగ్గా గడ్డం గీసుకుని, స్నానం చేసి, సరైన బ్రేక్‌ఫాస్ట్ తిని లాబ్‌కెళ్ళాడు.

మల్లిక ఆఫీసుకెళ్ళి తన రెజిగ్నేషన్ కాన్సిల్ చేసి యథాప్రకారం డ్యూటీలో జాయిన్ అయ్యింది

"వెల్‌కమ్ బాక్ మల్లికా!" సంతోషంగా అన్నాడు ఫిలిప్. కళ్ళు చిట్లించింది మల్లిక. గబగబా అతని రెక్క పట్టుకుని డైనింగ్‌రూంలోకి తీసికెళ్ళి కుర్చీలో కుదేసింది.

"ఇప్పుడు చెప్పు! డివోర్స్ సంగతి భార్గవ్‌తో చెప్పిందెవరు?"

"ఏమో నాకేం తెలుసు?" అమాయకంగా అన్నాడు.

"చాలించు నీ అమాయకత్వం! నీకు తప్ప మరెవ్వరికి తెలియదు. నిజం ఒప్పుకో." సీరియస్‌గా అడిగింది.

"సరే. నేనే చెప్పాను. ఇప్పుడు జరిగిన నష్టమేముంది? నువ్విక్కడున్నావు అంటే కథ సుఖాంతమైనట్లేగా?"

"సరే, ఇప్పుడు మంచే జరిగిందనుకో! కాని, నీకు ఏవైనా రహస్యాలు చెబితే బైట పెట్టేస్తావన్న మాటేగా ? ముందు ముందు నిన్ను నమ్మగూడదన్నమాటేగా?"

"కమాన్ మల్లికా! యు నో మి బెటర్ దేన్ దట్! ఏవి చెప్పాచ్చో, ఏవి చెప్పగూడదో నాకు తెలియదనుకున్నావా? ఒక మూర్ఖురాల్లాగా జీవితాన్ని నాశనం చేసుకుంటుంటే చూస్తూ వూరుకుంటాననుకున్నావా?" ఆవేశంగా ఇంకా ఏదో అనబోయాడు ఫిలిప్.

అతని చేతిని తనచేతిలోకి తీసుకుంది మల్లిక.

"ఐ థాంక్యూ మై ఫ్రెండ్! నీలాంటి గొప్ప స్నేహితుడు దొరకటం నా అదృష్టం!"

మల్లిక ఇంకేదో తిడుతుందని ఎదురుచూసిన ఫిలిప్ తెల్లబోయి చూశాడు.

(ఇంకా ఉంది)


సుభాషితాలు

విద్యా బంధుజనో విదేశ-

గమనే విద్యా పరా దేవతా

విద్యా రాజసు పూజితా న హి

ధనం విద్యా విహీనః పశుః




విదేశాలకు వెళ్ళినప్పుడు విద్యయే బంధువుగా ఆదుకొంటుంది. విద్య గొప్ప ఆరాధ్య దేవత. విద్య ప్రభువుల మెప్పును అందిస్తుందిగానీ ధనం కాదు. విద్య లేని వాడు వింత పశువు.

విద్యా నామ నరస్య రూప-

మధికం ప్రచ్ఛన్న గుప్తం ధనమ్

విద్యా భోగకరి యశ-

స్సుఖకరి విద్యా గురూణాం గురుః



విద్య మనిషికి గొప్ప రూప సంపద. విద్య ఎవరికీ కనబడకుండా దాచుకున్న ధనం. విద్య భోగాలనూ కీర్తినీ సుఖాలనూ సమకూరుస్తుంది విద్య గురువులకేగురువు

—ఆయుర్వేద శిరోమణి రాజ రాజేశ్వర శర్మ

హాలీవుడ్ గగన తలంలో వింత కాంతులు వెదజల్లే విభిన్న తారలు!

"**టై**యిమ్" వార పత్రికలో హాలీవుడ్ తారా **లోకాన్ని** గురించి ఒక సమగ్రమైన వ్యాసాన్ని "మేజిక్ **షాడోస్** ఫ్రమ్ ఎ మెల్టింగ్ పాట్" పేరిట రిచర్డ్ **కార్లిస్** అందించారు. జులై 8, 1985 వ సంచికలో ప్రచురించబడ్డ ఈ వ్యాసంలో ఆసక్తికరమైన **అంశాలు** ఎన్నో ఉన్నాయి.

హాలీవుడ్ పేరు వినని వారు ఉండరు. 1900 లో లాస్ ఏంజెలెస్ పేరు కూడా సరిగా తెలిసేది కాదు. కానీ హాలీవుడ్ అక్కడ చోటు చేసుకున్నాక అది ఊహాతీతంగా ఎదిగిపోయి "డ్రీమ్‌లాండ్"లా రూపొందడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. సినిమాల ప్రభావం సంఘ జీవితంపై ఎంతగా ఉందో చెప్పవలసిన అవసరంలేదు. చిత్ర వ్యాపారం ప్రపంచ విపణి వీధిలో సరిక్రొత్త సంచలనాన్నే కలిగించింది. హాలీవుడ్ కళాకారులకి విశ్వవ్యాప్తంగా గౌరవ ప్రతిష్ఠలే కాక, ఆకాశాన్ని అందుకొనేంత ఐశ్వర్యం కూడా లభ్యమయింది. చిత్ర నిర్మాతలు కుబేరులుగా పరిణమించారు. హాలీవుడ్ సంక్షోభంలో పడిందని వార్తలు అందుతున్నా, హాలీవుడ్ నిర్మాతలు, కళాకారులు విపరీతంగా పెంచుకొంటున్న నిర్మాణపు ఖర్చులు, **పారితోషికాలే** దానికి **కారణం అనిపిస్తుంది కాని మరొకటి కాదు.**



(1917)లో చార్లీ చాప్లిన్

హాలీవుడ్‌లో పేరు గడించినవారూ, సంపదని పెంచుకొన్నవారూ అమెరికన్‌లేనని అపోహపడితే పొరపాటు. హెర్మన్ మెల్‌విల్లే (ఈయన హాలీవుడ్‌కి చెందినవారు) అభిప్రాయ పడినట్లు హాలీవుడ్ తారాపథంలో చిత్ర విచిత్ర ద్యుతులతో మణికాంతులతో తళుకులీనే తారలన్నీ ఇతర దేశాలనుంచి వలస వచ్చినవే! తొంభై శాతంకి పయిగా హాలీవుడ్ నటులుకాని, నిర్మాతలు కాని, సాంకేతిక నిపుణులు కాని, రచయితలుకాని అందరూ అమెరికాకి కళా వ్యాపారం చేసుకోవటానికి వచ్చినవారే! ఇందులో అతిశయోక్తి ఏమి లేదు.

అడాల్ఫ్ జూకర్ పారమవుంట్ పిక్చర్స్ అధ్యక్షుడు. ఈయన హంగేరియన్! యూనివర్సల్ పిక్చర్స్ వ్యవస్థాపకుడయిన కారల్ లియమ్మెల్ జర్మనీనించి వలస వచ్చినవారు. సేమ్యూల్ గోల్డ్‌విన్ వార్సానించి హాలీవుడ్‌కి చేరుకొని గోల్డ్‌విన్ స్టూడియోని కట్టించారు. లూయిస్ మేయర్ మిన్స్క్‌నించి అమెరికా చేరుకొన్న వ్యాపారస్థుడు. మెట్రో - గోల్డ్‌విన్ - మేయర్ సంస్థకి ఈయన జనరల్ మేనేజర్! క్లార్నెస్ క్లారెన్స్ అనే చలన చిత్రాల చరిత్రకారుడు ఈ అంశంపై వ్యాఖ్యానిస్తూ అమెరికాకి వలస వచ్చిన హాలీవుడ్ వ్యాపారస్తులు. వారు పెరుగుతూ, హాలీవుడ్ స్థాయిని కూడా పెంచుతూ వచ్చారని అనడంలో ఎంతైనా వాస్తవముంది.

హాలీవుడ్ నటుల విషయంలో కూడా ఇంతే! ప్రపంచ ప్రసిద్ధి పొందిన హాలీవుడ్ నటుడు చార్లీ చాప్లిన్ అమెరికన్ కాదు. లండన్‌కి చెందిన మురికివాడలో నివసించే ఒక పేద కుటుంబంనించి ఈయన పైకి వచ్చారు. 1910 ప్రాంతంలో వారానికి 150 డాలర్‌లు పుచ్చుకునే ఈయన అతి త్వరలోనే యావత్ప్రపంచమూ గుర్తించిన హాస్యనటునిగా, అత్యంత ధనికుల్లో ఒకరిగా రూపొందారు. "లిటిల్‌ఫెలో"గా పిలువబడే చార్లీ చాప్లిన్ "పవర్‌ఫుల్ ఫెలో"గా మారడం హాలీవుడ్ ప్రభావమేనని అమెరికన్ నవలా రచయిత అప్టాన్ సిన్ క్లాయిర్ ప్రకటించడం యధార్థాన్నే చెబుతుంది. చాప్లిన్‌తో సరిసమానంగా పాప్యులారిటీని, ప్రాపర్టీని సాధించుకొన్న హాలీవుడ్ నటీమణి మేరీ పిక్‌ఫోర్డ్ టొరంటోకి చెందినది.



లూయిస్ బి. మేయర్



శామ్యూల్ గోల్డ్‌విన్



ఫ్రాంక్ కాప్రా



ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్



మేరీ పిక్‌ఫోర్డ్



రుడాల్ఫ్ వాలెంతినో



గ్రేటా గార్బో

"ప్రేమికుడు" రుడాల్ఫ్ వాలెంటినో ఇటలీ వాస్తవ్యుడు. జానపద కథా నాయకుడు సెస్యూ హయాకవా జపాన్‌కి చెందినవాడు. విషాద పాత్రల కథా నాయిక పోలా నెగ్రి పోలెండ్ దేశస్థురాలు. వ్యాంప్ పాత్రధారిణి గ్రేతా గార్బో స్వీడెన్ వనిత! ఇలాగ ఎంతోమంది నటీ నటులు భిన్న దేశాలకి చెందినవారు. ముఖ్యంగా హంగేరి, ఆస్ట్రియా, జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్, కెనడా, ఇటలీ, సోవియెట్ యూనియన్, స్వీడన్ దేశాల వారికి హాలీవుడ్ స్థావరంగా ఉందని చెప్పవచ్చు.

హాలీవుడ్ చిత్ర దర్శకులలో కూడా విదేశీయులదే పైచేయి. ఉత్తమ దర్శకత్వానికి ఇచ్చే ఆస్కార్ అవార్డులని కూడా వీరే ఎక్కువగా సంపాదించారు. తాజాగా ఇచ్చిన ఆస్కార్ అవార్డ్‌ని చెకొస్లోవేకియాకి చెందిన మిలాస్ ఫార్మన్ గెలుచుకున్నారు. 'అమడ్యుయస్" చిత్రం ఊహించని ఆర్థిక విజయాన్ని కూడా సాధించింది! ఫ్రాంక్ లియాడ్, ఫ్రాంక్ కాప్రా. విలియమ్ వయిలర్, ఇలియా కాజన్ మొదలైన డయిరక్టర్లందరూ ఆస్కార్ అవార్డ్ విజేతలే! వీళ్ళు అమెరికన్‌లు కారు!! గొప్ప దర్శకుల జాబితాకి ఎక్కిన మైఖేల్ కర్‌టిజ్ బూడాపెస్ట్‌కి చెందినవారు. సస్పెన్స్ చిత్ర దర్శకుడు ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్ లండన్‌లో పుట్టినవారు. ఆడ్రీ హెప్‌బర్న్ బెల్జియమ్‌కి చెందినవారు. ఇంతెందుకు? కళా దర్శకుడు కార్ల్ జూల్స్, వేయిల్ జర్మనీ దేశస్థులు! సంగీత దర్శకునిగా అమోఘమైన ఖ్యాతిని గడించిన మాక్స్ స్టెయినర్ వియెన్నా వాస్తవ్యులు! చెప్పుకోదగ్గ విశేషం ఏమిటంటే సోవియెట్ యూనియన్‌కి చెందిన స్లావా డ్వకర్‌మెన్ వంటి దర్శకులు కూడా హాలీవుడ్‌లో ఉండటం!

హాలివుడ్‌లో వ్యాపారమే ప్రధాన అంశమైనా భిన్న భిన్న సంస్కృతులు, సంప్రదాయాలు ఉన్న కళలకి వారధిగా కూడా అది నిలబడడం ఎంతైనా సంతోషాన్ని కలిగిస్తుంది అమెరికాకి ఇది వరం లాంటిది! □

—డా. జి. ఆర్. బి.

ఓ కన్నీటి కథ

శ్రీకంఠ స్ఫూర్తి

కమల కళ్ళనుంచి కన్నీళ్ళు జలజలా రాలుతున్నాయి...

బస్సు ముందుకు దూసుకు పోతూంది కిటికీ ప్రక్క సీటులో కూర్చుంది కమల. బయట ఎండ నిప్పులు చెరుగుతూంది. వేడిగాలి ఉండుండి విసిరి కొడుతూంది. ఎన్నో దృశ్యాలు కనుమరుగవుతూ వెనక్కి పోతున్నాయి ...

కమల కళ్ళనుంచి కన్నీళ్ళు జలజల రాలుతూనే ఉన్నాయి... ఎంత ఆపుకుందామన్నా ఉబికి వస్తోన్న దుఃఖం... ఆవేదన! కమల కొంగుతో కళ్ళు ఒత్తుకుంటోంది... అయినా ఆగని కన్నీటి స్రవంతి. ఆమె గుండెలు తడిసి పోతున్నాయి. ఆమె మనసు నిముష నిముషానికి బరువెక్కి బావురు మంటూంది. ఆంతర్యంలో బాధ కన్నీటి రూపంలో అలా కక్కుకుంటూ వస్తోంటే- మూగదానిలా ఆమె రోదిస్తోనే ఉంది. బస్సులో ప్రయాణీకులు ఆమెను వింతగా చూస్తున్నారు... జాలిగా చూస్తున్నారు... సానుభూతి కురిపిస్తున్నారు. ప్రక్కనే కూర్చున్న ఇద్దరాడవాళ్ళు తరచి తరచి అడిగినా ఆమె మాట్లాడే లేదు ఉలక లేదు .. పలక లేదు. ఆమె ఎందుకలా ఏడుస్తుందో- ఆమె కొచ్చిన కష్టం ఏమిటో ఎవరికీ అంతుపట్టలేదు.

బస్సు ముందుకు పరుగెడుతూనే ఉంది.

కమల కొద్దిగా కదిలింది. కొంగుతో మళ్ళీ కళ్ళు ఒత్తుకుంది ఇబ్బందిగా చేతులు పైట క్రిందకు పోనిచ్చి జాకెట్టు తడిమి తడిమి చూసుకుంది. ఆమెకు జాకెట్టు ఉపరితలం తడితడిగా తగిలింది. ఉబికి వస్తోన్న స్తన్యం' ఆమె ఇక ఉండబట్టలేక పోయింది. వెక్కెక్కి ఏడుతూ కిటికీ బయటకు చూస్తూ ఉండి పోయింది.

ఆరు నెలల పసిగుడ్డు. తన చిన్నారి కూతురు "శాంతి" కమల కళ్ళల్లో మెదిలింది. తన స్తన్యం కుడుపుతూ పాలు త్రాగాల్సిన పసి పిల్ల- అత్త మామల చేతుల్లో ఎలా ఉందో? ఏడుస్తుందేమో గుక్క బెట్టి.. తను కనిపించకపోతే బెంగతో నీరసించి పోతుంది.. తప్పదు తన పాలు తప్ప- పోతపాలు అసలు "శాంతి" త్రాగదు. ఏం చేస్తారు వాళ్ళు? పాలు తెప్పించి పడతారా? పట్టకుండా వదిలేస్తారా? ఊహూఁ పాలు పడతారు... కాని శాంతి ఆ పాలు త్రాగదు. పాలు త్రాగక- ఒకటే గుక్కబెట్టి ఏడిస్తే- తన శాంతి ఏమవుతుంది ? ఆ శాంతి కేదయినా అయితే తనేమవుతుంది" అమ్మో! శాంతిని మళ్ళీ తను చూడగలుగుతుందా" తను మళ్ళీ కాకినాడ వెళ్ళ గలుగుతుందా" ఆ ఆశ లేదు ఆ నమ్మకంలేదు. ధైర్యం లేదు తన కలల పంట పసిడి ముద్ద... చిన్నారి శాంతి . అమ్మో! .

కమలకు దుఃఖం తెరలు తెరలుగా ఉబికి వస్తోనే ఉంది.

కట్నంతాలూకు బాకీ మూడు వేలు తీసుకు రాకపోతే- కన్న కూతురిమీద ఆశ ఒదులుకోమని ఖచ్చితంగా చెప్పింది అత్తగారు...

మళ్ళీ ఆ యింటి గడపలో కాలు పెట్టొద్దని గర్జించాడు మావగారు ..

తల్లి దండ్రుల్ని ఎదిరించలేక- అత్తగారు తనను మెడ బట్టుకుని గెంటుతూంటే ఆమెకు వత్తాసు పలుకుతూ ఉండిపోయాడు పిరికి భర్త ..

తన వెనకనే బస్టాండుకు వచ్చి . తమ ఊరుకు టిక్కెట్టు తీసి- బస్సెక్కించాడు. కట్నం డబ్బు తీసుకు రాకపోతే కాపురం లేదన్నాడు. కన్న కూతురు దక్కదన్నాడు. తను మరో పెళ్ళి చేసుకుంటానన్నాడు.

మొత్తం మీద ముగ్గురూ కలిసి ఆరు నెలల పసి పిల్లని తమ వద్ద ఉంచేసుకున్నారు.. కనికరం లేకుండా తల్లీ బిడ్డల్ని వేరు చేశారు ఇప్పుడేం చేయాలి?

బస్సు షడన్ బ్రేకుతో ఆగింది... కమల త్రుళ్ళిపడి ఈలోకంలోకి వచ్చింది. రోడ్డు కడ్డంగా బిక్కచిక్కిన గేదె.. దానివెంట పిల్ల కాబోలు నీరసంగా నడుస్తోంది. డ్రైవరు గ్యాసు హారను అదేపనిగా కొడుతున్నాడు. నాలుగు గంటల ప్రయాణం... మూడు గంటల ప్రయాణం అప్పుడే గడిచి పోయింది. ఇంకో గంటలో తను ఇంటికి చేరుకోవచ్చు...

కమల సీటుకు వెనక్కి చేరగిలపడి కళ్ళు మూసుంది... అయినా ఆమె కళ్ళు కన్నీటి సెలయేళ్ళుగా ఉబుకుతూనే ఉన్నాయి. మూడు నెలల నుంచి మరి నరకయాతన పెడుతున్నారు. కనీసం బిడ్డతల్లి నన్న జాలి లేదు. అత్తగారు అనుక్షణం వేధింపు. సూటిపోటి మాటలు . ఒకోపూట అన్నం వండక పోవడం .. వండినా తనకు పెట్టక పోవడం భర్త సుబ్రహ్మణ్యం చీటికి మాటికి చెయి చేసుకోవడం .. మావగారు కూడా కనీస మానవత్వం లెకుండా తనపై విరుచుకుపడటం...

పెళ్ళిలో ఇస్తామన్న కట్నం నాన్న పూర్తిగా ఇవ్వలేక పోయాడు రెండు వేలు బాకీ పడ్డాడు. ఒక వెయ్యి ఆడపడుచు లాంఛనాలతో కలిసి మొత్తం మూడు వేలు ఇవ్వాలి మూడు నెలల్లో ఇస్తానని ఒప్పుకున్నది మూడేళ్ళు దాటింది ఈ మూడేళ్ళ లోనూ- అమ్మ పోయింది నాన్న రిటైరయ్యాడు. వచ్చిన ప్రావిడెంటు ఫండు డబ్బుతో నిరుద్యోగ అన్నయ్య పరారీ అయ్యాడు నాన్నకు పెన్షన్ డబ్బులే ఆధారం ఇంక ఎలా- వాళ్ళ కట్నం బాకీ తీర్చడం? ఇంటికి వెళ్ళినా, నాన్నను పట్టుకుని తనూ- తనను పట్టుకుని నాన్న ఏడవటం తప్ప చెయ్య గలిగిందేమి లేదు. మరేం చెయ్యాలిప్పుడు? తన బ్రతుకును అంతం చేసుకోవడమే! శాంతి లేకుండా తను బ్రతకదు .. బ్రతక లేదు.. కట్నం డబ్బు తీసుకెళ్ళకపోతే- వాళ్ళు తనను బ్రతకనివ్వరు... శాంతిని కనిపించ నివ్వరు..

కమల ఒక నిర్ణయానికొచ్చి కళ్ళు తెరిచేటప్పటికి బస్టాండులో బస్సు ఆగి ఉంది. ప్రయాణీకులంతా దిగి పోయారు. కమల కంగారుపడుతూ బస్సు దిగింది. స్టాండు బయట కొచ్చింది. అక్కడ రోడ్డు రద్దీగా ఉంది. ఒక దాని వెంట ఒకటి వాహనాల పరుగు.. జనం హడావుడి. ఎక్కడి కెళ్ళాలి" ఏం చెయ్యాలి?- ఆలోచించకుండానే కమల రోడ్డు మధ్యకు నడిచింది... ఆమె కళ్ళు మూసుకుంది.. మరుక్షణంలో ఓ- కెవ్వుమన్న కేక ఆ పరిసరాల్లో ప్రతిధ్వనించింది .

* * * * *

"కమల ఎక్స్పైర్డ్- స్టార్ట్" – రమణయ్య.

మెసెంజర్ చేతిలోంచి టెలిగ్రాం అందుకుని అదిరిపడ్డాడు సుబ్రహ్మణ్యం అతని వెన్నులోంచి వణుకు పుట్టింది . మనిషి నిలువెల్లా కంపించి పోయాడు. ఊహించని బాధ.. భయం అతని మనసును ఉక్కిరి బిక్కిరి చేశాయి . "అమ్మా!"

అరిచినట్టుగానే కేకపెట్టాడు సుబ్రహ్మణ్యం.

"ఏంటిరా? అంత గట్టిగా అరిచావు... వెధవ పిల్ల ఒకటే ఏడుస్తోంది'" దుర్గమ్మ వంటగదిలోంచి బయట కొచ్చింది.

"టెలిగ్రాం' అమ్మా! కమల. కమ..-" కొడుకు జీరబోయిన కంఠంతో చెప్పిన వార్త విని కొయ్యబారినట్లయ్యింది దుర్గమ్మ. కోడలు చనిపోయిందా! ఎంత పని చేసింది!

"ఏం చేద్దాంరా ఇప్పుడు?" ఆమె అయోమయంగా అడిగింది.

"ఏముంది? పిల్లని తీసుకెళ్ళి అప్పగించి వచ్చేస్తాను. వెళ్ళకపోతే బాగుండదు . సూట్కేస్లో ఒక జత బట్టలు సర్దు' అది చస్తూ ఏం చెప్పిందో- వాళ్ళంతా ఏం గొడవ చేస్తారో!"

"మినాన్న బయటి కెళ్ళారు... ఆయ నొచ్చిన తరువాత మేమూ బయలుదేరి రమ్మంటావా?"

దుర్గమ్మ భయం భయంగా అడిగింది.

'వద్దు' మిరొస్తే- అక్కడి వాళ్ళంతా దాన్ని కాల్చుకు తిన్నారని - ఒకటే దుయ్యబడతారు. నేనెదో ఆ తతంగం పూర్తయ్యాక ఏదో చెప్పి... తప్పించుకుని వచ్చేస్తాను!"

కొడుకు సలహాతో దుర్గమ్మ గబగబా సూట్‌కేస్ సర్దింది

సుబ్రహ్మణ్యం ఆరు నెలల శాంతిని ఒక చేత్తో ఎత్తుకుని- హడావుడిగా బస్టాండుకు వచ్చాడు బస్టాండులో సిద్ధంగా ఉన్న ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు అతని మనసులో అలజడి . ఆందోళన!


కమల పుట్టింటికి వెళ్ళి అప్పుడే మూడు రోజులయింది... ఇంతలో ఇంత పని చేస్తుందని తను ఊహించ లేదు. ఈ మూడు రోజుల్నుంచి శాంత, ఇంట్లో ఒకటే ఏడుపు. . ఎంత ఊరుకో బెట్టినా- ఎన్ని ప్రయత్నాలు చేసినా ఈ పిల్ల ఏడుపు తగ్గలేదు..

సుబ్రహ్మణ్యం భారంగా తల పట్టుకున్నాడు...

బస్సు బయలుదేరి వేగాన్ని అందుకుంది. అతని మనసు కల్లోలంగా ఉంది అతని అణువణువు లోనూ అశాంతి పెల్లుబుకు తోంది ఒళ్ళో శాంతి ఏడ్చి ఏడ్చి నిద్రపోయింది

ఇకనుంచి ఈ పిల్ల- తల్లిలేని పిల్లగా పెరుగుతుందా అనుకున్నాడు అలా అనుకోగానే అతని గుండె ఆర్ద్రంగా కొట్టుకుంది . కమల రూపం కళ్ళెదుట కనిపించి నట్లయ్యింది. ఎంత పని చేశావు- కమలా అంటూ తల వెనక్కి వాల్చాడు....

"ఎప్పుడూ తన మాటకు జవాబు చెప్పి ఎరుగదు ఎంత సహనం? తిట్టినా కొట్టినా, అన్ని మౌనంగా భరించి ఊరుకునేది అన్ని విధాలా తన కనుకూలంగా రోజులు గడపటానికి ప్రయత్నం చేసేది. కమలని తను మూర్ఖంగా పొగొట్టు కున్నాడా?" సుబ్రహ్మణ్యంలో విచక్షణ మొద లయ్యింది విచక్షణ పెరిగి పెరిగ పన్నటి బాధ. విచారం అతనిలో అలుముకున్నాయి



బస్సు ఒక్క కుదుపుతో ఆగింది... ఒళ్ళో శాంత ఉలిక్కిపడి పడటం మొదలు పెట్టింది కండక్టరు, డ్రైవరు బస్సు దిగారు బస్సులోని ప్రయాణీకులు బస్సుదిగి కాఫీ హోటలు వైపు నడిచారు ఒళ్ళో శాంత ఏడుపు ఎక్కువయింది. సుబ్రహ్మణ్యం కూడా బస్సుదిగి హోటలు వైపు నడిచాడు. గ్లాసులో రెండు కప్పులు పాలు పోయించుకుని చెంచాతో నెమ్మదిగా పట్టించసాగాడు శాంత ఆకలిగా ఆ పాలు త్రాగుతూంటే అతని మనసు కరిగినీరయింది- ఏదో తృప్తిగా నిట్టూర్చింది.

బస్సు మళ్ళీ బయలుదేరింది.

కేవలం కట్నం డబ్బులకోసం- తల్లిదండ్రులతో చేతులుకలిపి కమలకు నిజంగా అన్యాయం చేశాడు వాళ్ళు దాన్ని ఎంత వేపుకు తింటున్నా తను కమ్మనేవాడుకాదు తన మౌనాన్ని చూసి వాళ్ళు మరింత రెచ్చిపోయేవారు .. చివరకు పాలుత్రాగే పసిపిల్లని తనవద్ద ఉంచేసుకుని- అమ్మ కమలను బయటకు గెంటేసినా తను ఏమి మాట్లాడలేకపోయాడు చిన్నపిల్లని ఇక్కడ ఉంచేసుకుంటే- ఆ భయంతోనే పిల్లమీద బెంగతోనో- కమల తండ్రి దగ్గర్నుంచి కట్నం

డబ్బు తెస్తుందని తనూ భావించాడు... ఆ ముసలాడి దగ్గర డబ్బుందని అమ్మా - నాన్నా నమ్మకం! అన్నయ్య ఎత్తుకు పోయాడని కమల ఏడుపు.. తను ఏది నిర్ణయించుకోలేక కమలనే కొట్టేవాడు.. తిట్టేవాడు.. నిజానికి కమల డబ్బుతెస్తే- ఆ డబ్బుతో మరికొంత జతచేసి చిన్నమోటారుసైకిలు కొనుక్కుందామని తన ఆశ.... ఆలోచనాను.... కానీ అన్నీ బెడిసి కొట్టాయి... దేవతలాంటి భార్యని పోగొట్టుకున్నాడు. ఆ లోటు జీవితంలో తీరుతుందా? తన భవిష్యత్తు ఎలా ఉంటుంది?తను మరో పెళ్లి చేసుకోవాలా? మళ్లీ పెళ్లిచేసుకుంటే ఈ పిల్లగతి ఏమిటి? మావగారి దగ్గర ఒదిలే యడమేనా!

సుబ్రహ్మణ్యం సీటులో ఇబ్బందిగా కదిలాడు... బస్సులో జనం ఎవరిమాటల్లో వాళ్ళున్నారు... ఎవర్నీ పట్టించుకోకుండా బస్సు ముందుకు పరుగెడుతూనే ఉంది... సుబ్రహ్మణ్యం కూతురు శాంతి వంక జాలిగా చూసుకున్నాడు. అతని కళ్లు చెమర్చాయి. ఆ పిల్ల అమాయకంగా నిద్ర పోతోంది.... ఈ పిల్లలో అన్నీ కమల పోలికలే! అనుకోకుండా ఉండలేక పోయాడు సుబ్రహ్మణ్యం... చేతివాచీవంక చూసుకున్నాడు. టైము రెండున్నర... వేడిగాలి వీస్తోంది...

కమల మంచితనం... ప్రవర్తన తలచుకున్నకొద్దీ సుబ్రహ్మణ్యానికి పిచ్చెక్కినట్లుగా ఉంది.... ఎంత

ఓ కన్నీటి కథ

సరిపెట్టుకుందామన్నా ఆమె తలపులు అతడ్ని పీడటంలేదు.... భార్య రూపం పదే పదే గుర్తుకు వస్తోంది...

కమలకు పౌరుషం, అభిమానం ఎక్కువ.... తనెప్పుడైనా తిట్టినా కొట్టినా- రెండు మూడు పూటలు అన్నం మానేసి ఉండిపోయేది...


ఆ అభిమానంతోనే ఆత్మహత్య చేసుకుందేమో! కమల చనిపోతూ ఏం చెప్పి ఉంటుంది? తన మీద, తన తల్లి దండ్రులమీద పగ తీర్చుకుంటుందా? ఏమో! భర్త కొట్టేవాడని- అత్త మామలు కట్నం కోసం కాల్చుకుని తినేవారని- వాళ్ళే తన చావుకు కారణమని ఏదైనా చిన్న చీటీ రాసి పెడితే... అమ్మో!" సుబ్రహ్మణ్యం ఉలిక్కిపడ్డాడు. అతనిలో తెలియని భయం ప్రవేశించింది. ఆ భయంలో కొట్టుమిట్టాడు తూండగానే బస్సు గమ్యం చేరిపోయింది. స్టాండులో దిగి- కూతురు శాంతిని మరో భుజం మీదకు మార్చుకుని గబగబా రోడ్డుమీద కొచ్చాడు... బేరమాడకుండానే రిక్షా కట్టించుకున్నాడు. రిక్షా పది నిముషాలు పరుగెత్తి ఓ ఇరుకు వీధిలోకి మళ్ళింది. వీధి మొదట్నుంచే ఆతృతంగా మావగారింటి వైపు దృష్టిని సారించాడు సుబ్రహ్మణ్యం. అక్కడ జనం ఎవ్వరూ లేరు... ఏమయ్యింది? శవాన్ని అప్పుడే తీసుకు వెళ్ళిపోయారా? తనూ, తనవాళ్ళూ రాకుండానే! తన మావగారు- ఒకవేళ పోలీసులకు భయపడి... ఆయనసలే పిరికి మనిషి. తనకు టెలిగ్రాం ఉదయం ఏడు గంటల కందింది... అదెప్పుడో నిన్న సాయంత్రం- ఆరు గంటల కిచ్చారు... ఏం జరిగింది?

రిక్షా ఇంటి ముందాగింది. రిక్షావాడికి డబ్బులిచ్చి పంపించి- తడబడుతూన్న మనసుతో లోపలికి నడిచాడు సుబ్రహ్మణ్యం. తలుపులు తీసి ఉన్నాయి. వసారా ఖాళీగా బావురు మంటోంది. కొద్ది క్షణాలు అక్కడే అయోమయంగా నిలబడ్డాడు. గొంతు పెగిలి రావటం లేదు. చిన్నగా సకిలించాడు... లోపల గదిలోంచి ఎవరో వస్తున్న అలికిడి....

"బాబూ! వచ్చావా! శాంతిని కూడా తీసుకొచ్చావా?" ఎదురుగా గదిలోంచి బరువుగా- భారంగా తన మావగారు రమణయ్య...

"నన్ను- క్షమించండి! కమల ఇంత పని చేస్తుందనుకోలేదు. సమయానికి నేను ఊళ్ళో లేను. అమ్మా నాన్నా ఏదో చాదస్తంగా నాలుగు మాట లనేసరికి- కమల పౌరుషంగా పిల్ల నొదిలి వచ్చేసిందట! మావయ్యగారూ! శాంతి నేనూ ఇకపై దిక్కులేని వాళ్ళమయ్యాం!"

సుబ్రహ్మణ్యం తన తప్పును కప్పి పుచ్చుకుంటూ



ఆర్. వి. ఆర్. – రాజమండ్రి

నాకు చిన్నప్పటినించి రాత్రి 9 గంటల తర్వాత నిద్ర విపరీతంగా వచ్చేస్తుంది. ఎంత ఆపుకుందా మన్నా ఆపుకోలేను. అటువంటిది యిప్పుడు పగలు కూడా విపరీతంగా నిద్ర వచ్చేస్తోంది. చదువుతుంటే అలా చదువుతూనే నిద్రపోతాను.

★ చదువుతున్న పుస్తకం మీద ధ్యానం లేనప్పుడు ఇలాగే జరుగుతుంది. పడుకొని చదివినా, అన్నం తిన్న వెంటనే చదివినా ఇలా జరిగే అవకాశం ఎక్కువ. తిరుగుతూ చదివే అలవాటు చేసుకొంటే ఈ లక్షణం నుంచి కొన్నాళ్ళలో తప్పించు కోవచ్చును.

యస్. జె – కరీంనగర్

నేను సన్నగా, పొడుగ్గా వుంటాను. ఆడవాళ్ళు సన్నగా వున్న భర్త వలన తృప్తి పొందరని ఒక స్నేహితుడు వాదిస్తున్నాడు. నిజమేనా?

● పూర్తి అబద్ధం. అసలు సన్నగా ఉన్న భర్తల వల్లనే పూర్తి తృప్తి పొందే అవకాశం ఉంటుంది.

యమ్. వి. ఆర్. – కమలాపురం

నల్లగా వున్నవారు కొద్దిగా అన్నా తెల్లగా మెరుగు రావటానికి మెడిసన్ ఏదన్నా వుంటే చెప్పండి. మెలనిన్ తగ్గటానికి మందులు చెప్పండి.

★ ఇలా జరగటానికి ఏ మార్గమూ, మందులూ లేవు.

ఐ. వి. – ఖరగ్‌పూర్

నా వయస్సు 18 సంవత్సరములు. నేను సన్నగా పొడుగ్గా వుంటాను. నేను ఆంధ్ర వెడితే లావవుతాను. కానీ యిక్కడ వుంటే సన్నగా వుంటాను. ఇక్కడ వాతావరణం నాకు సరిపడదా? లేక యింకేమన్నా కారణమా?

★ బహుశా ఆంధ్ర మీ పుట్టిల్లు అయి ఉంటుంది. అక్కడి ఆదరణ, పని లేకపోవటం, మానసిక ఉల్లాసం మొదలయిన వన్నీ లావు అవటానికి దోహదం చేసి ఉంటాయి.

యస్. యస్. – గుంటూరు

మా యింట్లో అందరికి పేలు, ఈపి ఎక్కువగా వున్నాయి. తగ్గేందుకు మందు చెప్పండి.

★ బెంజైల్ బెంజొయేట్ 20 శాతం మందుగాని, గామా బెంజీన్ హెక్సాక్లోరైడ్ గాని పై పూతగా వాడవలసి ఉంటుంది అయితే దీనిని క్రమబద్ధంగా పూయవలసి ఉంటుంది.

తలకి బాగా స్నానం చేసి, తడి ఆరిన తర్వాత అన్ని వెంట్రుకలకి కుదుళ్ళ నుంచి చివరిదాకా అంటేటట్లుగా పై మందులను పూసి 12 గం. లు నాన నివ్వాలి. తర్వాత మళ్ళీ తలారా స్నానం చెయ్యాలి. అలా వరుసగా మూడు రోజులు చెయ్యటం అవసరం. ఇంట్లోని ప్రతివారు ఒకేసారిగా ఈ మందు వాడాలి. దువ్వెనలు వేరుగా ఉంచాలి. తలగడ గలీబులు, దుప్పట్లు మొదలయిన వాటిని నీళ్ళలో ఉడికించి వాడితే తిరిగిపేలువచ్చే అవకాశం ఉండదు.

సి. హెచ్. సి. – చిలకలూరిపేట

నాకు 16 సంవత్సరములు . 5 నెలల నుండి మెన్సెస్ అయినపుడు కాళ్ళు, నడుము, కడుపులో నొప్పి వస్తున్నది.

★ రజస్వల అయిన కొన్ని సం. ల పాటు పై లక్షణాలన్నీ సహజమే!

తాత్కాలిక ఉపశమనంగా ఆస్పిరిన్, ఆంటి స్పాస్మోడిక్ మాత్రలు వాడటం మంచిది. □

గొంతులో పశ్చాత్తాపాన్ని పలికించాడు. అంతులేని బాధని, దుఃఖాన్ని పలికించాడు.

"ఫరవాలేదు బాబూ! దాని ఖర్మ... నువ్వేం చేయగలవు..." రమణయ్య నిట్టూరుస్తూ అల్లుడి చేతిలోంచి మనవరాలిని ఎత్తుకున్నాడు. శాంతి తుళ్ళిపడి లేచి ఏడుపు మొదలెట్టింది... ఆ ఏడుపు పెద్దగా ఆ యింట్లో ప్రతిధ్వనించింది.

"అమ్మా! శాంతీ!" ప్రక్క గదిలోంచి ఓ ఆకారం సుడిగాలిలా పరుగెత్తుకొచ్చి రమణయ్య చేతుల్లోని శాంతిని చుట్టేసింది.

సుబ్రహ్మణ్యం శిలా విగ్రహంలా నిలబడి పోయాడు. అతని నోటి వెంట మాట రాలేదు. ఏమిటిది? కమల... తన భార్య బ్రతికేఉందా? కమల చనిపోలేదా? తనెంత మధనపడ్డాడు? ఎంత నరకం అనుభవించాడు?

కమల గదిలో ఒకమూలగా చతికిలపడి పోయింది. పైట తప్పించి– జాకెట్టు వదులు చేసి– ఆర్తిగా, ఆత్రంగా కూతురికి స్తన్యం కుడుపుతూ తన్మయంగా కళ్ళు మూసుకుంది.

ఆమె కళ్ళ వెంట కన్నీళ్ళు ధారలు కడుతూనే ఉన్నాయి.

"బాబూ! నా కూతుర్ని బ్రతికించుకోవడం కోసం... ఒక్క క్షణం– ఆ కూతురే చచ్చిపోయిందనుకుని నీకు టెలిగ్రాం ఇచ్చాను. అది చనిపోయిందని తెలిస్తే, తప్పకుండా నువ్వు శాంతిని వెంట బెట్టుకుని వస్తావని ఆశపడ్డాను. అలాగే నువ్వు శాంతిని తీసుకొచ్చావు... నిజానికి నా కూతురు వచ్చేదారిలో తన బ్రతుకును అంతం చేసుకుందామని బస్సు క్రింద పడబోయిందట! అదృష్టవశాత్తూ తెలిసిన వాళ్ళ కళ్ళబడి నన్ను చేరింది. దానికి తన కూతురు కావాలి. శాంతి లేకపోతే అది బ్రతకదు. దానిమీద బెంగతో ఈ మూడు రోజుల్నుంచి తిండి మానేసి చిక్కి శల్యమయి పోయింది. శవంలా మంచానపడి– "నాన్నా" నాకు శాంతి కావాలి.... శాంతి కావాలంటూ ఒకటే పలవరింత! ఏం చెయ్యను నేను? శాంతిని ఎలా తీసుకురాను? నా కూతుర్ని ఎలా బ్రతికించుకోను? ఆలోచించాను. అందుకు అబద్ధపు టెలిగ్రాం ఒకటే మార్గంగా తోచింది... నా ప్రయత్నం ఫలించింది... మీ అమ్మా, నాన్నా కేవలం కట్నం డబ్బుకోసం– తల్లినీ పిల్లనీ వేరు చేశారు... ప్చ్! ఆడపిల్ల బ్రతుకు ఎంత దయనీయంగా మారిపోయింది బాబూ! నీలాంటి చదువుకున్న వాళ్ళు కూడా అదే మార్గంలో నడిస్తే– అన్యాయమై పోతున్న ఆడజాతికి దిక్కేది బాబూ...? ఆ కట్నం బాకీ నేనిప్పుడు తీర్చే స్థితిలో లేను. ఆ కట్నం డబ్బే– దాని కాపురాన్ని నిలబెట్టే బంధం అయితే అది నా దగ్గర లేదు... నా కూతురు నాదగ్గరే ఉంటుంది బాబు... నాతో బాటే కలో గంజో త్రాగుతుంది!"

సుబ్రహ్మణ్యం మాట్లాడ లేదు. అతనిలో అంతులేని భావ సంచలనం మావగారి మాటలతో అతని మనసు మంచులా చల్లబడి పోయింది.

"మావగారూ! తల్లీ బిడ్డల్ని వేరు చేయటంలో నా పిరికితనం ఉంది. నా తప్పూ ఉంది... ఆ తప్పేమిటో నాకు తెలిసింది. నా కమల నాకు దక్కింది... నాకు మరింకేమీ వద్దు... అమ్మా నాన్నల మనస్తత్వాలు అంత త్వరగా మారవు. కమలను కొద్దికాలం మీ దగ్గరే ఉంచండి! త్వరలో నేను పూరికి బదిలీ చేయించుకుంటాను!"

సుబ్రహ్మణ్యం కళ్ళనిండా ప్రేమ నింపుకుని భార్య కమల వైపు చూశాడు... అతనిలో ఊహించని మార్పుకు– కమల కళ్ళ నించి మళ్ళీ కన్నీళ్ళు జలజలా రాలాయి. అవి కన్నీళ్ళా మరి? కాదు... కాంతి జలపాతాలు! □

ఫాల్గుణి డైరీ

మోసపోయిన అక్కా చెల్లెళ్ళు!

పాండిచ్చేరికి చెందిన కౌశవేల్ అనే అతని కూతుళ్ళు 18 ఏళ్ళ ఉష, 15 ఏళ్ళ పుష్ప మురుగేశన్ అనే అతన్ని విడివిడిగా ప్రేమించి, అనక తామిద్దరూ ఒకతన్నే ప్రేమిస్తున్నట్టు కనుగొన్నారట. మురుగేశన్ తాను యిద్దర్నీ పెళ్ళాడుతానని వారిద్దర్నీ నమ్మించి, సేలం తీసుకువచ్చి అక్కడ వారిని వో వ్యభిచారగృహానికి 3200 రూపాయల కమ్మి చక్కాపోయాట్ట. వీళ్ళు ఎదురు తిరిగితే మక్కెలు విరిచి వ్యాపారంలోకి దింపారట. కొనుక్కున్నవాళ్ళు. ఇద్దరూ చెరో రెండు వేలూ సంపాదించివ్వండి వొదిలేస్తాం అని అన్నారట. అంతడబ్బూ సంపాయించి యిచ్చి, ఇహ వొదిలెయ్యంటే బయటికెక్కడికి పోతారు బుద్ధిగా యిక్కడే యీ వ్యాపారం చూసుకోండి అన్నారట. అమ్మాయిలను అనుభవింప వొచ్చిన వో ఉల్లాస యువకునికి తమ శోక కథ చెప్పి రక్షించమని చెప్తే అతను పోలీసుర్ని పిల్చుకొచ్చి వీరిని విడిపించాడట

ప్రాణం తీసిన సినిమా!

మెట్టూరుకు చెందిన ఓ సినిమా థియేటర్లో "నిన్ను వెతుక్కుంటూ వస్తాను" అనే వో భయంకర హత్యలున్న సినిమా చూస్తున్న 58 ఏళ్ళ పాప అనే ఆవిడ "కాల్చుద్దురా? కాల్చుద్దురా" అని అరవంలో పెద్దగా కేకలు పెట్టి పడి, స్పృహతప్పి అక్కడే చనిపోయిందట

'వితంతు గర్భం' న్యాయమేనా?

బ్రిటనులో 23 ఏళ్ళ సోనియా పామర్ అనే ఆమె తన భర్త 24 ఏళ్ళ డేవిడ్ కాన్సరుతో చనిపోయే ముందు తనను తల్లిని కమ్మని కోరాడని, కనుక నిలవలో వుంచిన అతని వీర్యంతో తనను గర్భవతిని చేయాలనీ, ప్రభుత్వానికి ఓ అర్జీ పెట్టుకుందట అమె తన భర్త వీర్యంతో గర్భం ధరించినా, వితంతు గర్భమే అవుతుంది గనుక అది బ్రిటన్ ప్రభుత్వం వొప్పనున్నదా అని న్యాయశాస్త్ర ప్రవీణులు ...కాలు తిరగేస్తున్నారట.

కిరసనాయిల్ త్రాగి పసిపిల్ల దుర్మరణం!

మద్రాసు వ్యాసరపాడిలో ఒక యింట్లో మూడేళ్ళ పసిపిల్ల దాహం వేసి, మంచినీళ్ళనుకొని సీసాలో వున్న కిరసనాయిలు గటగట త్రాగేసిందట. ఆసుపత్రి సహాయం అందేలో గానే ఆ పిల్ల చనిపోయిందట.

తమిళనటి భర్త ఆత్మహత్య!

తమిళ సినిమా సహాయనటి గితాచౌదరి అనే ఆమెను 29 ఏళ్ళ విజయన్ అనే అతను యిష్టపడి పెళ్ళాడాడట. అనక భార్యాభర్తలిద్దరూ రోజూ పోట్లాడుకునేవారట ఇద్దరూ తాగేవారట ఒకనాడతను పీకమొయ్యా తాగి, తనకు సుఖం యివ్వమని ఆమెను వేధిస్తే ఆమె అతన్ని వో గదిలోకి నెట్టి తలుపు వేసేసిందట తెల్లారి చూస్తే విజయన్ తలుపు లోపలకు వేసుకుని, ఉరిపోసుకు చనిపోయి వున్నాడట.

కోర్కె తీర్చలేదన్న కోపంతో దురాగతం!

కర్ణాటక హసన్ జిల్లాకు చెందిన అర్సికెరి గ్రామంలో వో కామందు వొకామె తన కోరిక తీర్చలేదన్న కోపంతో తన వద్దనున్న గూండాలతో ఆమెను మానభంగం చేయించి, అనక దిగంబరంగా ఆ గ్రామమంతా తిప్పాడట ఆ గ్రామ ప్రజలు యీ దృశ్యాన్ని కౌరవ సభలా చూ వారట

కట్నానికి మరో యువతి ఆహుతి!


గిద్దలూరుకు చెందిన గళిజెరుగుళ్ళా గ్రామంలో షేక్ హుస్సేన్ సాహెబ్ అనే అతనికి పోయిన ఏప్రియల్‌లో 19 ఏళ్ళ రమిజాబీకి వివాహమయిందట. కట్నంగా 5 వేల రూపాయలు, 3 వేల బంగారం, పెళ్ళికొడుక్కి వాచి వుంగరం అన్ని యిచ్చారట ఆమె తలిదండ్రులు. ఆమె భర్త రాజస్తాన్ మిలిటరిలో సిపాయిగా వుండేవాడట. భర్త దగ్గర లేని సమయం చూసి ఆమెను ఆమె అత్తగారు, ఆడబొడుచులూ కట్నం యింకా పట్రమ్మని వేధించేవారట. తిట్టేవారట. చావగొట్టే-వారట. చివరికి జూలై 24వ తేదిన ఆమె మీద కిరసనాయిలు పోసి, మంట పెట్టి చంపేశారట. ఆమె తల్లి యీ విషయం పోలీసులతో చెప్పుకు ఏడుస్తోందట. రమిజాబీ తన మరణ వాఙ్మూలంలో తన అత్తగారూ, ఆడపడుచులూ కలసి తనను చంప యత్నించినట్టు చెప్పిందట.


ఆలనా పాలనా లేని ఎలిమెంటరీ స్కూళ్ళు!

ఇండియాలో సుమారు నాలుగు లక్షల ఎనభైయ్యయిదు వేల ఎలిమెంటరి స్కూళ్ళున్నాయట. వీటిలో సగానికి పైన సరియైన ఆలనాపాలనా లేక, కుర్చీ బెంచీలూ అవీ లేక, అవి వున్నా, వేయడానికి జాగాల్లేక, నామమాత్రంగానే వున్నాయట.


ఫ్రాన్స్‌లో కుక్కల కర్చు!

ఫ్రాన్స్‌లో 510 లక్షల కుక్కలున్నాయట. యజమానుల చేత పెంచబడే యీ కుక్కలు గాక, వీధి కుక్కలు ఎన్ని వున్నాయో ఆ ఏసుక్రీస్తుకే ఎరుకట. ఈ 510 లక్షల యజమానుల కుక్కలకు ఏటికి పది బిలియను ఫ్రాంకులు ఖర్చు అవుతుందట ఆ దేశంలో పిల్లులు ఎన్ని వున్నాయని తీసే లెక్కలింకా పూర్తి కానే లేదట – మ్యావ్! □





హల్లో! బాగున్నారాండీ!




హల్లో ! బాగున్నారాండి.

మరేమో.... నేనే బుడుగునండి !
మీ సీగాన పెసూనాంబ ఆడుకోవడానికి బొమ్మలు
ప్పదో...ముప్పయో పెట్టి తెచ్చారు కదా !
మరి సీగాన పెసూనాంబ బాగా చదుకోవడానికి ఏం తెచ్చారు ?
ఏం తేలేదు కదూ !
నే చెప్తా కుంచెం వింటారా!
ఇంకా పెద్దగా చదూకోటానికి
బోల్డు డబ్బు కావాలి. కదా !
మరెవరినైనా అడిగితే ప్రైవేటు చెప్పేస్తారు కదా!
మరి డబ్బేమో.... ప్పదో....ముప్పయో వేల రూపాయలు కావాలాయె!
అందుకు నాకు భలే ఉపాయం తెల్సు!
మరేమో ! ఈరోజే నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్లు తీసుకురండి !
అవేమో తనలా కాలేజీకి
వెళ్లేటప్పటికి, చదూకోటానికి పనికి వస్తాయని
రెండు జడలసీత నాకు చెప్పింది
మరి జాతీయపొదుపు సర్టిఫికేట్లు తెస్తారుకదా !

"నెల నెలా కొంత కూడ బెట్టండి.
బాబు భవిష్యత్తుకు శ్రీకారం చుట్టండి ."

ఇంకా ఎన్నెన్నో జాతీయ పొదుపు పథకాల వివరాలకు

మీకు దగ్గరలో ఉన్న పోస్టాఫీస్, జిల్లా
కలెక్టర్ కార్యాలయంలో స్పెషల్ తహశీల్దార్,
జిల్లా సేవింగ్స్ అధికారి, భారత
ప్రభుత్వం, డిప్యూటి డైరెక్టర్, స్మాల్ సేవింగ్స్



కమిషనర్,
స్మాల్ సేవింగ్స్, ఆంధ్రప్రదేశ్,
హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029

మీ భద్రత మా బాధ్యత

NSD/AMCO/12/85

పరువు ప్రతిష్ఠ



"ఛీ. . . అవిటిదానా! మళ్ళీ నోరెత్తావంటె వళ్ళు వాచిపోతుంది క్రోదంగా అన్నాడు కరుణాకరం

అతని మాటలకు రెచ్చిపోయిందతని భార్యయైన ఆరతి

అవిటిదానా! అవిటిదానా! అంటూ మాటకు ముందు గేలి చేస్తారెందుకు? నేను అవిటి దాన్నని

కిశోరి

తెలిసి యాభైవేల కట్నానికి ఆశపడి అనాథు చేసుకున్నారు మీరు. అనాడు కనిపించలేదా నాలోని అవిటితనం?" తీక్షణంగా ప్రశ్నించింది.

"అవును. కట్నాన్ని చూసే చేసుకున్నాను గాని, నీ అవిటితనాన్ని చూసి జాలిపడి చేసుకోలేదు. నోరు మూసుకుని కుక్కలాగా పడి వుండు. నా దారికెప్పుడూ అడ్డు రాకు."

"కుక్కలాగా పడి వుండటానికి కాదు మిమ్మల్ని పెళ్ళి చేసుకుంది. నేను మీ భార్యను. ఈ ఇంట్లో మీకెంత హక్కుందో నాకూ అంత హక్కుంది. ఇంకా ఎక్కువ మాట్లాడితే మీరే నేను చెప్పినట్లు వినాలి యాభై వేలు పోసి మిమ్మల్ని కొన్నాను కనుక." అంది ఆవేశంగా ఆరతి.

"ఏమిటి కూశావ్? నన్ను కొన్నావా?" అంటూ ఆవేశంతో రెచ్చిపోయి ఆమె జుట్టు దొరక బుచ్చుకొని ముందుకు వంచి వీపు మీద దభీ.... దభీ.... మంటూ పిడిగుద్దులు గుద్దాడు.

ఆ దెబ్బలకు తాళలేక "అమ్మా" అంటూ అరుస్తూ క్రిందపడి పోయిన ఆరతిని నిర్దాక్షిణ్యంగా కాలితో ఒక తాపు తన్ని వీధిలో కెళ్ళిపోయాడు కరుణాకరం.

చిన్నతనంలోనే పోలియో వచ్చి ఒక కాలు అవిటిదైంది ఆరతికి. మోకాలిపై చెయ్యివేసి వంగుతూ నడవవలసిందే. అందమైన ఆరతికి భగవంతుడు విధించిన శాపం ఆ అవిటితనం. పెరిగి పెద్దవయే కొద్దీ తల్లిదండ్రులకు గుండెల మీద కుంపటి అయ్యింది. సంబంధం చూడటానికి వచ్చిన ప్రతి ఒక్కరు ఆరతి అందాన్ని చూసి పరవశించారు. కానీ అవిటితనమని తెలియగానే వెనుకంజ వేసేవారు. ఎంత అందం వున్నా ఏమి లాభం? ఆమె అవిటితనాన్ని చూసి జాలిపడే వారే గాని పెళ్ళి చేసుకోగల విశాల హృదయం లేకపోయిందెవరికి. ఇలా వచ్చిన సంబంధమల్లా వెనక్కు పోతుంటే ఆరతి మనసు గాయపడసాగింది. ఆమె పెళ్ళి గురించిన ఆశలువదులుకుంటున్న తరుణంలో కరుణాకరం వాళ్ళువచ్చారు ఆమెను చూసు కోవడానికి. ఆరతి అవిటితనం గురించి తెలుసుకునే వచ్చారు. యాభై వేలు కట్నమడిగారు ఆరతి తండ్రిని. కరుణాకరంకు, తన కూతురికి వయసులో చాలా తేడా వున్నా, అతను నిరుద్యోగి అని తెలిసినా ఆ సంబంధానికి ఒప్పుకున్నాడు ఆరతి తండ్రి వెంకట్రామయ్య. తనకు కావలసింది నిర్భాగ్యురాలైన తన కూతురి వివాహం. అందుకే వున్న ఇల్లు తాకట్టు పెట్టి, యాభైవేలు కట్నమివ్వాలని తీర్మానించుకున్నాడు. అలా వారి వివాహం జరిగిపోయింది. పెళ్ళిలో నమ్రతగా మాట్లాడుతున్న అల్లుణ్ణి చూసి గర్వపడ్డాడు వెంకట్రామయ్య ఇల్లు తాకట్టు పెట్టానన్న బాధను కూడా మరిచి ఎలాగైనా ఆరతికి పెళ్ళి చేయ గలిగినందుకు సంతోషించాడు.

వివాహమై అత్తవారింటికి వచ్చాక వారి అసలు రూపం తెలుసుకున్న ఆరతి కృంగిపోయింది. కరుణాకరం ఉద్యోగం కోసం ప్రయత్నం చేసి, చేసి చివరకు ఉద్యోగ వయసు దాటిపోయింది. అందుకే ఆరతి గురించిన సమాచారం వినగానే కరుణాకరం తలిదండ్రులతో కలిసి ప్లాన్ వేసుకొని ఆరతి సంబంధం ఖాయం చేసుకున్నారు. పెళ్ళైవచ్చాక ఆ కట్నం డబ్బుతో "ఫ్యాన్సీ అండ్ జనరల్ స్టోర్స్" తెరిచాడు బ్యాంక్‌లో కూడా లోన్ తీసుకుని. షాపు పెట్టి స్థిరపడ్డ క్షణం నుండి కరుణాకరం భార్యను మానసికంగా, శారీరకంగా బాధ పెట్టసాగాడు.

"నిరుద్యోగిని నీకు పిల్లనివ్వను" అన్న అతని మేనమామ కరుణాకరం షాపు తెరవగానే అక్కతో, బావగారితో రహస్యంగా మంతనాలాడి కరుణాకరంను కూడా ఒప్పించాడు తన కూతురిని వివాహం చేసుకొనేందుకు. ఆ విషయం గ్రహించిన ఆరతి భర్తను నిలదీసి ప్రశ్నించిందా రోజు. అందుకు ప్రతి ఫలమే ఈ నాటి యీ సంఘటన. అలా తనను కొట్టి నిర్దాక్షిణ్యంగా వీధిలోకి వెళ్ళిపోతున్న భర్తను కళ్ళనీళ్ళతో చూసింది ఆరతి.

"భగవాన్! నేనేం పాపం చేశానని నాకీ అవిటితనాన్నిచ్చావు? ఇస్తే ఇచ్చావు. నన్ను ఆడదానిగా ఎందుకు పుట్టించావు? నీకసలు హృదయమనేది లేదు. అందుకే నీవు రాయివయ్యావు." కనపడని దేవుణ్ణి మనసులోనే నిందించుకోసాగింది తన కవిటితనాన్ని ప్రసాదించినందుకు.

తను తెచ్చిన డబ్బుతో షాపు పెట్టుకుని తనకంటూ ఒక స్థానాన్ని కలిగించుకుని ఇప్పుడు తనను "రసంలోని కరివేపాకులా" తీసి ప్రక్కన పారవేస్తున్నారు. అంటే తన అవసరం అతనికి తీరిపోయింది. తనను అలా హింసిస్తుంటే తనకేమి పట్టనట్లు బైట వరండాలో కూర్చుని భగవద్గీత చదువుకుంటున్న అత్తగారైన లక్ష్మమ్మను అసహ్యించుకొంది. "ఛీ....ఛీ....ఈమెది ఒక ఆడ జన్మేనా? స్త్రీయై పుట్టి, తోటి స్త్రీని అందునా అవిటిదైన కోడలిని తన కొడుకిలా హింసిస్తుంటే తనకు ఏమి పట్టనట్లయినా లేకుండా భగవద్గీత చదువుతూ కూర్చుంది. చేసే పాపం చేస్తూ భగవద్గీత చదువుకుంటే మోక్షం వస్తుం దనుకొందా? ఇటువంటి వారిని ఆ భగవంతుడు క్షమిస్తాడనుకుంటుంది కాబోలు" అని మనసులోనే అత్తగారిని ఛీదరించుకొంది ఆరతి.

ఆమె నెమ్మదిగా ప్రక్కనే వున్న గది గోడను ఆధారం చేసుకుని లేచి గోడ కానుకుని నిలబడింది. కళ్ళనీరు తుడుచుకొని; రేగిన కురులు సవరించుకుంటూ మోకాలిపై చేయి ఆనించుకుని నడుస్తూ వంటింట్లో కెళ్ళింది. అలా నడుస్తుంటగా వీపంతా వచ్చి పుండులాగా అనిపించింది. ఆ బాధనంతా పంటి బిగువున భరిస్తూ వెళ్ళింది ఆరతి.


* * * *

ఒకరోజు ఏదో పని మీద ఆ వూరికి వచ్చి ఆరతిని చూచేందుకు వెళ్ళాడు వెంకట్రామయ్య. ఆ సమయంలో కరుణాకరం బజారు కెళ్ళాడు ఏదో పని మీద. షాపులో జనం ఎక్కువగా వచ్చినందు వల్ల కరుణాకరం తండ్రి బలరామయ్య, తల్లి లక్ష్మమ్మ ఇద్దరూ షాపులో కూర్చున్నారు.

సన్నబడి, నల్లబడ్డ ఆరతిని చూడగానే వెంకట్రామయ్య హృదయం ద్రవించి పోయింది.

"అమ్మా! ఏమిటి తల్లీ! ఇలా అయ్యావు?" అతని కంఠంలో ఆవేదన ధ్వనించింది.

"నాన్నా!" తండ్రిని చూడగానే గుండెల్లోని వేదన పొంగి పొరలగా దుఃఖోద్వేగంతో అతని ఒడిలో తలదాచుకుని బావురు మంది ఆరతి. అలా ఏడుస్తున్న కూతురిని చూస్తున్న కొద్దీ అతని మనసులో అలజడి కలిగింది. గుండెల నెవరో పిండి నట్లయింది. అతని కంటి నుండి రెండు కన్నీటి బొట్లు టప, టపారాలి ఆరతి తలపై బడి ఇంకి పోయాయి. తన హృదయవేదన తీరేదాకా ఏడ్చిన



ఆరతి తండ్రి బుజ్జగించడంతో లేచి కూర్చుంది.

"ఏమిటి తల్లీ ! ఎందుకింత బాధ పడుతున్నావ్? చెప్పమ్మా?" లాలనగా అడిగాడు. అసలు విషయమంతా కూతురి నోటి వెంట విని హతాశుడయ్యాడాయన. అడిగినంత కట్నం ఇస్తే బాగా చూసుకుంటాడని అనుకున్నాడే గాని ఇలా కూతురి జీవితం నాశనం అవుతుందనుకోలేదు. పెళ్ళప్పుడు వినయంగా మాట్లాడుతున్న అల్లుణ్ణి గుణవంతు డనుకున్నాడే గాని కాలసర్ప మనుకోలేదు. అయినా ఇప్పుడు తను మాత్రం ఏం చేయగలడు పెళ్ళి జరిగిపోయాక? అందుకే బిడ్డను అనునయింప చూశాడు.

"ఆరతీ! ఏం చేద్దాం చెప్పు తల్లీ? సర్దుకు పోక తప్పదమ్మా. నీ భర్తను నీవే ప్రేమతో దారికి తెచ్చుకోవాలే గాని, నీ వెంత? అంటే నీవెంత? అని అనరాదమ్మా. త్రాడును తెగేదాకా లాగరాదు. నీవే సర్దుకుపోవాల".

"హు..... సర్దుకు పోవడం? ఎంత బాగా చెప్పారు నాన్నా? అడుగడుగునా నా అవిటి తనాన్ని వేలెత్తి చూపుతూ నన్ను కించపరుస్తుంటే సర్దుకు పొమ్మంటారా? పెళ్ళై కొద్ది నెలలైనా కాకముందే మరో పెళ్ళి చేసుకోవాలని చూస్తుంటే సహించమంటారా నాన్నా?" వెక్కిళ్ళ మధ్య అంది.

"చేసుకోవాలను కున్నంత మాత్రాన చేసుకుంటాడామ్మా? తాళికట్టిన భార్యవు నీవుండగా ఎలా చేసుకుంటాడు? రేప్రొద్దున అలాటిది జరిగితే కేసుపెట్టమూ?"

"ఎప్పుడూ? నేను చచ్చాకనా?"

"ఎందుకమ్మా అలా మాట్లాడుతావు?" ఆమె మాటలు శరాఘాతంలా మనసున నాటుకోగా బాధతో అన్నాడు.

"అవును నాన్నా! అంతే జరుగుతుంది చూస్తుండండి".

"అలా జరుగడానికి వీల్లేదు." గట్టిగా అరిచినట్లుగా అన్నాడతను.

"వీళ్ళు ఎంతకైనా తెగించిన మనుషులు నాన్నా! అంతపనీ చేస్తారు" అని క్షణమాగి

"నాన్నా! నన్నీ నరకం నుండి మనింటికి తీసుకెళ్ళరూ?" అంటూ ప్రాధేయపడింది.

"పాపా!....." క్షణం నివ్వెర పోయాడాయన.

"ఎందుకు నాన్నా! అలా విస్తుపోతారు? నేను మీకేం భారంగా వుండనులే. ఇంటర్ దాకా చదివించారు నన్ను. ఏదో ఒక వుద్యోగం చేసుకొంటూ నాకాళ్ళపై నేను నిలబడతాలే నాన్నా! అంది.

అమ్మా! అదికాదు తల్లీ ! నీ ఒక్కదానివీ భారమా మాకు? కానీ ... కానీ .... అత్తిల్లు వదిలి పుట్టిల్లు చేరిన ఆడదాన్ని చూసి ఈ లోకం హర్షిస్తుందను కుంటున్నావా? కాకుల్లా పొడవదూ? పదుగురిలో అది ఎంత పరువు తక్కువ పనో ఆలోచించావా? నిన్ను చూసి నలుగురూ చాటు మాటుగా హేళనగా నవ్వుకుంటుంటే నా మనసెంతగా క్రుంగి పోతుందో

పరువు – ప్రతిష్ఠ

ఆలోచించావా? " వేదనగా అన్నాడాయన.

అతని మాటలకు పేలవంగా నవ్వింది ఆరతి.

"బాగా చెప్పారు నాన్నా! కన్నకూతురి కన్నా పరువు ప్రతిష్ఠే ముఖ్యమనుకొంటే, నన్ను చూసి నలుగురు హేళనగా నవ్వుకుంటుంటే మీ మనసు క్రుంగి పోతుందనుకొంటే నన్ను తీసుకెళ్ళకండి. నన్నీ నరకంలోనే వుండనివ్వండి. ఏపూటో ఒక పూట మీకూతురు చచ్చిపోయిందని తెలుస్తే వచ్చి నాలుగు కన్నీటి బొట్లు రాల్చి వెళ్ళండి." అంటూ వెక్కి వెక్కి ఏడువసాగింది.

ఆ మాటలకు కలవర పడ్డాడు వెంకట్రామయ్య . అయినా తన కల్లవరం పైకి కనపడ నివ్వకుండా.

ఎందుకమ్మా? అంత లేని మాటలు మాట్లాడుతావు? నీవేదో ఆవేశంలో అలా అంటున్నావు. శాంతంగా కూర్చుని ఆలోచించు. నా మాటల్లో ఎంత నిజముందో మగణ్ణి విడిచిన స్త్రీని ఈ లోకం ఎంత చులకనగా చూస్తుందో నీకు తెలియదు". అన్నాడు కూతురి తలపై చేయి వేసి నిమురుతు.

అతనలా అనగానే కళ్ళు తుడుచుకుని చివ్వున తల ఎత్తి తండ్రి వంక చూసింది.

"బాగా ఆలోచించే యీ నిర్ణయం తీసుకున్నాను నాన్నా! మీకు వుత్తరం వ్రాద్దామనుకుంటుండగానే మీరే వచ్చారు. అయినా మీరింకా పాతకాలపు పద్ధతిలోనే ఆలోచిస్తున్నారు. కాలం మారిందని మరిచి పోతున్నారు."

ఆ మాటలకు నవ్వాడాయన.

"పిచ్చితల్లీ! నీకింకా చిన్న పిల్లవు. లోకం తీరు తెలియదు నీకు. కాలం ఎంతగా మారినా మనుషులు మాత్రం మారలేదమ్మా".

"అయితే మీరు నన్ను తీసుకెళ్ళరా నాన్నా?" ఇక తండ్రితో వాదించి లాభం లేదనుకొని చివరిసారి ఆశగా అడిగింది.

ఆ మాటకు పెద్దగా నిట్టూర్చాడాయన.

"ప్రస్తుతానికి వద్దు తల్లీ! మరికొద్ది రోజులు వేచిచూడు. ఈ పరిస్థితి మారకపోతే అప్పుడాలోచిద్దాం. నాకు కాస్త వూళ్ళో పని వుంది. ఈ రాత్రికి మీ శేషయ్య అంకుల్ ఇంట్లో వుండి తెల్లారాక వూరెళ్తాను. నీవు మాత్రం మరొక్క మారు బాగా ఆలోచించమ్మా" అన్నాడు కుర్చీ నుండి లేస్తూ. ఇక తండ్రి తన బాధ నర్థం చేసుకో లేదని తెలిసుకుంది ఆరతి. తండ్రికి తనకన్నా పరువు, మర్యాద లెంత ముఖ్యమో అర్థం చేసుకో గలిగింది. అందుకే మరి మాట్లాడలేక పోయింది. నెమ్మదిగా ఆయన పాదాలను కళ్ళకద్దుకుంది.

"అరెరె.... ఏమిటమ్మా ఇది? లే.... లే" అన్నాడాయన.

"కాఫీ త్రాగి వెళుదురు గాని వుండండినాన్నా!" ఆమె కప్పుడు గుర్తుకు వచ్చింది తండ్రికి కాఫీ కూడా ఇవ్వలేదని. తండ్రి కనపడగానే హృదయంలోని ఆవేదనంతా వెళ్ళబోసు కోవడంలో కాఫీ ఇవ్వాలన్న సంగతి గుర్తురాలేదామెకు.

"ఇప్పుడేమి వద్దమ్మా! ఇందాకే త్రాగి వచ్చాను. మీ మామ, అత్తా షాపులో వున్నారు కాబోలు. పలుకరించి వెళతాను" అంటూనే వెళ్ళి పోయాడాయన. తండ్రి వెళ్ళిన వైపు పేలవంగా చూస్తుండి పోయింది ఆరతి.

* * * * *

"ఈమె సంసార జీవితానికి పనికిరాదు" అని వున్న కాగితంపై సంతకం పెట్టమని వేధించసాగాడు కరుణాకరం, ఆరతిని.

"లేదు. నేను పెట్టను. ఎందుకు పెట్టాలి?" ధైర్యంగా అడిగింది ఆరతి.

"పెట్టి తీరాలి. నీవు సంతకం పెడితే నేను లక్షణంగా మా మామ కూతురిని పెళ్ళి చేసుకోవచ్చు." అన్నాడు వెకిలిగా నవ్వుతు.

ఆ నవ్వు చూడగానే కంపరమెత్తింది ఆరతికి.

"ఏమిటీ? మీ మామ కూతురును చేసుకుందామనా? ఈ ఎత్తు?"

"చేసుకున్నా నీ కేమి లోటు రానివ్వనులే డియర్! నిన్ను కూడా భార్యలాగానే చూసుకుంటాలే" హేళనగా అన్నాడు.

"భార్య లాగా! అంటే? నన్ను మీరిప్పుడు వుంచుకున్నారా?" ఆరతి కూడా వ్యంగ్యంగానే అంది.

ఆమాటకు చెర్రెత్తు కొచ్చింది కరుణాకరంకు.

"షటప్!......" అరిచినట్లుగా అన్నాడు.

ఈ తర్క వితర్కం అనవసరం. సంతకం పెడతావా లేదా? కఠినంగా అడుగుతూ ముందు కడుగు

కోరిక

రాయాలని ఉంది
కలల మరచి కనులు తెరిచి
నిజమేదో రాయాలని ఉంది
స్పందించిన గుండె పలికించే నాదాన్ని
దిశ దిశలా వినిపించాలని ఉంది
కన్నుల చాటున కదిలే కథలను
మనసుల మాటున ఒదిగే వ్యథలను
ఓదార్చాలని ఉంది
కరుడు గట్టిన హృదయాలను కరిగించాలని

మోడు వారిన జీవితాలలో వసంతం
పూయించాలని ఉంది
భయం బ్రతుకు బంధాలు తెంచాలని
ఆనందామృతాన్ని పంచాలని ఉంది
అలుముకున్న నిశీధిని మసి చేయాలని
పేరుకు పోయిన కల్మషాన్ని
కడిగి వేయాలని ఉంది
ఐకమత్యపు బావుటాలు ఎగురవేయాలని
అనురాగపు సౌరభాలు వెదజల్లాలని ఉంది

—వేముగంటి శ్రీనివాస్

వేశాడు.

"నేను పెట్టను......" ధైర్యాన్ని కూడ దీసుకుంటూ ఒక్కడుగు వెనక్కేసింది.

"పెట్టవూ......?" తీక్షణంగా అడుగుతూ మరో అడుగు ముందుకేశాడు.

"చచ్చినా పెట్టను......"

అంతే. ఛెళ్ళుమన్నాయి ఆమె చెంపలు. అతను చేసిన ఆ పనితో తనను తను నిలద్రొక్కుకోలేక దబ్బున క్రింద పడిపోయింది.

"చచ్చాక నీవేమిటి పెట్టేది? పెడతావా? లేదా?" కాలు పైకెత్తాడు ఆమెను తన్నడానికి.

అతనలా బలవంతం చేసే కొద్దీ ఆమె మనసు కఠినంగా, మొండిగా మారసాగింది.

"పెట్టను......"

"పెట్టవూ కాలితో బలంగా తంతూ మళ్ళీ అడిగాడు రెట్టిస్తూ.

"పెట్టను....." మొండిగా అంది ఆ దెబ్బల బాధను పంటి బిగువున భరిస్తూనే.

"ఒరే కరుణా! అది అలా వింటుందనుకున్నావా? ఇదిగో ఈ కిరోసిన్ పొయ్యి" అంటూ కిరోసిన్ డబ్బా అందించింది. అంతవరకు మౌనంగా ఆ దృశ్యాన్ని తిలకిస్తున్న అతని తల్లి.

"ఛీ ......'నీవూ ....ఒక ఆడదానివేనా?" నరరూప-రాక్షసి లాంటి అత్తగారిని చూసి ఛీత్కరించింది ఆరతి.

"ఇటువంటి అత్తలుండబట్టే ఎందరో అమాయకులైన అబలల బ్రతుకులు మొగ్గలోనే రాలిపోతున్నాయి" అనుకొంది మనసులో. వాళ్ళు తప్పకుండా తనను కాల్చి చంపుతారనుకోగానే ఆమెలో ప్రాణ భయం కలగ్గా నెమ్మదిగా లేవ-బోయేంతలోనే కరుణాకరం తల్లి అందించిన డబ్బాను తీసుకుని గుమ్మరించాడు ఆరతిపై. అవిటి-తనం ఆరతిని పారిపోకుండా చేసింది.

కిరోసిన్ ఏనుగు తొండం వంటి ధారతో తలపై పడుతుండగా వుక్కిరిబిక్కిరి అవుతూ పైకి లేవ-బోయి దబ్బున క్రిందపడి పోయింది.

"ఇప్పటికైనా పెడతావా? లేదా?" క్రూరంగా చూస్తూ ఆమెను రెక్కబట్టుకొని పైకి లేపి అడిగాడు.

"వూ హు......" తల విదిలించిందామె.

"అయితే చావు.......!" అంటూ విసురుగా ఆమెను పొయ్యి వైపు తోశాడు. ఆ విసురుకు కట్టెలతో గణ, గణా మండిపోతున్న పొయ్యిపై పడ్డది ఆరతి. అతని క్రూరత్వాన్ని చూసి, రోసిన అగ్నిదేవుడు ఆరతిని ప్రియమార కౌగిలించుకున్నాడు.

అది చూసి వికటాట్టహాసం చేస్తూ కొడుకు, ఆ వెంటనే తల్లి వంటింటి బైటకు వచ్చి తలుపులు వేసేశారు. నిస్సహాయురాలైన ఆరతి ఆర్తనాదాలు ప్రతిధ్వనించ సాగాయా గదిలో

"అమ్మా........! ఆరతీ" అంటూ కెవ్వుమని కేక వేస్తూ లేచిన వెంకట్రామయ్యను.

"ఏమిట్రా రామయ్యా? ఏదైనా కలగన్నావా?" వెంకట్రామయ్య వేసిన కేకకు వులిక్కిపడి లేచిన శేషయ్య ఆత్రంగా స్నేహితున్ని భుజాలు పట్టి కుదిపాడు.

"ఆ.....ఆ....కలా....!" బిత్తర చూపులు చూస్తూ అన్నాడు వెంకట్రామయ్య స్వప్నావస్థ నుండి తేరు-కుంటూ.

"అవును....పీడకల ఏదైనా వచ్చిందా?" ఆప్యా-యంగా అడుగుతూ అతని వెన్ను నిమిరాడు శేషయ్య.

అప్పటికి గాని వాస్తవ ప్రపంచంలోకి రాలేక-పోయాడు వెంకట్రామయ్య రాత్రి పొద్దుపోయే దాకా కూతురిని గురించి ఆలోచిస్తూ పడుకున్న తను కలలో అలాంటి ఘోర సంఘటన చూడగానే నిలువెల్ల వణికిపోతు కెవ్వున కేక వేస్తూ లేచాడు.

"ఏమిట్రా ఆ కల?" లేచి వెళ్ళి గ్లాసుతో మంచి-నీళ్ళు తెచ్చి అందిస్తూ అడిగాడు శేషయ్య. గ్లాసుడు నీళ్ళు గడగడా త్రాగాక కుదుటపడింది వెంకట్రామయ్య మనసు. అప్పుడు చెప్పాడు నిన్న సాయంత్రం తనకు ఆరతికి జరిగిన సంభాషణ.

అది విని గాఢంగా నిట్టూర్చాడు శేషయ్య.

"చూడరా రాముడూ! అమ్మాయి చెప్పింది సబబుగానే వుంది. తను ఎంతటి నరక మనుభ-విస్తేనో గాని అమ్మాయి నీకు చెప్పదు. సామాన్యంగా ఏస్త్రీ అయినా తన సంసారం స్వర్గ-తుల్యంగా వుండాలనే కోరుకుంటుంది. ఏ స్త్రీ అయినా భర్తకు అనుకూలంగా వుండి, అతని ప్రేమకు పాత్రురాలు కావాలనే చూస్తుంది. తన చెయి దాటిపోయాకనే ఇల్లు విడవాలన్న నిర్ణయం తీసుకుంటుంది. నీ కలలో లాగే వాస్తవంగా జరిగితే నీవు తట్టుకోగలవా? నీ వనుకునే ఆ పరువు, ప్రతిష్టనీ ఒక్కగానొక్క కూతురుని బ్రతికించ గలవా? చెప్పు...?" ఆవేశంగా అడిగాడు శేషయ్య.

"లేవు... బ్రతికించలేవు....." దుఃఖంతో వెంకట్రామయ్య కంఠం రుద్ధమైంది. తిరిగి ఇలా అన్నాడు.

"శేషూ! అలా జరుగడానికి వీల్లేదు. ఒక్కగానొక్క కూతురు పోయాక మేము బ్రతికి ఏమి ఫలం? ఆ జన్మాంతం కుమిలిపోతు బ్రతకాలి.. నాకిప్పుడు వచ్చిన ఈ కల నా కళ్ళు తెరిపించింది."


"నిజమేరా రాముడూ! ఆ కల రాకపోయి వుంటే అలాగే జరిగేది. ప్రస్తుతం అమ్మాయి వున్న పరి-స్థితుల లాంటివి. ప్రతిరోజు ఇటువంటి ఘోరమైన చావు గురించి వార్తాపత్రికలలో ఎన్ని చదవడం లేదు మనం? అన్నాడు శేషయ్య.


"ఇక చెప్పకు శేషూ! నేను భరించలేను. తెల్ల-వారగానే వెళ్ళి నా బిడ్డను మా వూరికి తీసుకెళతాను." అన్నాడు నిశ్చయంగా వణుకుతున్న గొంతుతో.

"మంచిది. అలా చెయ్యి." అంటూ స్నేహితుని భుజం తట్టి.

"ఇక నిశ్చింతగా నిదురపో. టైం ఒంటిగంట అవుతుంది." అంటూ లేచి వెళ్ళి తన మంచం మీద పడుకున్నాడు శేషయ్య.

తెల్లవారగానే కూతురిని తన వెంట వూరికి పిలుచుకెళ్ళాలని నిశ్చయం చేసుకున్నాక వెంకట్రామయ్య మనసు తేలిక పడగా మంచంపై మేను వాల్చి నిశ్చింతగా కళ్ళు మూసుకున్నాడు. □





ఎన్. టి. ఆర్. పై వ్యాస రచన పోటీ

ఆంధ్రప్రదేశ్ యన్. టి. ఆర్. సాంస్కృతిక కేంద్రము (రిజిస్టర్డ్), అనంతపురము వారు, కేంద్రము దశాబ్ది ఉత్సవాల సందర్భముగా వ్యాస రచన పోటీలు నిర్వహించుచున్నారు 'సినిమారంగము నుంచి రాజకీయరంగానికి' అన్న అంశంపై ముఖ్యమంత్రి గౌరవనీయులైన శ్రీ యన్. టి. రామారావు గారిని గురించి 80 అరటావులకు మించకుండా శ్రీ రామారావు గారు సినిమా జీవితంలో సాధించిన విజయాలు, ప్రాంతీయ పార్టీ స్థాపించుట, వారి విజయాలు, దీక్ష మొదలగు వారు సాధించిన అంశములతో చక్కని వ్యాసము తయారుచేసి పంపవలెను. ఉత్తమ వ్యాసానికి రు. 516 నగదు బహుమానము యివ్వబడును. రచనలు మాకు చేరవలసిన తేది 31.8.85. వివరాలకి – సి. పాండురంగమూర్తి, ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ యన్. టి. ఆర్. సాంస్కృతిక కేంద్రము, 22.50 పాతవూరు, అనంతపురముకి రాయవచ్చు.

అవీ - ఇవీ - అన్నీ


ఖమ్మంజిల్లా సాహితీమూర్తులు

"ఈ దశాబ్దపు ఖమ్మం జిల్లా సాహితీ మూర్తులు" (1970–1980) అన్న శీర్షిక క్రింద, యు.జి.సి. వారి ఆధ్వర్యంలో నేను సంక్షిప్త పరిశోధనా ప్రాజెక్టు చేపట్టినాను. కావున ఈ జిల్లాకు చెందిన రచయితలు, రచయిత్రులు తమ జీవిత, రచనా సంబంధమైన వివరాలను 31–10–85 లోగా పంప, ప్రోత్సహించ ప్రార్థన.

"సుచంద్ర"
తెలుగు శాఖాధిపతి,
యస్. యస్. ఆర్ అండ్ జ్యోతికాలేజి,
ఖమ్మం–507003

విశ్వనాథ సాహిత్యంపై వ్యాస రచన పోటీ

ప్రతి సంవత్సరం 'కులపతి సమితి' (వరంగల్) విశ్వనాథ సాహిత్యంపై నిర్వహించే వేయి రూపాయల బహుమతి వ్యాస పోటీకి ఈసారి "విద్యను గూర్చి విశ్వనాథ" అన్నది పోటీ వ్యాస విషయంగా నిర్ణయింపబడింది. వ్యాసం 150 ఫుల్ స్కేప్ పేజీలకు మించకూడదు. పోటీకి వ్యాసం ప్రతులు మూడు 1985 నవంబరు 30 లోగా, కార్యదర్శి, కులపతి సమితి, 15–729/1, రామన్నపేట, వరంగల్–506002 అను చిరునామాకు పంపవలసి ఉంటుంది. వివరాలకు, ఆసక్తి గలవారు పై చిరునామాకు రాయవచ్చు.



వినతి

ఆచార్య రోణంకి అప్పలస్వామిగారిని చాలామందికి తెలుసు. తెలియనివారు ఎ తెలుసుకోదగ్గ గొప్ప వ్యక్తి.

ఆయన బహు భాషాకోవిదుడు. విద్యావేత్త. కవి. గత అరవై ఏండ్లుగా సాహిత్యానికి ఎనలేని సేవ చేస్తున్నవారు.

అందుకే యీ సంవత్సరం సెప్టెంబరు 15వ తేదిన వారి 77వ జన్మదినోత్సవ సందర్భంగా, యావదాంధ్ర ప్రజానీకం తరఫునా వారిని ఘనంగా సన్మానించేందుకు విశాఖ రచయితల సంఘం నిర్ణయించుకుంది.

ఈ ఉత్సవంలో పాలుపంచుకోవాలనే ఉత్సాహం ఉన్న వారి అభిమానులూ, శిష్యులూ, పరిచితులూ యీ దిగువ చిరునామాకు దయచేసి తెలియచేయవలసిందిగా సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీ రా. వి. శాస్త్రి విజ్ఞప్తి చేస్తున్నారు.


చిరునామా: కాళీపట్నం రామారావు, 49.17.18/1, లలితానగరం, విశాఖపట్నం 530016.

వారపత్రికలకు ఒరవడిదిద్దిన

ఆంధ్రపత్రిక

సంస్థ నుంచి వెలువడిన మరో వనితా పక్షపత్రిక

కలువబాల



పరితలను ఆలోచింపచేసే రచనలు,
వినూతన శీర్షికలు, పూర్తి ఆఫ్‌సెట్ ముద్రణ
$\frac{1}{4}$ డెమ్మీ సైజు.

హైదరాబాద్ నోట్‌బుక్

రామాయణ సమ్మేళనం:-

శృంగేరి పీఠాధిపతులు జగద్గురు శ్రీ భారతీ తీర్థుల వారు తమ చాతుర్మాస్య వ్రత సందర్భంగా నల్లకుంట శంకరమఠంలో ఏర్పాటు చేసిన త్రిదిన రామాయణ సమ్మేళనం భక్తులకు, మేధావులకు, పండితులకు, పామరులకు విజ్ఞానపు విందులు పెట్టింది. సమ్మేళనం ప్రారంభించిన గవర్నర్ డాక్టర్ శంకర్‌దయాళ్‌శర్మ, అధ్యక్షత వహించిన శ్రీ భారతీతీర్థుల వారు, ప్రసంగించిన పండిత ప్రకాండులు తమ ప్రసంగాలతో శ్రోతలకు పెక్కు విషయాలు అయాచితంగా తెలిపారు. రామాయణం ఒక మతానికి చెందినది కాదు. మానవ జీవిత మూల్యాలను ఆవిష్కరించినట్టిది. శాశ్వత సత్యాలను, ఉత్తమ సంస్కృతిని అందించే గ్రంథం. జటాయువు ఆత్మార్పణం, భారత విభీషణుల భక్తి ప్రపత్తులు ఆచరణలోకి తేవలసిన విషయాలు. కొన్ని పాత్రలను చూస్తుంటే, రామాయణం అహంకారం తొలగించుకున్న పాత్రల చరిత్రా అనిపిస్తుంది – అన్నారు గవర్నరు. రామాయణం వినోదంగా విని వెళ్ళిపోయే గ్రంథం కాదు. న్యాయ మార్గానుసారికి పశుపక్ష్యాదులు కూడా సహాయం చేస్తాయని, అన్యాయ పథగామిని సోదరులు కూడా పరిత్యజిస్తారని తెలుపుతూన్న రామాయణం మానవులకు న్యాయ మార్గ ప్రదర్శిని. తన దగ్గరివారితోను, ఇరుగుపొరుగు వారితోను ఎలా ప్రవర్తించాలి అనే విషయాన్ని రాముడు ఆచరణపూర్వకంగా చూపాడు. యావత్ప్రపంచానికి ధర్మమార్గోపదేష్టగా నిలిచాడు – అని శ్రీ భారతీతీర్థుల వారు అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాయం సంస్కృతాచార్యులు డాక్టర్ పుల్లెల శ్రీరామచంద్రుడు సంస్కృతంలో ప్రసంగించారు. రాముని పితృభక్తి సాటిలేనిది. తన పరాక్రమ ప్రకటనార్థం శివధనుస్సు విరిచాడు. తండ్రికి తెలియకుండా వీర్యశుల్క అయిన జానకిని చేపట్టనన్నాడు. తండ్రి యిచ్చిన భార్య అనే ప్రీతి తనకు మొదట కలిగిందని, తర్వాత ఆమె రూప గుణాతిశయంవల్ల ఆ ప్రీతి అభివృద్ధి కలిగిందని రాముడంటాడు. తండ్రి ఆజ్ఞతో జీర్ణ వస్త్రంలాగా రాజ్యాన్ని నిర్మలత్వంతో వదిలిపెట్టాడు. రాముని ప్రవర్తన నేటికి ఆచరణయోగ్యం. దానివల్ల సమాజ వ్యవస్థలో సామరస్యం ఏర్పడుతుంది – అన్నారు డాక్టర్ శ్రీరామచంద్రుడు. గాయత్రీ మంత్రార్థాత లేనివారికి ఆ ఫలం దక్కేటట్టు 24 అక్షరాలను నిక్షేపించి 24 వేల శ్లోకాలు రచించాడు వాల్మీకి. కావ్య ప్రయోజనం రామాయణం పట్ల పూర్తిగా సార్థకమవుతుంది – అన్నారు డాక్టర్ దివాకర్ల వెంకటావధాని. విదేశీయుల దృష్టిలో రామాయణ ప్రాశస్త్యాన్ని విపులీకరించారు డాక్టర్ మల్లాది గోపాలకృష్ణశర్మ. విషాద పాత్రలు గల కావ్యం సానుభూతిని కలిగిస్తుంది. సంపూర్ణ వ్యక్తిత్వంతో తీర్చిన పాత్రలు గల కావ్యం ఆనందాన్ని కలిగిస్తుంది. రామాయణంలో పాత్రలు చతుర్విధ పురుషార్థాల స్వరూపాలుగా గోచరిస్తాయి. ఫలం కోరకుండా వున్నప్పుడే అర్థ పురుషార్థం సమగ్రమవుతుంది. దీనికి లక్ష్మణుని పాత్ర ప్రతీక. విరక్తి, అనుబంధరాహిత్యం వున్నప్పుడే కామ పురుషార్థం సమగ్రమవుతుంది. దానికి భరతుడు ఉదాహరణ. రాముడు ధర్మస్వరూపుడు. శత్రుఘ్నుడు మోక్షస్వరూపుడు. రామాయణం బుద్ధి స్థానీయమైన మిథిల, హృదయ ప్రతీక అయిన అయోధ్య, అహంకార స్వరూపమైన లంక అనే మూడు నగరాల చరిత్ర. మాయాభంగమే శివధనుర్భంగం. భార్య తన సౌందర్యవిభ్రమాలతో భర్తలో రమణభావాన్ని పెంచేదిగా కాక, ఆత్మజ్యోతిని ప్రజ్వలింప జేసేదిగా వుండాలి. సీత అలాంటి ధర్మపత్ని – అని డాక్టర్ జి. వి. సుబ్రహ్మణ్యం ప్రసంగించారు. ప్రొఫెసర్ కె. సుబ్రహ్మణ్యం ఆంగ్లంలో ప్రసంగిస్తూ, రామాయణం బుద్ధి సంబంధమైన తర్కాదులతో సంబంధం లేకుండా సరాసరి హృదయాన్ని తాకి, కరగించి వేసే కావ్యమన్నారు. రామతత్త్వాన్ని వివేచన విశ్లేషణలతో కాక, అవ్యాజంగా తల్లిని ప్రేమించే పిల్లవలె సమీపించాలి. భారతీయ సంస్కృతి రామాయణంలో రూపుదిద్దుకుంది. దీనికి లక్ష్మణుడు సీతాదేవి నగలను చూచినప్పుడన్న మాటలు తార్కాణ. ఇలాటి సంస్కృతిని పిల్లలకు అందించవలసిన బాధ్యత పెద్దలది – అని ప్రొఫెసర్ కె. సుబ్రహ్మణ్యం అన్నారు. నిర్గుణం, నిరాకారం అయిన పరబ్రహ్మతత్త్వం సగుణం, సాకారం అయి రాముడుగా అవతరించగానే, వేదం రామాయణంగా రూపొందింది. నరుడై ధర్మాచరణ చేస్తూ వ్యావహారిక సత్యసాధన ద్వారా నిత్యసత్యాన్ని ఎలా చేరుకోవాలో రాముడు తన ప్రవర్తన ద్వారా చూపాడు. త్యాగం వల్లనే అమృతత్వాసిద్ధి. అలాటి త్యాగమూర్తి రాముడు. శత్రువులు పరోక్షంలోను పొగిడే రాముడు, సుఖదుఃఖాలలో తటస్థంగా వున్న రాముడు మనకు ఆదర్శమూర్తి. ఆ లక్షణాలు అలవరచుకోవడం నేడూ అవసరం – అని డాక్టర్ బి. ఆర్. శాస్త్రి భగవద్గీతోపనిషత్తుల సౌరభం గుభాళింపజేస్తూ ప్రసంగించారు. ఈ సమ్మేళనంలో పాల్గొనవలసిన డాక్టర్ కె. కమల, డాక్టర్ ముదిగొండ శివప్రసాద్ ఏ కారణాల వల్లనో పాల్గొనలేదు. శ్రీ భారతీతీర్థుల వారు తమ సమా ఏకోపన్యాసంలో త్రిజటాస్వప్న వృత్తాంతాన్ని వివరిస్తూ, జాగ్రుత్స్వప్న సుషుప్త్యవస్థల మూలతత్త్వాన్ని వివరించారు. స్వప్నాలు ఒకొకప్పుడు భవిష్యత్సంఘటనలకు సూచకమవుతాయని అన్నారు.

వంశీ రామరాజుకు అవార్డులు :-

వంశీ సంస్థాపకులు శ్రీ రామరాజును న్యూయార్కులోని తెలుగు కళాసమితి వారు జూలై 21న ఉత్తమ కార్య నిర్వహకుడుగా అవార్డు బహూకరించారు. చికాగో బాలాజీ దేవాలయం నిర్వాహకులు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సమావేశంలో "అభినవ శ్రీకృష్ణరాయ" బిరుదంతో సన్మానించారు. ఈ విషయాన్ని వంశీ రామరాజు జూలై 29న తాజ్‌మహల్‌హోటల్‌లో జరిగిన తమ అభినందన సభలో తెలిపారు. అమెరికాలో పుట్టి పెరిగిన తెలుగు కళాకారులతో 1986 ఏప్రిల్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లో పెక్కు కార్యక్రమాలు ఏర్పాటుచేయనున్నట్లు ఆయన తెలిపారు. నవలా రచయిత్రి శ్రీమతి యార్లగడ్డ కిమిరకు (వాషింగ్టన్) మాదిరెడ్డి సులోచన స్వర్ణ పతకం శ్రీ గుమ్మలూరి నరసింహశాస్త్రికి (వాషింగ్టన్) గురుజాడ అప్పారావు స్వర్ణ పతకం, శ్రీమతి ప్రభారఘునాథ్‌కు (న్యూయార్క్) ఘంటసాల బంగారు పతకం, తెలుగు సభల వ్యవస్థాపకులు శ్రీ గుత్తికొండ రవీంద్రనాథ్‌కు




(న్యూయార్క్) ఉత్తమ కార్యకర్తకచ్చే టి. సుబ్బరామిరెడ్డి బంగారు పతకం వంశీ సంస్థ బహూకరిస్తుందని శ్రీ రామరాజు తెలిపారు. చికాగో రేడియోలో ప్రతి మంగళవారం శ్రీమతి గుణసుందరి ఆధ్వర్యంలో తెలుగు కార్యక్రమాలు ప్రసారమవుతాయని, సాహితీ సాంస్కృతిక వార్తలను చికాగో రేడియోకు తెలియజేయాలని ఆయన అన్నారు. అమెరికాలో వున్న సుప్రసిద్ధ కళాకారుడు శ్రీ యస్వీ రామారావు పేరును వంశీ ప్రిపరేటరి స్కూలుకు పెట్టనున్నట్లు కూడా వంశీ రామరాజు తెలిపారు. అభినందన సభలో డాక్టర్ సి. నారాయణరెడ్డి, కుమారి వాసిరెడ్డి సీతాదేవి శ్రీ వంశీ రామరాజును ప్రశంసించారు.

ఉపశ్రుతి:–

జూలై ఉత్తరార్థంలో హైదరాబాద్ మారదర్శినిలో జరిగిన తెలుగు కవిసమ్మేళనంలో విశేషమేమిటో చెబుతారా?– అని ప్రశ్నించారు నన్నొక సాహిత్యాపాంథుడు. విశేషమేమంటారా, ఇద్దరు ముగ్గురు మినహా అందరూ సమైక్యత వంటి అపశబ్దాలు వాడటం, పాత భావాలనే మైక్ అదిరిపోయేటట్టు గట్టిగా చదవడమూను – అన్నారు మా మాటలు వింటున్న ఒక పెద్దమనిషి.

—తిరుమల రామచంద్ర

Printed and Published for Nageswara Rao Estates Private Ltd., by S. Nageswara Rao at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3, Editor : S. Radhakrishna, Phones : P. B. X. : 61247, 61248 & 75667.



ఏ.గోపాలకృష్ణ B.A. సమర్పించు
గోపీ ఫిలింస్
రక్తసిందూరం
స్క్రీన్‌ప్లే-దర్శకత్వం: ఏ.కోదండరామిరెడ్డి నిర్మాత: శ్రీమతి ఏ.శేషారత్నం
కథ: యండమూరి వీరేంద్రనాథ్ మాటలు: సత్యానంద్ సంగీతం: చక్రవర్తి కెమెరా: లోక్‌సింగ్
కూర్పు: కోటగిరి వెంకటేశ్వరరావు నిర్వహణ: జాస్తి సత్యశేఖర్. జాస్తి రమణమూర్తి
SREE LAKSHMI ADS

Regd. No. H/VJ-41 ANDHRA SACHITRA VARA PATRIKA
30 ఆగస్టు-5 సెప్టెంబర్, '85

